
భారతి

సాహిత్య మాసపత్రిక
సెప్టెంబరు 1980



వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

సెప్టెంబరు 1980

సంపుటము : 57 సంచిక : 9

విడిపత్రిక వెల రెండు రూపాయలు

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1980

అ ధు నా

ఎవరో పారేసిన
ఎంగిలాకులకై
ఎకా యెకీగా
ఎగబడిపోయే
కుక్కలూ కాకులూ
బక్కి పేగుల బిచ్చగాళ్ళూ;

అన్నానికి అలమటించి
ఆకలితో ఆవేదనతో
ఆక్రోశించి అసువులు బాసిన
అనాధ ప్రేతాల్ని తినే
నక్కలూ రాబందులూ
నానా రకాల ఈగలూ;

నిండిన ఈ లోకంలో
నిజాయితీకి నీడా
నిస్స్వార్థానికి తావూ
నీతి నియమాలకి గూడూ
కలికంలోకి కూడా
కనబడకుండా పోయింది !

ఎందుకిలా జరుగుతూంది ?
ఏమిటి దీనిక్కారణం ? ? !

*   *   *

"మాకు బుద్ధిబలముంది
మాకు విచక్షణజ్ఞానముంది :
మహాసముద్ర గభీర గర్భంలో
విహాయస మహోన్నత వీధుల్లో
వీరవిహారం చేస్తాం
వినోదంగా పయనిస్తాం."

అని గర్వించే మనమే
అవనిలో జరుగుతూన్న
అనర్థాలన్నిటికీ
ఆది పురుషులం
ఆత్మ పరిశీలన చేసుకోలేని
అభాగ్యులం !

మానాభి మానాలకీ
మానవతా భావాలకీ
తిలోదకాలిచ్చిన లోకంలో
ఎలాగ నిలబడగలుగుతుంది
సర్వమానవ సౌభ్రాతృత్వం
వసుధైక కుటుంబ తత్వం !

*   *   *

రాజకీయ రథానికి
రాచబాట లెన్నెన్నో !
పదవీ వ్యామోహ దీపంలో
పడి నశించిపోయే శలభాలెన్నో !

గతాన్ని మరుస్తారు
మతాల్ని మారుస్తారు
ఏ గడ్డైనా కరుస్తారు
ఎన్నో మాయమాట లరుస్తారు

స్వార్థపరత్వావతారాలు
సాగిస్తారు వింత బేరాలు
అందితే సిగ అందకపోతే కాళ్ళు
పట్టుకుంటారులే వీళ్ళు
పదవికోసం వీళ్ళు చేయని
పనులేవీ లేవు !

*   *   *

రాజకీయ రంగంలో
రాజుకుంటాయిలే
రంగు రంగుల మంటలు
ఖంగుమంటాయి వాగ్దానాల గంటలు
శుష్కప్రియాలు
శూన్యహస్తాలు !

అమ్మవారిలాంటి
అంటురోగం యిది;
మనుష్యుల్లోని మచ్చల్ని
బయటపెట్టేస్తుంది —
ఈ రాజకీయ మశూచి పీడితుల్లో
ఏనాటికైనాగానీ
ఆవిర్భవించగలడా
అలీ మావో మాలిన్. *

* అలీ మావో మాలిన్ (నైరోబి, కెన్యా వాసి) ప్రపంచంలో ఆఖరి మశూచి రోగి అని ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) 1978 ఏప్రిల్‌లో ప్రకటించింది.

అంకితము

౧

ఆత్మలో ఆత్మ, కన్నులయందు కనులు
బ్రతుకులో బ్రతుకొకటైన భాగ్యరేఖ
అల్లుకొనిపోయిన స్మృతుల కొల్లగొట్టు
కొనుచు పోషించుకొందు జీవన భరమ్ము!

౨

కంటకాంచలములు, విచ్చుకత్తు, లంప
శయ్య, లగ్నికీలా సహస్రములు, గడచి
చనిన సౌఖ్య స్మృతుల్; ప్రతిక్షణము తలపు
పూలయందు బాధా సౌరభాల జల్లు!

౩

మరపురాని, మరువలేని, మరువబడని
జీవితస్మృతి కనక మంజీర భావ
నిస్వనముల నిత్యమ్ము స్పందించు వెడద
వెడలి జడిగొను బాష్పముల్ తుడువదరము!

౪

గత పురాస్మృతి గాఢాంధకార పటలి
క్రమ్ముకొని పోయినట్టి అగాధ విధుర
మామకాభాగ్య జీవిత మార్గమందు
వెలుగు నింపెదవా వినువీధినుండి!

౫

నాడు చనె వసంతములు క్షణాలువోలె
క్షణములే నేడు నిలచు యుగమ్ములగుచు;
ప్రత్యణువునందు విశ్వరూపమ్మె తోచు;
అశ్రుకణమె ముంచెత్తు మహార్ణవముగ!

౬

కనులనుండి వెడలు బాష్పకణములెల్ల
తుడిచినారు, నిట్టూర్పులు విడచినారు
కాని... ఈ గుండె లోతుల లోని అశ్రు
వులను పెనుమంటలను ఆర్పగలరె వీరు?

౭

చందన పరిమళమ్ములు, నందనవన
పారిజాత సుగంధముల్, పాలకడలి
వెడలు జాబిల్లి నవ్వుల వెలుగు లమృత
ధారలున్ జేరవిక నీ ఎడారి బ్రతుకుఁ!

౮

స్వచ్ఛము వినిర్మలం బాకసమున క్రమ్మి
క్షణములోనిండె అగ్నిశిఖాసమాన
విద్యుదుగ్ర సంచలనముల్, వికృత భయద
కాల జీమూత ధూమ రేఖా పటలము!

౯

ఈ బ్రతుకునకు నింక రేయింబవళ్లు
రెండు నొక్కటే — చీకటి నిండు రాత్రి;
కాదు కనబడ బోదొక ఇందుకిరణ
కణమొ; ఉల్కా సముద్గత క్షణిక రుచియొ!

౧౦

జ్యోతిరింగణ మొకటి ఈ శూన్య జీవి
తాంధకార మార్గముల మధ్యమ్మునందు
క్షణము విరజిమ్మి పోయిన కాంతి విస్ఫు
లింగమై మహోగ్నుల రగిల్చినది ఎడదఁ!

౧౧

నీవు లేని నాదు భావి రసాతల
గర్భ దుర్భరాంధకార మయము;
తారకా కరాళ దంష్ట్రాముఖమ్మున
రేలు నన్ను నమిలి మ్రింగు చుండుఁ!

౧౨

కొనుమివి మదీయ హృదయ నిగూఢ భావ
పథములన్ నీచు దీర్ఘ నిశ్వాస మాలి
కా పరంపరల్; నందన కల్పతరువు
కడల విహరించు నినుజేర గలుగునేని!

శ్రీ వఝ్ఝల కాళిదాసు

కాగితం మీద పులులు

శ్రీ గరికపాటి కృష్ణమూర్తి

ఏయ్
  మిత్రమా!
కాగితంమీదున్న అక్షరాలను
కుదురుగా కూర్చున్న నల్ల పిల్లులనుకోకు
పిల్లలాడుకునే కాగితపు
[illegible] కాదా భావించకు.

[illegible] మధ్యాహ్న మార్తాండ వేడికిరణాలు
మన(సు)లోని మురికిని యింకింపజేస్తాయి
వాటి ధగద్ధాయమైన వాడి కరవాలాలు
రాక్షస హృదయాలను చీల్చి చెండాడుతాయి.

అణువులంతవున్నా అణువులంత శక్తివి
ఆటం, హైడ్రోజన్ బాంబుల స్థావరాలవి
చరిత్రలో యెన్నోసార్లు ప్రజలకు
చైతన్యం ఖడ్గాలిచ్చి
చండశాసనుల శిరస్సులను
స్వైతం వంచినవి; ఖండించినవి.

రాముడు కృష్ణుడు వాల్మీకి వ్యాసుడు
బుద్ధుడు, క్రీస్తు, మార్క్స్, గాంధీలు
వీటితోనే మన మనోమరుభూముల్ని దున్ని
మధుర జలాలను పారించారు
సశ్యశ్యామలం చేశారు.

అసత్యం, అధర్మం, హింస, ద్వేషాది జంతువులను
వేటాడటానికి
సత్యం, ధర్మం, అహింస, ప్రేమాది పులులకు
పాలిచ్చి, పెంచి, పెద్దజేసినవి యివే
వసుధైక మానవతా విలువల హర్మ్యాలకు
ఇటుకలనిచ్చి; వాసమేర్పరచేవికూడా యివే.

నా దేశం శాన శాన మారింది

శ్రీ గంధం వేదవేశ్వరరావు

బ్రదర్,
నాదేశం ఎంత ఎంత మారింది
అరెబై నా దేశం ఎంత ఎంత తరక్కి జేసింది
మీరే జెప్పండ్రి
తెల్లోల్ల జమాన్ల మనమెప్పుడన్న
గిట్ల ఒక్క జాగల గూకున్నమా
ఎన్కటిక్కి సదువుల్ జద్వనీంకె
నడ్మి నడ్మి వోతుండ్రంట
ఇప్పుడు జూడండ్రబై
ఊర్ల ఊర్ల యిస్కూల్లు దెర్శిండ్రు
పంతుల్లు జెర దుమ్మాలు గొట్టినా
ఇద్దుమాత్రం బల్వాగనే దెర్శిండ్రు
మెరాదోస్త్ జూష్నవా
నిన్నట్దాంక అడ్వులెంటదిరిగిన
కోయలకొండ లంబడోల్లపిల్ల గీయాల
పెద్ద సద్వుల్ జదివి
బెల్ బాటమ్ దొడుక్కొని
గరమ్ సూటరేసుకొని కండ్లద్దాల్ వెట్క
బషిష్టాండ్ల దిర్గుతుంటె
నా సామిరంగ – ఏం బయాన్ జెయను
అబ్బ అబ్బ నాదేశం
ఎంత ఎంత బద్లాయించింది
నిన్నట్దాంక మార్కిట్ల గూకొని
కూరగాయలమ్మిన నర్సి
ఇయ్యాల పర్సువట్టుకొని
ఉస్మానియా దవాఖాన్ల నర్సు పన్జేస్తుంటె
నా కండ్లే దిర్గినై !
దవాఖానల్ దెర్శిండ్రు
మంది రోగాల్ బాగజేస్తుండ్రు
నిన్నదాంక గూనిది, మూల్గి మూల్గి నడిషి
ఇయ్యాల ఎకాఎకి
వాణిశ్రీ లెక్క కులుకుతుంది

ఇన్నావా ! అన్నా
మొరార్జీభాయి సుక్కేసుకోవద్దంటడు
చరణభాయి మొక్కల్నే వెంచండన్నడు
ఇందిరమ్మ ఏమంటదో సూడాలె
ఇన్నవా బిడ్డా
రిచ్చదొక్కే లచ్చిగాని కొడుకు
లచ్చరరయ్యిండు.
దేశదేశాల్ దిర్గొచ్చిండు
ఈ దేశాన్నే మర్శిపోయిండు
ఏషం మార్శిండు బాస మార్శిండు
విలవెట్టి అడ్గితే
నీ దేశమోన్ని కాదేకాదంటడు
నాదేశం ఎంత మారిందో తెలుసా
మాజీమంత్రికి మంత్రసానికి
ఫరక్ లేకుండయింది
కండక్టర్‌కు కలెక్టరుకు ఫరక్ లేదు
కండక్టర్ ఆర్. టి. సి. బస్సు నాదంటడు
కలెక్టరేమో సర్కారు మోటరు సొంతదనుకొంటడు
నాదేశం ఎంత బద్లాయించిందంటే
[illegible] అసలైన కవులు
ఎందరు పైసలిస్తేనే కవులు
వరదలపై రాయమంటే
మరదలుపై రాస్తారు
రాజకీయాలు జెప్పనే గూడదు
పొద్దున అపోజిషన్‌ల ఉంటడు
రాత్రికి ముఖ్యమంత్రయితాడు
నాదేశం శానశాన మారింది
ఈ దేశంల అన్నీ వింతలే
ఒకడు పుడ్తే సెలవు
ఒకడు జస్తే సెలవు
ఈయాల నాదేశం యింత మారిపోయింది !

శ్రీ పి. సుందరరామశాస్త్రి

శ్రీ పృథ్వీమూల రాజవంశము విష్ణుకుండిన సంబంధాలు*

ప్రాచీనాంధ్రదేశ చరిత్రలో ప్రసిద్ధమైన విష్ణుకుండిన రాజవంశంతో సంబంధ బాంధవ్యాలు నెరపి, వారి సామంత మండలిలో ప్రధానమైనదిగా ఖ్యాతినందినది శ్రీ పృథ్వీమూల రాజవంశం. సుమారొక శతాబ్దిక్రితం ఫ్లీటు దొరగారు ప్రకటించిన గోదావరి తామ్రశాసనం[1] శ్రీ పృథ్వీమూలుడనే రాజును వెలుగులోనికి తెచ్చింది. ఆతనిదే ఇటీవలికాలంలో ప్రకటించబడిన కట్టుచెఱువు శాసనం,[2] విష్ణుకుండిన మహారాజు రెండవ విక్రమేంద్రవర్మచే నీయబడిన తుమ్మలగూడెం శాసనము[3] ఈ రాజవంశాన్ని గూర్చి మఱికొంత సమాచారాన్నందిస్తున్నవి. అందుచేత, పూర్వంకంటె వీరి చరిత్ర నేడు మఱింత స్పష్టమై, నాటి రాజకీయాలలో వీరు నిర్వహించిన పాత్ర నూహించ వీలవుతున్నది.

I పృథ్వీమూలవంశము : శాసనాధారాలు

పైన ప్రస్తావించబడిన మూడుశాసనాలు ఈ వంశచరిత్రను గూర్చి తెలియజేస్తున్న సమాచార వివరాలను ముందుగా పరిచయం చేసికొనడం యుక్తము. అవి లిపి పరిణామ శాస్త్రానుసారం క్రీ. శ. ఆరవ శతాబ్దికి చెందిన వేంగిలిపికి సంబంధించిన అక్షరవిన్యాసంతో, పరస్పరం సన్నిహితమైన పోలికలను కల్గియున్నాయి.[4] తుమ్మలగూడెం శాసనం శక సంవత్సరం 488 (అనగా క్రీ. శ. 566కు) చెందినదిగా స్పష్టమైన కాలసూచికను కల్గియుంది. పృథ్వీమూలుని రెండు శాసనాలను సైతం తదనుగుణంగా, సమకాలీన చారిత్రక విశేషాలసాయంతో నించుమించుగా కాలనిర్ణయంచేసి, ఈ వంశ చరిత్రను విశదీకరించడమే, ఈ వ్యాసరచనలోని ముఖ్యోద్దేశము.

పృథ్వీమూలుని రెండు శాసనాలలో అతని వంశ, గోత్ర వివరాలు ప్రస్తావించబడలేదు. అందుచేత ఈ వంశీయులను పృథ్వీమూల వంశీయులని వ్యవహరించడమే మంచిది, తుమ్మలగూడెం శాసనంలో సైతం వీరి వంశనామం ''శ్రీపృథ్వీమూలవంశ''మనే వ్యవహృతమైంది.[6]

గోదావరి తామ్రశాసనం

గోదావరి తామ్రశాసనంవలన తెలియవచ్చే రాజులు : ప్రభాకర మహారాజు, అతని కుమారుడు, శాసన ప్రదాతయునైన పృథ్వీమూల రాజు. శ్రీ ప్రభాకర మహారాజు ''దేవద్విజగురుచరణ సమారాధనాధిగత నిరతిశయ పుణ్యనిచయస్య, సకల దిఙ్మండలాలంకార భూత యశసః'' అని వర్ణించబడినాడు.[7] ఈ వర్ణన కేవలం సాంప్రదాయిక గౌరవ సూచకమే కాని, ఆతని రాజకీయ ప్రతిభా ప్రతాప విశేషాలను సూచించదు. శాసన ప్రదాతయైన పృథ్వీమూలుడు ''మాతాపితృ పాదానుధ్యాతు''డని; ''శ్రుతి, స్మృతివిహిత పదార్థావబోధజనిత ప్రజ్ఞావివేక నిరవగీతానుపాలితాశేష వర్ణాశ్రమ ధర్మ''ము కలవాడని; ''పరానుగ్రహమాత్ర ప్రయోజన ప్రతిపన్నైశ్వర్య గురుభార'' యుతుడని, పరమమాహేశ్వరుడని వర్ణించబడినాడు.[8] అతడు ధరించిన 'రాజ'బిరుదం, శ్రుతి, స్మృతి విహితమైన వర్ణాశ్రమ ధర్మపాలకుడన్న వర్ణనతో కూడి, స్వతంత్రుడైన రాజని స్ఫురింపజేస్తున్నాయి. కనుక, ఈ శాసనకాలంగా పేర్కొనబడిన 25వ రాజ్య సంవత్సరం, ఈతని పరిపాలనా కాలానికి చెందినదేనని భావించవచ్చును.[9]

గోదావరి తామ్రశాసన ప్రాధాన్యతయందు వివరించబడిన ''చతుర్దంత సంగ్రామ విజయా''ల ప్రస్తావన. ఈ శాసనం తాళుపాక విషయంలోని చూయిపాక గ్రామాన్ని నానాగోత్రేభ్యులైన నలువది ఆధర్వణిక కులజులకు (అనగా అధర్వణ వేదపారగులయిన బ్రాహ్మణులకు) అగ్రహారంగా నీయబడినట్లు ప్రకటిస్తున్నది. అయితే, ఈ ప్రదానం—స్వమాతా పితృల పుణ్యావ్యాప్తికై ఇంద్రాధిరాజనే వాని విజ్ఞాపనను పురస్కరించుకొని చేయబడినట్లు వివరించబడింది. శాసనపాఠంలో ఈ ఇంద్రాధిరాజు ఈ విధంగా ప్రశంసించబడినాడు. ''శ్రుతాభిజన వృత్త సంపత్ప్రభా భాసురోదార పురుష రత్న నికర ప్రసూతిహేతు ప్రఖ్యాత మణల్కుడి వాస్తవ్య ద్విజాత్మ

---

* ఈ వ్యాస రచనలో నాకు మార్గదర్శకులై సాయపడిన డా. బి. ఆర్. సుబ్రహ్మణ్యం, ఎమ్.ఏ., పిహెచ్. డి., రీడర్ ప్రాచీన భారతదేశ చరిత్ర, పురావస్తు శాస్త్రవిభాగం, నాగార్జున విశ్వవిద్యాలయం—గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

న్వయ పయోధి సంభూత శీతరశ్మి; అసకృదవాప్త చదుర్దంత సంగ్రామ విజయు''డు, మితవర్మయొక్క ప్రియ తనయుడు, ''ఇంద్రభట్టారక సముత్పాటనాభిలాష సముదిత ప్రముదితాశేష నృపతికృత తుముల సమరాధిరూఢ సుప్రతీకానేకపాభిముఖ సమద కుముద ద్విరద నిపాతనాధిగత భువనతల విపుల విశుద్ధయశ''స్వియైనవాడు.[10]

కట్టుచెఱువు శాసనము

కట్టుచెఱువు శాసనం బుద్ధభగవానుని స్తుతితో ప్రారంభమై క్రమంగా వంశవర్ణనకు పూనుకొని, ప్రథమంగా ఒక మూల రాజును గూర్చి ఈవిధంగా ప్రశంసిస్తుంది.[11]

జయతి జయతి భూమ్నా మూలరాజస్సమన్తా
ద్వితత రుచిర భాస్వల్లోక విఖ్యాతకీర్తి:
బహుసమర జయోపాత్తోన్నత శ్రీ రజేయ
స్సుకదిర గుణపాశాబద్ధ నిశ్శేషలోక:

తర్వాత ప్రభాకర మహారాజు, అతని కుమారుడును, శాసన ప్రదాతయునైన శ్రీ పృధ్వీమూలుడు—కేవలం గోదావరి తామ్ర శాసనంలోని శబ్దార్థాలతో వర్ణించబడినారు.[12] అయితే, పృధ్వీమూలుడుమాత్రం మఱికొంచె మతిశయంగా ఈ శాసనంలో ప్రశంసించబడినాడు.[13] గోదావరి తామ్రశాసనంలో ఇంద్రాధిరాజు సాధించినట్లు చెప్పబడిన చతుర్దంత సంగ్రామ విజయాలను పృధ్వీమూలునకన్వయింపజేయడం ఇందు ప్రధానంగా గ్రహించవలసినది.[14] ఈ శాసనం పృధ్వీమూలుని కుమారుడైన హరివర్మ గుణపాశపురంలో స్వప్రతిష్ఠాపితమైన బౌద్ధారామానికి ''కట్టుచెఱువుల'' నామ గ్రామాన్ని ప్రదానంచేస్తూ ఇచ్చినాడు. శాసనకాలము నందు సూచించడం జరుగలేదు. కాని గోదావరి తామ్రశాసన ప్రదానానంతరం దీని నిచ్చినట్లు తోస్తుంది.[15]

స్వస్తి వచనం కంటె ముందు, దైవస్తుతితోబాటుగా శ్లోక రూపంలో ప్రశంసించబడినందున మూలరాజు వంశపూర్వుడై గౌరవ పాత్రుడైనవాడని తోస్తుంది. శాసన ప్రదాతయైన పృధ్వీమూలుని కంటె విభిన్నరీతిలో వర్ణించబడినందున వీరిరువురు వేర్వేరు వ్యక్తులని గ్రహించవలసియున్నది. మూలరాజ ప్రశంస తర్వాత, స్వస్తి వచనంతో అసలు శాసన పాఠం ప్రారంభమవుతుంది. అందుచే ప్రభాకర మహారాజునకు మొదటి మూలరాజుతోకల సంబంధమిందు ప్రస్తావించబడనట్లే.

తుమ్మలగూడెం (రెండవ) శాసనము : పృధ్వీమూల వంశ ప్రశంస

విష్ణుకుండిన మహారాజు రెండవ విక్రమేంద్రవర్మ ఇచ్చిన తుమ్మలగూడెం శాసనం, తత్ప్రదాన భాగంలో పృధ్వీమూల వంశాన్ని ప్రశంసిస్తున్నది. ఆ శాసనంలో తెలుపబడిన భూదానాన్ని పొందుతున్న బౌద్ధవిహారం పరమ భట్టారికా మహాదేవిచే నిర్మించబడిందని, ఆమె తన జన్మచేత లక్ష్మి సాగరమునువలె శ్రీ పృధ్వీమూల రాజవంశాన్నలంకరించిందని వివరించబడింది.[16] కనుక ఆమె ఒక పృధ్వీమూలుని కుమార్తెయని భావించవలసియుంటుంది. ఏలననగా, స్వతంత్రంగా పరిపాలిస్తున్న తరుణంలోనే వంశనామాన్ని గ్రహించలేని ఈ రాజపరంపర విష్ణుకుండినుల నాటికే పృధ్వీమూల రాజ వంశంగా ప్రసిద్ధమైందనీ చెప్ప వీలులేదు. కనుక, పృధ్వీమూల వంశమంటే, ఆ పేరుగల రాజు నింట, యని అర్థం చేసికొనడం యుక్తం.

తర్వాత శాసనాంతంలో ఆజ్ఞప్తిగా ఒకమూలరాజు పేర్కొనబడినాడు. ఆతడు అధఃపతనం చెందిన భర్తృకుల లక్ష్మి నుద్ధరించిన వాడు, సామంత మండలియందు ప్రసిద్ధమైన ప్రఖ్యాత కుల ప్రసూతుడైనవాడని, ప్రశంసించబడినాడు.[17] అంతేకాని, యతని వంశ నామం స్పష్టంగా పేర్కొనబడలేదు. కాని, ప్రాచీనాంధ్ర చరిత్రలో మూలరాజు, లేక పృధ్వీమూల రాజు అనే వ్యక్తి నామాలు మరో వంశంలో కనిపించనందున, తుమ్మలగూడెం శాసనాజ్ఞప్తి పృధ్వీమూల వంశీయుడేనని నిర్ధారణ చేయవచ్చును.

తుమ్మలగూడెం శాసన ప్రదాతయైన రెండవ విక్రమేంద్ర వర్మ పరమభట్టారికా మహాదేవి, గోవిందవర్మల కుమారుడైన[18] రెండవ మాధవవర్మ ప్రనప్త. కనుక పరమభట్టారికా మహాదేవి తండ్రియైన పృధ్వీమూలరాజు, తుమ్మలగూడెం శాసనాజ్ఞప్తియైన మూలరాజుగా భావించరాదు. కాగా, నాటికి నాలుగు తరాల క్రిందట, గోవిందవర్మ సమకాలికుడైనవాడు కనుక, కట్టు చెఱువుల శాసనంలో తొలుతగా ప్రశంసించబడిన మొదటి మూలరాజును పరమ భట్టారికా మహాదేవి జనకునిగా గుర్తించడం యుక్తము.

అలాగే, తుమ్మలగూడెం శాసనాజ్ఞాపకుని గోదావరి, కట్టు చెఱువు తామ్ర శాసనాల ప్రదాతయైన పృధ్వీమూలరాజుగా గుర్తించడానికీ క్రింద చూపబడిన ప్రబలకారణాలున్నాయి.

(1) గోదావరి తామ్ర శాసనం చతుర్దంత సంగ్రామాలను ప్రస్తావించగా, కట్టు చెఱువు శాసన మీ యుద్ధ విజయాలను పృధ్వీమూలునికే కట్ట బెడుతున్నదని పైన వివరించబడింది. విష్ణుకుండిన రాజులలో రామతీర్థం శాసనప్రదాతయైన ఇంద్రవర్మ అనేక చతుర్దంత సంగ్రామ విజయుడు.[19] కనుక గోదావరి, కట్టు చెఱువు శాసనముల నిచ్చిన పృధ్వీమూలుడు విష్ణుకుండిన ఇంద్రవర్మ, అతని కుమారుడైన రెండవ విక్రమేంద్రవర్మలకు సమకాలికుడని స్పష్టమవుతున్నది. ఇంద్రవర్మ మరణానంతరం శైశవంలోనే సింహాసనము నధిష్ఠించి, పదునాలుగు సంవత్సరాలు మాత్రం పరిపాలించిన రెండవ విక్రమేంద్రవర్మ[20] కీతడు ప్రధాన సామంతుడైయున్నట్లు అర్థం చేసికొనడం పొరబాటు కాబోదు.

(2) రెండవ విక్రమేంద్రవర్మ దానం చేసిన తుమ్మలగూడెం,[21] తుండి,[22] శాసనాల తుది పంక్తులలో ధర్మవిలోపనకు ప్రతిఫలంగా సంభవించగల పాపాన్ని వివరిస్తూ, సాధారణంగా శాస

నాంతాలలో కన్పించే వ్యాస గీతా శ్లోకాలలోనిది కాని, ఒక శ్లోకం, ప్రత్యేకంగా రచించబడినట్లు కన్పిస్తుంది. అదే శ్లోకం కట్టు చెఱువు శాసనంలోను కన్పిస్తుంది.[23] ఆ శ్లోక పాఠమిది :

నిష్నుతాం భర్తృ[24] గో విప్ర
బాలయోషి త్తపస్వినః[25]
యాగ తిస్సా భవేద్వృత్తిం
హరతః శాసనాంకితమ్.

దీనినిబట్టి ఈ రెండు వంశాలకు చెందిన శాసన రచయిత యొకడేనని తోస్తుంది. అంతేకాక, తుమ్మలగూడెం, కట్టుచెఱువు శాసనాల ప్రణాళిక కూడ ఇంచుమించు ఒకే విధంగా కన్పిస్తుంది. రెండు బౌద్ధ విహారాలకు చేసిన దానాలు; రెండింటిలోను, స్వస్తి వచనం కంటె ముందుగా శ్లోక రూపకమైన వంశ ప్రశంస లేదా ప్రదాతృ ప్రశంసన చేయబడింది. విష్ణుకుండిన శాసనాలలోని బిరుద వాక్యాలు కొన్ని గోదావరి తామ్ర శాసనంలో కంటె, కట్టు చెఱువు శాసనంలో అధికంగా కన్పిస్తాయి. ఈ అంశాలు పృథ్వీమూలరాజు చివరి ఇద్దరు విష్ణుకుండిన రాజులకు సమకాలికుడై, విష్ణుకుండినుల అస్తమయానంతరం స్వతంత్రించినాడని సూచిస్తాయి

పృథ్వీమూల, విష్ణుకుండిన వంశీయుల శాసన లేఖకుడొకే వ్యక్తి కావడం రెండు విధాల సాధ్యం. రెండవ విక్రమేంద్రుని పరిపాలనా కాలంలో పృథ్వీమూలరాజు, అతని అధికారులు విష్ణుకుండిన పరిపాలనా యంత్రాంగంలో ప్రాబల్యం వహించినారని భావించడం మొదటి పద్ధతి. లభ్యమవుతున్న శాసనాధారాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించవు.[26] విష్ణుకుండిన పరిపాలనాంతాన, నారి రాజ్య. పరిపాలనా యంత్రాంగాలు పృథ్వీమూలుని వశమైనాయని భావించడం రెండవ పద్ధతి. అనగా, పైన సూచించబడినట్లు సార్వభౌముని అనంతరం సామంతమండలి యందు ప్రబలుడైయుండిన పృథ్వీమూలుడు సామ్రాజ్యాన్ని స్వహస్తగతం చేసికొని, స్వతంత్ర పరిపాలన జరిపినాడని భావించడంలో పొరబాటుండబోదు.[27] కట్టు చెఱువు శాసనం, గోదావరి శాసనం కంటె వెనుకటిదై యుంటుందని భావించడానికి కూడ పైన ప్రస్తావించబడిన శ్లోకము, శాసన ప్రణాళికలలోని పోలికలే కారణాలు. అవి కట్టు చెఱువు శాసనంలో ప్రస్ఫుటమైనట్లుగా గోదావరి తామ్ర శాసనంలో కన్పించవు.

తుమ్మలగూడెం (రెండవ) శాసనం విష్ణుకుండిన కాలానుక్రమణికకే కాక, పృథ్వీమూలుని కాల నిర్ణయానికి సైతం సరియైన ఆధారమని పై చర్చ వలన స్పష్టమవుతున్నది. అతన్ని క్రీ. శ. 545–580 సంవత్సరాల నడిమి కాలంలో, కొంతవరకు (క్రీ. శ. 570) విష్ణుకుండిన సామంతు సామంతునిగాను, ఆ తర్వాత స్వతంత్రునిగాను పరిపాలించి నట్లూహించుకొని, పృథ్వీమూల వంశ, కాలానుక్రమణికల నీ క్రింది విధంగా నిర్ధారించవచ్చును.

1. మొదటి పృథ్వీమూలుడు... క్రీ. శ. 430–455[28]
(కట్టు చెఱువు శాసనంలో వంశపూర్వునిగా 'మూలరాజ' నామంతో పేర్కొనబడినవాడు. తుమ్మలగూడెం శాసనంలో పరమ భట్టారికా మహాదేవి జనకుడైన పృథ్వీమూలరాజు.)

|

2. మహారాజ ప్రభాకరుడు క్రీ. శ. 520–545

|

3 రెండవ పృథ్వీమూలుడు క్రీ. శ. 545–580
[గోదావరి, కట్టు చెఱువు తామ్రశాసనాల ప్రదాత. చతుర్దంత సంగ్రామ విజయి. తుమ్మలగూడెం (రెండవ) శాసనాజ్ఞాపకుడు]

|

4. రాజా హరివర్మ క్రీ. శ. 580 – ...

ఇచ్చట ఈ రాజుల వ్యక్తి నామాల గూర్చి కొంచెం వివరించడం అవసరం. కట్టు చెఱువు శాసనంలో "మూలరాజు"ని పేర్కొనబడినా, అతడు తుమ్మలగూడెం శాసనంలో పృథ్వీమూలుడని పేర్కొనబడినట్లు; అలాగే, తుమ్మలగూడెం శాసనాజ్ఞాపకుడు "మూలరాజు"ని పేర్కొనబడినా, అతడు గోదావరి, కట్టు చెఱువు శాసనాల ప్రదాతగా పృథ్వీమూలుడని వ్యవహరించబడినట్లు భావించవచ్చు. కాగా, వీరి నామధేయం "మూలరాజు"గాను "పృథ్వీ"పదం గౌరవసూచకంగా ఎడనెడ చేర్చబడుతున్నట్లు అర్థమవుతుంది. క్రీ. శ. 6, 7 శతాబ్దులలో పలువురు రాజులు, యువరాజు వివిధమైన "పృథ్వీ" పదం గౌరవసూచకంగా తమ పేర్లకు, లేదా పదవీ సూచక పదాలకు ముందు ధరించేవారని చెప్పడానికి వీలుంది. కొప్పరం శాసనంలో కుబ్జవర్ధనుడు పృథ్వీదువ (యువ) రాజని పేర్కొనబడడం ఈ సందర్భంలో జ్ఞప్తి చేసికొనవచ్చును.

II శ్రీ పృథ్వీమూల వంశ చరిత్ర : విష్ణుకుండినులు

గోదావరి, కట్టు చెఱువు తామ్ర శాసనాలు తాళుపాక విషయంలోని గ్రామాలను దానం చేస్తున్నట్లు ప్రకటించడంచేత, ఆ శాసన ప్రదాతయైన పృథ్వీమూలుడు ఆ విషయం (లేదా, మండలం)లో పరిపాలించేవాడని నిశ్చయించవచ్చును. ఈ ప్రదేశం పూర్వం "తాటిపాక సీమ"యని వ్యవహృతమవుతూ, నేటి తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు తాలూకాతో సరియైనదిగా చరిత్రకారుల నిర్ణయం.[29] మొదటి పృథ్వీమూలుని కాలం నుండి యీ వంశీయులిదే ప్రాంతాన్ని పరిపాలిస్తున్నట్లు భావిస్తే, ఆ రాజు శాలంకాయన వంశంలో చివరివాడైన రెండవనందివర్మ సమకాలికుడని[30] బహుశః అతని సామంతుడని నిర్ణయించవచ్చు. శాలంకాయన వంశాన్ని నిర్మూలించినవాడు విష్ణుకుండిన మహారాజు గోవిందవర్మ (క్రీ. శ. 435–475). అతడు తన తుమ్మలగూడెం (మొదటి) శాసనంలో "భుజబలోత్సాహ ప్రభావానురాగా వాప్త స్వరాజ్యేన, శౌర్య ధైర్య ప్రతాపాను భావాదన్య సామంతా క్రాంత రాజ్యాంతరేణ"[32] అని

వర్ణించుకొన్నాడు అనగా గోవిందవర్మ తన శౌర్యధైర్య ప్రతాపాది గుణ విశేషాల చేతనేకాక, అనురాగానుభావాలచేత అన్య సామంతుల రాజ్యాల నాక్రమించినాడు. దీనినిబట్టి పతనోన్ముఖమైన శాలంకాయన వంశాన్ని తుదముట్టించడంలో గోవిందవర్మ కౌటిల్య నీతిని ప్రదర్శించి, వారి సామంతుడైన పృథ్వీమూలుని తనకు పితునిగా జేసికొని, ఆతని కుమార్తెయైన పరమ (భట్టారికా) మహాదేవిని వివాహమాడి, తదుపరి వేంగీ మండలంపై దండెత్తినాడని, శాలంకాయన వంశ నిర్మూలన జరిపినాడని భావించడం యుక్తమని స్పష్టపడుతున్నది.

ఋషీక దేశంలో పరిపాలిస్తున్న విష్ణుకుండిన రాజులు[33] క్రమంగా కృష్ణా, నర్మాదా నదుల నడుమగల దక్షిణా పథాన్నంతా ఆక్రమించి, కొంతకాలం సువిశాల సామ్రాజ్యాన్ని నిర్మించి పాలించారు. ఆ వంశంలో రాజ్య విస్తరణకు పూనుకొన్న మొదటి రాజు గోవిందవర్మ.[34] అతని కా కార్యక్రమంలో పృథ్వీమూలుడు తోడ్పడినాడని, ''బహు సమర జయోపాత్తోన్నత శ్రీ రజేయః'' ఇత్యాది వర్ణనలతో నీ రాజు ప్రశంసించబడిన తీరు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తుందని భావించవచ్చును.

పృథ్వీమూలుడు శాలంకాయనులపై తిరుగుబాటు చేసి, విష్ణుకుండినుల సాయంతో స్వతంత్ర పరిపాలనను నెలకొల్పియుండవచ్చును. అతనికి కల ''మహారాజ'' బిరుదు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తుంది. కాని, వారి సాయంతో బలపడిన విష్ణుకుండినుల ముందు ఈ వంశీయులు క్రమం ప్రభావశూన్యులై సామంత మాత్రులుగా మిగిలిపోయినారని, అయితే, వారితోగల సంబంధంచేత కొంత ప్రాధాన్యత కల్గి, విష్ణుకుండిన సామంత మండలిలో నతి ప్రముఖులై, స్వాతంత్ర్యం పోగొట్టుకొన్నా, అసంతృప్తి చెందక ప్రభు వంశాన్ని తుదివరకు విశ్వాస పాత్రులై సేవించారని భావించవచ్చును. తుమ్మలగూడెం (రెండవ) శాసనంలో నీ వంశం[35] ''విష్ణుకుండికుల బహు మతైక సంబంధితాభిఖ్యాత మహాత్మ్యం, అశేష సామంతకుల తిలకాయ మానం, అవికల గుణ మణి కిరణ నికర విచ్ఛురిత విపుల దిగంతరాళం'' అని ప్రశంసించబడిన విషయం గమనించదగింది. కాని పూర్వ చరిత్రకారులు పలువురిందుకు విరుద్ధంగా నిర్ణయించియున్నారు. వారి సిద్ధాంతాలను క్లుప్తంగా పరామర్శించి, సత్య నిర్ణయం చేయవలసియున్నది.

చతుర్దంత యుద్ధాలు

పృథ్వీమూల వంశీయులలో తగినంత సమాచారం రెండవ పృథ్వీమూలుని గూర్చి మాత్రమే లభిస్తున్నది. ఈతని గోదావరి తామ్ర శాసనంలో ప్రస్తావించబడిన చతుర్దంత సంగ్రామాలు పృథ్వీమూల – విష్ణుకుండిన సంబంధాలను తెలియజేస్తూ, చరిత్రకారుల మధ్య తీవ్ర చర్చలకు భిన్నాభిప్రాయాలకు కారణమైనాయి. పైన వివరించినట్లుగా యీ సంగ్రామాలు నిర్దిష్టంగా ఏ యే వంశీయుల మధ్య జరిగినవో తెలియరాకున్నా, చరిత్రకారులు తమ ప్రజ్ఞా విశేషంతో ఆ సంఘటనలను విశ్లేషించారు.

గోదావరి తామ్రశాసనాన్ని ప్రకటిస్తూ, ఫ్లీటు దొరగారు చతుర్దంత సంగ్రామాలు అందు పేర్కొనబడిన ఇంద్రభట్టారకునికి, ఇంద్రాధిరాజుకు నడుమ జరిగినట్లు, ఈశాన్యదిశకు ప్రతీకమైన సుప్రతీకము, నైఋతి దిశకు ప్రతినిధిగా కుముదము ఈ సంగ్రామ సందర్భంగా పేర్కొనబడినవని భావించారు.[36]

ఇంద్రభట్టారకుని వేంగీ చాళుక్య రాజులలో మొదటి జయసింహుని సోదరుడు, అతని తర్వాత సింహాసనము నధిష్ఠించిన వానిగాను, ఇంద్రాధిరాజును తూర్పు గంగ వంశీయులలో 87వ సంవత్సరంలో అచ్యుతాపురం తామ్రశాసనాన్ని, లేదా 128వ సంవత్సరంలో చికాకోలు తామ్రశాసన మిచ్చిన రాజులలో నొకనిగాను, ఆయన గుర్తించారు. గంగ వంశీయుడైన ఇంద్రవర్మకు సామంతుడై, పృథ్వీమూలుడు వేంగీచాళుక్యరాజైన ఇంద్రభట్టారకునిపై దండెత్తినాడని ఆయన నిర్ణయం. కాని, వేంగీచాళుక్యులలో ఇంద్రభట్టారకుడు కేవలమొక వారము దినములు పరిపాలించినవాడు. కనుక, ఆ స్వల్పవ్యవధిలో అనేక రాజులొక కూటమిగా ఏర్పడవలసిన ఆవశ్యకత, అవకాశం ఉన్నాయని భావించడం సుసంగతంకాదు.

విష్ణుకుండిన శాసనాలలో తొలుత లభ్యమైన చిక్కుళ్ళ శాసనాన్ని ప్రకటిస్తూ కీల్‌హారన్ పండితుడు[37] అందు చెప్పబడిన ఇంద్రభట్టారకవర్మ గోదావరి తామ్రశాసనంలోని ఇంద్రభట్టారకుడే కావచ్చునని సూచించారు. అయితే, ఆయన ఈ రెండు శాసనాలను సుమారు ఎనిమిదవ శతాబ్దికి చెందినవిగా భావించి, ఇంద్రాధిరాజును తూర్పుగంగ రాజులలోని 128, 154 సంవత్సరాలనాటి శాసన ప్రదాతగా గుర్తించారు.

తర్వాత కాలంలో తూర్పుగంగ రాజులలో ప్రథముడని చెప్పదగిన మరొక ఇంద్రవర్మ 39వ సంవత్సరంనాటి జిర్జింగి తామ్రశాసన[38] ప్రదాత వెలుగులోనికి వచ్చాడు. అంతట ఆచార్య డి. ఆర్. భండార్కర్‌గారు[39] గోదావరి తామ్రశాసనంలోని ఇంద్రాధిరాజితడేనని సూచించారు. జిర్జింగి శాసన ప్రదాత కూడ చతుర్దంత సంగ్రామ విజయుడే.[40] డూబ్రేగారు[41] కీల్‌హారన్, భండార్కర్‌గార్ల సూచనలను సమన్వయపరచి విష్ణుకుండిన ఇంద్రభట్టారకునికి, తూర్పుగంగ వంశీయుడైన ఇంద్రవర్మకు సమకాలీనతను స్థాపించారు. వారిరువురిమధ్య జరిగిన చతుర్దంత పోరాటాలలో పృథ్వీమూలుని నాయకత్వాన ఏర్పడిన రాజుల కూటమి విష్ణుకుండిన ఇంద్రభట్టారకుని నోడించి, బహుశః వధించి యుండవచ్చునని అభిప్రాయపడినారు. ఇంద్రభట్టారకుని యనంతర మతని కుమారుడైన రెండవ విక్రమేంద్రవర్మ శైశవంలోనే రాజ్యభారం వహించినాడన్న శాసనవాక్యం పై సిద్ధాంతాన్ని సమర్థిస్తుంది. అందుచే భావరాజు కృష్ణారావుగారు[42] కూడ ఇదే సిద్ధాంతాన్ని అంగీకరించారు.

ఇటీవలికాలంలో, తుమ్మలగూడెం శాసనాలు ప్రకటించబడిన తర్వాత చతుర్దంత సంగ్రామాలను గూర్చి, పృథ్వీమూలునికి విష్ణుకుండిన వంశంతోగల సంబంధాన్ని గూర్చి, కొందరు చరిత్రకారులు

చర్చించారు వారిలో ప్రముఖులు డా. మారేమండ రామారావు, డా. నేలటూరి వెంకటరమణయ్య, డా. శంకరనారాయణన్‌గార్లు.

డా. మారేమండ రామారావుగారు[43] గోదావరి తామ్ర శాసనంలోని ఇంద్రాధిరాజా జిర్జింగి శాసన ప్రదాత కాకపోవచ్చునని, అతడు మితవర్మయను బ్రాహ్మణుని కుమారుడని చెప్ప వీలులేనందున[44] అట్టి గుర్తింపు పొసగదని వాదించారు. ఆయన ఇంద్రాధిరాజు కళింగలో ఏదో చిన్న రాజ్యాన్ని పాలించే స్థానిక ప్రముఖుడని, పృథ్వీమూలుని కూటమిలో చేరి, పోరినాడని ఆయన ఊహ. ''మహారాజు'' బిరుదం ధరించిన ప్రభాకరుని కుమారుడై పృథ్వీమూలుడు అట్టి బిరుదం ధరించకపోవడాన, అతడు విష్ణుకుండిన మాధవ వర్మచే నోడించబడి, స్వాతంత్ర్యం కోల్పోయినాడని, ఆ మహారాజు మరణానంతరం కల్లోల పరిస్థితులేర్పడి, పృథ్వీమూలుడు పలువురు సామంతులను సంఘటిత పరచి, ఇంద్రభట్టారకుని కాలంలో విష్ణుకుండినులతో పోరాడే అవకాశం కల్గియుండవచ్చునని ఆయన భావించారు. అంతేకాక, ఆ పోరాటంలో ఇంద్రభట్టారకుడు నిహతుడై యుండవచ్చునని, రెండవ విక్రమేంద్రవర్మకు శైశవంలోనే రాజ్యభారం వహించవలసి వచ్చింది. తత్ఫలితంగానే కావచ్చునని కూడ, ఆయన ఊహించారు.

ఇంద్రాధిరాజును గుర్తించడంలో తప్ప మిగిలిన వివరాలలో డా రామారావుగారి సిద్ధాంతం డుబ్రేగారి సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నది.

డా. శంకరనారాయణన్[45] పై సిద్ధాంతాన్నీ విధంగా పూర్వపక్షం చేశారు. 1) మితవర్మ నామధేయంలోని ''వర్మ'' ణాంతం వారు క్షత్రియులని సూచిస్తుంది. కాకున్నా, 'ద్విజ' శబ్దంచేత మితవర్మ అతని కుమారుడు బ్రాహ్మణమాత్రులని గ్రహించరాదు. 2) ప్రాచీన పల్లవ, కదంబ వంశీయులవలెనే గంగవంశీయులు బ్రాహ్మణులై, వారి శాఖీయులైన కళింగ గంగరాజులును, బ్రాహ్మణులే కనుక, ద్విజ శబ్దం బ్రాహ్మణ వాచకంగా గ్రహించినా ఇంద్రాధిరాజును, జిర్జింగి శాసన ప్రదాతతో గుర్తించడంలో తప్పులేదు. 3) డి. ఆర్ భండార్కర్‌గారు సూచించినట్లు జిర్జింగి శాసన ప్రదాతకు, విష్ణుకుండిన ఇంద్రవర్మకు, సామాన్యమైన చతుర్దంత సంగ్రామ విజయాలు వారి సమకాలీనతను వారి మధ్య జరిగిన పోరాటాలను సూచిస్తున్నాయి.

కనుక, శంకరనారాయణన్‌గారు ఇంద్రాధిరాజు లేక తూర్పు గంగవంశీయుడైన ఇంద్రవర్మ మొదట పృథ్వీమూలునికి సామంతుడే అయి ఉంటాడని ఊహించారు.[46] ఆయన కూడ ఇంద్రభట్టారకుడు చతుర్దంత సంగ్రామాలలో పృథ్వీమూలునిచే నోడింపబడియుంటాడని భావిస్తూ తుమ్మలగూడెం శాసనాజ్ఞప్తియైన శ్రీ మూలరాజును గోదావరి తామ్రశాసన ప్రదాతనుండి ప్రత్యేకీకరించారు.[47] అనంతరకాలంలో ఇంద్రభట్టారకుడు తిరిగి బలం చేకూర్చుకొని పృథ్వీమూలు నోడించియుంటాడని, ''అసకృదనేక నిశిత నిస్త్రింశ సహస్ర సంకులాతి భీమసంగ్రామ ప్రకాశితాత్మ విక్రమాతిశయోపార్జిత యశోవిభూతి విస్తరుడ''ని హరివర్మ ప్రశంసించబడడం[48] వలన; విష్ణుకుండినులతో అతడు పోరాటాలు సాగించినట్లు, అందు హరివర్మ తోడ్పడినట్లు సూచిస్తాయని ఆయన భావం. తుమ్మలగూడెం శాసనాజ్ఞప్తి అయిన మూలరాజు హరివర్మ కుమారుడై యుండవచ్చునని ఆయన ఊహ.

పై సిద్ధాంతం అనేక కారణాలవలన అంగీకారయోగ్యం కాలేకపోతున్నది జిర్జింగి శాసన ప్రదాత స్పష్టంగా (తూర్పు) గంగవంశీయుడని తెలియవస్తూండగా, వంశగోత్రాది వివరాలు తెలియని ఇంద్రాధిరాజును అతనితో గుర్తించడం సబబుకాదు. అతడు స్వతంత్రించకపూర్వం పృథ్వీమూలుని సామంతుడై ఉంటాడని భావించడం సహేతుకంకాదు. జిర్జింగి తామ్రశాసనం క్రీ. శ 537 నాటిది. అప్పటికే తత్ప్రదాత చతుర్దంత సంగ్రామ విజయుడు, కాగా గోదావరి తామ్రశాసనం ఈ వ్యాసంలో అనుసరించబడిన కాలానుక్రమణికవలన క్రీ. శ. 570 నాటికి చెందియుంటుంది[49] తుమ్మలగూడెం శాసనంలో స్పష్టం చేయబడిన పృథ్వీమూల–విష్ణుకుండిన వంశ సంబంధాలకు భిన్నంగా పృథ్వీమూలుడు స్వతంత్రించి, ఇంద్రభట్టారకునితో పోరాడినాడని నిశ్చయించడానికి తగిన ఆధారాలులేవు. గోదావరి తామ్రశాసనం సైతం అందుకు తగిన సాక్ష్యాధారాలను సమకూర్చదు. పూర్వచరిత్రకారుల ననుసరించి మాత్రమే ఈ పోరాటాలు జరిగినాయని భావిస్తూ సుప్రతీకాన్ని పృథ్వీమూలుడే యధిరోహించినాడని, శాసనార్థానికి విరుద్ధంగా శంకరనారాయణన్‌గారు ఊహించారు.[50]

డా. నేలటూరి వెంకటరమణయ్యగారు[51] పృథ్వీమూలుడు విష్ణుకుండిన ఇంద్రభట్టారకుని శత్రుకోటిలోని వాడని భావించడానికెట్టి ఆధారమూలేదని, పైగా ప్రభువంశం దుస్థితిలోనుండగా ఆదుకొన్న ప్రధాన సామంత పాలకుడని, సరిగా గుర్తించారు. గోదావరి తామ్రశాసన పాఠాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇంద్రాధిరాజు (శంకరనారాయణన్‌గా రూహించినట్లు పృథ్వీమూలుడు కాదు.) సుప్రతీకము అనే దంతావళాన్నధిరోహించి, ఇంద్రభట్టారకు నెదిరించ వచ్చిన రాజుల కూటమిలోని ''సమదకుముద ద్విరదాన్ని'' పడగొట్టినాడని, అందులకు పృథ్వీమూలుడు సంతోషపడినట్లు అర్థమవుతుంది. కుముద ద్విరదాన్ని ఇంద్రభట్టారకుడధిరోహించినాడన్న అర్థాన్ని శాసనపాఠం ప్రతిపాదించదు. కనుక ఇంద్రభట్టారకునికి సాయంగా సామంత పృథ్వీమూలుడు పంపిన సేనలకు ఇంద్రాధిరాజు నాయకత్వం వహించి విష్ణుకుండినుల విజయానికి తోడ్పడినాడని భావించడం సముచితము.

డా. వెంకటరమణయ్యగారు చతుర్దంత సంగ్రామాలలో ప్రస్తావించబడిన సుప్రతీక, కుముద నామధేయాలకు ఏ ప్రత్యేక ప్రాధాన్యతలేదని, కేవలం లాంఛనప్రాయమని అభిప్రాయపడినారు.[52] కాని, అష్టదిగ్గజాలలో ఈ రెండుపేర్లను ప్రస్తావించడం కేవలం లాంఛన ప్రాయమనో, యాదృచ్ఛికమనో భావించ వీలులేదని, అవి కొంత చారిత్రక ప్రాధాన్యతను కల్గియున్నవనే తోస్తుంది. నైఋతి దిశనుండి విష్ణుకుండిన సామ్రాజ్యానికేదో ప్రమాదం ఉత్పన్నం

కాగా, వారికి పృధ్వీమూలుని సేనలు సాయంగా వచ్చినాయని స్ఫురిస్తుంది.

చతుర్దంత సంగ్రామాలు ప్రతాపశీలుడనే రాజుచే నీయబడిన కంఖేడ్ తామ్రశాసనం[53] లో కూడ ప్రస్తావించబడినాయి. ఆ రాజు వంశగోత్రాది వివరాలు తెలియవు. అతడు కూడ విష్ణుకుండినుల పై ఎత్తివచ్చిన రాజుల కూటమిలో భాగస్వామి కావచ్చును [54] గోదావరి తామ్రశాసనంలోని ఇంద్రాధిరాజుతో గుర్తించ వీలులేకున్నా, తూర్పుగంగ వంశీయుడైన, జిర్జింగి శాసన ప్రదాత కూడ, ఆ కూటమిలోనివాడై ఉండవచ్చునని చెప్పడానికి సంశయించ పని లేదు చూడగా, బాదామి చాళుక్యరాజు మొదటి పులకేశి కాలంలో, అతని కుమారుడైన మొదటి కీర్తివర్మ ఈ కూటమినేర్పరచి, ఆంధ్రదేశంపై దండెత్తి వచ్చినాడని తోస్తుంది. అతడు "వంగాంగ కళింగ వట్టూర మగధ మద్రక కేరళ గంగ మూషక పాండ్య చోళీయ ద్రమిళాలూక వైజయం"త్యాది రాజ్యాలను జయించినట్లు[55] వర్ణించబడినాడు. ఈ వాక్యంలోని అతిశయోక్తిని పరిహరించినా, అతడు ఆంధ్రదేశాన్ని పరివేష్టించియున్న రాజ్యాలను జయించినట్లు తెలుస్తున్నది. అట్టి వీరుడు ఆంధ్రదేశాన్ని జయించకపోవడం విచిత్రమే! డా శంకరనారాయణన్‌గారు విష్ణుకుండిన–చాళుక్య రాజ్యాలమధ్య స్నేహసంబంధాలు విలసిల్లినాయని ఊహించారు. [56] కాని, ఆంధ్రదేశంపై రెండవ పులకేశికి పూర్వమే కీర్తివర్మ కొందరు సామంతరాజులను కూడగట్టుకొని, విష్ణుకుండిన కాలంలోనే దండెత్తినాడని భావించడంయుక్తం. ఆ పోరాటంలో చాళుక్యయువరాజు పరాజితుడైనాడని, మొదటి పులకేశికి గల సత్యాశ్రయ బిరుదాన్ని విష్ణుకుండిన ఇంద్రవర్మ, ఈ యుద్ధ విజయసూచకంగా ధరించినాడని తోస్తుంది.[57]

డా. శంకరనారాయణన్‌గారు[58] గోదావరి తామ్రశాసనకాలం నాటికి పృధ్వీమూలుడు స్వతంత్రుడని, తచ్ఛాసన కాలం ఆతని రాజ్య సంవత్సరాలలోనే పేర్కొనబడిందని అభిప్రాయపడడం యుక్తమే. కాని ఆయన భావించినట్లు ఆ రాజు ఇంద్రభట్టారక వర్మ కాలంలో విఫల విప్లవం జరిపి తాత్కాలిక స్వేచ్ఛను పొందినాడని చెప్పరాదని పై చర్చ వలన స్పష్టమవుతున్నది. పృధ్వీమూలుడు ఇంద్రభట్టారకుని వర్ణించాడు కాని, శత్రు వర్ణించాడు కాడు. కనుక, ఆరాజు విష్ణుకుండిన సామ్రాజ్యాస్తమయానంతరం, క్రీ. శ. 570[59] తర్వాత స్వతంత్రించినాడని, అయితే, అతడు 25 సంవత్సరాల కాలం స్వతంత్ర పరిపాలన నెఱపినాడని కాక, తన యావత్పరిపాలనా కాలాన్ని స్వతంత్రమైన దానిగా భావించుకొన్నాడని భావించతగియున్నది.

అలాగే, జిర్జింగి శాసన ప్రదాత విష్ణుకుండినులతో పోరాడినట్లు, అతడు బహుశః కీర్తివర్మలకు సహచరుడై, ఆతడేర్పరచిన రాజ్యకూటమిలో భాగస్వామి అయి ఉండవచ్చునని భావించడంలో పొరపాటు ఉండబోదు. ఏతత్కారణంచేతనే కీర్తివర్మ జయించినట్లు చెప్పిన దేశాలలో కళింగ చేర్చబడిందని భావించవచ్చు.

విష్ణుకుండిన సామ్రాజ్యాస్తమయం తర్వాత స్వతంత్రించి, వారి సామ్రాజ్య భాగాల నాక్రమించడంలో పృధ్వీమూలుడు, అతని కుమారుడైన హరివర్మ అనేక పోరాటాలు చేయవలసి యుండవచ్చు. కట్టుచెఱువు శాసనమందు హరివర్మను గూర్చి చేసిన ప్రశంస, ఆ యుద్ధాలకు సంబంధించిందని భావించవచ్చు. ఆ సమయంలో, రణదుర్జయ వంశీయుడైన పృధ్వీమహారాజు రాజ్యవిస్తరణకై ఉత్తరదిశలో తూర్పుగంగ రాజులను, దక్షిణ దిశగా పృధ్వీమూల వంశీయులను గెల్చినట్లు కన్పిస్తుంది. ఆ పోరాటాల ఫలితంగా పృధ్వీమూలవంశం అంతరించి, వేంగిమండలం దుర్జయ వంశీయుల వశమైందని భావించవచ్చు. క్రీ. శ. 580 ప్రాంతంలో హరివర్మ సింహాసనము నధిష్ఠించి, తర్వాత కొద్ది కాలంలోనే రణదుర్జయ రాజుచే నోడించబడి, రాజ్యభ్రష్టుడై యుండవచ్చును.

ఈవిధంగా ప్రాచీనాంధ్రదేశ చరిత్రలో విష్ణుకుండినుల సామంత వంశాలలో పృధ్వీమూలవంశం ప్రధానమై, వారికి దక్షిణ పార్శ్వ సన్నిభమై నిల్చిందని, అంతేకాని, పూర్వచరిత్రకారుల మతానుసారం వారితో విరోధించి పోరాటాలకు పూనుకొనలేదని, అట్టి సిద్ధాంతం ఆధునికంగా లభించిన సాక్ష్యాధారాలకు విరుద్ధమని గుర్తించాలి.

సంఖ్యారూపక సూచికలు - జ్ఞాపికలు

1 J. B. B. R. A. S, XIV, PP. 114 ff.

2 A. P. G. A. S., No. 6, Sec. VII, PP. 241 ff.

3 భారతి, ఆగస్టు 1965, పుటలు 2–14:

4 Epi. Ind. IV, P. 194. కీల్ హారన్ పండితుడు గోదావరి తామ్రశాసనం, విష్ణుకుండినుల చిక్కుళ్ళ శాసనం లిపి పరిణామ శాస్త్రానుసారం సన్నిహిత సంబంధం కలవిగా చక్కగా గుర్తించారు. కాని, ఆనాటి చారిత్రక సిద్ధాంతాల ననుసరించి, ఆయన ఈ రెండుశాసనాలు, క్రీ. శ 7, 8 శతాబ్దులకు చెందినవిగా భావించారు.

5 శాసన పాఠం (శా. పా.) పంక్తి 43–44. "...సాష్టాశీతి చతుఃశతే శకపతే సంవత్సరాణాం గతే॥"

6 శా. పా., పంక్తి 23.

7 శా. పా., పంక్తులు 1–4.

8 శా. పా., పంక్తులు 5–9.

9 డా. శంకరనారాయణన్‌గారు కూడ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. చూడండి. The Vishnukundis and their Times, పుట 94–95. వారి అభిప్రాయం ముందు వివరంగా చర్చించబడింది.

10 శా. పా., పంక్తులు 12–22.

11 శా. పా., పంక్తులు 3–16.

12 శా. పా, పంక్తులు 6–12.

13 శా. పా., పంక్తులు 12–14.

14 శా. పా., పంక్తులు 12–13. "అనేక చాతుర్దంత సమర సంఘట్ట విజయా"

15 ముందు వివరంగా చర్చించబడింది.

16 శా. పా., 17-30 పంక్తులు పరమ భట్టారికా మహాదేవి ప్రశంస. అందు 23–24 పంక్తులు, "శ్రీ పృథ్వీ మూల రాజవంశ ముత్పత్తి పరిగ్రహేణ శ్రీ యేవ సాగర మలంకృతవత్యా..."

17 శా. పా.. పంక్తులు 44–45. యేనోద్వృతా భర్తృకులస్య లక్ష్మీ ర్మ రథః పతన్తీ నయ విక్రమాభ్యామ్।
ఆజ్ఞాపనాఖ్యాత కుల ప్రసూతః శ్రీ మూలరాజః సనృపేషు ముఖ్యః॥

18 గోవిందవర్మ ఇచ్చిన తుమ్మలగూడెం (మొదటి) శాసనం (పంక్తులు 21–22) స్పష్టంగా "స్వస్యా అగ్రమహిష్యా పరమ మహాదేవ్యా" అని పేర్కొంటుంది. రెండవ విక్రమేంద్రవర్మ ఇచ్చిన తుమ్మలగూడెం (రెండవ) శాసనం (పంక్తులు 28–29) కూడ "గోవిందరాజస్య మూర్తి మతీశ్రియ ప్రత్యవిషయీకృత మనోరథయా పరమభట్టారికా మహాదేవ్యా..." అని వివరిస్తుంది.

19 రామతీర్థం శాసనం పంక్తి 5; రెండవ విక్రమేంద్రవర్మ తుమ్మలగూడెం శాసనం, పంక్తులు 10–11; చిక్కుళ్ళ శాసనం, పంక్తులు 12–13; తుండి శాసనం, పంక్తి 17.

20 చిక్కుళ్ళ శాసనం, పంక్తులు 17–18; తుమ్మలగూడెం శాసనం, పంక్తులు 14–15;

21 శా. పా., పంక్తులు 35-38.

22 శా. పా., పంక్తులు 30–32.

23 శా పా., పంక్తులు 30–32· తుమ్మలగూడెం శాసనంలో, ఈ శ్లోకానికి ముందున్న "యశ్చాత్ర లోభ...పాత కాని భవంతి" అనే వాక్యం కూడ స్వల్పమైన మార్పులతో ఈ శాసనంలో చూడవచ్చును

24 తుండి శాసనపాఠం "విఘ్నతా మ్మా తృగో విప్ర"

25 తుమ్మలగూడెం శాసనపాఠం "బాలయోషి ద్విపశ్చితః"

26 పృథ్వీమూలుని ప్రాబల్యం, పైన 17వ నెం. జ్ఞాపిక.

27 ముందు వివరంగా చర్చించబడింది.

28 నాగార్జున విశ్వవిద్యాలయంవారికి డాక్టరేట్ పట్టంకొఱకు నేను సమర్పించబోతున్న పరిశోధక వ్యాసంలో గోవిందవర్మ పరిపాలనాకాలం సుమారుగా క్రీ. శ. 435–475గా నిర్ణయించి యున్నాను· తదనుగుణంగా సమకాలికుడు, బంధువు నైన మొదటి పృథ్వీమూలుని పరిపాలనాకాలం సుమారుగా 25 సంవత్సరాలుగా భావించి, ఈ కాలనిర్ణయం జరిగింది.

29 A. P. G. A S., No. 6, P 243.

30 శాలంకాయన వంశ, కాలానుక్రమణికలను గూర్చి నా వ్యాసం, ఆంధ్రప్రదేశ ప్రభుత్వ పురాపత్ర సంరక్షక శాఖ (State Archives) వారు ప్రకటించే ఇతిహాస్ పత్రిక, సంపుటి V, సంఖ్య 1., P.P. 1-15 చూడండి.

31 ఈ విషయాన్ని గూర్చి ఇతిహాస్ పత్రికకు ఇటీవల పంపిన మరొక వ్యాసంలో మరింత వివరించాను.

32 భారతి, 1965, జులై, పుటలు 14–28, శా. పా., పంక్తులు 5–6.

33 డా. శంకరనారాయణ్, పుట 32. ఋషీకదేశం నేటి మెదక్ జిల్లావరకు విస్తరించి, అశ్మకదేశ సరిహద్దు నంటి యుంటుందని భావించవచ్చు అశ్మకదేశం నేటి నిజామాబాద్ జిల్లానుండి, పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలు.

34 ఈతని తుమ్మలగూడెం శాసనం పరమ మహాదేవీ విహారానికి దానం చేసిన పెణ్కపఱ గ్రామం కృష్ణకీవల ఉన్నది. అది పల్లవ రాజులలో సింహవర్మ మహారాజు దానంచేసిన ఓంగోడు శాసనంలో కూడ పేర్కొనబడింది.

35 శా. పా., పంక్తులు 21-23.

36 J. B. B. R. A. S., XIV, P.P. 115-116.

37 Epi. Ind. IV, P· 195.

38 Epi. Ind. XXV, PP. 281 ff.

39 Bhandarkar's list., p. 386., Note 5.

40 శా. పా., పంక్తి 4

41 Ancient History of the Deccan., p 91.

42 Early Dynasties of Andhradesa., pp. 493-500. ఆయన ఇంద్రాధి రాజుకే పృథ్వీమూలుడు సామంతుడని భావించారు. డా. నేలటూరి వెంకటరమణయ్యగారు A. P. G. A S., No. 40, p. 35లో, స్వమాతా పితృణ పుణ్యావ్యాప్తి కొరకు ఒక గ్రామాన్ని ప్రదానం చేయదలచి, పృథ్వీమూలునికి విజ్ఞప్తి చేసినవాడు అతనిపై అధిరాజు కానేరడని చక్కగా సూచించారు.

43 Studies in Early History of Andhradesa, pp. 118-119.

44 A. P. G. A. S., No. 10, p. 17. పైన పేర్కొన్న గ్రంథంలో ఈ సిద్ధాంతాన్ని కొంచెం సవరించి, ఆయన ప్రకటించారు. ఇంద్రాధిరాజును జిర్జింగి శాసన ప్రదాతగానే

భావించి, పూర్తిగా డ్యూబ్రే, భావరాజు కృష్ణారావుగార్ల సిద్ధాంతంతో నేకీభవించారు.

రాళ్ళబండి సుబ్బారావుగారు తిరివింగి శాసన ఖండ ఫలకంపై గల కాల సూచికను 28గా చదివి, అది జిర్జింగి శాసనం కంటే ముందటిదిగాను, మితవర్మచే నీయబడినదిగాను వాదించ సమకట్టేరు. J. A. H. R. S., IV, pp. 77 ff. కాని, అందు పేర్కొనబడిన కాలసూచిక 88, డా. శంకర నారాయణన్, పుట 108, Note 20, VIII.

45 పుట 101–102. (పైన పేర్కొనబడిన "ది విష్ణుకుండీస్ అండ్ దెయిర్ టైమ్స్" గ్రంథంలో)

46 అదే గ్రంథం, పుట 100–101.

47 అదే గ్రంథం, పుట. 95–97.

48 శా. పా., పంక్తి 16–18.

49 అంతేకాక, జిర్జింగి శాసన ప్రదాత కంటె తూర్పు గంగవంశంలో మరొక స్వతంత్ర పరిపాలకుడు ఉన్నాడనటానికి స్పష్టమైన ఆధారాలు లేనందున, గంగ శకాన్ని ప్రారంభించిన రాజు ఇంద్రవర్మ అని, అతడు కనీసం నలువదేండ్లు పరిపాలించి, ముప్పది తొమ్మిదవ సంవత్సరంలో ఆ శాసన ప్రదానం చేసినాడని భావించవలసివస్తుంది. ఆ తర్వాత అతడు పృథ్వీమూలుని సామంతుగా కావడానికి అవకాశముండదు. (పైన 42 సూచికను కూడ చూడండి.)

50 "ది విష్ణుకుండీస్ అండ్ దెయిర్ టైమ్స్" పుట 99.

51 "విష్ణుకుండినులు" (తెలుగు), A.P.G.A S., No. 40. పుటలు 34–35.

52 అదే గ్రంథంలో, పుట 34.

53 Epi. Ind. XXII, pp. 93 ff., పంక్తి 3.

54 Early Dynasties of Andhradesa, p. 495.

55 మహాకూట స్తంభ శాసనము, Ind. Ant. XIX, pp. 7–20, శా. పా., పంక్తి 7.

56 "ది విష్ణుకుండీస్ అండ్ దెయిర్ టైమ్స్" పుట 113.

57 తుమ్మలగూడెం (రెండవ) శాసనంలో ఇంద్రవర్మ సత్యాశ్రయుడని పేర్కొనబడినాడు. శా. పా. పంక్తి 1.

58 "ది విష్ణుకుండీస్ అండ్ దెయిర్ టైమ్స్" పుట 95–96.

59 తుమ్మలగూడెం (రెండవ) శాసనం వలన రెండవ విక్రమేంద్రవర్మ పదునొకండవ రాజ్య సంవత్సరం శక 488 సంవత్సరం, లేదా క్రీ. శ 566 తో సరియగునని తెలియవస్తున్నది. కాగా అతని తుది రాజ్య సంవత్సరం, నేటికి తెలిసినంతవరకు పదువాలుగు (తుండి శాసన కాలము). కనుక రెండవ విక్రమేంద్రుని పరిపాలన క్రీ. శ. 570 తో పరిసమాప్తమవుతున్నట్లు నిర్ణయించవచ్చును.

వసంతం నా ప్రియ నేస్తం!

శ్రీ ఆసు రాజేంద్ర

ఆకులు రాలిన కొమ్మల ముఖాల్లో
  విషాదాన్ని తుడిచేసి
చిగురుల చిరునవ్వులు తొడిగే
వసంతం నా ప్రియనేస్తం
జీవితంమీద తీయ్యని అనుభూతులు మొలిపిస్తూ
సమాధి బ్రతుకులకు
ఉగాది ఊపిరిపోసే
'ఆమె'
నిశ్శబ్దంలో అడుగులి దాచుకుని
పూలవాగులా కదలివస్తుంటే

చేదుగా కసిరే వేపరెమ్మలు
పాల నురగల్లాంటి పువ్వులతో పలుకరిస్తాయి
వయసు ముదిరిన మామిడి వృక్షాలు
పుల్లటి పిల్లల్ని బుజాలకెత్తుకుంటాయి
ఆకుల పరదాల మాటునుంచి
నవ్వులు రువ్వే పూలబాలలు
గాలిమేనుకు సుగంధాల్ని పూస్తాయి
కాకి గొంతుకవిని మూర్ఛపోయిన వనాన్ని
కోయిలమ్మలు మృదు మధుర గానంతో
                సేదతీరుస్తాయి.

డా. యు. ఎ. నరసింహమూర్తి

కవిత్వము - ఔచిత్యము

ఈ శకారంభానికి పూర్వం నుండీ ప్రాచ్య – పాశ్చాత్య దేశాలలో కవిత్వతత్త్వాన్వేషకులు ఔచిత్యాన్ని గూర్చి ఆలోచిస్తూవచ్చేరు. కవిత్వం యొక్క బహిరాకృతులైన శైలీగతమైన వివిధాంశాలన్నీ ఔచిత్యంచుట్టూ పరిభ్రమిస్తున్నాయని ఫ్రెంచి విమర్శకులు భావించగా[1] క్షేమేంద్రుని మతాన్ననుసరించిన ఆధునిక భారతీయ విమర్శకులు కవిత్వంయొక్క అంతశ్చేతనను విశ్లేషించే గుణ–రస–ధ్వని–అనుమానాదీ వాదాలన్నీ ఔచిత్యాన్ననుసరించి మసలుకుంటున్నాయని ప్రకటించేరు.[2] కవిత్వంలో ఏ లోటునైనా కప్పిపుచ్చవచ్చునేమో గాని ఔచిత్యం లేని లోటును కప్పిపుచ్చడం కష్టం. ఒక్క కవిత్వానికే కాదు సభ్యమానవ వ్యవహారసర్వస్వానికి ఔచిత్యం మూలాధారం.

ఔచిత్యమనేది వస్తువు వస్తు లక్షణాల అనుగుణ్యానికి సంబంధించిన విషయం. ఏది దేనికి అనురూపంగా వుంటుందో అది ఉచితమనబడుతుంది. ఉచితంయొక్క భావం ఔచిత్య మనబడుతుందని క్షేమేంద్రుడు పూర్వాచార్యుల మాటను పునశ్చరణ చేసేడు.[3] కవిత్వంలో పదార్థోత్కర్షను పరిపోషించి సహృదయుల మనస్సుకు చమత్కారపూర్వకమైన అలౌకికానందాన్ని స్ఫురింపజేసేది ఔచిత్యమని కుంతకుని మాట.[4] ఔచిత్యం చమత్కారకారి అనడంలో క్షేమేంద్రుని ఆశయం కూడా ఇదే[5] అతడు ఔచిత్యాన్ని రసజీవిత భూతమని ప్రకటించి ప్రవక్తృస్థానాన్ని అధిష్ఠించేడు. ఇతరులు కూడా కొందరు ఔచిత్యం అంటే ఏమిటో వివరించిన కొన్ని సందర్భాలున్నాయి. ఆవివరణలనుబట్టి అర్హత్వము,[6] నిర్వాహకత్వము,[7] ఉచితత్వము,[8] యోగ్యత[9] – ఇలా వేర్వేరు పదాలతో ఒకే అర్థం ఔచిత్యతత్త్వంగా గుర్తించబడినట్లు తెలుస్తుంది. పై వాడుకలన్నీ ఔచిత్యమంటే ఏమిటో చెప్తున్నట్లు కనిపించినా స్పష్ట ప్రతిపత్తికి లొంగనివిగా వున్నాయి. కాబట్టి వీటివలన ఔచిత్యమొక అనిర్వచనీయము, అవశ్య సంభావి ఐన తత్త్వమని తెలుస్తోంది. ఆ తత్త్వాన్ని గూర్చి కొంచెం వివరంగా తెలుసుకోవలసివుంది.

ఔచిత్యానికి అర్హత్వం, యోగ్యత అనేవి సామాన్యార్థాలు. సంబంధము – సామ్యముగల వస్తువులు పరస్పరం నిబద్ధతను కలిగి వుండడం, నిర్దిష్ట సంబంధంగల ఒకానొక గుర్తింపు పొందిన ఊహ ఆ సంబంధంపట్ల స్థిరత్వాన్ని కలిగి ఉండడం, ఏది ఎలా వుండాలి అనే విషయంలో అది ఎలాగుండాలో ఆ విధంగా వుండడం ఔచిత్య మనబడుతుంది. లోకంలో ప్రతి విషయం కొన్ని ఇతర విషయాలతో తప్పనిసరి సంబంధాలను కలిగివుంటుంది. మనకు ఎన్నో నియమాలున్నాయి. ఇంకెన్నో పరిణామ దశ లున్నాయి. ఔచిత్య చింతన సమస్తమైన నియమశీల లేదా పరిణామ దశల యోచనలతో ముడిపడినదై వుంటుంది. కవిత్వము మొదలైన కళలను గూర్చిన శాస్త్ర గ్రంథాలు ఆయా కళలకు సంబంధించిన వివిధ అంశాల పరస్పర సంబంధాలను గూర్చి గాఢమైన అభినివేశంతో కొన్ని పద్ధతుల నేర్పరచి వున్నాయి. సౌందర్య దర్శనంలో ఈ పద్ధతులకు కూడా అందని మానసికానుభవా లెన్నో వున్నాయి. ఆ శాస్త్రీయ పద్ధతులను గౌరవించడంలోను, ఆ మానసికానుభవాల నిర్వహణలోను యోగ్యత లేదా అర్హత అనే లక్షణం అత్యంతప్రధానమైనదిగా ఎంచబడుతుంది. యోగ్యత లేదా అర్హత అనే ఈభావన సర్వ సామాన్యమైనది. దానిని సమగ్రమైన ఏ సూత్రానికైనా అమరేటట్లు రూపొందించవచ్చును. ఒక సూత్రానికి పునరుక్తప్రాయంగా గాని లేదా ఇతర భావనకు చెందిన వర్ణనకు ఒదిగేటట్లుగా గాని రూపొందించవచ్చును.

గుప్పెడు అన్నం/గుక్కెడు నీళ్ల
స్వాతి వానకే/ముత్యపు చిప్పై
కరువే రూపం దాల్చి/కడుపే చెరువై ఏడ్చి
నెలత ఒకర్తుక/నిలబడ్డాది
భిక్షాపాత్రికతో.[10]

ఇక్కడ భిక్షాపాత్ర – ముత్యపుచిప్ప సంబంధ సామ్యంగల వస్తువులు. స్వాతివానకోసం ముత్యపుచిప్ప, గుప్పెడు అన్నంకోసం, గుక్కెడు నీళ్ళకోసం భిక్షాపాత్ర ఎదురుచూసి అలమటించడం వాటి పరస్పర నిబద్ధతను వ్యక్తం చేస్తోంది. కరువుకు రూపం ఏర్పడదు. కడుపు చెరువు కాలేదు. అయినా పిడికెడు అన్నం, ఒక చుక్క నీరు దొరకని బిచ్చగత్తె రూపంతో అనుసంధించేటప్పటికి రూపంలేని కరువుకు రూపం వస్తుంది. పిడికెడు నడుమైనా లేని జీవచ్ఛవమైన ఆడదాని ఏడుపు నిండిన కడుపు చెరువుగా కన్పిస్తుంది. దానికి కారణం లోకంలో గుర్తింపు పొందిన ఊహలు ఆ సంబంధంపట్ల స్థిరత్వాన్ని కలిగివుండడమే. రోజుల తరబడి తిండి లేక ఎండిపోయిన బిచ్చగత్తె ఎలాగుండాలో ఈ వర్ణన అలాగుండడమే ఇక్కడ ఔచిత్యం కాగలదు. "మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని కావ్యాని" అనేది మనపూర్వుల నియమాలలో ఒకటి. దానినిబట్టి ఒక కావ్యం "శ్రీ వక్షోజ కురంగనాభ మెదపై జెన్నొంద" అంటూ ప్రారంభమై "వానలు సరవితో వర్షించె, సస్యముల్ వేళ్లంగొల్పుగ విఱవీఁగి పండె" అంటూ ముగియవచ్చును.[11] ఒక వేదనా శకలం ఆధునికమైనా

"బాములు నశించవలె ప్రేముడి హసించవలె
భూమి అలదేవతల భూములను మించన్"[12]

అంటూ భరత వాక్యంతో ముగియవచ్చును. ఇది నియమా న్ననుసరించిన ఔచితమౌతుంది. ఈ విధమైన నియమాలు మన కెన్నో వున్నాయి. కాని పాటించి తీరాలని పట్టుపట్టినవారు కొంత మందే. సంప్రదాయాన్ననుసరించి మాత్రం అవి చాలాకాలం నిలిచి వున్నాయి. మన సాహిత్య చరిత్రలో నడచిన పరిణామ దశలు కొన్ని ఈ విధమైన నియమాలను పాటించడం వలన మాత్రమే ఔచిత్య పోషణ జరుగుతుందనే భ్రమను తొలగించేయి. ఎన్నో నియమాలు గాలికి కొట్టుకుపోయేయి. అంతమాత్రంచేత పాటించదగిన మర్యాద లన్నీ పనికిమాలిన వయ్యాయని అనుకోవలసిన పనిలేదు. నికరమైన విలువలు పరిణామ దశల్లో సైతం తమ మర్యాదను కోల్పోకుండా నిలుస్తాయి. అవి రత్నదీప శిఖలు. ఇప్పుడు—అప్పుడు వీచేగాలులకు ఆరేవి కావు. వాటిని గుర్తించడం, పోషించడం ఔచిత్యానికి మన్నన కాగలదు. ఇక సౌందర్య లోలుపత విషయం. ఒక పాట ''ఇంటి ముందు జూకా మల్లెతీగల్లో అల్లుకొని''[13] వుందంటే, కీర్తి ''చరమ సంధ్యాకాల సంఫుల్ల మల్లికాస్తబక పంక్తులతోడ సరస మాడిం''దంటే[14] ఆ అనుభూతుల స్వరూప స్వభావాలను తార్కికంగా నిర్ణయించాలని భావించినవాడు రసికుడు కాడని చాలమంది అంగీకరిస్తారు. గతించిన ప్రేయసిపాటలో మాధుర్యముంది. ఇంటి ముందున్న జూకా మల్లెతీగలో అందముంది. సౌరభముంది. అంతే కాదు. ఆ మల్లెతీగకు ఆ పాటకు సాహచర్యముంది. అందుచేత మల్లెతీగ అందాన్ని చూడగానే, సౌరభాన్ని గ్రోలగానే పాటలోని మాధుర్యం స్మృతి పథంలో మెరుస్తుంది. ఆ రెండింటి సాహచర్యం తన స్మృతులను విడవకుండా వెన్నాడుతూంది. అందుకే ఆ పాట మల్లెతీగల్లో అల్లుకుందన్నాడు కవి. ఈ అనుభవాన్ని నిర్వహించడానికి ఔచిత్య మర్యాద తెలిసి వుండడం దోహదకారి ఔతుంది. అలాగే సాయం సంధ్యలో విచ్చిన తెల్లని మల్లెపూల గుత్తుల సౌందర్యాన్ని మనసులో పదిలం చేసుకొని కీర్తి తెల్లగా వుంటుందనే కవి సమయంతో దానికి సంబంధాన్నికలిపిన రమణీయ కల్పన రెండవ ఉదాహరణం. ఇక్కడ నియమ పాలనతో పాటు, సౌందర్యానుభూతిని వ్యక్తం చేయడంలో ఔచిత్యం కనబడుతుంది.

అంగి—అంగములమధ్య సిద్ధించిన ఐక్యమే ఔచిత్యమని స్థూలంగా అంగీకరించడం జరిగింది. నిశ్చయమైన ఇలాంటి అంగీకారానికి అశాస్త్రీయాలైన అనుభవాలమీద ఆధారపడడం కారణ మని విజ్ఞుల అభిప్రాయం.[15] యోగ్యత లేక యుక్తత అనే భావన ఐక్యతాభావనకంటె పూర్వమైనది. ఎందుచేతనంటే ఒక పదార్థ సృష్టి దాని అంతస్సంబంధా లన్నింటితోనూ యుక్తమైనదైనప్పుడే ఒక ఐక్యస్వరూపంగా రాణిస్తుంది. అంతేకాని ఐక్యంగా గోచరించిన కారణంగా దానిలోని అంతస్సంబంధాలు తేటపడవుగదా!

''రేయి కడుపున చీకటి చాయవోలె
తమసు పెడఁద దివాంధగీతము విధాన
ఘూకరావాన వలమత రేకరీతి
నా విషాదమ్ములో దాఁగినాఁడ నేనె.''[16]

ఈ దుఃఖగీతంలో విషాదం మూర్తీభవించింది. కారణమేమిటి? నాలుగు పాదాలలోవున్న భావానికి ఐక్యం సిద్ధించింది కాబట్టి. ఈ ఐక్యానికి రాత్రి కడుపులో చీకటి, చీకటి గుండెలో గుడ్లగూబ పాట, గుడ్లగూబ పాటలో గుండెలు కలచే గుణం—ఇవన్నీ ఒకదానిలో ఒకటి అణగివున్న రీతిగా ఈ ప్రవాసి తన విషాదంలో తాను దాగి వుండడమే అభివ్యక్తిలోని వివిధాంశాల అంతస్సంబంధాల అనుగుణ్యమే కారణము. అందుచేత ఔచిత్యమనే భావన ఐక్య భావన కంటె విస్తృతమైన లక్షణంగల విషయం. ఔచిత్యం ఒక వస్తువు లోని వివిధాంశాల మధ్యనుండే సంబంధాన్ని నిరూపించేదిగా వుండడం మాత్రమే కాకుండా భిన్న భిన్న పదార్థాల మధ్యనుండే సంబంధాన్ని తెలియజేసేదిగా వుండడమే అందుకుగల ముఖ్యకారణ మని చెప్పవచ్చును.

ఔచిత్యానికి సంబంధించిన నికరమైన సాధ్యమైన నియమా లను రూపొందించడానికి రెండు ప్రత్యక్షమైన ఆధారాలున్నాయి. అవి (1) ప్రకృతి (2) సంప్రదాయము — ఆచారము వీనిలో సంప్రదాయం, ఆచారం అనేవి విశ్వసనీయంగా ప్రకృతిని ఆధారం చేసుకొని రూపొందించినవి కావడంవల్ల ఆ రెండింటిమధ్య చాలినంత పొందు కుదిరినప్పుడే విలువ నిలుస్తుంది సంప్రదాయం ఆధారంగా రూపొందించబడిన నియమాలు నికరమైనవిగాను, ఆ సంప్రదాయం కొనసాగినంత కాలం నిర్వివాదమైనవిగాను వుంటాయి. ఎప్పుడైనా ప్రకృతిసిద్ధమైన—సంప్రదాయసిద్ధమైన యోగ్యతా నియమాలమధ్య వైరుధ్య మేర్పడితే సంప్రదాయసిద్ధమైన నియమమే ఆమోదయోగ్యమైనదిగాను, నిశ్చలంగా నిలిచేదిగాను ఎంచబడుతుంది. హంస దమయంతితో—

''చదవేటి బంగారు జలరుహంబుల తూండ్లు
భోజనంబులు మాకుఁ బువ్వుబోఁడి''[17]

అంటుంది. ప్రకృతిసిద్ధమైన యోగ్యతా నియమాల ననుసరించి పరీక్షిస్తే నదుల్లో తామర లుంటాయనడం అనుచితం. బంగారు తామరతూళ్లు భోజన పదార్థం కావడం అంతకుమించి అనుచితం. కాని కవుల సంప్రదాయాన్ననుసరించిన యోగ్యతా నియమాలను బట్టి ఈ కల్పనలో ఔచిత్యం సిద్ధిస్తుంది. నదులలో పద్మా లుండడం కవి సమయ ప్రసిద్ధం. హంసలు తామరతూళ్లు తింటా యనే వాడుక కూడా పరంపరాగతమైనది. ఆకాశగంగ—అందులో బంగారు తామరలూ ఉంటాయన్నమాట పౌరాణిక సంప్రదాయా న్ననుసరించి ఉచితంగా కనిపిస్తుంది. సంప్రదాయం ఆధారంగా పై పాదంలోని కల్పనకు శిరఃకంపనంచేసి తిరిగి తిరిగి స్మరించు కునే మనమే ఈ క్రింది కల్పనలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తాం.

''సౌధమున హంసతూలికాశయనము పయి
విశ్రమించు తలంపున వెన్నువాల్చ
తోచె హృదయేశ్వరీ! మహాదుస్సహముగ
వర్తమానాతి దుర్బలావస్థ నాకు''[18]

మన పురాణేతిహాసాల్లోనూ, జానపద గాథల్లోనూ హంసలు–హంస తూలికాతల్పాలు కన్పిస్తాయి. ఆ సంప్రదాయాన్ననుసరించిన కవులు ఆ గాథల్ని ఇప్పుడు రాసినా ఆనాటి వాతావరణాన్ని కల్పించడం అంగీకరిస్తాం. కాని మన తరంలోగాని, మన ముందుతరంలో గాని హంస తూలికాతల్పాలు కాదుకదా హంసలనైనా చూడలేదు. అటువంటి సందర్భంలో సమకాలీనమైన ఇతివృత్తంలో, ఎంత అప్రధానమైనా, 'హంసతూలికాశయన' కల్పన ప్రశ్నకు గురికాక తప్పదు. పూర్వకవి సంప్రదాయం అనేక కారణాలచేత విచ్ఛిన్నమయింది. సంప్రదాయం నిరంతరాయంగా కొనసాగినంతకాలమే దాని ననుసరించిన ఔచిత్యం నిలుస్తుంది. సంప్రదాయంలో మార్పుకలిగితే దాని ననుసరించిన యోగ్యతా నియమాల్లో కూడా మార్పుకలుగుతుంది. ప్రకృతి సిద్ధమైన యోగ్యతా నియమాలు స్థాపనవిషయంలో కఠినతరమైనవిగా వుంటాయి.

కవితా సంబంధమైన విషయాలకు చెందిన తీర్పులలో, బహిర్నిర్మాణంలో, అత్యధికభాగం సందర్భాన్ననుసరించి రూపొందినవి కాగలవు. కవితా సంబంధమైన విషయాల అంతర్నిర్మాణంలో పరస్పర సన్నికర్ష కల వివిధాంశాల మధ్య విశదమైన సంబద్ధత, ఆనుగుణ్యం తప్పనిసరిగా అవసరం. అపరిష్కృతమైన సంఘర్షణకి గాని, వైరుధ్యానికి గాని అక్కడ స్థానంలేదు. ఏ విషయంలోనైనా సామాన్య విధులు ఒకానొక ప్రత్యేక సందర్భంతో సరియైన నిబద్ధతతో వర్తిస్తాయా? లేదా? అని నిర్ణయించే సమస్య మిగిలే వుంటుంది. కళాసంబంధమైన లేదా న్యాయపరమైన పరిణామంలో అంతిమపరిష్కారం ఎప్పుడూ ప్రత్యేక సంబంధాన్ని పురస్కరించుకొని మాత్రమే వెలువడుతుంది. ఇక్కడొక చిన్న సామాన్యమైన ఉదాహరణ చూపిస్తాము. కుమారగిరి లకుమతోపాటు దక్షవాటికి వెళ్తాడు. అక్కడ ఒకనాటి సంధ్యా సమయంలో శివునికి నాట్య నైవేద్య మిమ్మని లకుమను ఆదేశిస్తాడు. అందరిముందూ లకుమ, శివుడు కూడా మైమరచేటట్లుగా తాండవనృత్యం చేస్తుంది. ఆ నృత్యంలో శివపార్వతులు కౌగిలించుకొనే సందర్భం అభినయింపబడుతుంది.

"అంతట చిత్రమ్ముగ 'లకు
మా' యని పిల్చుచు నామెను
కర్పూర వసంతనృపుడు
గాటముగా కౌగిలించె.
రసభంగము చేసెడు నీ
రసహృదయుడు కాడు రేడు
ఔచిత్యజ్ఞుం డైనను
ఆవేశవశుండు రేడు."[19]

ఇక్కడ సామాన్యంగా రెండు అనౌచిత్యాలు కన్పిస్తాయి రసవత్తరమైన నాట్యానికి భంగం కలిగించడమొకటి. పదిమందిలో లకుమను గాఢంగా కౌగిలించుకోవడం రెండవది. ఈ రెండూ సామాన్య విధులకు వ్యతిరిక్తమైనవి. కుమారగిరి ఔచిత్యం తెలియనివాడు కాడు. ఐనా ఈ రకమైన కల్పన చేయడంలోని సామంజస్యమేమిటి? ఇక్కడ కుమారగిరి అనుచిత ప్రవర్తన అనేది లకుమ నాట్యం యొక్క ఉదాత్తతతో ఆచ్ఛాదితమయింది. అందుచేతనే కుమారగిరి ఆవేశవశుడైనందువల్లనే ఆ విధంగా ప్రవర్తించేడని ఆ ప్రత్యేక సందర్భంలోని ఔచిత్యాన్ని కవి సమర్థించడం జరిగింది. ఈవిధంగా సామాన్యమైన నియమాలకంటె ప్రత్యేకమైన సందర్భాలు తమ ఉచితత్వాన్ని నిలబెట్టుకుంటాయి. శృంగారవర్ణనలో ఉపనాయక రతి, ముని–గురుపత్నీగతమైన రతి, అనుభయ నిష్ఠమైన రతి విశ్వనాథుని నియమాన్ననుసరించి దూషితాలౌతాయి[20] ఇందులో ఉపనాయక రతి, ముని–గురుపత్నీగతమైన రతి నైతికదృష్టి ననుసరించి అనుచితమైనవి బహునాయక రతి ఒకానొకప్పుడు లోక–శాస్త్రాలు రెండింటికి విరుద్ధమైనది. రతి ఏకనిష్ఠంగా వుండడం ప్రకృతిసిద్ధమైనా కాకపోయినా సమాజానుమోదితమైన న్యాయం. అనేక నిష్ఠమైనప్పుడు రతిస్వరూపం దూషితమౌతుంది. సాహిత్యం ఆదర్శ సమాజానికి మార్గదర్శకం కావాలనే దృక్పథంతో కావ్యాల్లో పై విషయాలు శోభించవని కొందరు భావించేరు. కొంతమంది ఇందుకు విరుద్ధంగా సంచరించిన వారున్నారు. అప్పుడప్పుడొక్క కవి మాత్రమేకాక సంపూర్ణయుగమే నీతినియమాల కతీతంగా ప్రవర్తించడముంది. కాని శుక్తిమతీకోలాహలంవంటి సందర్భాలలోని అనుభయ నిష్ఠమైన రతి ఆ విధమైనదికాదు. అసత్యత్వం – అయోగ్యత్వం అనౌచిత్యంయొక్క రెండురూపాలు. ఇక్కడ ఆ రెండింటికీ స్థానం

లేదు. ప్రపంచ సాహిత్యంలో పై సామాన్యవిధికి విరుద్ధమైన సందర్భాలు వర్ణించబడిన రసవత్తర ఘట్టాలెన్నో వున్నాయి. ఆ ఘట్టాల ఔచిత్యాన్ని ఒకానొక సామాన్య నియమం ఆధారంగా ప్రశ్నించాలనుకోవడం అరసికతకు ప్రమాణమౌతుంది ఔచిత్య దృష్టితో పరిశీలించినప్పుడు ప్రత్యేక సందర్భం అద్వితీయమైనది. అక్కడ తుది తీర్పును రూపొందించడం ఒక సూత్రాన్ని అనుసంధించడానికి కాదు. అక్కడ అవసరమైన విజ్ఞానానికి, తీర్పుకి పూర్తిగా అనుభవమే ఆధారం. సహృదయుల అనుభవానికి ఇతరుల సమర్థన మాత్రమే నికషోపలమౌతుంది. వివేచనతోకూడిన పరీక్ష లేదా చర్చలమూలంగా ఇతరుల సమర్థన లభిస్తుంది.

నిర్వాహకత్వమే ఔచిత్యమని ఇంకొక వివరణ వుందికదా! నిర్వాహకత్వమంటే ఏమిటి? కళాకారుడు తనకుండే విషయ సర్వస్వ పరిజ్ఞానాన్ని, తన లక్ష్యాని కనువుగ, అవసరమైన మేరకు, స్వీకృత వస్తువులో అమరేటట్లుగా అనుసంధించడం నిర్వాహకత్వమని భావించవచ్చును. ఈ అనుసంధాన విధానాన్ని సంప్రదాయానికి నూత్న ప్రయోగానికి మధ్య వారధిగా అనేక యుగాలనుండి ప్రవర్తిస్తూన్న వ్యాపార విశేషంగా విమర్శకులు భావిస్తున్నారు.[21] భౌతిక ప్రపంచంలో సమ్యక్ సంఘటితమైన పొందిక ఫలితంగా పరిసరాలతో సామరస్యంకల జీవితమెలా రూపొందిందో అదేవిధంగా కళాక్షేత్రంలో అనువర్తన విధానం అతఃపూర్వం సుస్థాపితమైన వస్తువును కళాకారుడు ఆశించిన లక్ష్యాల కనుగుణమైన ప్రమాణాలలో అమర్చడంలో ఫలితాన్ని పొందగలడు. కవితావస్తువు సాంప్రదాయికమైనదై కవి ప్రయోగశీలంతో దాని నిర్వహణకు పూనుకుంటే ఆ రెండింటిని సమన్వయపరచవలసిన బాధ్యత కవికి ఎక్కువగా వుంటుంది. నిర్వహణ ననుసరించి వస్తువులో మార్పులు చేయడం అవసరమౌతుంది. 'అన్యథావా ప్రకల్పయేత్''[22] అనే మాట ఇందుకే పుట్టింది. లక్ష్యంలోని మార్పు, అభిరుచిలోని క్రొత్తదనం, శైలీనవ్యత లేదా నూతన భావసంగ్రథనం ఇలా ఏవైనా సమకాలీనమైన మార్పులు సాంప్రదాయిక వస్తువులో ప్రవేశపెట్టబడవచ్చుమ.

''ఒంటి విలుకాడవై నన్ను నోర్చు తెగువ
వలదురా! రాఘవా! రాఘవా! దశాస్య
నక్కటా! క్రూర విక్రము, స్వాత్మహనన
పాతకుని జేయకుముర! నీ పాదమాన!''[23]

తనను చంపాలని వచ్చే శ్రీరాముడిపై భక్తిని, అభిమానాన్ని ఒలికించే రావణుడున్నాడిక్కడ. ద్వేష భక్తితో శ్రీ మహావిష్ణువును చేరుకోవాలని కోరుకుని వున్నా, సాంప్రదాయిక భావన ననుసరించి రావణుడిలా ప్రవర్తించి వుండలేదు. ఐనా రావణుని శ్రీ రామచంద్రుని భక్తుడిగా తీర్చిదిద్దడమనే అభిరుచి విశేషం ఈ రకమైన నిర్వహణద్వారా నవ్యతను సాధించి ఔచిత్యాన్ని సాధించింది. అందుకే ఈ పద్యం చదివిన వారికి రావణుడిపై సానుభూతి కలుగుతుంది. నిర్వహణరీతిలోని మార్పులు సర్వవ్యాప్తాలైన అంశాలకు చెందినవైనప్పుడే అవి యథార్థస్ఫూర్తితో అనుసరించదగినవి కాగలవు. వారసత్వం వలన సంక్రమించిన వస్తువులలోగల సర్వానుగుణత్వం కవుల్ని, పాఠకుల్ని వాటిపట్ల ఆకర్షితులయేలా చేస్తుంది. ఆ కారణంగా అత్యాధునిక భావాలను ఉద్దీప్తంచేసే నిర్వాహకుడికి సైతం సాంప్రదాయిక జ్ఞానం ఉపకరిస్తుంది.

''ఇదేమి! లోకం హిరణ్య నేత్రుని
పదా ఘాతమున ప్రతిధ్వనించగ
కురుక్షేత్రమున క్రుద్ధవృకోదరు
గదా ఘాతమున గజ గజ లాడగ''[24]

ఇక్కడ సామాజిక విప్లవం ప్రధానంగా గల సామ్యవాద భావనకు దీప్తిని కలిగించడానికి హిరణ్యనేత్రుని పదాఘాతం, క్రుద్ధ వృకోదరుడి గదాఘాతం అనే సాంప్రదాయిక సంకేతాలు స్వీకరించబడ్డాయి. దైవ భావనలోకాని, ఇతిహాసాల యాథార్థ్యంలోగాని విశ్వాసం లేని కవి కూడా సర్వానుగుణత్వం అనేలక్షణం ఆధారంగా సాంప్రదాయిక ప్రతీకల్ని యథేచ్ఛగావాడుకుని ఉద్దిష్ట లక్ష్యసాధన చేయవచ్చును. ఆ నిర్వహణలో ఔచిత్యం భాసించడానికి కవి గ్రహించిన సంకేతాలు సర్వవ్యాప్తమైనవి కావడమే కారణం. ఈ రీతిగా కవిత్వంలో నిర్వహణ కుండే ప్రాధాన్యాన్ని గ్రహించినవారు కాబట్టే కుంతకుడు,[25] ఆనందవర్ధనుడు,[26] విశ్వనాథ[27] మొదలైనవారు కావ్యంలో కథకు గాక నిర్వాహకత్వానికే అధిక ప్రాధాన్యముందని చెప్పడం జరిగింది. ఒకే గ్రంథాన్ని ధర్మశాస్త్రమని, వేదాంతమని, నీతిశాస్త్రమని, మహాకావ్యమని, సర్వలక్ష్య సంగ్రహమని, ఇతిహాసమని, పురాణ సముచ్చయమని- ఆ విషయాలు క్షుణ్ణంగా తెలిసినవారంతా కొనియాడడం ఎలా సాధ్యం ?[28] అది విశ్వ జనీనం కావడమెలాగ? అది కవియొక్క నిర్వాహకత్వం వలన సాధ్యమయింది. అందుకు మహా భారతమే ప్రమాణం. విశ్వనాథవారు తమ రామాయణ కల్ప వృక్షాన్ని ''నా సకలోహ వైభవ సనాథ'' మన్నారు. రాసేది రాముడికథ అందులో అన్నీ తన ఊహలే ఉండడ మెలా? అనే ప్రశ్నకు వారి నిర్వాహకత్వమే సమాధానం. ఈ నిర్వాహకత్వం కవుల వ్యక్తిగత ప్రతిభా వైలక్షణ్యం వలన సిద్ధిస్తుంది.

''చూడు చంద్రుణ్ణి, అతన్నెవరు ముద్దు పెట్టుకున్నారో
మొహమంతా తాంబూలం మచ్చలు.''[29]

కవులు చంద్రుడిలోని మచ్చలను గురించి ఎన్నో విధాలుగా ఊహించేరు. కాని ఈ భావన సరిక్రొత్తది. కథా సందర్భాన్ననుసరించి యౌవనావస్థలో ఉన్న నాయికా నాయకులు యథేచ్ఛగా సుఖాన్ని అనుభవిస్తూన్న సందర్భంలో నాయకుడీ మాట అంటాడు. వారి భావాలన్నీ ఆ సందర్భంలో శృంగారభరితాలై వున్నాయి. కాబట్టి ఎదుటనున్న చంద్రుడిలోని మచ్చలను ఆ భావన కనుగుణంగా దర్శించడం జరిగింది. ఇక్కడ రచయిత సందర్భాన్ననుసరించి తనఊహను చంద్రునిమీద ఆరోపించడంలో అతని నిర్వాహకత్వం తెలుస్తూంది.

నిర్దుష్టంగా వుండడమే ఔచిత్యతత్త్వమని సామాన్యంగా భావించడం వుంది. ఆ భావన ననుసరించి ఒక ప్రమాణం లేదా పద్ధతి, నియమం లేదా సూత్రానికి దృఢంగా కట్టుబడివున్న

స్పష్టమైన, సమగ్రమైన భావన ననుసరించడం ఔచిత్యమనబడుతూంది. ఈ రకమైన ఔచిత్యం రెండు రకాలుగా వుంటుంది. అనిర్వచనీయమైన ప్రమాణంతో కూడిన సమగ్రమైన పద్ధతి, నిర్వచించబడిన సూత్రం, నియమం లేదా ప్రకృతిసిద్ధమైన ఐక్యం, నిర్దిష్టమైన ఊహల ననుసరించి నిర్మించబడిన సంప్రదాయం మొదలైన వాని విషయంలో సూత్రానికి లేదా క్రమబద్ధమైన ఆచరణకు కట్టుబడి వుండడం ఔచిత్యం కాగలదు. సూత్రముఖంగా అసంపూర్ణంగా ప్రతిపాదించబడిన ప్రమాణాన్ని లేదా నియమాన్ని అనుసరించడానికి గాని, అంతవరకు ఏ సూత్రంచేతా నిర్మితం కాని ఒకానొక నియమాన్ని అనుసరించడానికి అతఃపూర్వం సుసంగతమై, సుస్థాపితమైన సూత్రాన్ని అతిక్రమించడం కూడా ఔచిత్యం కావచ్చును.

"We destroy conventions only to construct ideals"[30] అన్న వాక్య మీఅంశాన్నే దృఢపరుస్తూంది. ఈఅంశం కొంచెం వివరణ సాపేక్షమైనది. ఆధునిక కాలంలో భాషా విషయికంగా ఆచార రూఢమైన, సంకేతరూఢమైన వ్యవహారానికి కట్టుబడి వుండడం ఔచిత్యమనిపించుకుంటూంది. అదే ఇంతకుముందు భాషా వ్యవహారం నుండి ఏర్పడిన సూత్రాలకు కట్టుబడి ఉండడం ఔచిత్యమని వ్యవహరించబడింది. సాహిత్య రంగంలో ఆధునికుల దృష్టి సహజత్వానికి, వాస్తవికతకు నిబద్ధమై వుండడం, రసానుగుణమైన రీతిలోవుండడం, సూత్రబద్ధం కాకపోయినా సర్వసమ్మతమైన సంకేతానికి లేదా అలవాటుకు కట్టుబడి వుండడం ఔచిత్యమనిపించుకుంటూంది. పూర్వం అలంకారశాస్త్ర సంబంధమైన విధాయక సూత్రాలకు కట్టుబడి వుండడం ఔచిత్యమనితలంచబడేది.

ఔచిత్యానికి సంబంధించిన అతిముఖ్యమైన, ఆచరణయోగ్యమైన ప్రశ్నలన్నీ నిబద్ధతకు సంబంధించి లేదా నియమము–సూత్రాలకు సంబంధించి ప్రాచీన ఆధునిక దృక్పథాల మధ్య సంభవించిన సంఘర్షణ నుండి లేదా నియమానికి – సూత్రానికి మధ్య నడచిన సంఘర్షణ నుండి పుట్టేయి. సిద్ధాంతరీత్యా ఈ విధమైన సంఘర్షణ సూత్రంయొక్క వైఫల్యాన్ని ఇముడ్చుకొనేదిగాను, నిరుపయోగతను వ్యక్తం చేసేదిగాను వుంటుంది. సమగ్రంగా నిర్మించబడిన లేదా విశదంగా అనుసంధించదగిన సూత్రాలు లేనిపక్షంలో సాధారణ నియమాల్లో దాగివుండే నిర్దిష్టమైన అర్థ్యమలమ సుస్థాపితం చేయడం కష్టం కాగలదు. ఒక సూత్రాన్ని సమర్థవంతంగా స్థానభ్రష్టం చేయగలిగేది వేరొక సూత్రం మాత్రమే. ఈ విషయాన్నంతటినీ దృష్టిలో ఉంచుకునే క్వింటిలియన్ అనే గ్రీకు పండితుడు ఔచిత్యాన్ని కళా సంబంధమైన సర్వ వాస్తవిక సూత్రాలకు ఆధార కేంద్రంగాను, సూత్ర విరుద్ధమైన మార్గంలో సంచరించవలసిన కళాకారుడికి ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగాను పేర్కొన్నాడు.

అధస్సూచికలు

1 రీన్ వెల్లెక్, ఎ హిస్టరీ ఆఫ్ మాడరన్ క్రిటిసిసమ్, వోల్తేర్, పు. 45.

2 "ఔచిత్య మనుధావన్తి సర్వే ధ్వని రసోన్నయాః।
గుణాలంకృత రీతీనాం నయాశ్చానృజు వాఙ్మయాః।"

ఆచార్య కుప్పుస్వామిశాస్త్రి, హైవేస్ ఎండ్ బైవేస్ ఆఫ్ లిటరరీ క్రిటిసిసమ్ ఇన్ శాన్స్క్రిట్, పు. 27.

3 "ఉచితం ప్రాహురాచార్యాః సదృశం కిల యస్యయత్।
ఉచితస్య చ యో భావః తదౌచిత్యం ప్రచక్షతే॥"
ఔచిత్య విచార చర్చా, శ్లో. 9

4 "ఆశ్లేసేన స్వభావస్య మహత్త్వం యేన పోష్యతే।
ప్రకారేణ తదౌచిత్య ముచితాఖ్యాన జీవితమ్॥"
వక్రోక్తి జీవితమ్, 1–53.

5 "ఔచిత్యస్య చమత్కారకారిణ శ్చారు చర్వణే।
రస జీవిత భూతస్య విచారం కురుతేఽధునా॥"
ఔచిత్య విచార చర్చా, శ్లో. 3.

6 "అర్థాత్వ మౌచితీ", కావ్య ప్రకాశము, శ్రీధర వివేకటీకా, ప్రకాశకులు – శివప్రసాద భట్టాచార్య, పు. 44.

7 "ఔచితీ – తాత్పర్యా న్నిర్వాహకత్వమ్" కావ్య ప్రకాశము, మహేశ్వరుని ఆదర్శ వ్యాఖ్య, పు. 84.

8 "ఔచిత్యమ్ ఔచితీ", సరస్వతీ కంఠాభరణము, నారాయణ దండనాథ వ్యాఖ్య, భా. 4, పు. 31.

9 "ఔచితీ యోగ్యతా", ఆంధ్ర రస గంగాధరము – వేదాల తిరువేంగళాచార్యులు, పు. 32.

10 శ్రీరంగం నారాయణబాబు, రుధిరజ్యోతి – 'దేశమాత'.

11 అల్లసాని పెద్దన, స్వారోచిష మనుసంభవము.

12 ఆరుద్ర, త్వమేవాఽహమ్ – 'వేదనా శకలం'.

13 తిలక్, అమృతంకురిసిన రాత్రి- 'నువ్వులేవు నీ పాటవుంది.'

14 శ్రీనాథుడు, శృంగార నైషధము.

15 జోసెఫ్ టి. షిప్లీ, డిక్షనరీ ఆఫ్ వర్ల్డ్ లిటరేచర్, ఫిట్‌నెస్.

16 దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణశాస్త్రికృతులు–ప్రవాసము.

17 శ్రీనాథుడు, శృంగార నైషధము 2–49.

18 తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, హృదయేశ్వరి.

19 సి. నారాయణరెడ్డి, కర్పూర వసంతరాయలు.

20 "ఉపనాయక సంస్థాయాం ముని గురుపత్నీ గతాయాంచ।
బహునాయక నిష్ఠాయాంరతౌతథానుభయనిష్ఠాయాంచ॥"
విశ్వనాథుడు, సాహిత్య దర్పణము.

21 ఎన్. హెచ్. స్టెయిన్‌బర్గ్—కాస్సెల్స్ ఎన్‌సయిక్లోపేడియా ఆఫ్ లిటరేచర్, సంపుటము 1, పు. 5, 6

22 యత్స్యా దనుచితం వస్తు నాయకస్య రసస్యవా।
విరుద్ధం తత్పరిత్యాజ్యం అన్యథావా ప్రకల్పయేత్॥
సాహిత్య దర్పణము, 6–50.

23 కాటూరి వేంకటేశ్వరరావు, పౌలస్త్య హృదయము.

24 శ్రీశ్రీ, మహాప్రస్థానం—'జ్వాలా తోరణం.'

25 "నిరంతర రసోద్గార గర్భ సౌందర్య నిర్భరాః।
గిరః కవీనాం జీవన్తి న కథామాత్ర మాశ్రితాః॥"
కుంతకుడు, వక్రోక్తి జీవితము—చతుర్థోన్మేషము.

26 "నహి కవే రితివృత్తమాత్ర నిర్వాహేన ఆత్మ పదలాభః"
ఆనందవర్ధనుడు, ధ్వన్యాలోకము.

27 "ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయి
రెట్లు గొప్పది నవకథా ధృతిని మించి"
విశ్వనాథ, రామాయణ కల్పవృక్షము—అవతారిక.

28 "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
... ...
... ...
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁజేసె భారతంబు"
నన్నయ, ఆం. మహాభారతము, ఆది–1–32.

29 చలం, శశిరేఖ — పు. 41.

30 జార్జ్ శాంతాయన — ఎస్సేస్ ఇన్ లిటరరీ క్రిటిసిజమ్, పు. 292.

ఆధార గ్రంథాలు

1 ఔచిత్య విచార చర్చా — క్షేమేంద్రుడు.
2 వక్రోక్తి జీవితము—కుంతకుడు.
3 డిక్షనరీ ఆఫ్ వరల్డ్ లిటరేచర్- జోసెఫ్ టి. షిప్లీ.
4 కాస్సెల్స్ ఎన్‌సయిక్లోపేడియా ఆఫ్ లిటరేచర్ — ఎస్. హెచ్. స్టెయిన్‌బర్గ్.
5 ది గ్రీక్ ఎండ్ రోమన్ క్రిటిసిజమ్—జి.ఎమ్.ఎ. గ్రూబ్.
6 రస సిద్ధాన్త - డా. నగేంద్ర.

అరుణ సందేశం

శ్రీ నాళేశ్వరం శంకర్

ప్రేయసీ!
నిన్నక్కడే వదిలేస్తా
తాజమహల్‌ను మించడానికి –

వెలుతురు పిట్టా!!
నన్ను కాళరాత్రి కబళించినా
నీవెంటే వస్తా –

రాత్రి
భూశవంపై
చల్లబడ్డ పేలవు గింజల్లా
విద్యుద్దీపాలు
స్తంభాలకు వురితీయబడుతున్నాయ్

ఈ పసి దీపాలకు తెలియదు
రాత్రిని ఉదయం చేయలేమని –

ఈ వెలుతురుకు తెలియదు
చీకటాలోచన గుంటనక్క
పైనుంచి పొంచిచూస్తోందని –

కనురెప్ప మేఘం వెనక
సమాధిలోవున్న
నా కంటి సూర్యుడికి తెలుసు

చేతల్నిచెప్పే దగా చేతుల్ని
నమ్మేకన్న
చేతుల్ని నరకడం నయమని!

బంధముక్తి

కల

కల్పవృక్షంగా ఎదిగి
పుప్పొడి చినుకుల దుప్పటిలో
పూలను దాచుకొన్నచోట
నేనూ ఒక పూవునై ...

శిల

శిల్ప ఋక్షంగా ఒదిగి
ఉలితాకని ఎదలోతుల లోయలలో
తళుకు పరుచుకున్నచోట
నేనూ ఒక తళుకునై ...!

సినీవాలి

ఉగాది మొదలైన అమావాస్యరాత్రి
ఆరుబైట పరుచుకున్న
నిశ్శబ్దంమీద
ఏవేవో కాళధ్వనుల కర్కశదాడి
కదులుతున్న గాలిచేత
కదిలింపబడుతున్న ప్రత్యణువులో
ప్రతి
ధ్వనీ
ప్రతిధ్వనే ...

ఆత్మలో చైత్ర మిహికం
విషాదంగా గుచ్చుకొని
నేత్ర సీమల్లోకి యాత్ర సాగిస్తున్న ఆరాత్రి
అణువు అణువు అవ్యక్త ఆలాపనలో ...

మనసు విప్పితే
మంచుకన్నా చల్లని కన్నీళ్లు
మాట మాట కోసం
వెతుక్కుంటున్న చప్పాళ్లు ...

క్షణాలు క్షణాలతో చేస్తున్న
నిర్దయా సంగ్రామంలోని
ఎందరో క్షతగాత్రుల సామూహిక నిర్వేదం
వెన్నుతట్టి యిస్తున్న వేదాంతసారం ...

ఊపిరి తప్ప
ఉనికి సంకేతం తెలియని అవస్థకు
సిలైన్ సూది ...

అన్నీవుండి — ఏమీలేని
ఒక అసహాయత కనుకొలుకుల్లో నివాసం
ఏర్పరుచుకొని
చుక్క చుక్కను నరాల్లోకి ఓపిగ్గా ఎక్కిస్తున్న
సిలైన్ సూదివంక
చూస్తున్నప్పుడు
నేలమీద నేత్రజల పరిణాహం ...

పదభారంతో పుడమి
క్రుంగిపోతున్న స్పృహ
ఆలోచన ఆకాశంగా వ్యాపించి
రేగిపోయి రోదసికి బలి ...

చీకటి రాత్రికి చిక్కుముడి వేసిన
వేదనామయ మరుత్తులో
హంస విలవిల్లాడుతున్న జాలి ...

చీకాకుల పొదలో
కాకుల రొద ...

కళ్లలో
చిక్కుపడిన కాలం కాళ్లు — చేతుల
ఆగినట్టు కనిపించే నీరస చైతన్యంలో
ఒదిగిన — రేయి.
కాలపు
ఆకాలపు ఓర్పులో
నిట్టూర్పుల బలి ...

చీకటి రేఖా చిత్రాల్ని
అస్పష్టంగా గుండె గోడలమీద
గీస్తోన్న
శిశిరవృక్ష
శిథిలశాఖా
కుంచెలు ...

ఏడిపించే రాత్రిని ఎరుగుదును
కానీ
ఏడిచే రాత్రిని
ఓదార్చబోతే ఒలకబోసుకునే విషాదం
రాలిపడిన విచ్చుకోని ముద్దమందార పువ్వులో ...

గడిచిన కాలం
ఇంత వేగంగా దూసుకొచ్చిందికదా
ఈ వ్యక్తా వ్యక్తాల నడుమ
నలుగుతున్న వర్తమాన వలయంలో
తెల్లారకుండానే వచ్చిన వెలుతురు!
ఆలస్యమైనా అమృతం విషంకాలేదు!

సాంధ్యశ్రీ

[డా॥ పాటిబండ్ల దక్షిణా మూర్తికి ....]

స్మశానంలో త్రవ్వబోకు

రఘువర్మ

గతం —
ఒక స్మశానం!
అందులో ...
నీ తీరని కోరికలను, ఆశలను
పూడ్చిపెట్టిన —
నీ వయస్సుకు కొలతలైన
సంవత్సరాల సమాధులుంటాయి!
జ్ఞాపకాలనే కీచురాళ్ళ రొదలుంటాయి!
నిట్టూర్పులనే నక్కల ఊలలుంటాయి!
ఆవైపు చూడాలని
ఉబలాటంగా ఉంటే —
ధైర్యాన్ని దీపంగా వెలిగించుకొని
అలా ఛాయామాత్రంగా చూడు.
కానీ — అందులో త్రవ్వబోకు
త్రవ్వితే నీకు నిధులు దొరకవు
కోరికల కంకాళాలు తప్ప —
ఆశల అస్థికలు తప్ప!
దుఃఖమనే అమావాస్య చీకటిలోమాత్రం
ఆవైపు నీవసలే వెళ్ళబోకు.
వెళ్ళితే — జ్ఞాపకాల కీచురాళ్ళ రొదలు
నీ చెవులను గింగుర్లెత్తించి
నిన్ను బధిరుడిగా చేస్తాయి!
నిట్టూర్పులనే నక్కల ఊలలు
నీ గుండెల్ని ముక్కలుగా కోస్తాయి!!!

[అంకితం — సామాన్యుడికి]

పరుగు

ఏమిటీ జీవితం? ఇంత చిత్రమైనదేమిటి? ఇంత అర్థంకానిదీ అయోమయమూ ఏమిటి?

నిన్నటికి నిన్న ఓ కోరిక. ఆ వాంఛా సాఫల్యంకోసం వెర్రిగా ఆత్రతపడడం.

ఇవాళ—అదే కోరిక—తీరుతూంటే — పాముకోర గుండెల్లో దిగుతూ విషం చిమ్ముతున్నంత విపరీత వేదన! తన కోరికే తనతో క్రూరంగా ఆటలాడుతూ వెక్కిరిస్తూ . మనిషీ. నీ బుద్ధీ జ్ఞానమూ అల్పాతి అల్పంసుమా అని ఛెళ్ళున కొరడా ఝుళిపించడం వీపుమీద!

జీవితం చదరంగమే కావొచ్చు. మనిషి — పావే కావొచ్చు. కాని—మరీ యింత దారుణమా! ?

*　　　*　　　*

"పార్వతమ్మగారూ! ... ఉత్తరం .." మిట్టమధ్యాహ్నపు ఎండలో చల్లగాలిలాగ పోస్టుమన్ పిలుపు.

అంతవరకూ బాధించిన నడుమునొప్పి ఎక్కడ కెగిరిపోయిందో ఒక్కసారి? తటాలున లేచి వచ్చారు పార్వతమ్మ. "మజ్జిగ తీసుకుందువుగాని. దాహం తీరుతుంది. ఎంత ఎండగా ఉంది..." అంటూ—ఉత్తరం అందుకోకుండానే లోపలికి వెళ్ళి పెద్ద గ్లాసుతో తేటమజ్జిగ తెచ్చారావిడ తాగి — అడిగించుకోకుండానే ఉత్తరం చదివాడు పోస్టుమన్. రఘు—కులాసాగానే ఉన్నాడుట. శ్యామలకూడా బాగానే ఉందట· విశాఖపట్నంనుంచి విజయవాడ బదిలీ కాబోతున్నట్లు వ్రాశాడు.

అంటే—మరో రెండువందలమైళ్ళ దూరంగా వెళ్తున్నాడన్నమాట! ఎక్కడి టెక్కలి, ఎక్కడి విజయవాడ! మనుషుల్ని ఎందుకిలా దూరదూరంగా విసిరేస్తూ ఉంటాడో దేముడు? ఉత్తరంలో మాటవరసకయినా రాయలేదు తనని రమ్మనీ, వొచ్చి తమతోనే ఉండమనీ. ఆ భావన స్ఫురించేసరికి పార్వతమ్మ కళ్ళల్లోకి నీళ్ళు వొచ్చేశాయి· ఇక ఆమె వేయబోయే ఛాదస్తపు ప్రశ్నలు పోస్టుమాన్‌కి తెలుసు...అతనికి కొత్తకాదు.

సరిగ్గా చదివావా నాయనా? మా వాడు నన్ను రమ్మని వ్రాయలేదూ? మా కోడలు నీళ్ళు పోసుకున్నట్లు వ్రాశాడేమో. మరోసారి...జాగ్రత్తగా చదువుబాబూ ... నీకు పుణ్యముంటుంది. మా అబ్బాయి మరీయింత పొడిగా వ్రాయడే. చచ్చి నీ కడుపున పుడతాను, మరొక్కసారి చదవవూ?

ఆ ఉత్తరంలో ఏమీ ఉండవు—ఆమె ఆత్రతా అనుమానమే తప్ప ఆ ముసిలావిడమీద జాలి వేస్తుంది. ఆ కొడుకుమీద కోపం వొస్తుంది. ఉత్తరంలో రాయని—అబద్ధాలు చదివేద్దామా అన్నంతగా మనసు కరిగిపోతుందావిడ పరిస్థితినీ దైన్యాన్నీ చూస్తూంటే. కాని అది తప్పనిపిస్తుంది. ఇప్పటికే డ్యూటీనిమించి చేస్తున్నాడు. అదనపు పనిలో అబద్ధాలాడడం ఒకటా?

పోస్టుమాన్ జారుకున్నాడు—ఆవిడ పరధ్యానంగా ఉండడం చూసి.

పార్వతమ్మ కనులు తుడుచుకుంది. ఎదురుగా...దూరంగా ఎండలో...రోడ్డుమీద . వెన్నెల్లో అంత హాయిగానూ ఆడుకుంటున్న పిల్లలు. వాళ్ళకి ఎండ అనిపించడంలేదూ?

అడ్డాలనాడు పిల్లలు కాని—గెడ్డాలు వొచ్చాక పిల్లలా? కాదు కాదు. వాళ్ళే నాటికీ పిల్లలే. ఆ తప్పు—వాళ్ళది అయిఉండదు. కనిపెంచిన అమ్మదే ఐ ఉంటుంది. తెలిసో తెలియకో ... ఎక్కడో ఏదో లోపం . పొరపాటు . చేసి ఉంటుంది తల్లి. దానికి శిక్ష — తరువాత ఎప్పుడో అనుభవిస్తూ—బిడ్డని తప్పు పడుతుంది తను చేసినది మరచి. అంతే తప్ప పిల్లలకి అమ్మా...అమ్మకి బిడ్డలూ దూరమౌతారా? రక్తబంధం ఓ పట్టాన దూరం కానిస్తుందా?

తను రఘుకి చేసిన అపచారమేమిటి? వాడికెందుకింత కోపంగా ఉంది అమ్మమీద? వొచ్చి తనతోనే ఉండమని ఒక్క ఉత్తరంలోనూ వ్రాయడేం? అసలు—ఉత్తరాలే పున్నానికో అమావాస్యకో తప్ప రాసి పడెయ్యడేం? తను మూడు నాలుగు వ్రాయిస్తే—వాడు ఒక్కటి వ్రాయడం గగనం. అదీ—పెళ్ళాంచేత రాయించి చివరన తను సంతకం చేస్తాడు విధిలేనట్లు. తనకి చదువు బాగా రాదు కానీ వాడి చేతివ్రాత తనకి గుర్తే. అంత ఉత్తరమూ వాడే వ్రాస్తే చూసుకుని మురిసిపోదామనుకుంటుంది. కాని వాడలా వ్రాయడు. అమ్మమీద వాడి కెందుకింత కోపం?

ఓ నిముషం ఆలోచనలో పడింది పార్వతమ్మ. జీవితంలోకి—ఆలోచనలూ జ్ఞాపకాలూ పడవ కట్టుకుని—వెనక్కి వెళ్ళింది అతి జాగ్రత్తగా. అలాగ గతాన్ని పునరావలోకనం గావించుకునేసరికి ఆమెకేదో తట్టింది. ఇంక ఆమె ఆలస్యం చేయదలుచుకోలేదు క్షణమయినా. అంత ఎండలోనూ—బయలుదేరింది, నాలుగిళ్ల అవతలి నారాయణమ్మగారింటికి. వాళ్ల మనవడు హరి బుద్ధిమంతుడు. అడిగితే కాదనడు. రమ్మంటే రాననడు. ఎన్ని చిన్న చిన్నపాయాలు చేసిపెట్టడం లేదింతవరకూ? ఆ కుర్రాడి రాత కూడా చక్కగా ముత్యాల కోవలా ఉంటుంది.

అతన్ని బ్రతిమాలుకుని యింటికి తీసుకువొచ్చింది. కాగి తమూ కలమూ అతనే తెచ్చాడు. కళ్ళు మూసుకుని—ధ్యానంలోలాగ ఉండి—మెల్లగా చెప్పసాగింది.

''నాయనా రఘూ! ... ఇన్నాళ్ళూ నేను గ్రహించలేక పోయాను. నేను చేసిన పొరపాటూ నీకు నామీద కోపానికి కారణమూ. విషయం తెలిస్తే నువ్వు యీ అమ్మని క్షమించగలవనే ఆశ. చిన్నప్పుడు నువ్వు మందకొడిగా ఉండేవాడివి. అలాగని అనారోగ్యమూ కాదు. చురుకుదనం తక్కువ. దానికి వైద్యుడు చెప్పిన పద్ధతి—నీలో కదలికలు బలవంతంగా ఐనా కలిగించమని. నెలల పిల్లడివి. నన్ను పట్టుకు వదిలేవాడివి కావు ఒక్కక్షణమైనా ... నీకు పాకడం నేర్పడానికి నేను నీకు దూరంగా జరిగేదాన్ని. నీకందకుండా...అందివచ్చే అంది దూరమౌతూ పాకడం... తరవాత నడక...పరుగుకూడా అలాగే నేర్పాను. కొంచెం పెద్దయ్యావు. అది తెమ్మనీ యిది తెమ్మనీ అటూ యిటూ పంపేదాన్ని. సాయంత్రం ఆటలాడుకుందుకు పొమ్మనేదాన్ని. ఇంట్లో—నీకు దూరంగా ఉండి పరుగెత్తుకు రమ్మనేదాన్ని. నీకు దొరక్కుండా దూరమయ్యేదాన్ని. నిన్ను దూరదూరంగా పరుగు తీయించేదాన్ని. అది—నీ ఆరోగ్యమూ అవయవాలూ సక్రమంగా అయ్యేందుకు వైద్యుడు చెప్పిన విధానం అనుసరించడమే తప్ప నిజంగా నిన్ను దూరం చేసుకోవాలనీ నీకందకూడదనీ కాదు. నువ్వెంత దూరంగా పరుగెడుతూంటే అంత ఆనందంగా ఉండేది నా కప్పుడు. అందుకే—బజారుకనో మరో పని అనో నిన్ను దూరంగా పంపేదాన్ని. అది—నువ్వంటే యిష్టమూ ప్రేమా లేకకాదు...నిన్నూ నలుగురితోనూ సమంగా తయారు చేయాలని.

ఇప్పుడు—నేను ముసిలి దాన్నయిపోయాను. నువ్వేమో నాకు దూరంగా అతి దూరంగా పరుగెడుతున్నావు నిన్ను నేనందుకోగలనా బాబూ? అప్పుడు నీకు నేను నేర్పిన పరుగు—యిప్పుడు నామీద ప్రయోగించకు. నేను నిన్ను చేరలేను. బాబూ, ఆవేళ... ఆ రోజుల్లో ఎంతగా వేడుకున్నానో నీకు పరుగు రావాలని!...ఇప్పుడు అంతగానూ కోరుకుంటున్నాను నువ్వు నాకు దూరంగా పరుగెత్తకుండా అతి దగ్గరగా రావాలని. అప్పుడు నువ్వు పరుగెత్తి నన్నందుకో గలిగేవాడివి కానీ యిప్పుడు నేను నడవడానికీ అశక్తురాలినే. అర్థం చేసుకుని — యీ అమ్మని దగ్గరగా తీసుకోవూ ఆగ్రహం మాని? నీమీది బెంగతో ఎంత క్రుంగి కృశించిపోతున్నానో! ఒక్కసారి వొచ్చి కనిపించవూ నా కన్నుల పండుగగా? అప్పుడు నిన్ను దూరంగా పరుగెత్తించిన దానికి పరిహారంగా యిప్పుడు నన్ను దూరంగా ఉంచకు. ఇంక పెద్ద వాడి వయ్యావు. దూరపు పరుగులు వొద్దు. దగ్గరగా రా...''

నీకు చేరువ కావాలని పరితపిస్తున్న అమ్మ.

అంతే అన్నట్లు ఆగిందావిడ. మూసుకున్న ఆమె కన్నుల నుండి ఆగకుండా కన్నీరు. రఘు పరుగు అతని వయసుదీ వాతావరణానిదీ అని ఆ వృద్ధురాలికి తెలియదు.

హరి—కాగితాన్ని కవరులో పెట్టబోతూ—చిత్రమైన ఆ ఉత్తరాన్ని అదోలా చూశాడు.

~~~~~~~~

బ తు కు

జి ం బో

నే
చచ్చిపోతాననే కదూ
నీ
బాధ
పిచ్చివాడా —
ఈ వ్యవస్థలో
మనం బతికింది
తొమ్మిది మాసాలే.

—: o :—

ఆ ర్తి

శ్రీ గోవిందరాజు రామకృష్ణరావు

పిలవనిదే
'ఓయ్' అన్నది ఎవరు ?
నీవే అయివుంటావు
ఓ ప్రభూ !
అంతటి
ఆర్తి ఎవరికుంటుంది ?
కంటికి రెప్పలా కాపాడే
నీకు తప్ప !

—: o :—
~~~~~~~~

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

ఎలమంచిలి చాళుక్యులు

తెలుగునాడు మూడుపూవు లారుకాయలుగా పాలించిన వేంగీచాళుక్య ప్రభువుల యనంతరము వారి శాఖ ఒకటి వుత్తర ప్రాంతాలకి తరలివచ్చి ప్రస్తుత విశాఖ జిల్లాలోని శారద, వరాహ నదులమధ్య నున్న ఎలమంచిలి రాజధానిగా పదహారవ శతాబ్ది వరకు పాలించినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం యిది ఎలమంచిలిగా పిలువబడు నప్పటికీ చాళుక్యుల శాసనాల్లో దీన్ని 'ఎలమంచి'గనే పేర్కొనటం జరిగింది.[1] ఈ శాఖ చాళుక్యులు దీన్ని ఆశ్రయించటానికి కారణం వేంగీ చాళుక్యుల కాలంలో యేడవ శతాబ్ది నుంచీ యీ నగరానికి లభించిన ప్రాముఖ్యతేనని చెప్పుకోవచ్చు.

ఎలమంచిలి ప్రప్రథమంగా మనకు వేంగీ చాళుక్యుల దాయాదుల కలహాల్లో ప్రస్తావనకు వస్తుంది. సమస్త వేంగీ దేశాన్ని అతి కొద్దికాలంపాటు నిల్పుకోగల్గిన కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు మూడవ విష్ణువర్ధనునిచే రాజ్యభ్రష్టుడై తరుమబడినపుడు యిటు ప్రక్క పారివచ్చి, పర్వతముల మధ్య సురక్షితముగ, నదీ జలములతో సుసంపన్నముగా, దిమిల వంటి ప్రముఖ రేవు పట్నములతో నలరారు మధ్యమ కళింగ దేశాంతర్గతమైన యీ ఎలమంచిలి నగరము నాక్రమించెను.[2] ఈతని సంతతివారైన రెండవ మంగిరాజు, వినయాదిత్యవర్మ, శ్రీకొక్కిలివర్మ మహారాజులు మధ్యమ కళింగప్రాంతాలు ఎలమంచిలి రాజధానిగా పాలించినట్లు ముంజేరు తామ్ర శాసనాలు తెల్పుతున్నాయి.[3] అయితే వీరీ ప్రాంతాలను స్వతంత్రముగా పాలించారో లేక వేంగీ సింహాసనానికి తలవొగ్గి పాలించారో స్పష్టంగా తెలియదు. కాని మూడవ విష్ణువర్ధనుని కాలం నుండి గుణగ విజయాదిత్యుని కాలం వరకు వేంగీ రాజులెవ్వరూ యీ కొక్కిలి సంతతిపై దండెత్తకపోవటాన్నిబట్టి ఆ ప్రాంతాల్ని వీరికి విడిచిపెట్టినట్టు భావించుకోవచ్చు. సర్వలోకాశ్రయులమని, అనివారత శక్తిత్రయ సంపన్నులమని బిరుదములు ధరించిన వీరు శైవమతావలంబకులు.

వీరి తర్వాత ప్రథమ చాళుక్య భీముని కశింకోట శాసనమున ఎలమంచిలి మధ్యమ కళింగ విషయము ప్రస్తావింపబడింది.[4]

ఈ విధంగా ఎలమంచిలి, వేంగీ చాళుక్య చరిత్రలో నొక ప్రాముఖ్యతగల నగరముగా చాల సందర్భములలో చెప్పబడినను, నొక పటిష్టమైన రాజధానిగా పన్నెండవ శతాబ్దిలో యీ శాఖ చాళుక్యులు ప్రవేశించు వరకును ప్రభవింపలేకపోయినది. అప్పుడడుగిడిన చాళుక్య శాఖ సుమారు పదునెనమండుగురు పాలకులతో వ్యాపించి, రాజధానిగా ఎలమంచిలి కీర్తి పెంచిరి. వీరే ఎలమంచిలి చాళుక్యులు.

వీరి వంశ చరిత్ర వెలువరించటానికి ప్రబలాధారాలు శాసనాలు. పంచధార్ల ధర్మలింగేశ్వరుని ఆలయంలోని శాసనాలు, సింహాచలం లోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని శాసనాలు వీరి వంశ చరిత్ర తెల్పటంలో చాల వుపకరిస్తాయి. పంచధార్లలోని విశ్వేశ్వరదేవ, నృసింహదేవ చక్రవర్తుల శాసనాల్లో వీరి వంశపు వివరాలు చాల వరకు లభ్యమౌతాయి. వీటికి తోడుగా వీరి పోషణలో విన్నకోట పెద్దన రచించిన 'కావ్యాలంకార చూడామణి', దోనయామాత్య కవి వ్రాసిన 'సస్యానందం' మనకు మరిన్ని వివరాలందించి వీరి వంశ చరిత్ర తెల్సుకోవటంలో తోడ్పడతాయి.[5]

వీరి పూర్వీకులైన వేంగీ చాళుక్యుల లాగే వీరుకూడ చంద్రవంశీయులమని చెప్పుకుంటూ చాళుక్య ప్రశస్తిని తమ శాసనాల్లో చెప్పుకొనేవారు.[6] మధ్యయుగాల్లో యిలా చెప్పుకోవటం చాల రాజవంశాలకి పరిపాటిగా కన్పిస్తుంది. ఈ రాజుల శాసనాలన్నీ చాల వరకు శక సంవత్సరం, తిధి వారాలు పేర్కొన్నవే కనుక రాజ్యకాలాన్ని, వంశ క్రమాన్ని నిర్ధారించటంలో అంతగా చిక్కులేర్పడలేదు. కొంతమంది రాజుల శాసనాలు లభ్యం కాకపోవటంతో కొన్ని సంశయాల్ని యితరాధారాలతో పూరించుకోనల్సి వస్తోంది.

సమర్థులైన యోధులు, పరిపాలనాదక్షులు చాలమందివున్న యీ కోవ పాలకుల్లో గణుతికెక్కిన చక్రవర్తి విశ్వేశ్వరదేవుడు. సాహితీ సమరరంగాలు రెండింట ఎలమంచిలి ప్రతిష్ఠ గణనీయంగా పెరిగిన దీతని పాలనలోనే. పరిస్థితులనుబట్టి యీ రాజులు తూర్పు గాంగులకు, గజపతులకు సామంతుల ననిపించుకొన్నను వీలైనప్పుడెల్ల ప్రతిఘటించి స్వతంత్రత ప్రకటించేవారు.

ఉదయాదిత్యుడని అభివర్ణింపబడిన విజయాదిత్యుడను రాజు యీ ఎలమంచిలి చాళుక్య వంశపు మూల పురుషునిగా తెలియుచున్నాడు. ఈతని భార్య చండాంబిక. పుత్రుడు మల్లపదేవుడు. ఈతని శాసనములుగాని యితరాధారములుగాని లభ్యమగుటలేదు. ఈతని కాలమును గూర్చి నిర్ధారించుటకు నవకాశములు లేకపోయినను యీతడు మొదటికులోత్తుంగ చోడుని కుటుంబములోని వాడగుటచే క్రీ॥ శ॥ 1170 ప్రాంతములకు చెందియుండునని సివెలుపండితుడభిప్రాయపడెను. కాని శాసనమున స్పష్టముగా యీ విజయాదిత్యుడు కులోత్తుంగుని వంశమునకు చెందినవాడుగా మాత్రము చెప్పబడినది, కుటుంబములోని వానిగాకాదు.[7] అందువలన శ్రీమతి యశోదాదేవిగారు గుర్తించినట్లు సివెలు పండితుని నిర్ణయ మనుమానాస్పదమే.[8] బహుశః యీ విజయాదిత్యుని పాలన క్రీ॥ శ॥

1203 నుండి 1228 ప్రాంతము వరకు నుండి యుండినట్లూహింపవచ్చును.

ఈ విజయాదిత్యుడెవరై యుండుననునది వివాదగ్రస్తము. ఈతని సోదరియైన గోమతీదేవి శాసన మొకటి చాళుక్య ప్రశస్తితో క్రీ॥ శ॥ 1205 సం॥న యీయబడినది. దీని నాధారముగా నీ విజయాదిత్యుని ఎలమంచిలి చాళుక్య వంశ స్థాపకునిగ యనుమానింపవచ్చును. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, తాళపునిచే పదభ్రష్టుడైన బేత విజయాదిత్యుడే యీ వంశమును పదవ శతాబ్ది ప్రాంతమున స్థాపించెనని భావించిరి. ఈ విజయాదిత్యుడు క్రీ॥ శ॥ 1205 ప్రాంతమున యీ భూభాగముల నేలినట్లును, మల్లపదేవుని తండ్రిగను తప్ప మరే యితర వివరములు తెలియక పోవుటచే యీ విజయాదిత్యు డెవరైనదీ స్పష్టముగా తెలియదు.

ఈతని కుమారుడు సర్వలోకాశ్రయ మల్లపదేవుడు. ఈతని భార్యయైన లక్ష్మీదేవి శాసన మొకటి సింహాచలమున క్రీ॥ శ॥ 1266న యివ్వబడినది. ఆ శాసనమునందు తన పుత్రుడైన వుపేంద్రదేవుని యాయురారోగ్యైశ్వర్యాభివృద్ధికై శ్రీ సింహాచల స్వామికి 'మణప' యను గ్రామమును సమర్పించినట్లు తెల్పబడినది.[9] ఈ శాసనమందు తన భర్తయైన మల్లపుని విషయ మేమియును ప్రస్తావింపబడకపోవుటచే నీ సమయమున కాతడు సజీవుడో, కాడో తెలియదు. కాని యీ శాసన మివ్వబడిననాటికి పాలకుడుపేంద్రుడని చెప్పగలము. మల్లపుని రాజ్య కాలము క్రీ॥ శ॥ 1228 నుండి 1253 వరకు సాగియుండవచ్చును. (పై సింహాచల మందలి లక్ష్మీదేవి శాసనమున నీతని నామము మంగిరాజని తెల్పబడినది. కాని వంశ వృక్షపు యితర వివరములకు సరిపోవుటచే నీతనిని మల్లపునిగా గుర్తించుట జరిగినది. వంశ వృక్షమునకు నవంబరు, 1979 భారతి చూడుడు.)

ఈ మల్లపుని కుమారుడైన వుపేంద్రదేవునకు కరవాల భైరవ, ధరణీ వరాహాది బిరుదములు కలవు. ఈ బిరుదములకు రూఢిగా యీతడెదుర్కొనిన శత్రువర్గము గాని, పోరాడి జయించిన యుద్ధములుగాని తెలియవు. ముందు చెప్పబడినట్లుగా యీతని నిమిత్తమై యీతని తల్లి లక్ష్మీదేవి మణప గ్రామము సమర్పించినది. ఆనాటి కీతని తండ్రి మరణించినట్లూహించుటకు వీలున్నది. క్రీ॥ శ॥ 1253 లో యివ్వబడిన ద్రాక్షారామ శాసనమున నీ యుపేంద్రుడు తన తండ్రికి ధర్మార్థముగా శ్రీ భీమేశ్వర మహాదేవునికి కొంత భూమి సమర్పించెను.[10] బహుశః ఆ కాలమునకే మల్లపుని మరణమును, ఉపేంద్రుని రాజ్యాభిషేకము కూడ జరిగి యుండును.

ఈతని భార్య గంగాంబిక యనియు, కుమారుడు రెండవ మల్లపదేవుడనియు తెలియుచున్నది. యశోదాదేవిగా రీతని భార్య నామము గణపాంబికయని పొరబడిరి. కాని విశ్వేశ్వరదేవ, నృశింహదేవుల శాసనములనుబట్టి యీతని భార్య పేరు గంగాంబయే.

రెండవ మల్లపదేవుడు క్రీ॥శ॥ 1266 ప్రాంతమున రాజ్యమునకు వచ్చియుండును. క్రీ॥శ॥ 1250 ప్రాంతములలో పట్టాభిషిక్తుడై యుండునని సివెలు పండితుని భావము. కాని ఆనాటి కింకనూ యీతని తండ్రికే రాజ్యము సంక్రమింపలేదు. చాళుక్య కుల భూషణ, సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన — యనున వీతని బిరుదములు. భార్య చోడాంబిక. ఈతని తరువాతవాడైన రెండవ వుపేంద్రదేవుని సింహాచల శాసనమును బట్టి యీతడు సుమారు క్రీ॥శ॥ 1283 వరకు ఎలమంచిలి ప్రాంతముల నేలియుండును[11]

మల్లపుని యనంతరము రాజ్య మధిష్ఠించిన వాడీతని కుమారుడైన రెండవ వుపేంద్రుడు సింహాచల శాసనము వలన క్రీ॥శ॥ 1283లో రాజ్యమునకు వచ్చినట్లును, యీతని తర్వాతి వాడైన కొప్పరాజ నారాయణుని రాజ్యారంభ కాలమైన క్రీ॥ శ॥ 1316వరకు రాజ్యమేలినట్లు తెలుస్తోంది.[12] రాజశేఖర, చాళుక్య కుల భూషణ, చాళుక్య వంశక్షితిపతి తిలక యనున వీతని బిరుదములు. ఈతడు తన శత్రువుల నణదమణచినట్లు శాసనములందు పేర్కొనబడినది. కాని ఆ శత్రువులెవ్వరో, ఏ సందర్భమున వారీ యుపేంద్రుని యెదుర్కొనిరో తెలియదు. ఈతడు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థము చోడమల్లాగ్రహారము గట్టించెను. భార్య మల్లాంబిక.

రెండవ యుపేంద్రదేవుని యనంతరము రాజ్యమునకు వచ్చిన దీతని పుత్రుడైన రాజనారాయణ కొప్పదేవుడు. యశోదాదేవి గారీతడు క్రీ॥ శ॥ 1300 ప్రాంతమున రాజ్యమున కొచ్చియుండునని పేర్కొనినారు. కాని యీతని శాసనములు క్రీ॥ శ॥ 1316 నుండి మాత్రము లభ్యమగుటచే దానినే యీతని రాజ్యారంభ వర్షముగా నిర్ణయించుట యుచితము. ఈతని పేరు రాజనారాయణుడే అయినను క్షీరారామ కొప్పేశ్వరునియెడ యీతనికిగల భక్తివిశేషములవే నీతని యనంతర శాసనములందీతడు కొప్పేశ్వరునిగను, కొప్పరాజుగను, పేర్కొనబడినాడు. పరగండభైరవుడని బిరుదు వహించిన యీతడు గొప్ప పండితుడని తెలియుచున్నది. భార్య గంగాంబ. ఈతని శాసన మొకటి పాలకొల్లు క్షీరారామమున కలదు. క్రీ. శ. 1356 వరకు సుమారు నలుబది సంవత్సరము లీతడు రాజ్యమేలెను.

అన్నదేవచోడుని రాజమండ్రి మ్యూజియపు శాసనము ననుసరించి చోడభక్తి రాజు గజపతులను ఎలమంచిలి ప్రక్కనున్న పంచధార్లలో ఓడించినట్లును, తనకు సామంతుడైన యొక కొప్పలపతిని ఆ ప్రాంతమున కభిషేకించినట్లును తెలియుచున్నది.[13] ఆ యుద్ధ వివరములు స్పష్టముగా తెలియకపోయినప్పటికీ ఆ గజపతి మూడవ వీరనరసింహుడు కాదగును. ఆతని సామంతృత్వమున ఎలమంచిలి కొప్పరాజు కూడ యీ యుద్ధమున పాల్గొని చోడభక్తిరాజు చేతిలో నోడియుండెనకొనుట కవకాశ మున్నది. ఈ విధముగా కొప్పరాజ నారాయణుని కాలమున ఎలమంచిలిసీమకై కామవరపుకోట తెలుగు చోళులు, కళింగ తూర్పుగాంగులు పరస్పరము కలహించుకొనుచున్నట్లు తెలియుచున్నది.

ఈ కొప్పరాజ నారాయణుని యనంతరము క్రీ. శ. 1356 ప్రాంతమున నీతని కుమారుడైన మూడవ యుపేంద్రదేవుడు

రాజ్యమునకు వచ్చినట్లు సింహాచల శాసనమునుబట్టి తెలియుచున్నది, ఈతడు శాసనమున 'చాళుక్య కుల సర్వలోకాభి రాముడ'నియు. 'వరవరాంగ లాంఛనేక్షణుడ'నియు వర్ణింపబడినాడు.[14] విశాఖ జిల్లాలోని అప్పికొండ ఆలయమున నీతని మరియొక శాసనము కలదు. అందీతని తండ్రియైన కొప్పదేవుని ధర్మార్థము యొసగిన కానుకలు చెప్పబడినవి. ఈతనికి బింబాంబవలన చెన్నీశ్వరుడును, మరియొక పుత్రుడు మనుమోపేంద్రుడును కల్గిరి. ఈతని రాజ్యాంతకాలము తెలియదు. కాని యీతని కుమారుడు క్రీ శ. 1372 వరకు పాలించుటచే దరిదాపుగా నీతడు క్రీ. శ. 1365 ప్రాంతమువరకు రాజ్యము నేలినట్లు చెప్పవచ్చును.

బహుశః యీ ఉపేంద్రుడు తన సార్వభౌముడైన మూడవ వీరభాను దేవుని తోడ్పాటుతో కామవరపుకోట తెలుగుచోళుల సామంతుడైన కొప్పల పతిని ఎలమంచిలి ప్రాంతములనుండి తరిమి వైచి యుండును. ఇది తరువాత యనేక వైర వైషమ్యములకు కారణమైనది· ఎలమంచిలి దాపునగల 'కలువలపల్లి' ప్రాంతములు అల్లయవేమునిచేతను, కశింకోట ప్రాంతములు అల్లయవీరునిచేతను జయింపబడుట యీ ప్రాంతముపై వరుసగా జరిగిన దాడులను సూచించుచున్నవి.

మూడవ యుపేంద్రుని యనంతరము సింహాసన మెక్కిన వాడు ఎలమంచి చెన్నీశ్వరదేవుడు. ఎలమంచిలి శాఖ చాళుక్యులలో 'ఎలమంచి'ని తన నామమున కలిపి చెప్పుకొనిన తొలిరాజితడే. ఈతడు తన తండ్రి యనంతరము క్రీ శ. 1365 ప్రాంతమున రాజ్యమునకు వచ్చినట్లు తెలియుచున్నది. ఈతని భార్యయైన అయిదవ వుపేంద్రుడును, మల్లాంబవలన ముమ్మడిదేవి క్రీ శ. 1372లో సింహాద్రినాథుని సన్నిధిని శాసనమొకటి చెక్కించెను.[15]

ఈమెకాక యీతనికి మల్లాంబయను మరియొక భార్యగూడ నున్నట్లు మల్లాంబ కుమారుడైన చోడగంగుని సింహాచల శాసన మూలమున తెలియుచున్నది [16] చెన్నీశ్వరునకు ముమ్మడాంబవలన అయిదవ వుపేంద్రుడును, మల్లాంబవలన చోడేంద్రుడును జన్మించిరి. ఈతని రాజ్యాంతకాలము చర్చించవలసిన యంశము

ఎలమంచి చెన్నీశ్వరుని భార్యయైన ముమ్మడాంబ క్రీ. శ. 1372లో సింహాచలము నందిచ్చిన శాసనము అయిదవ వుపేంద్రుని రాజ్యకాలమునకు చెందినదిగా కన్పించుచున్నది. ఈ శాసనదత్త సమయమునకు చెన్నీశ్వరుడుండెనో, లేదో తెలియదు. కాని పాలకుడుగా మాత్రము అయిదవ వుపేంద్రుడు చెప్పబడెను. విశ్వేశ్వరదేవుని వంటి యనంతర రాజుల శాసనములు మరియొక విధముగా

పేర్కొనుచున్నవి. వాటి ననుసరించి యీ సమయమున రాజ్యము నాల్గవ వుపేంద్రుడైన మనుమోపేంద్రుని పాలనలో నుండెను. దీనినిబట్టి యీ కాలమున ఎలమంచిలి రాజ్యము తన పినతండ్రి యైన నాల్గవ వుపేంద్రుని యాక్రమణలో నుండగా అయిదవ వుపేంద్రుడు దాని వారసునిగా ప్రకటించుకొని పెనుగులాడినట్లు గని, లేదా వారిరువురు సంయుక్త పాలన మొనరించినట్లు గావి భావించుట కవకాశము కల్గుచున్నది. ఏది ఎట్లున్నను క్రీ.శ.1372 నాటికి వీరిరువురిలో నేయొక్కరుగాని, వుభయులుగాని పాలించి నట్లును చెన్నీశు డీ కాలమునకు పరమపదించెననియు తెలియు చున్నది.

ఈ చెన్నీశ్వరుని కాలముననే ఎలమంచిలి చాళుక్యులు తమ రాజధానిని పంచధార్లనుండి ఎలమంచిలికి మార్చి యుందురని యశోదాదేవిగారి యభిప్రాయము. కాని యీ విషయము నిర్ధారించు టకు అవకాశములు లేవు. మొదటినుండియు యీ వంశస్థుల కుల దైవమైన ధర్మలింగేశ్వరుడు పంచధార్లలో నుండెను తప్ప రాజ ధానిగా యది యెన్నడును లేదు.

చెన్నీశ్వరుని యనంతరము ఎలమంచిలి రాజ్యమధిష్ఠించిన దాతని సోదరుడైన మనుమోపేంద్ర దేవుడు. ఈతని వివరములు యీతని పుత్రుడైన విశ్వేశ్వరదేవుని పంచధార్ల శిలాశాసనమువలన తెలియుచున్నవి.[17] క్షత్రియ ధర్మమును పరిరక్షించు సమర్థుడైన పాలకుడుగా వర్ణితుడైన యితడు క్రీ. శ. 1375 వరకు పాలించి యుండును. రాజశేఖర, సర్వజ్ఞ, శంకర యనున వీతని బిరుదములు. భార్య లక్కాంబిక. బహుశః యీతనితో యీతని అన్న కుమారుడైన అయిదవ ఉపేంద్రుడు రాజ్యమునకై తగువు పడుచున్న సమయముననే అనవేమారెడ్డి యీ ప్రాంతములపై ఎత్తి వచ్చినట్లును, యీ ప్రాంతములను జయించినట్లును తెలియుచున్నది.

మనుమోపేంద్రునితో సింహాసనమునకు పెనగిన అయిదవ ఉపేంద్రుడు చివరకు కృతకృత్యుడై క్రీ. శ. 1375 ప్రాంతము లలో రాజ్యమునకు వచ్చినట్లును, కొద్దికాలము మాత్రమే పాలించి నట్లును తెలియుచున్నది. ఈతని భార్య అత్యమాంబ. ఆమెవలన నీతనికి ఉపేంద్రుడు, నాగేంద్రదేవ చక్రవర్తి, నృసింహదేవచక్రవర్తి యను ముగ్గురు పుత్రులు జన్మించిరి. ఈతడీ ప్రాంతములను రెడ్డి రాజుల సామంతునిగా పాలించెననుటకే అవకాశమున్నది.

ఈతని పుత్రుడైన నృసింహదేవుని శాసనమువలన నీతడు తన పేరిట ఉపేంద్రవరమను నగ్రహారము నిర్మించినట్లు తెలియు చున్నది.[18] దీనిని ప్రస్తుత ఎలమంచిలి తాలూకాలోని 'ఉప్మాక'గా గుర్తింపదగును.

ఎలమంచిలి చాళుక్య పాలకులలో తలమానిక మనదగిన వాడును, పరాక్రమవంతుడును, పండితుడును, సంగీత సాహిత్య పోషకుడును, ఆలయ నిర్మాణాది పుణ్యకార్యాభిరతుడునైనవాడు విశ్వేశ్వర చక్రవర్తి. తమ వంశ ప్రశస్తిని సవివరంగా శాసనములందు జెక్కించిన తొలిరాజితడే. తెలుగు భాషలో ప్రప్రథమంగా నలంకార శాస్త్రమును విన్నకోట పెద్దనచే వ్రాయించి ప్రోత్సహించుటకు, తెలుగు సాహిత్యమున చూడామణిగ నమరించుటకు కారకుడీతడే. ఎన్నివిధముల చూచినను ఎలమంచిలి చాళుక్య చరిత్రయందు మాత్రము గాక తెలుగుజాతి చరిత్రయందే విశ్వేశ్వరదేవుని ఖ్యాతి గణుతికెక్కినది.

విశ్వేశ్వరుడు క్రీ॥ శ॥ 1377నుండి 1407 వరకు రాజ్యాధి కారము వహించెను. కాని క్రీ॥ శ॥ 1391 లో నీతని పెదతండ్రి పుత్రుడైన చోడగంగుని సింహాచల శాసనమును బట్టి,[19] నాటి నుండి 1407 వరకు చోడగంగునితో కల్సి సంయుక్తపాలన మొన రించినట్లు తెలుస్తోంది. అందువలన స్వీయ పాలనలో పదునాల్గు సంవత్సరములు, సంయుక్త పాలనలో పదునారు సంవత్సరములు మొత్తముమీద ముప్పది సంవత్సరము లీతని పాలనసాగినది. శాసనము లందీతడు విశ్వేశ్వరభూపతి, సర్వలోకాశ్రయచక్రవర్తి, విష్ణువర్ధన, ఎలమంచి విశ్వేశ్వర, రాయగండ గోపాల, ధరణీవరాహ — అని పేర్కొనబడెను

ఈతని రాజ్యపాలనా కాలమందు అతిముఖ్యముగా చెప్పదగిన యంశము క్రీ॥ శ॥ 1402లో సర్వసిద్ధియొద్ద ఆంధ్రులతో జరిగిన యుద్ధము. దీనిని గురించి పంచధార్ల శిలాశాసనమున[20]

''గతి బాహుశక్తి భూమి [తి] మపి గణయత్స్వవ్స్ సిద్ధిపథ భగ్నం।
సతి చిత్రభాను సాక్షిణి ధరణీ వరాహోద ధావ దంధ్రబలం।''

అని చెప్పబడినది. ఇదే విషయము 'కావ్యాలంకార చూడామణి' యందును సమర్థింపబడినది

''చతురుపాయ బాహుశక్తి క్ష్మావళి బాఅవిడిచి చిత్రభాను సాక్షిం
బాజె సర్వసిద్ధి పదమేది ధరణీ వరాహమునకు నోడి రాచకదువు''

ఈ 'సర్వసిద్ధి' సర్వసిద్ధి బిరుదాంకితుడైన చాళుక్య జయసింహుచే గాని తద్వంశజులచే గాని అతని పేరిట కట్టబడిన గ్రామము. ఎల మంచిలి కారుమైళ్ళ దూరమున కలదు. ఇందలి ఆంధ్ర శత్రువు లెవరనునది ఆసక్తితో గమనింపవలసిన యంశము. శాసనములందు గాని, కావ్యాలంకార చూడామణి యందుగాని యీ వివరము ప్రస్తా వింపబడలేదు యుద్ధము జరిగిన చిత్రభాను వత్సరమైన శక సం॥ 1324 (క్రీ॥శ॥ 1402)న విశ్వేశ్వరుడు సర్వసిద్ధియొద్ద ఆంధ్ర సైన్యముల నెదుర్కొని విజయము నందెను. ప్రొ॥ జె. నోబెలు దొరగారీ శాసనమును వ్యాఖ్యానించుచు యింతకన్న యితర వివరము లీ శాసనమున చెప్పబడలేదనిరి. కాని యీ శత్రువులు ఆంధ్రేశ్వ రులమని బిరుద నామములు ధరించిన వెలమ పాలకులుగాని రాజ మహేంద్రవరపు రెడ్డిరాజులుగాని కావచ్చును. వారెవరైనను వారితో చాళుక్య విశ్వేశ్వరునకు గట్టి ప్రతిఘటన ఎదురైయుండవచ్చును. అందువలననే చాల కాలము వరకు ఆ యుద్ధ విజయము వీరికి స్మరణీయమైనది.

ఈతని భార్య మనుమయదేవి. వీరికొక కుమార్తె తప్ప పుత్రులున్నట్లు తెలియుటలేదు.

చాళుక్య విశ్వేశ్వరుని తర్వాత సింహాసన మధిష్ఠించినది సంయుక్తపాలకుడైన ఎలమంచి **చోడగంగదేవుడు.** రెడ్డిరాజులు మున్నగువారితో నిరంతరము సంభవించు చిన్న కలహములే అంత వరకు వీరి సంయుక్త పాలనకు కారణము కాదగును. సమర్థుడగు పోటరి కనుకనే నీతని సహకారము కోరి విశ్వేశ్వరు డీతనిని తనతో పాటుగా సింహాసనమున నిల్పుకొనియుండును. విశ్వేశ్వరుని మరణానంతము వీరి మైత్రి వర్ధిల్లినది. సింహాచలపు శాసన మొకటి చోడ గంగుని యోధునిగను, శత్రునిర్మూలనమొనర్చిన వానిగను వర్ణించుచున్నది.[21] నాల్గవ వీర భానుదేవుని సార్వభౌమత నీత డంగీకరించినది లేనిది శాసనములలో వెల్లడి కాలేదు.

చోడగంగుని యనంతరము రాజ్యమునకు వచ్చినది అయిదవ ఉపేంద్రుని పుత్రుడైన **ఆరవ ఉపేంద్రుడు.** విశ్వేశ్వరునకు గాని, చోడగంగునకుగాని పుత్రులు లేకపోవుటతో నీతనికిట్టి యవకాశము కల్గినది. ఈతని శాసనము లేవియు లభ్యము కాకపోవుటచే యీతడు రాజ్యమునకు రాలేదని కొందరి తలంపు. కాని నృసింహుని పంచధార్ల శాసనమున చోడగంగ నాగేంద్రులకు నడుమ ఉపేంద్రుడు గూడ చెప్పబడుటచే నీతడు సింహాసనమున కొచ్చినట్లు భావించుటయే యుక్తము. ఈతనిపాలన క్రీ॥ శ॥ 1417 వరకును సాగియుండును.

ఆరవ ఉపేంద్రుని యనంతరము ఎలమంచిలి సింహాసన మధిష్ఠించినది అతని సోదరుడైన నాగేంద్రదేవుడు. విష్ణువర్ధనుడను బిరుద నామము ధరించిన యీతని శాసనమొకటి పంచధార్ల ధర్మలింగేశ్వరుని ఆలయమున కలదు. ఈతనిభార్య అన్యమదేవి. అన్యమదేవియేకాక యీతనికి భవానీదేవి యను మరియొక భార్యయున్నట్లు పుత్రుడైన కుమార యెఱ్ఱమ నాయకుని శాసనము మూలముగా తెలియుచున్నది.[22] ఈతడు నరసింహదేవుని రాజ్యారంభకాలమగు క్రీ॥ శ॥ 1422 వరకును పాలించియుండును.

నాగేంద్రదేవుని యనంతరము రాజ్యమునకు వచ్చినది అతని సోదరుడును అయిదవ ఉపేంద్రుని ఆఖరుకుమారుడునగు నరసింహదేవ చక్రవర్తి. విశ్వేశ్వర భూపతివలెనే పంచధార్ల ధర్మలింగేశ్వరున కీతడెన్నియో కానుకలు సమర్పించెను. ఆతని వలెనే శాసనమున పూర్తి వంశవృక్షము వ్రాయించెను.[23] తన పేరిట నొక్కగ్రామము నిర్మించినట్లు చెప్పబడినదిగాని ప్రస్తుత మెచటను కానరాదు. సర్వలోకాశ్రయుడు, విష్ణువర్ధనుడు మున్నగునవి యీతని బిరుదములు. ఈతడు పరిణయ మాడిన వీరాంబిక యొక దేవదాసియని శాసనములద్వారా తెలియుచున్నది.[24] ఎలమంచిలి దాపున గల కలువలపల్లి, వెలుమూరు గ్రామములలో కొన్ని భూము లీతనిచే ధర్మేశ్వరునకు కానుకీయబడినవి

ఈతడు తూర్పు గాంగ చక్రవర్తులలో కడసారి వాడైన నాల్గవ భానుదేవునికి సమకాలికుడు. ఇది గాంగుల పాలన బలహీనమగుచున్న కాలమగుటచే రెడ్డి రాజులు సింహాచలము వరకు నాక్రమించు యుద్దేశ్యముతో వ్యూహము పన్నుచుండిరి. క్రీ॥శ॥1434లో వేమారెడ్డి సింహాచల శాసనమున కలువలపల్లి మున్నగుచోట్ల దేవ బ్రాహ్మణ భూములపై కల పన్నులను తొలగించుటనుబట్టి యీ ప్రాంతమున యీతని అధికారము చెల్లుబడియగుచున్నట్లు తెలియుచున్నది. ఈ ఆక్రమణకై జరిగిన దాడులలో ఎలమంచిలి చాళుక్యులు వీరికి తలవొగ్గియే వుందురు. అల్లాడరెడ్డి పుత్రుడైన వేమారెడ్డి తన వేమవర శాసనమున చెప్పిన విషయము కూడ దీనిని బుజువు చేయుచున్నది.[25] కాని రెడ్డిప్రభువుల సార్వభౌమత వీరంగీకరించినది లేనిది స్పష్టముగా తెలియదు. ఏది ఏమైనను యీ కాలమున ఎలమంచిలి ప్రాంతమునకై గాంగులకును, రెడ్లకు నడుమ హెచ్చుగా పోరాటములు సాగుచుండెను.

ఆరవ ఉపేంద్రునకుగాని నృసింహదేవునకుగాని సంతతి లేక పోవుటచే నాగేంద్రదేవుని పుత్రుడైన కుమార ఎఱ్ఱమనాయకు డిటువంటి క్లిష్ట పరిస్థితులలో సింహాసన మధిష్ఠించుట తటస్థించెను. పెద్దాపురపు గుండేశ్వరునకు, చాళుక్యభీమేశ్వరునకు, ద్రాక్షారపు భీమేశ్వరునకు, రాజమహేంద్రవరపు మార్కండేయ లింగమునకు యీతడు తన బాల్యమునే పెక్కు దానముల నొనరించినట్లు పంచధార్ల శాసనము తెల్పుచున్నది. ఇదే శాసనాంతమున యీతనిని గూర్చి[26]

''శ్రీ శ్రీ... . ఎ...ండిందుకు
ల సింధు సుధాకరమూర్తిన్ సంతతో పా–
శ్రిత బంధు రక్షణ కృపావశ వర్తిన్
చతుస్సముద్ర సమ్మిశ్రిత కీర్తిన్ లో
భి నృప మిండం...డికరి సర్వన్ లో–
కాశ్రయ చక్రవర్తిన్ మహిమాఢ్యం–
డు నాగయ యెఱ్ఱం డుర్విన్ లోను॥''

అని చెప్పబడినది. ఇది యొక పద్య క్రమమున మన్నట్లు జయంతి రామయ్యపంతులుగారు గుర్తించిరి. అట్లైన ఎలమంచిలి చాళుక్య శాసనములలో పద్యమున్న శాసనమిది యొక్కటే కాదగును.

నృసింహదేవుని రాజ్యాంతకాలమైన క్రీ॥ శ॥ 1437 నుండి తన కుమారుడైన సింగరాజ మహాపాత్రుని రాజ్యాధిరోహణకాలమగు క్రీ॥శ॥ 1494 వరకు అనగా సుమారు 57 సంవత్సరములు ఎలమంచిలి ప్రాంతము లీతని యేలుబడిలో నుండెను. ఈతని భార్య సింగమాంబ. కరవాలభైరవ, సోమకులేశ్వర, సర్వలోకాశ్రయ, విష్ణువర్ధనాది బిరుదము లీతడు ధరించెను.

సుదీర్ఘమైన యీతని రాజ్యవర్ష కాలమున దేశ రాజకీయములలో పెక్కు మార్పు లేర్పడినవి. కళింగమున కడపటి గాంగులను ధిక్కరించి గజపతులు విజృంభించిరి. క్రీ॥ శ॥ 1434 లో తుది గాంగ సార్వభౌముడైన నాల్గవ భానుదేవుని పదచ్యుతు నొనరించి కపిలేశ్వర గజపతి సార్వభౌముడైనాడు. గాంగ చక్రవర్తులతో తమకుగల సన్నిహిత సంబంధములచే యిటువంటి అస్తవ్యస్త పరిస్థితులలో తమ సార్వభౌముడైన భానుదేవుని తిరిగి ప్రతిష్ఠించుటకై కుమార యెఱ్ఱమ నాయకుడు, ఒడ్డాది రాజులు మున్నగువారి తోడ్పాటుతో ప్రయత్నించెను. కాని శక్తివంతులైన గజపతుల ధాటి ముందీ ప్రయత్నములు భగ్నమైనవి. తిరుగుబాటొనరించిన

యిూ సామంత రాజులను లొంగదీసుకొని విజయగర్వముతో సాగి పోయిన గజపతులు రెడ్లకు, విజయనగర రాజులకు, బహమనీ సుల్తానులకు, రేచెర్ల వెలమలకు ప్రక్కలో బల్లెమైరి.

ఇటువంటిపరిస్థితులలో ఎలమంచిలి చాళుక్యుల పరిపాలనలో చాల సమస్య లెదురైనవి. రాజమహేంద్రవరపు రెడ్లు తూర్పు ముఖమై యాక్రమింపవచ్చుచుండ, గజపతులు పశ్చిమాభిముఖులై సేనలను నడుపుటలో ఎలమంచిలి ప్రాంతము మధ్య నలిగి, శాంతి సుస్థిరతలు లేక క్షోభించెను. ఎచటనూ ప్రస్తావింపబడక పోయి నను కడకు యిూ ప్రాంతము లన్నియు గజపతుల సార్వభౌమత నంగీకరించియే యుండును. కుమార ఎఱ్ఱముని పుత్రుడైన సింగ రాజు గజపతుల పాలనలోని రాజోద్యోగులు, సామంతులు దాల్చు 'మహాపాత్ర' పదము వహించుటనుబట్టి[27] ఎలమంచిలి చాళుక్యులు గజపతులకు సామంతులైనట్లు చెప్పటకు హెచ్చు అవకాశములున్నవి.

సింగరాజ మహాపాత్రుని తర్వాత శ్రీధర రాజనరేంద్ర, హరి నరేంద్రులు వరుసగా ఎలమంచిలి పాలించినట్లు క్రీ॥ శ॥ 1530, క్రీ॥ శ॥ 1538 లో యివ్వబడిన పంచధార్ల శాసనములు తెల్పు చున్నవి.[28] హరినరేంద్రుని యనంతరను ఎలమంచిలి చాళుక్య వంశ మంతరించినది.

ఈ విధంగా వేంగీ చాళుక్యరాజుల కాలంలో కొందరు ప్రభు వులకు కొద్దికాలంపాటు ఆశ్రయమిచ్చి ప్రాముఖ్యత సంతరించుకొన్న ఎలమంచిలి, వేంగీ చాళుక్యాంత కాలానికి ఒక చిన్న రాజకీయ కేంద్రమై సుమారు నాల్గువందలేళ్ళపాటు పాలించిన ఒక చాళుక్య శాఖకి ఆలంబన అయింది. విశ్వేశ్వర, ఎఱ్ఱమ, నృశింహదేవులవంటి సమర్థులైన పాలకులను ప్రభవింపజేసి తెలుగుదేశ చరిత్రలో తనకో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొంది.

అధోజ్ఞాపికలు

1 యస్. ఐ. ఐ. వాల్యూం. VI. నెం. 919; 921.
2 'ది ఈస్టరన్ చాలుక్యాన్ ఆఫ్ వేంగి' — నేలటూరి వెంకట రమణయ్య.
3 ఎ. ఆర్. ఇ. నెం. 10,11,12,13 ఆఫ్ 1908-9.
4 ఎ. ఆర్. ఇ. నెం. 14 ఆఫ్ 1908–9.
5 'భారతి' నవంబరు 1979. పే. 90
6 యస్. ఐ. ఐ. VI నెం. 662; 665.
7 యస్. ఐ. ఐ. VI నెం. 665; ఎ. ఆర్. ఇ. 216 ఆఫ్ 1899.
8 జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ వాల్యూం XXVII.
9 యస్. ఐ. ఐ వాల్యూం. VI నెం. 692, ఎ. ఆర్. ఇ. 241 ఆఫ్ 1899.
10 యస్. ఐ. ఐ. IV నెం. 1371.
11 యస్. ఐ. ఐ VI నెం. 934 ఎ. ఆర్. ఇ. నెం. 299 ఆఫ్ 1899.
12 యస్. ఐ. ఐ V నెం. 138 ఆఫ్ 1893.
13 ''హిస్టరి ఆఫ్ ది రెడ్డి కింగ్డమ్స్''—మల్లంపల్లి సోమశేఖర శర్మ.
14 యస్. ఐ. ఐ VI నెం. 910; ఎ. ఆర్. ఇ 294 ఆఫ్ 1899.
15 యస్. ఐ. ఐ. VI నెం. 921.
16 యస్. ఐ. ఐ. VI నెం. 705; ఎ. ఆర్. ఇ. 249 ఆఫ్ 1899.
17 యస్. ఐ. ఐ. VI నెం. 665; ఎ. ఆర్. ఇ. నెం.216 ఆఫ్ 1899.
18 యస్. ఐ. ఐ. VI నెం. 662; ఎ. ఆర్. ఇ. నెం.214 ఆఫ్ 1899.
19 యస్ ఐ. ఐ. VI నెం. 705; ఎ. ఆర్. ఇ. నెం.249 ఆఫ్ 1899.
20 యస్. ఐ ఐ. VI నెం· 665; ఎ. ఆర్. ఇ. నెం.216 ఆఫ్ 1899.
21 యస్. ఐ ఐ. VI నెం. 705; ఎ. ఆర్. ఇ. నెం 249 ఆఫ్ 1899.
22 యస్. ఐ ఐ. VI నెం. 663; ఎ ఆర్. ఇ. నెం 215 ఆఫ్ 1899.
23 యస్. ఐ. ఐ. VI నెం. 662; ఎ. ఆర్. ఇ. 214ఆఫ్ 1899.
24 యస్. ఐ. ఐ. VI నెం. 668; ఎ. ఆర్ ఇ. 219ఆఫ్ 1899.
25 ''హిస్టరి ఆఫ్ ది రెడ్డి కింగ్డమ్స్'' - మల్లంపల్లి సోమ శేఖర శర్మ
26 యస్. ఐ ఐ. VI నెం. 663; ఎ. ఆర్· ఇ. నెం.215 ఆఫ్ 1899.
27 యస్. ఐ. ఐ. VI నెం. 661; ఎ. ఆర్. ఇ. నెం.213 ఆఫ్ 1899.
28 యస్. ఐ ఐ. VI నెం. 669, 671.

శ్రీ పిక్రాల శేషాచార్యులు

అకారాది నిఘంటువుల ఆదికర్తలు

ముందు నిఘంటువుల నిర్మాణములోని రకములను దెలిపి పిమ్మట ప్రకృతమైన అకారాది నిఘంటువుల రచనను **మొ**దట ఆరంభించినవారినిగుఱించి వ్రాసెదను.

నిఘంటు రచనయందు కవివర్యులు నానారీతుల నవలంబించి చేసియున్నారు. 1. కొందఱు పర్యాయ పదములను దెలుపుచు రచించిరి. పర్యాయపదము లనఁగా ఒక్క యర్థముకల శబ్దముల గుంపు. ఇవి సంస్కృతములో నమరసింహుని నామలింగానుశాసనము. హేమచంద్రాచార్యుని అభిధాన చింతామణి. మఱికొందఱు చేసిన మఱికొన్ని కోశములును గలవు.★ తెనుఁగులో కోటి వెంకనార్యుని ఆంధ్రభాషార్ణవము, **తూ**ము రామదాసు చేసిన ఆంధ్ర పద నిధానము, శ్రీరాజా త్యాడ పూసపాటి వీరరాజు బహద్దర్ వారి రచితము ఆంధ్రపదాకరము. మఱికొందఱు రచించిన మఱికొన్నియుఁ గలవు. 2. ఇంకఁ గొందఱు నానార్థ నిఘంటువులను నిర్మించిరి. ఇవి సంస్కృతములో ఇరుగపదండనాథుని నానార్థ రత్నమాల, కేశవదేవుని నానార్థార్ణవతరణి మఱి కొందఱి మఱి కొన్నియునుఁ గలవు తెనుఁగులో నానార్థనిఘంటు వనునదియు, మఱియొకటియు దొరుకుచున్నవి. పర్యాయపద నిఘంటువుల నిర్మాణములో కాండ—వర్గాది విభాగ కరణ**ము** ఆయా రచయితల యుద్దేశానుసార ముండును. నానార్థ నిఘంటువుల నిర్మాణము ఆశ్చర్యకరములైన భిన్న భిన్న ప్రకారములతో నొనర్పఁబడియున్నది. 1. కొందఱు కొన్నేసి యక్షరములు కల పదములనే గైకొని నిఘంటువులను రచియించియున్నారు. ఇవి పురుషోత్తమదేవుని ఏకాక్షర నిఘంటువు, మఱికొందఱు రచించినవియునుఁగలవు. ఇఱుగప దండనాథుఁడు తన నానార్థ రత్నమాలలో ఏకాక్షరకాండము, ద్వ్యక్షర కాండ**ము** ఇత్యాది విధముగ నప్త (౭) క్షరకాండమువరకు శబ్దాక్షర సంఖ్యానుసారముగ కాండవిభాగముఁ జేసియున్నాఁడు (ఈ నిఘంటు వచ్చై యున్నది. మఱి యిఱువురు రచించిన నానార్థ రత్నమాలలు ప్రాచ్యలిఖిత గ్రంథాలయములలో ననూర్యంపశ్యములుగ నున్నవి. వాటినిఁ జూచినఁగాని వాఁటిలోని విభాగ ప్రకారము వ్రాయ వలను పడదు.) 2. ఇఁకను మఱికొందఱు నియతముగ కొన్నేసి యర్థములనుఁ బ్రతిపాదించు శబ్దములనే గైకొని వాఁటియొక్క ఆ యర్థముల నన్నిఁటినిఁ దెలుపుచు నిఘంటువులఁ జేసియున్నారు. కవితార్కికసింహ సర్వతంత్రస్వతంత్ర వేదాంతదేశిక నామములం బ్రసిద్ధులైన శ్రీమద్వేంకటనాథాచార్యులవారు రచియించిన దశదీపక నిఘంటు విట్టిది 3 మఱికొందఱు మహాకవులు శాస్త్రోక్త ప్రకారము అక్షరోత్పత్తి స్థానక్రమము ననుసరించి కోశ**ము**లను నిర్మించిరి. అనఁగా నాయాస్థానములలోఁ బుట్టిన అక్షరములు ఆదిలో నొండె అంతములో నొండెకల శబ్దములఁ జెప్పు**చు** గ్రంథములను రచియించిరి ఉదా– "శ్లో॥ వసా–తసీ బ్రసీ–మాంసీ" అని "దంత్యాదులయందు చంద్రగోమి" అని గు–బా–ప్ర. **యందుదా**హృతము. 4 ఇఁకను సంస్కృతములో పుల్లింగము, స్త్రీలింగము, నపుంసక లింగము, పుంస్త్రీ లింగము, పున్నపుంసక లింగము, స్త్రీనపుంసకలింగము, త్రిలింగము ఈ రకముగ లింగజ్ఞాన మావశ్యకము. కావున కొందఱు ఒక్కొక్క లింగముకల శబ్ద**ము**లను బోధించు కాండ—వర్గాది విభాగముకల నిఘంటువులను నిర్మించిరి. ఇవి వోపాలితాదులు చేసినవి. **మొ**దలైనవి. శ్లో॥ మహామాత్ర స ప్రధాన స్స్యాత్ ." అని "**పుంస్కాణ్డమందు** వోపాలితుఁడు" **అ**ని గు. బా. ప్ర. **ఉ**దాహరణ**ము** వలన యీ రచన తెలియుచున్నది. 5. శ్రీహర్షాదులు కొందఱు శబ్దముల **రూ**పభేదములనుఁ దెలుపు నిఘంటువులను రచియించిరి. ఇవి ఆయన రచించిన **ద్విరూప** కోశము మఱొకరి రచన శబ్దభేద ప్రకాశికయు మఱికొందఱి రచనలును. 6. మఱికొందఱు కొన్ని కొన్ని వృత్తములతోఁ గొన్ని కొన్ని వర్గ—కాండాదుల విభాగముఁజేసి ఆయా విభాగములయందాయా వృత్తములతో శబ్దములనుఁ జెప్పు నిఘంటువులఁజేసిరి. దీని కుదాహరణము – "మాయాకారక సంజ్ఞస్స్యాత్ప్రతిహారక ఇరం మదోద్రభాన్ అని ఆర్యయందు వరరుచి" అని గు.బా.ప్ర **లో** నుదాహృతము. 7. మ**ఱి** కొందఱు—సంస్కృత భాషలోని ప్ర—పరా —అప—సం అను—అవ—నిస్—నిర్—దుస్—దుర్—వి—ఆఙ్—ని—అధి —అపి—అతి—సు—ఉత్—అభి—ప్రతి—పరి—ఉప — అనెడు నిరువది రెండు ఉపసర్గములలో నేయే ఉపసర్గము లేయే శబ్దములముందుఁ జేర్చినచో నేయర్థము నిచ్చునో నా విషయము నెఱింగించు నిఘంటువులను రచించియున్నారు. ఉదా—'శ్లో॥ ఉపసర్గేణ ధాత్వర్థో బలా దన్యత్ర నీయతే। ప్రహారా హార సంహార విహార పరిహారవత్" ఆ + హారము = ఆహారము, అభి + అవ = ఆహారము అభ్యవహారము (తిండి), వి + అవ=హారము=వ్యవహారము., అధి + ఆ + హారః= అధ్యాహారః ఊహ, (లేక) తనకు లేనిది తెచ్చుకొనుట. ఇట్లే యోగ అనుయోగః (ప్రశ్నము), ఉపయోగః, అభియోగః (వ్యవహారము), వియోగః - సంయోగః మొదలయినవి. ఇట్టి గ్రంథములు ఉపసర్గవృత్తి, ఉపసర్గవర్గము మున్నగునవి ముద్రితములై యున్నవి.

3–4–5–6–7—నానార్థ నిఘంటువులు కావు.

పర్యాయపద నిఘంటువులలో కడన సంక్షిప్తముగ నానార్థములమన్ను నుడివెదరు. ఉదా—అమరకోశమునందు త్రికాండశేషమునందు వైజయంతి మున్నగు మఱికొన్ని కోశములలోను నీ పద్ధతి కాంచనగును.

శబ్దముల నానార్థములనే ప్రతిపాదించ నేర్పడిన నానార్థరత్నమాల విశ్వకోశము మేదినీకోశము మున్నగువాఁటిలో కావలసిన శబ్దములను వెదకుకొన నవసరములేకుండా సులభముగఁ జూచుకొనుట కనువుగ శబ్దములయొక్క అంత్యాక్షరములు కకారాది వర్ణక్రమమున వాకొనఁబడినవి. మేదినీకోశము మున్నగు కొన్నిఁట అక్షరసంఖ్యాక్రమ విశిష్టములైన అనఁగా కైకం-కద్వి-కత్రి—మున్నగు తీరున శబ్దముల ఆద్యక్షరము లకారాదిగను, అంత్యాక్షరములు కకారాదిగను చెప్పఁబడెను. అమరకోశము మున్నగు నిఘంటువులలో నానార్థ వర్గములందు కాంతవర్గము, ఖాంతవర్గము మున్నగుతీరున వర్గములనుఁ గల్పించి ఒక్కొక్క వర్గములో నొక్కొక్క యక్షరమంతమందుఁగల శబ్దములు చెప్పఁబడినవి. పురుషోత్తమదేవుఁడు త్రికాండ శేషములో నానార్థవర్గమందు అక్షర సంఖ్యాక్రమమునుఁ బాటించలేదు కాని శబ్దముల ఆదియం దకారాది క్రమమును, అంత్యమునందు కకారాది క్రమమునుఁ బాటించుచు రచించెను.

నానార్థ నిఘంటు నిర్మాణములో 1వ సంఖ్యగల పద్ధతి కొలఁది శబ్దములనే చెప్పునది యగుటయు, 2వ సంఖ్యగల పద్ధతి శబ్దముల అర్థపౌష్కల్యము నెఱింగింపలేని దగుటయు, 3వ అంకెగల పద్ధతి వ్యాకరణశాస్త్రమునున్ను బాగుగ నభ్యసించినవారికే ఎఱుఁగశక్యమై అన్యుల కెఱుఁగరాని దగుటయు, 4వ అంకెగల పద్ధతి అలింగములు తెలిసిననే ఎఱుఁగ సాధ్యమగుటయు, 5వ అంకెగల పద్ధతి శబ్దములను వాఁటి యర్థములను వరుసగఁ జెప్పఁజాలని దగుటయు, మేదినీకోశ-త్రికాణ్డశేషాదుల పద్ధతి శబ్దముల ముందు వెనుకను అక్షరక్రమమునుఁజూచి కావలసిన శబ్దమునుఁ జూచుకొను శ్రమమునుఁ గలిగించునవి యగుటయు, అమరకోశాదుల పద్ధతి శబ్దముల ఆదిలో అకారాది పద్ధతి లేకుండుటయు పాఠకులకు శ్రమ కలిగించునవియే.

కావున నీ లోపమునుఁ బాప సమర్థులైన కొందఱు నైఘంటుకులు శబ్దాదులయం దకారాది క్రమమునుఁ బాటించినిఘంటువులు రచించి జిజ్ఞాసుజనమునకు సౌకర్యమును కలిగించియున్నారు. ఎట్లనిన? అమరకోశమునకు శ్రీమాన్ తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారు రచియించిన గురుబాల ప్రబోధిక యను తెనుఁగు వ్యాఖ్యానము మిగులఁ బ్రసిద్ధమైనది. పలుతావుల ననేక ముద్రాశాలలలో పలువురు పండితోత్తములు పెక్కుమారులు పరిశోధించి ముద్రింపించిన గ్రంథములను మనము చూచుచున్నాము. అందు—శబ్దాదులయం దకారాది క్రమముతో రచితములైన నిఘంటువులనుంచి యుదాహరణములు చూపఁబడియున్నవి. అందు రెండు మూఁ డుదాహృతములను వ్రాసెదను.

అమరకోశే ద్వితీయకాణ్డే వనౌషధివర్గే 1. "శ్లో॥ గాలవ శ్శాబరో లోధ్రస్తిరీటస్తిల్వ మార్జనౌ." 33॥ అను శ్లోకము యొక్క గురుబాల ప్రబోధికా వ్యాఖ్యానములో "శబర సంబంధిత్వాచ్ఛాబరః పా. సాబరః. సాబరాఖ్యాసరాధేచ లోధ్రేపాసేచ పఠ్యతే ఇతి పకారాదా వజయః" అనియు, 2. తృతీయకాండే నానార్థవర్గే "శ్లో॥ విస్తారవల్ల్యోర్న ప్రతతిః" అనెడు శ్లోకగురుబాల ప్రబోధికలో "ప్రతతి శబ్దము పకారాది. ప్రస్థస్సానునిమానేచ ప్రతతిస్తు తిరుధోః" అని పవర్గ ప్రథమాదులయం దజయుఁడును, అనియు, 3. నానార్థవర్గమునందే "శ్లో॥ జామిస్స్వస్ర కులస్త్రియోః" అనెడు శ్లోకముయొక్క గురుబాల ప్రబోధికయందు "జామిశబ్దము తోడఁబుట్టిన యామెకును, లస్త్రీకినిఁ బేరు. జమతీ తి జామిః. సీ. జము అ-నే. సామ్మఁదినునది. పా. యామిః ప్రహరే సంయమే యామోయామి స్స్వస్రకులస్త్రియోః, అని యకారాదులయందు రభసుఁడు, అనియు, జహ్మస్తు కుటిలేమందే జామిస్స్వస్ర కుల స్త్రియోః అని జకారాదులయం దజయుఁడు, అనియు నిత్యాదిగ నుదాహరణములు కలవు.

ఇందుచేత అకారాది క్రమమున నిఘంటు నిర్మాణము మొదటినుంచియు నున్నదే. ఇది పాశ్చాత్యుల నిఘంటు రచనను జూచి ఆర్యులారంభించిరన్నమాట బహుగ్రంథ పర్యాలోచన విమర్శ శూన్య హేతుకమైనదే. ఐతే ఈ అకారాది వర్ణక్రమపద్ధతి ప్రాచీనార్యులొనర్చినది కేవలము వ్యంజన క్రమముమీఁదనే కాని ఆ వ్యంజనముల మీఁది స్వరములయు (అనఁగా క—కా—కి—కీ మాదిరి.) వ్యంజనముల క్రింది సంయోగముల(అనఁగా క్య—క్ర—క్ల—క్వ మాదిరి) (ఒత్తుల) మీఁదనుఁ గానరాదు. అన్నచో అందుకుఁ గారణముతెలియఁదగినది. ఆ ప్రాచీన నిఘంటువులు వర్ణించుట కనుగుణముగ శ్లోకములతో రచితములు. శ్లోకములయందు అన్నిఁటి క్రమము (వ్యంజనముల మీఁది స్వరములయు, వ్యంజనముల క్రింది సంయోగము (ఒత్తు) లయు వరుస పాటింప నలవికాదు. కావున వా రట్లు రచియించిరి.

క్రీస్తు పుట్టుటకు యేఁబదియే డేండ్లముందటి మహారాజు (విక్రమార్కుని) సంస్థానమునం దాస్థాన పండితుఁడు (అమరసింహుఁడు) శబ్దముల నానార్థ ప్రతిపాదనమునందుఁ బాటించిన శబ్దాంతములలోని కకారాది వర్ణక్రమమునుఁ గాంచి ఆ తర్వాతి పాశ్చాత్య విద్వాంసులుకూడా నిఘంటు రచనలయందు పదముల ఆదిలో వారి ఏ. బి. సి. డి. మున్నగు తీరునమందు వర్ణక్రమముతో నిఘంటువుల నిర్మించుకొనిరి. పిమ్మట ఆర్యులున్ను వ్యంజనముల మీఁది స్వరములయు, వ్యంజనముల క్రింది సంయుక్తము (ఒత్తు) లయు క్రమమునుఁ బాటించుచు వాక్యరూపమున నిఘంటువుల విరచించిరి. అవి-సంస్కృతభాషలో రాధాకాంత దేవుని శబ్దకల్పద్రుమము, తారానాథ తర్కవాచస్పతి భట్టాచార్యుని వాచస్పత్య బృహదభిధానము, పరవస్తు శ్రీనివాసాచార్యులవారి సర్వశబ్ద సంబోధిని, వారి కుమారులు మహామహోపాధ్యాయ శ్రీ పరవస్తు వేంకట రంగాచార్యులయ్యవారలంగారి శబ్దార్థ సర్వస్వము, సుఖానందుని శబ్దరత్నాకరము, మఱికొందఱు రచియించిన మఱికొన్నియు. తెనుఁగులో శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారి శబ్దరత్నాకరము, దానివెనుక కొట్ట లక్ష్మీనారాయణశాస్త్రులవారి లక్ష్మీ

నారాయణీయము, మున్నగునవియు, నేటికాలములో శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులవారి ఆంధ్రశబ్ద రత్నాకరము మఱికొన్నియుఁ బ్రశస్తములు ప్రసిద్ధములు. హైదరాబాదులో శ్రీమదాంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీవారచ్చువేసిన "సంస్కృతాంధ్ర పదార్ణవము" వ్యాఖ్యారూపము. అమరకోశాంధ్రభాషార్ణవముల ననుసరించినది కావున నట్లు కాండ–వర్గ–రూపవిభజనము కలదు.

పదాదులయం దకారాది వర్ణక్రమముతో నిఘంటువులఁజేసిన అజయుఁడు రభసుఁడు మున్నగాఁ గల పూర్వులు పాఠకులు వర్ణింప సులభముగ నుండుటకై శ్లోకములతో కోశములఁజేయుచు, శ్లోకములలో నిముడింపశక్యమగువరకు పదాదులయం దకారాది వర్ణక్రమము నవలంబించియే రచించియున్నారు. కాన నిఘంటు రచనలో శబ్దాదులయం దకారాది వర్ణక్రమము పాశ్చాత్యులనుఁ జూచి మనవా రవలంబించిరనుట[1] "భూమి గుండ్రముగ నున్నదను సంగతి పాశ్చాత్య దేశీయులలో నొకరిపేరు చెప్పి–ఆతను కనిపెట్టినదనియు, సూర్యుఁడు భూమిచుట్టు తిరుగుచున్నాఁ డనువిషయము పాశ్చాత్యులలో నొకరిపేరు చెప్పి ఆతఁడు కనుఁగొనెన"నియుఁ జెప్పెడు మాటలవలె నజ్ఞాతప్రలపితములే కాని ప్రాజ్ఞు లనెడు మాటలుకావు.

---

* ఇట్టి పర్యాయ పదకోశములలోఁ గ్రియాపదములకుఁజెందిన పర్యాయములను అస్తి–భవతి–విద్యతే మున్నగువాఁటిని రచయితలు జెప్పరు. అమరకోశమునందు మాదిరి మూడు కాండములు వాఁటిలో వర్గములనుఁ బెట్టి భట్టమల్లుఁడను పూర్వకవి రచించిన "ఆఖ్యాతచంద్రిక"యు, విజయానందుఁడు చేసిన నాలు గధ్యాయములు కల "క్రియాకలాప" మనునదియు, క్రియాపదములలోని ఆత్మనేపదులు – పరస్మైపదులు, ఉభయపదులు మొదలయిన రూపభేదముల నుపదేశించు "ధాతురూపభేద" మనునదియు శ్రీరామాచార్యరచిత "క్రియాకోశ" మనునదియు రచయిత్రు నామరహితములైన నూరు–నూటముప్పది శ్లోకములు కల "క్రియానిఘంటువు"లను రెండు కోశములు క్రియాపద పర్యాయములను బోధించునవి. ఆంధ్రములో ఆంధ్ర భాషార్ణము కడన క్రియావర్గమని ఒక వర్గముకలదు.

1 ఇత్యాది మూఢవిశ్వాస వాక్యముల ఖండనము సోపపత్తికముగ మా తాతగారు షడంగవేదజ్ఞ శ్రీమాన్ కళత్తూరు విక్రాల రాఘవాచార్యులవారిచే రచితములు 1893వ సం॥రములో ముద్రితములునైన వేదప్రామాణ్యములోఁ గొన్నియు, సర్వప్రామాణ్యములో నన్నియు నెఱుంగఁదగును. ఏతద్విషయ సంక్షేపము ఆంధ్రప్రభ (దినపత్రిక) తే 7–2–1971ది కల ఆదివారపు సంచికలో "విద్వద్వర్యులు శ్రీ విక్రాల రాఘవాచార్యులు" అను వ్యాసములో మా అన్నగారైన వారి ఉపన్యాస సారాంశము వ్రాసియున్నాను.

"నీ వు..."

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

ఈ దినాంతమ్ము చైతన్యస్వాదుగీతి
వోలె కురిసిన చంద్రికాజాలమందు
నీవు దేవతవోలె నిర్నిద్ర కాంతి
నా కనుంగవ వెల్గించినావు తరుణి !!

విమల వాసంత దరహాస విశద రుచులు
మధుర నవ శరచ్చంద్రికా మహిత ఘృణులు
కన్నుదోయినిఁ దాల్చి సాక్షాత్కరించి
నావా !! చైతన్యమూర్తివి నీవ కావా !!

విరియఁబూచిన మందారవృక్షమట్లు
కదలివచ్చిన చైతన్యకాంతి ! నీవు
రాకయుండిన యెడ నాదు బ్రతుకు నంధ
కార మగ్నమై స్రుక్కదా !! కాక చెడదా !!

నీవు భువనేశ్వరివి — నీవు నిఖిలజంతు
ప్రాణ భూతేశ్వరివి నీవు పరమ విశ్వ
పాలనేశ్వరి నీవు కావ్యప్రసిద్ధ
మధు రసేశ్వరి నీవు — సమ్మదము నీవ !!

నేను

శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తి

ఏనొక సమీరబాలుడ; నీ కవిత్వ
పారిజాతమ్ము నా జగన్మాత యొసగె
మా పరస్పర సంస్పర్శ మాత్ర కలన
పులకిత బ్రహ్మపదమును పొందగలను!

ఏనొక వినూత్న మధుపాయి; నీ కవిత్వ
సరస మధుపాత్రనా జగజ్జనని యొసగె
స్వాదు లెరుగని పైత్య విభ్రాంతమతులు
తిట్టనీ వెలివేయనీ దిగులుపడను!

ఏనొక త్రికాలభిక్షుకు; నీ కవిత్వ
కామధేనువు చిక్కె ప్రాక్కర్మమహిమ,
కార్తవీర్యుల పాపిష్ఠకనులనుండి
కాచికొందును లోక సంగ్రహము కొరకు!

ఏనొక ధనంజయుండ; నేనీ కవిత్వ
దివ్య చింతామణీ మహాదీప్త శక్తి
చింతలన్ ప్రేల్చి, క్రౌర్య విచ్ఛిత్తిజేసి,
కలిమి లేమల చెలగాట గట్టివైతు!

ఏనొక త్రిలోక విజయుడ; నీ కవిత్వ
దివ్య గాండీవ మా దేవదేవి యొసగె;
సతుల శీలంబులూడ్చు దుశ్శాసనులను;
అడ్డుపడు సైంధవుల పుటమార్చి వైతు!

ఏ నపర భార్గవుండ, నాకీ కవిత్వ
ధర్మపరశు వొసంగెనా త్ర్యంబికాంబ;
కనులు గానని అధికార గర్వమతుల
రూపుమాపగ, ధర్మసంస్థాపనకిక!

ఏనొక ప్రగాఢ భక్తుడ, నీ కవిత్వ
పుష్పక విమాన మందెక్కిపోదు నింక
అమలినామ్నాయ శృంగాటమందు నుండి
రమ్మనెడి అమ్మ పాదపద్మమ్ము కడకు.

ఏనొక విశిష్టతాపసి నీ కవిత్వ
దివ్యమార్గముచూపె ఆ దేవజనని;
ఎట్టి అపమార్గముల బట్టకేగ మించి
అందుకొందింక ఆ మహానంద పదము.

ఏనొక విధేయ రచయిత నీ కవిత్వ
మా జగన్మాత నాలోన నధివసించి
చెప్పినట్లు రచించితి చిత్తశుద్ధి
నెవ్వరేమన్న నేమి? నాకేమి భయము?



శ్రీ నాగళ్ల గురు ప్రసాదరావు

రాఘవ పాండవీయము - పాఠ పరిష్కారము

శోభితాపస్తంబ సూత్రు, గౌతమగోత్రు
సుచరిత్రుఁ, బింగళి సూరను కవి
పౌత్త్రు, నన్నపరతి భావన దౌహిత్రు,
నమర ధీమణికి నబ్బమకుఁ బుత్త్రు,
నను జన్మ లైనట్టి యమలన యెఱ్ఱనా
ర్యులు భక్తి సేవింప నలరు వాని,
సత్కావ్య రచనా విశారదుండగు వాని,
సూరన నామ విశ్రుతుని నన్నుఁ
బ్రియము సంధిలంగఁ బిలిపించి, బహువస్త్ర
భూషణాది దానములఁ గరంబు
సంతసం బొనర్చి యెంతయు గారవ
మెసఁగ మధుర ఫణితి నిట్లు లనియె.

ఇది పింగళి సూరన రచించిన రాఘవ పాండవీయములో నవతారికయందుఁ గలదు (పద్య. 9). ఈ పద్యము 1882 వ సం॥లో శారదా నిలయ ముద్రాక్షర శాలయందు ముద్రితమయిన రాఘవ పాండవీయ ప్రతిలోను, వావిళ్లవారు 1910, 1949 వ సం॥లలో ముద్రించిన రాఘవ పాండవీయ ప్రతులలోను యిట్లే యున్నది. ఈ మూఁడు ప్రతులును ముద్దరాజు గణపయామాత్య పుత్రుఁడయిన పెదరామధీమణి రచించిన టీకతోఁ గూడియున్నవి.

వీనినిగాక నేను మఱియొక ముద్రిత ప్రతిని చూడఁగలిగితిని. అది ఆర్. వేంకటేశ్వర అండ్ కో మద్రాసువారు ప్రకటించినట్టిది ప్రకటించిన సంవత్సరము తెలియుటకు వీలుగాకున్నది. ఇది "ఎ.వి. నరసింహ్మాం పంతులచేతఁ బరిశోధితము." "నరసింహ్మాంపంతులు" గారు "చూచువాండ్ర కానందము సంధిలునట్లు మూలమును జక్కఁగా సంస్కరించి" వ్యాఖ్య రచించిరి. ఈ ప్రతిలో "అన్నప పతి భావన దౌహిత్రు" "అనుజన్మ లైనట్టి యమలన యెఱ్ఱనార్యు, లతి భక్తి సేయఁగ నలరు వాని" అను పాఠ భేదములు కనఁబడుచున్నవి. ఇఁక మిగిలిన పద్య మంతయు ఏ మార్పు లేక యున్నది.

"శోభితాపస్తంబ సూత్రు" నను పద్యము కళాపూర్ణోద యావతారికలో యథాతథముగా నున్నది. వివిధ కళాపూర్ణోదయ ప్రతులలో ఈ పద్యమునకు భిన్న పాఠములు కనఁబడుచున్నవి. మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి ప్రతులలో (1938,1963) "అన్నమ పతి భావన దౌహిత్రు" "అనుజన్మ లైనట్టి యమరన యెఱ్ఱనార్యులు భక్తి సేయంగ నలరు వాని" నను పాఠములు కలవు. కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారి ప్రతిలో (1943) "అన్నప పతి భావన దౌహిత్రు" నను పాఠము కలదు పయి రెండవ పాఠమే దీనిలో నున్నది వావిళ్లవారి ప్రతిలో (1953) సూర్యనారాయణ శాస్త్రి రి ప్రతుల పాఠములే యున్నవి. "గౌరవ మెసఁగ" నను క్రొత్త పాఠము కనఁబడుచున్నది. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారిప్రతిలో వావిళ్ల ప్రతిలో నున్నట్టే పై మూఁడు పాఠములున్నవి.

చాగంటి శేషయ్యగారు ఆంధ్ర కవి తరంగిణి పదవ సంపుటములో (పుట 97) "అన్నపసతి భావన దౌహిత్రు"అను పాఠము చూపిరి.

దీనిని బట్టి "నన్నపరతి భావన దౌహిత్రు" "అన్నమ పతి భావన దౌహిత్రు" "అన్న వసతి భావన దౌహిత్రు" అను మూఁడు రకముల పాఠములు కనఁబడుచున్నవి. మఱియు "అను జన్మ లైనట్టి యమరన యెఱ్ఱనార్యులు" "అనుజన్మలైనట్టి యమలన యెఱ్ఱ (ఱ)నార్యులు" అను రెండు రకముల పాఠము లున్నవి. వీనిలో ఏవి సాధు పాఠములు ?

ముద్దరాజు రామన "నన్నపరతి భావన దౌహిత్రున్" అను పాఠమును స్వీకరించెను గదా! దానికి నన్నపరతి=నన్నపరత భావన లకు, దౌహిత్రున్=కూతురు కొడుకైన వానిని" అని యర్థము వ్రాసెను. ఈ యర్థము మనల నెక్కడకుఁ దీసికొనిపోవునో తెలియదు. ఇఁక "నరసింహ్మాం పంతులుగారు" "అన్నప పతి=అన్నప రాజుయొక్క(పుత్త్రుఁడగు), భావన=భావన యొక్క, దౌహిత్రున్=కూఁతురి కొమారుని" అని యర్థము వ్రాసెను. ఇదియు అనన్వితమయినట్టిదే.

సాధు పాఠము "అన్నమపతి భావన దౌహిత్రు" అనునట్టిదే. సూరన రచించిన ప్రభావతీ ప్రద్యుమ్నము చూచినఁగాని యీ పాఠమే సముచితమని తెలియదు. పరిష్కర్తలు, వ్యాఖ్యాతలు. టీకాకారు

ప్రభావతీ ప్రద్యుమ్నమును జూచియుండినచో ఈ పాఠముల గొడవ యుండెడిది గాదు.

ప్రభావతీ ప్రద్యుమ్నములో సూరన తన తల్లి పుట్టినింటి వైపు వారిని విపులముగా వర్ణించెను. ఆ వర్ణనమునుబట్టి సూరన మాతామహి అన్నమ్మ యనియు, మాతామహుఁడుఁ భావన (య్య) యనియు, భావన కేసయ్య కుమారుఁ డనియు తెలియును. "నరసింహ్మం పంతులు" గారు భావన అన్నపరాజు పుత్త్రుఁడని వ్రాయుట పొరపాటు. సూరన తల్లి పేరు అంబమ్మ. ఈ పేరునే యాయన అబ్బమ్మ, అయ్యమ్మ, అయమ యని రకరకములుగాఁ బేర్కొనెను. ఈ సమాచారములన్నియు ఈ క్రింది పద్యములనుబట్టి తెలియును.

సీ. చిఱువన దేచిరా జెఱుక మించిన బుద్ధో
త్తముఁ డేవధూమణి తాత తండ్రి
యనవరత మునికి నాయూరి పేరఁ దా
వెలయు కేసయ్య యేవెలఁది తాత
యన్నయ్య బాపయ్య లగ్రజానుజులుగాఁ
బరఁగు భావయ్య యేగరిత తండ్రి
జయనయోన్నతులు కొండయ రాఘవార్యులే
సతి కన్నదమ్ములై నుతులు గనిరి

ఆ. పృథివి నేపురంధ్రి పెద తండ్రి కొడుకు స
త్కీర్తి శోభితుండు కేసవిభుఁడు
తనరు నే గుణాఢ్య పినతండ్రి సుతుఁడు గం
గయ్య బహుసహోదరాంచితుండు.

తే. గీ॥ రమ్య గుణనిధి యన్నమ్మ రాచపూఁడి
గణపతి సుపుత్రి యే సాధ్విఁ గన్నతల్లి
యట్టి యంబమ్మఁ బింగళి యమర మంత్రి
పెంపు నింపును మెఱయంగఁ బెండ్లియాడె.

తే. గీ॥ అనఘ సౌభాగ్య వర్తనా ర్ధాంగ లక్ష్మి
పింగళి యమరామాత్యు నర్ధాంగ లక్ష్మి
యంబ మాంబిక భోగభాగ్యముల మరుని
యంబకును నంబికకు సాటి యనఁగ వెలసె

కం. ఆ జంపతులకుఁ బుత్రుల
మై జనియించితిమి సూరనాఖ్యుఁడ నేనున్
భ్రాజితమతి యమలార్యుఁడు
రాజిత బోధార్థనాభిరతుఁ డెఱ్ఱనయున్.

(ప్రభావతీ ప్రద్యుమ్నము. ఆ1. ప 38, 39, 40, 41)

కాన "అన్నమపతి భావన దౌహిత్రు" ననఁగా అన్నమ భర్తయగు భావన కొమార్తె కొడుకయినవాని నని యర్థము. అన్నమ భావనల కూఁతురు కొడు కయిన వానిని అని సారాంశము. ప్రౌఢ వ్యాకరణ కారక పరిచ్ఛేదమున "ఒక్కచో సమాసాంతర్గత విశేష్యంబుల కగు విశేషణంబుల షష్ఠికిని ప్రథమ చూపట్టెడి" (సూ. 21) అను సూత్రము గలదు. దాని కిది లక్ష్యమగును. "భావన దౌహిత్రు" ననునది షష్ఠీ సమాసము. భావన షష్ఠ్యంతము. దీని విశేషణము అన్నమపతి దీనికి షష్ఠీవిభక్తి రావలసియుండఁగాఁ బయి సూత్రమును బట్టి ప్రథమావిభక్తి యయ్యెను. అన్నమపతి ప్రథమాంతము. "అన్నమపతి భావన దౌహిత్రు" అను మొత్తమును ఏక సమాసముగా నయినఁ జెప్పికొనవచ్చును.

"అనుజన్ములైనట్టి యమరన యెఱ్ఱనార్యులు భక్తి సేయంగ నలరువాని" అనునది సాధు పాఠము గాదు. "అనుజన్ములైనట్టి యమలన యెఱ్ఱనార్యులు భక్తి సేయంగ నలరు వాని" అనునదే సరియయిన పాఠము. అమలన, ఎఱ్ఱనయనువారు సూరనసోదరులు. అమరన సూరన తండ్రి. కాని యిప్పుడు లభించుచున్న "అనుజన్ములైనట్టి యమలన యెఱ్ఱనార్యులు భక్తి సేయంగ నలరువాని" "అనుజన్ములైనట్టి యమలన యెఱ్ఱవార్య, లతిభక్తి సేయఁగ నలరు వాని" అను రెండు పాఠములలో దేనినైన స్వీకరింపవచ్చును. తాళపత్ర ప్రతులలో ఏ పాఠ మెక్కువగా నున్నదో పరిశీలించిదానినే యంగీకరించుట లెస్స. "అనుజన్ము లైనట్టి యమలన యెఱ్ఱనార్యులు భక్తి సేవింప నలరు వాని" అని రాఘవ పాండవీయ ముద్రిత ప్రతులలో నొక పాఠమున్నదని మనము మఱవరాదు.

రాఘవ పాండవీయావతారిక యందే
ఈకరణి ధాత్రి వెలసిన యాకువీటి
తిమ్మరాహుత్త తనయుఁ డుత్తీర్ణకీర్తి
పరుఁడు పెద వేంకటాద్రి భూవరుఁడు సేయు
సేవలింపుగఁ గైకొని దైవమునకు

అను పద్యము (40) కలదు. ఇది షష్ఠ్యంతములకు ముందున్న పద్యము.

ఈ పద్యమునకు ముద్దరాజు రామన "పెద వేంకటాద్రి భూవరుఁడు=పెద వేంకటాద్రి రాజు, చేయు=ఒనర్చునట్టి, సేవలు=వందనములు, ఇంపుగన్=ఇష్టముగ, కైకొని=గ్రహించి, దైవమునకున్=నా యిష్టదేవతకు" అని టీక వ్రాసెను. ఈ టీక సరియయినది గాదు. కైకొని యనునది సరియయిన పాఠము గాదు.

రామన వ్రాసిన దానినిబట్టి యాకువీటి పెద వేంకటాద్రి చేసిన సేవలు స్వీకరించినవాఁడు సూరనయే యను విపరీతార్థము

వచ్చును. ఇది సందర్భమునకు సరిపోవునది గాదు. పెదవేంకటాద్రి యేమి? సూరనకు సేవలు చేయుటయేమి? సూరన వానిని గైకొనుట యేమి? పై పద్యము షష్ఠ్యంత పద్యముల కవ్యవహిత పూర్వముగా నున్నది. వేంకటాద్రి గుణగణములు వర్ణించిన తరువాత సూరన దీనిని రచించెను. "ఇటువంటి గుణగణములు గల యాకువీటి పెద వేంకటాద్రి గావించు సేవలు స్వీకరించు దైవమునకు" అని విరూపాక్షస్వామి సంబంధిగా భావము చెప్పికొనుట సముచితము. ఈ భావమే తరువాతి షష్ఠ్యంత పద్యములతోఁ జక్కని పొత్తు కేఁది యగును. "దైవమునకు" అని షష్ఠ్యంతమే పద్యము తుది నున్నది. దీని తరువాత షష్ఠ్యంత పద్యములు మొదలగుట సమంజసముగా నుండును. కాన యిట వేంకటాద్రి సేవలు గైకొనువాఁడు సూరన యని యర్థము చెప్పుట యడ్డదిడ్డిగా నున్న యతుకు వలె నుండును. "విరూపాక్షాహ్వయం" బగు బ్రహ్మము "ఆకువీటి తిమ్మ ప్రభు వేంకటాద్రి హృదయాటీకంబు" అని సూరన కావ్యాదినే పేర్కొనెను. "విమలభక్తి పెద వేంకటధాత్రీ రమణ మానస నిరంతవాసా" యని యాయనయే కావ్యాంతమున విరూపాక్షస్వామిని వర్ణించెను. కావ్యము లోపల నైతము ఆశ్వాసాద్యంత పద్యములలో నిట్టి వర్ణనములు కలవు. పెద వేంకటాద్రి విరూపాక్షస్వామి కూరిమిభక్తుఁడు. అట్టిభక్తుని సేవలకు ఆ స్వామి సంతోషించుట యాశ్చర్యము గాదు.

కావున సందర్భమునకుఁ దగిన యర్థము చెప్పికొనుటకు "కైకొని" యను పాఠమునకు బదులు "కైకొను" అను పాఠమును స్వీకరించి, "సేవలింపుగఁ గైకొను దైవమునకు" అని నాల్గవ పాదమును మార్చవలయును. "కైకొని" యను క్త్వార్థము కంటె "కైకొను" అను తద్ధర్మార్థ విశేషణ మిట సరిగా నుండును. ఈ పాఠమే ఆర్. వేంకటేశ్వర అండ్ కో వారి ముద్రిత ప్రతిలోనున్నది. ఇంతేకాదు. వఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు నైతము హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠికలో (పుట 101) "కైకొను దైవము"న కను పాఠమునే తార్కాణించిరి.

గుప్పెడు మనసు

దిలావర్

గుప్పెడైనా లేని యీ మనసులో
యుగాలు క్షణాలుగా మారిన
ఎన్నెన్ని అనుభూతులు!
క్షణాలు యుగాలుగా మారిన
ఎన్నెన్ని అనుభవాలు!

ఎక్కడో అంతరాంతరాల సరసిలో
విరిసిన ఆశల చిరుకెరటం
అలలు అలలుగా కలలుగా వలలుగా
పరచుకొంటుంది అంతులేని ఆకాశంగా!
ఎక్కడో అంతశ్చేతనా కణంలో
రగిలిన చిరుమంట
జ్వాలలు జ్వాలలుగా నాలుకలుగా చీలికలుగా
భగ్గుమంటుంది శాంతించని అగ్నిపర్వతంగా!

ఎన్ని పువ్వులు! ఎన్నిరంగులు!
అందీ అందని ఎన్ని యింద్రధనుస్సులు!
బాధల ఎడారులు! భరించలేని తుఫానులు!
భాషకందని భావ సముద్రాలు!
భావం పెదవి విప్పలేని నిశ్శబ్ద అగాధాలు!
గుప్పెడైనాలేని యీ మనసులో
ఎన్నెన్ని అనుభూతులు...అనుభవాలు ...!

డా. లింగంనేని బసవ శంకరరావు

విశేషణములు

సంస్కృతంలో విశేషణానికి 'విశిష్యతే అనేన ఇతి విశేషణమ్' అని నిర్వచనం ఉంది. ఇది విశేషించేది కాబట్టి విశేషణమైంది. అంటే ఒక శబ్దంవల్ల తెలియవచ్చే అర్థాన్ని అంతకంటె స్పష్టమయ్యేటట్లు విశేషపరచి సంగ్రహంగా తెలియజేసేశబ్దమే విశేషణం. దీనిచేత నామం విశేషింపబడుతుంది కాబట్టే నామాన్ని విశేష్య మనటం సరిపోయింది.

విశేష్య విశేషణాలకు నిజానికి పెద్దగా భేదంలేదు ఈ విషయాన్ని గమనించాడుకాబట్టే వెండ్రీస్ తన లాంగ్వేజి అనే గ్రంథంలో **"Substantives and adjectives are interchangeable in all languages and from a grammatical point of view there is no clear cut boundary between them. They may both be grouped together in a single categories of the noun" p. 117.**

ప్రపంచంలోని కొన్ని భాషల్లోని విశేష్య విశేషణ భావం కొంతవరకు కల్పితం అని మనం చెప్పవచ్చు. ఎందువలనంటే ఆయా భాషల్లో విశేష్యాలు వాక్యంలోని స్థానాన్నిబట్టి తాత్కాలిక విశేషణత్వాన్ని పొందుతాయేగాని మరేమికాదు. ద్రావిడ భాషల్లోని విశేషణాలన్ని సహజంగా అవి విశేషణాలు కావు. నామవాచక శబ్దాలే ఎటువంటి మార్పు పొందకుండా విశేష్యాలకు ముందు ప్రయోగింపబడి స్థాన భేదాన్ననుసరించి విశేషణాలుగా ప్రవర్తిస్తాయి.

ద్రావిడ భాషల్లోని విశేషణాలకు విశేష్యాలకు సర్వసాధారణంగా ప్రత్యేకమైన భేదమేమీలేదు. ద్రావిడ భాషల్లోని విశేషణాలు చాలవరకు విశేష్యాల నుండి ఏర్పడినవే. సహజంగా ఉండే విశేషణాలు చాల తక్కువ. గుణ రస వాచకాలైన నామాలు ఇతర నామాలకు ముందు వాడబడితే అవే విశేషణాలవుతాయి. ఈ భావాన్నే కాల్డువెల్లు కూడ సూచించాడు — **"The majority of adjectives in all the Dravidian dialects are nouns of quality or relation, which become adjectives by position alone, without structural change whatever, and without ceasing to be, in themselves, nouns of quality" – Ibid p. 309.**

ద్రావిడ భాషల్లోని విశేషణ ప్రక్రియావిధానాన్ని ప్రధానంగా రెండు విధాలుగా విభజింపవచ్చు. I. **మూలధాతు** రూపాలే కొన్ని విశేషణాలుగా వ్యవహరింపబడతాయి. II. నామక్రియా ధాతువుల నుండి ఏర్పడిన కొన్ని విశేషణాలూ ఉన్నాయి. **మూలధాతు రూపా**లైన విశేషణాలను స్థూలంగా మళ్ళీ నాల్గు రకాలుగా వింగడింపవచ్చు. 1. గుణ రస వాచకాలైన శబ్దాలు, 2. నిర్దేశాత్మక సర్వనామాలు, 3. ప్రశ్నార్థక సర్వనామాలు, 4. సంఖ్యావాచక విశేషణాలు.

1. గుణ రసాది వాచకాలైన శబ్దాలు : కొన్ని విశేషణాలను చాల ప్రాచీన కాలంనుండి **భాష**లో విశేషణ ధాతువులనియే నిరూపించటానికి వీలవుతుంది. తెలుగులో చిఱు—గాలి, పెన్+పాఱ, పేరోడ, చిన్న—పూవు, పెద్ద—వాన; కన్నడంలో చిక్క—హుడుగ, సణ్ణ—హుడుగ, కిరియ—అణ్ణ, హిరియ—అణ్ణ, దొడ్డ—మళె; తమిళంలో చిరు—ప్పయ్యన్, పెరు—మక్కళ్; మలయాళంలో చెరియ—కుట్టి, వలియ—కుట్టి. కొన్ని విశేషణ రూపాలు తెలుగులో ప్రాచీన సమాసాల్లో నిల్చి ఉన్నాయి—కెం-దామర, క్రొ-క్కారు, క్రీ—గాలు, చెం—దోవ, ప్రా—యిల్లు, మీ—గడ, లే—దూడ. కాలక్రమాన ఈ విశేషణ ధాతురూపాలే వ్యస్తంగా ఉన్నపుడు కొన్ని అనుబంధక ప్రత్యయాలను తీసికొని విశేషణాలుగా పరిగణింపబడుతూవచ్చాయి— కెంపు, క్రొత్త, క్రింద, చెన్ను, ప్రాత, మీదు, లేత.

2. నిర్దేశాత్మక సర్వనామాలు : నిర్దేశాత్మక సర్వనామ రూపాలైన ఆ, ఈ అనేవి కూడ విశేషణాలుగా వాడబడతాయి. మధ్యస్థతా **బో**ధకం అయిన 'ఉ' తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో ప్రాచీనకాలంలో ఉన్నట్లు ఆధారాలున్నాయి. కాని ఆధునిక భాషల్లో ఇది లోపించింది. ఆ, ఈ అనేసర్వనామ రూపాలకు ర, శ, స, ష, హ (ఊష్మలు) తప్ప మిగిలిన హల్లులు పరమైతే దీర్ఘాలు హ్రస్వమవటమే గాకుండ ఆ పరమైన హల్లు ద్విత్వం అవటం కూడా జరుగుతుంది. తెలుగు - ఆ+కాలము=అక్కాలము. ఈ+చోటు=ఇచ్చోటు. ఈ లక్షణం తమిళ, మలయాళ భాషల్లోకూడ కొన్నిచోట్ల కనబడుతుంది. తమిళం—ఆ+నాళ్=అన్నాళ్, ఈ+నాళ్=ఇన్నాళ్ మలయాళంలో కూడ ఇదేరూపాలున్నాయి—అన్నాళ్, ఇన్నాళ్. కన్నడ భాషలో దీర్ఘం హ్రస్వ మవటంగాని, పరమైన హల్లు ద్విత్వమవటంగాని కనబడటంలే**దు**. ఈ సర్వనామ రూపాల పైననే ఇతర అనుబంధక ప్రత్యయాలు చేరటంచే విభిన్నార్థ బోధక విశేషణ రూపాలేర్పడుతున్నాయి.

తె	క	త	మ
అంత, ఇంత	అష్టు, ఇష్టు	అవ్వళవు, ఇవ్వళవు	అత్ర, ఇత్ర
అన్ని, ఇన్ని	అష్టు, ఇష్టు	అత్తనై, ఇత్తనై	అత్ర, ఇత్ర
అట్టి, ఇట్టి	ఆతర, ఈతర	అప్పడి, ఇప్పడి	అంగనె, ఇంగనె

3. ప్రశ్నార్థక సర్వనామం : ప్రశ్నార్థక సర్వనామమైన 'ఏ' నిర్దేశాత్మక సర్వనామాలైన ఆ, ఈల వలె ప్రక్రియా విధా

నాన్ని పొందుతుంది. ఇది హ్రస్వమవటం, తర్వాతి హల్లు ద్విత్వ మవటం కూడ కనబడుతుంది. తెలుగు — ఏ+కడ = ఎక్కడ, ఏ+చోటు = ఎచ్చోటు. ఏ శబ్దము, ఏ రాయి, ఏ సంత మున్నగు వాట్రిలో రాదు (బాల. సమాస. 14) తమిళం—ఏ+నాళ్=ఎన్నాళ్, ఏ+నిలై = ఎన్నిలై, ఏ+అళవు = ఎవ్వళవు. మలయాళంలో ఏ+నాళ్ = ఎన్నాళ్, ఏ+నిలవ్ = ఎన్నిలవ్ కన్నడంలో ఆ,ఈలకు వలె 'ఏ'కు కూడ హ్రస్వ ద్విత్వ లక్షణం ఉండదు. ఆ,ఈల లాగానే 'ఏ'పై కూడ ఇతర అనుబంధక ప్రత్యయాలుచేరి విశేషణ రూపాలేర్పడటం కనబడుతుంది.

తె	క	త	మ
ఎంత	ఎష్టు	ఎవ్వళవు	ఎత్ర
ఎన్ని	ఎష్టు	ఎత్తనై	ఎత్ర
ఎట్టి	ఎంతహ	ఎప్పడి	ఎంగనె

4. సంఖ్యా వాచక విశేషణాలు : ద్రావిడ భాషల్లో సంఖ్యా వాచక విశేషణాలున్నాయి. ప్రాచీన విశేషణ రూపాలన్నీ సంగ్రహ రూపాలే. ఈ సంఖ్యావాచక విశేషణ రూపాలకు తర్వాత కాలక్రమాన కొన్ని ప్రత్యయాలు చేరి విశేష్య రూపాలేర్పడటం జరిగి ఉంటుం దని ద్రావిడభాషా శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఉదా. ఒరు > ఒన్ణు, ఒక > ఒకటి, ఇరు > ఇరండు, మూ > మూన్ణు, నాల్ > నాంగు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లోని సంఖ్యావాచక విశేషణ రూపాలివి :

తె	క	త	మ
ఒక్క/ఒక	ఒరు/ఓర్	ఓర్/ఒరు	ఓర్/ఒరు
ఇరు/ఈర్	ఇర్	ఇరు/ఈర్	ఇరు/ఈర్
మూ/ము	మూ/ము	మూ/ము	మూ/ము
నలు/నల్	నాల్/నల్	నాల్	నాల్
ఏ	ఐ/అయ్	ఐ/అయ్	ఐ
అఱు	అఱు	అఱు	అఱు
డె	ఎళ్	ఎఱు	ఎఱు
ఎనమ/ఎన	ఎణ్	ఎణ్	ఎణ్
తొమ్	తొమ్	తొళ్	తొళ్
పదున్/పన్	హదిన్/హన్	పత్/పదున్/ఎన్	పదిన్/పన్
నూట	నూత్	నూత్	నూత్

II నామక్రియా ధాతువులనుండిఏర్పడిన విశేషణ రూపాలు :

1. కొన్ని నామవాచక రూపాలు ఎటువంటి ప్రత్యయాలు తీసికొనకుండ మరియొక నామవాచకానికి ముందు ప్రయోగింపబడితే అవి విశేషణాలవుతాయి. ఈవిధంగా నామవాచక రూపాలు స్థానాన్ని బట్టి విశేషణాలవటం ద్రావిడ భాషల్లో ఎక్కువగా కనబడుతుంది.

తె	క	త	మ
ఇసుక—నేల	మరళు - నెల	మణల్—నిలమ్	మణల్—నిలయ్
తల—నొప్పి	తలె—నోవు	తలై—నోవు	తలె—కుత్తు
కుక్క—పిల్ల	నాయి—మరి	నాయి—కుట్టి	నాయి—కుట్టి
బంగారు—బొమ్మ	బంగార—బొంబె	పొన్—బొమ్మై	పొన్—బొమ్మ

ఈ విధంగా నామవాచకం విశేషణంగా వాడబడేటప్పుడు కొన్ని మార్పులు కూడా పొందుతుంది—ఉప్పం—బెరిక, జీడిన్—ఇఱ్రి, విలువ్వుటద్దము, సరసవ్వుమాట ఇలాగే సంఖ్యావాచక విశేష్య రూపా లను మరియొక నామానికి ముందు విశేషణాలుగ వాడటం కనబడు తుంది.

తె	క	త	మ
రెండు—పుస్తకాలు	ఎరడు—పుస్తకగళు	ఇరండు—పుస్తకంగళ్	రెండు—పుస్తకమ్
నాలుగు—గుఱ్ఱాలు	నాల్కు—కుదెరెగళు	నాంగు—కుదిరైగళ్	నాలు—కుదిర

2. కొన్ని నామవాచక పదాలకు విశేషణ ద్యోతక ప్రత్యయాలు చేర్చటంచేత అవి విశేషణాలవుతాయి—నల్+అ = నల్ల. వ్యవహారంలో విశేష్య విశేషణాలకు స్ఫుటమైన భేదం ఏమిలేదు. అందువల్ల ఈ విశేషణ రూపమైన 'నల్ల' కూడ కొంతకాలం తర్వాత విశేష్యంగా కూడ వాడబడటం జరిగింది. నన్నయ భారతాది పర్వంలో 'నల్లలేదయ్యేనేని' (2–33), తెల్లని తురగోత్తము వాలంబు నల్లసేసితిరేని (2–35) అని నాలుగైదుసార్లు అదే సందర్భంలో విశేష్యంగా ప్రయోగించాడు. ఈ 'నల్ల'కు మరొక విశేషణ ప్రత్యయంచేరి నల్ల+ని=నల్లని అనే విశేషణరూపం తయారైంది. మళ్ళీ దీనిమీద కూడ మరొక విశేషణ ద్యోతక ప్రత్యయం చేరి నల్లని+అయిన=నల్లనైన అనే మరొక విశేషణ రూప మేర్పడింది.

డకారాంత, శకట రేఫాంత శబ్దాలలో బయలుదేరిన ద్విత్వ 'ఱ' కారము ఉచ్చారణలో 'ట' అయి 'ట్ట'గా మారి తర్వాత కొంత కాలానికి ప్రత్యేకంగా విశేషణ ద్యోతకచిహ్నంగా పరిగణించటం జరిగింది.

తె	త	మ
ఏటి—మన్ను	ఆట్రు—మణల్	ఆట్టు—మణల్
నట్టిల్లు	కాట్టు—ప్పూనై	కాట్టు—పూచ్చ

కన్నడంలో ఇటువంటి మార్పు కనబడటం లేదెందుకో. ఈ విశేషణ ద్యోతక ప్రత్యయమైన 'ట' కారమే ఇతర నామవాచక శబ్దాలపై జేరి వాటిని విశేషణాలుగా మార్చటం కూడా కనబడు తుంది. తెలుగులో—కఱకు—ట్—అమ్మ=కఱకుటమ్మ, చిగురు టాకు.

3 తెలుగులో 'ము' వర్ణాంత శబ్దాలు విశేషణాలు అయ్యేటప్పుడు 'ప'కారాంతా లవుతున్నాయి. నిజానికి ఈ పకారాంత రూపాలే ప్రాచీన రూపాలు. వీటినుండే మువర్ణాంతరూపాలు తర్వాతి కాలంలో బయలుదేరాయి. ప్రాచీన విశేషణ ద్యోతక పకారం సమాస రూపాల్లో నేటికి నిల్చి ఉంది. కాని వ్యస్తంగ ఉన్నప్పుడుమాత్రం 'ము'కారాంతంగ ఉంది. మన వ్యాకర్తలు వర్ణనాత్మక దృష్టితో ఇనుము, జనుము, వేములలోని 'ము'కారం 'ప'కారంగా సమాసాల్లో మారుతుందని చెపుతున్నారు ఇందులో 'ప'కారమే ప్రాచీనరూపం. ప్రాచీన కాలంలోని ఇనుమ్పు, జనుమ్పు, వేమ్పు అను విశేష్యాలపై విశేషణ ద్యోతక చిహ్నమైన 'అ' చేరి ఇనుమ్ప, జనుమ్ప, వేమ్ప రూపాలు ఏర్పడ్డాయి. ఇనుప-కడ్డీ, జనుప-నార, వేప-చెట్టు. తమిళంలో ఇరుప్పు-క్కోల్, వేప్పెణ్ణె అంటారు. మలయాళంలో వేప్పెణ్ణ ఉంది.

4· అగు ధాతువునుండి ఏర్పడ్డ భూతార్థక క్రియాజన్య విశేషణం చేర్చటంచే నామవాచకం విశేషణంగా మారుతుంది. ద్రావిడ భాషల్లో ఈ నిర్మాణం ఎక్కువగా కనబడుతోంది. తెలుగులో 'ఆయిన' నామవాచకానికి చేరిస్తే అది విశేషణం అయిపోతుంది—అందమైన—బాలిక, బలమైన—దెబ్బ. తమిళంలో 'ఆన' చేరిస్తే నామం విశేషణమవుతుంది—ఎళిదాన—నడై, బలమాన—అడి. మలయాళంలో 'ఆయ' చేర్చటం కనబడుతుంది - గంభీర మాయ—పడయ్. కన్నడంలో 'ఆద' చేరుతుంది—చెందవాద—హెణ్ణు, బంగారాద—మనస్సు.

5. తెలుగులో 'అగు' తద్ధర్మరూపం చేరటంచేత కూడ విశేష్యం విశేషణ మవుతుంది- అందమగు—బాలిక, బలమగు—దెబ్బ. 'ఉన్న' చేరితే కూడ విశేషణం తయారవుతుంది—అందమున్న—బాలిక. తమిళంలో 'ఉళ్ళ' చేరటంచే విశేష్యం విశేషణ మవుతుంది—సంతోష ముళ్ళప్పయ్యన్, మలయాళంలో —సంతోషముళ్ళ—కుట్టి, కన్నడంలో సంతోషద—హుడుగ—దాదాపు వీటన్నిటిలోను పొసెసివ్ సెన్స్ కనబడుతోంది.

6. క్రియాధాతువులనుండి కూడ విశేషణాలు తయారవుతాయి—తద్ధర్మార్థక విశేషణం, భూతార్థక క్రియాజన్య విశేషణం, వర్తమానకాల విశేషణం, భవిష్యత్కాల విశేషణం, వ్యతిరేక విశేషణం మొదలైన వున్నాయి.

	తె	క	త	మ
తద్ధర్మ:	చేసెడివాడు	మాడువవను	సెయ్‌బవన్	చెయ్యున్నవన్
భూత :	చేసినవాడు	మాడిదవను	సెయ్‌దవన్	చెయ్‌దవన్
వర్తమాన:	చేయుచున్న వాడు	మాడుతిద్ద వను	సెయ్‌గిన్టవన్	చెయ్యున్న వన్
భవిష్యత్తు:	చేయగలవాడు	మాడువంత హవను	సెయ్యప్పోగిరవన్	చేయ్యాన్ పోగున్నవన్
వ్యతిరేక :	చేయనివాడు	మాడదవను	సెయ్యాదవన్	చెయ్యాత్తవన్

7. కొన్ని అవ్యయాలు ఈ భాషల్లో కొన్ని సందర్భాలలో విశేషణాలుగ వాడబడుతాయి.

తె	క	త	మ
కొంచెము—సేపు	కొంచ—హొద్దు	కొంజమ్—నేరమ్	కురచ్చు నేరమ్
మిక్కిలి—వేడి	తుంబ—బిసి	మిగవుమ్—సుడు	మిగవుమ్ చుడు

సంస్కృతభాషలో విశేష్య విశేషణాలకు లింగవచన విభక్తుల్లో ఏకరూపత ఉండాలన్న నియమం ఉంది. ఈ సంస్కృత లక్షణాన్ననుసరించి తెలుగు పండితులు కూడా అచ్చటచ్చట తమ రచనల్లో విశేష్య విశేషణాలకు లింగ విభక్తుల్లో ఏకరూపతను ప్రాచీన కాలంనుండి ప్రవేశపెట్టారు. ప్రాజ్నన్నయకాలంలో "శౌచ కందర్పునకు వేంగీశ్వరునకు" అని ఉంది. అందువల్లే చిన్నయసూరి "విశేష్యంబునకుం బోలె విశేషణంబునకు లింగవిభక్తి వచనంబులగు" (కారక-19) అని సూత్రీకరించాడు. కాని నిజానికి విశేష్య విశేషణాలకు ఏకరూపత తెలుగు భాషలోనేకాదు ద్రావిడభాషలకే సహజం కాదు. సిథియన్ భాషల్లోకూడ విశేష్య విశేషణాలకు లింగవిభక్తి వచనాలకు ఏకరూపత ఉండదని కాల్డువెల్లు చెప్పాడు. సంస్కృత భాషలో మాత్రం వీటికి ఏకరూపత కనబడుతోంది—

మహాన్ పురుషః (పుం), నిరాశ్రయాలతా (స్త్రీ) రమణీయానివనాని (నపుం).

తరతమ భావనిరూపణ: సంస్కృతంలో తరతమ భావ నిరూపణకు విశేషణానికి తరతమ ప్రత్యయాలను చేర్చి వాడటం కనబడుతుంది. ద్రావిడ భాషల్లో విభక్తి ప్రత్యయాల సహాయంతో ఈ తర-తమభావం వ్యక్తం చేయటం ఉంది-పంచమి, చతుర్థి మున్నగునవి.

తె. వానికంటె వీడు మంచివాడు (పంచమి) దానికంటె ఇది మంచిది. క. దక్కింత ఇదు ఒళ్ళెదు. త. అదర్కు ఇదు నల్లదు. మ. అదిన్ను ఇదు నల్లదు.

ఈ భాషల్లో కొన్ని పదాలుచేర్చికూడ ఈ తరభావం వ్యక్తం చేయవచ్చు-త. అదై విడ ఇదు నల్లదు, అదై పార్కిలుమ్ ఇదు నల్లదు. క. అదక్కింత ఇదు ఒళ్ళెదు మ. అది నేకాళ్ ఇదు నల్లదు.

సప్తమీ విభక్తి ప్రత్యయాలతో తమ భావము తెల్పవచ్చు. తె. వారందరిలో వీడు మంచివాడు, క. అవరెల్ల రల్లియు ఇవను ఒళ్ళెయవను, త. అవర్‌గళ్ ఎల్లోరిలుమ్ ఇవన్ నల్లవన్, మ. అవర్ ఎల్లావరె కాళుమ్ ఇవన్ నల్లవన్. ఈ భాషల్లో విశేషణం పునరుక్తమవ్వటంచేత భృశార్థం వస్తుంది- తె. వేడి వేడి కాఫీ, క. బిసి బిసి కాఫీ, త. సూడాసూడా కాఫీ, మ. చుడు చుడు కాఫీ.

శ్రీ ఆదూరి వెంకటసీతారామమూర్తి

ఈ చీకటి విడిపోలేదు

హైదరాబాదులో ... మించి అడుగెత్తు లేచి సూరీడు లోకంమీదికొచ్చే వేళకి సింహాచలం గుడిదగ్గర కొచ్చేశాడు. సింహాచలానికి పట్టుమని పదేళ్ళుండవు. వాడి అయ్య అప్పలకొండ బతికుండి చదివిస్తే వీడీపాటికి ఫస్టుఫారంలో కొచ్చేసును. తెలివైనవాడూ చురుకైనవాడూ కాబట్టి ఫస్టుమార్కులు తెచ్చుకునేవాడే. కానీ ఆ అదృష్టం సింహాచలానికిలేదు. రెండుపూట్లా కడుపునిండా సారా తాగి అయ్య తనను తను చంపేసుకునే సమయానికి సింహాచలానికి అయిదేళ్ళు. పలక పట్టుకుని బళ్ళో కెళ్ళవలసిన వయసులో కడుపు పట్టుకుని వీధినబడ్డాడు సింహాచలం. వాడికి వాళ్ళయ్య మిగిల్చిన ఆస్తంతా ఓ రోగిష్టి తల్లీ; ఓ మాటలు రాని చెల్లీ. తల్లి పేరు కనకమయితే చెల్లి పేరు లక్ష్మి.

మొదట్లో పాచిపనులుచేసి పిల్లలిద్దరికీ యిన్ని గంజినీళ్ళు పోసేది కనకం. ఆ తర్వాత మలేరియా వచ్చి, మంచంపట్టేక, కోలుకుని శవంలా అయ్యాక చాల పన్లు మానేసుకుంది. దాంతో సంపాదన తగ్గింది. ఇంట్లో ఆకలి పెరిగింది. సరిగ్గా అప్పుడే సింహాచలం లోకంలో కొచ్చాడు. దగ్గర్లోవున్న దేవాలయంలోకి వెళ్తున్న జనం వాడిని ఆకర్షించారు. 'దేవుడంటే ఎవరూ?' అనే అనుమానమొచ్చిందప్పుడే. వాళ్ళమ్మ నడిగాడు.

'దేవుడంటే మనిషికాడూ గొప్పవాడూ' అంది వాళ్ళమ్మ.

అయితే అతనికెందుకు దండంపెట్టడం అనే మరో అనుమాన మొచ్చింది సింహాచలానికి.

'దండం పెట్టాలంతే' అంది వాళ్ళమ్మ. పెడితే కావలసినిస్తాడంది. అయితే ఎవరికేది కావలిస్తే వారికది దేవుడు దండం పెట్టించుకున్నాకనే యిస్తాడన్న సంగతి అప్పుడే తెల్సుకున్నాడు సింహాచలం. అన్నీవుండి, డబ్బున్నవాళ్ళే దేవుడి దగ్గరకెళ్తుంటే నేనెందుకు వెళ్ళకూడదూ? అనుకున్నాడు. అలా అనుకున్నరోజునే వెళ్ళేడు. దేవుణ్ణిచూసి దండం పెట్టేడు. ఆకలి తీరేట్లు చెయ్యమని కోరుకున్నాడు. దండం పెట్టి బయటకొస్తుంటే డబ్బూ, అందమూ గల ఒకావిడ కారెక్కబోతూ సింహాచలాన్ని కేకేసింది. అంతవరకూ సింహాచలాన్ని దూరంగా పొమ్మనేవారే కన్పించారు గాని రమ్మనేవారు కన్పించలేదు. అంచేత ఆవిడ దగ్గరకు పరుగెత్తుకెళ్ళేడు. కొబ్బరిచెక్కా, అరటిపండూ వాడి చేతిలోపెట్టి తీసుకోమని సౌంజ్ఞచేసి కారెక్కి తలుపేసుకుందావిడ.

సింహాచలం ఆవిడవంక ఆశ్చర్యంగా చూశాడు. తన కోరికను మన్నించి దేవుడు పంపిన మనిషేమో యీవిడ అనుకున్నాడు.

సరిగ్గా ఆనాటినుండే సింహాచలం దినచర్యలో మార్పు వచ్చింది. మనల్ని ఆదుకునేందుకు దేవుడొకడున్నాడూ అనే నమ్మకం కూడ కుదిరిందివాడిలో. అంచేత రోజులో సగభాగం గుడిదగ్గరే గడిపేవాడు. వచ్చిన ప్రసాదంలో తనుసగం తిని, మిగిలింది యింటికి తీసుకెళ్ళేవాడు.

ఎండ యింకా ముదర్లేదు. చెరువు గట్టుమీది కొంగలా గుడిముందు గట్టుమీద కూర్చున్నాడు సింహాచలం. ఆ రోడ్డమ్మట కాన్వెంటుకుపోయే పిల్లలు రెక్కలురాని కొంగల్లా అన్పించారు వాడి కళ్ళకి. ఆ కాన్వెంటు పిల్లలు యింగ్లీషులో మాట్లాడుతుంటారు, పోట్లాడుకుంటారు. పాటలు పాడుకుంటారు. పద్యాలు చెప్పకుంటారు. వాళ్ళని చూసి సింహాచలం మనసు అసంతృప్తిగా మూల్గుతుంది

వాళ్ళు చక్కగా వున్నారనికాదు–తనులేడే అని!

లోకంలోని మనుష్యుల్ని రెండురకాలుగా విభజించవచ్చు. తమకు లేదని యేడ్చేవాళ్ళూ...ఇతరులకు వుందని యేడ్చేవాళ్ళూ. వాళ్ళలో సింహాచలం మొదటి కోవకు చెందినవాడు.

సింహాచలం దృష్టి మరల్చుకుని చూసేసరికి ఎదురుగా పెద్దిరాజు కన్పించేడు. పెద్దిరాజు కూడ ప్రసాదాల భక్తుడే. వాడితోపాటు మరో నలుగురు కూడ వున్నారు సింహాచలానికి పోటీగా.

సింహాచలం గుడివంకచూస్తూ కూర్చున్నాడు. అప్పుడే భక్తులు ఒకరూ ఒకరూ వస్తున్నారు.

సూరీడు కాస్త బైటకొచ్చి ఎండ కరకర లాడ్డంతో సింహాచలం కడుపులో పేగులు కరకరలాడ్డం మొదలుపెట్టాయి. రాత్రెప్పుడో తాగిన గంజినీళ్ళు ఎప్పుడో అరిగిపోయాయి.

ఆమధ్య జబ్బుచేసి కనకం పన్లోకెళ్ళడం మానేస్తే రాని రోజులకు మినహాయించుకుని మిగిలిన డబ్బే చేతికివ్వడంవల్ల యింట్లో గంజినీళ్ళు దొరికే దిక్కుకూడ లేకపోయింది.

అంచేత, 'బోణీదొరికిందిరారా' అని పెద్దిరాజు అనేసరికి ఎగిరి గంతేసి ఒక్కంగలో వాడిదగ్గరకు వెళ్ళేడు సింహాచలం. మొట్టమొదటి ప్రసాదం ఎవరికి దక్కినా అది అందరూ పంచుకోవాలనే రూలు వాళ్ళలో వుంది.

అరటిపండు ముక్క నోట్లోవేసుకుని దేవస్థానం కుళాయి నీళ్ళు కడుపునిండా తాగేసరికి ఎక్కడలేని శక్తి వచ్చినట్లయింది సింహాచలానికి.

'యేఁట్రా గుంటల్లారా. అప్పుడే తెల్లారిపోయిందేటి–దోరం దాటి బైటికి పదండిముందు' అంటూ గద పట్టుకొచ్చే యముళ్ళా కఱ్ఱ పట్టుకొచ్చేడు వీరాసామి.

వీరాసామి దేవస్థానం కావలాదారు. ఆరడుగుల విగ్రహం, బొత్తు మీసాల్తో భయంకరంగా కన్పిస్తాడు. గొంతుతోనే అదిలించి జనాన్ని అదుపులో పెట్టే సామర్థ్యం ముందతనికి. దేవుడి దగ్గర అందరూ సమానమే అయినా కార్లలో వచ్చేవారికీ కాలినడకన వచ్చే వాళికీ ఎవరి అంతస్తునుబట్టి వార్ని గౌరవించగలిగే నేర్పుందతని వద్ద. బెల్లంమీద మూగిన యీగల్ని తోలేసినట్లు ప్రసాదాలకోసం గుడికొచ్చే గుంటల్నీ తోలేస్తాడతడు. అందుకే వాళ్ళపట్ల వీరాసామి యమధర్మరాజు.

మెట్లు దిగి రోడ్డుమీది కొచ్చాడు సింహాచలం. సరిగ్గా అప్పుడే వచ్చి ఆగిందో కారక్కడ. అది కారులాలేదు. గండభేరుండ పక్షిలావుంది కుబేరుడి వాహనంలావుంది. అందులోంచి దిగినవాళ్ళు మనుషుల్లాలేరు. రాక్షసుల్లానూ లేరు. దేవతల్లా వున్నారు. వారి వంటిమీది బట్టలు దేవతా వస్త్రాల్లా వున్నాయి. వాళ్ళు మామూలు దంపతుల్లా కాకుండా ఆదిదంపతుల్లా కన్పించారు సింహాచలం కళ్ళకి. వాళ్ళ పక్కనున్న అయిదేళ్ళ ఆడపిల్ల బంగారురంగు గౌను వేసుకున్న దంతబ్బొమ్మలా వుంది. ఆ పిల్లని చూస్తుంటే తన చెల్లెలు గుర్తుకొచ్చింది సింహాచలానికి. ఒకే యీడువారైనా వారిద్దరిలోనూ ఎంత తేడావుందీ అనుకున్నాడు. కానీ ఆ తేడాకి సరియైన కారణమేమిటో మాత్రం వూహించలేకపోయాడు. గొప్ప, బీద తారతమ్యాల గురించిగాని; సంఘానికే అడ్డుగోడలుగా నిలిచిన యీ అంతస్తులు, వాటిమధ్య నలిగిపోయే జీవితాలగురించి గాని; వాటివెనుక రగిలే పగ, ద్వేషాలగూర్చిగాని సింహాచలానికి నిశితంగా తెలీదు–తెల్సుకునే వయసూ కాదు.

ఎండ వేడెక్కింది. గట్టుమీద కూర్చుని గుడిలోంచి వచ్చే వారివంక ఆశగా చూస్తున్నాడు సింహాచలం. మరో నాలుగు కొబ్బరి ముక్కలు దొరికితే తను యింటికెళ్ళిపోవచ్చు. ఇంతలో...లోపల్నించి వస్తూన్న ఓ ఆసామి అతని కళ్ళబడ్డాడు. దేవుడిముందు ఎన్నో కోరికలు కోరుకుని కోరికకో కొబ్బరికాయ చొప్పున కొట్టినట్టు అతని దగ్గర చాల కొబ్బరి చెక్కలున్నాయి. తనకొకటైనా దక్కక పోదు అని గట్టు దిగాడు సింహాచలం. ఆ వచ్చినాయనకి నలభై యేళ్ళుంటాయి. బయటకొచ్చి ఏదో వెతుకుతున్నాడతను. దృష్టి నంతా అతని పైనే నిలిపి చూస్తున్నాడు సింహాచలం. అతగాడు వాచ్‌మన్‌ని పిలిచి యేదో అడిగాడు. వాచ్‌మన్ చుట్టూచూసి; తల త్రాటించి సింహాచలాన్నీ తతిమ్మా గుంటల్నీ కేకేశాడు. ఆశ్చర్యంతో చూస్తున్న సింహాచలం ఒక్కంగలో అక్కడకు చేరుకున్నాడు.

''ఏరా గుంటల్లారా. బాబుగారి కొత్తచెప్పులు కనపడ్డం లేదంట – మీరెవరన్నా చూశార్రా.''

వీరాసామి మాటలకు సింహాచలం గుండెల్లో రాయిపడింది. నిశ్చలంగావున్న ఆకాశంపై కారుమబ్బులు కమ్ముకున్నట్లు అతని మనసంతా అల్లకల్లోలమైంది. మాకు తెలీదంటే మాకు తెలీదన్నా రంతా. పెద్దిరాజు మాత్రం సింహాచలం వంక చూశాడు. ఆ చూపులో వున్నదేదో గ్రహించిన సింహాచలానికి కాళ్లలో వణుకు ప్రారంభమైంది.

''ఈ దేవత గుడికాడ యిట్లాంటి దొంగినాలెప్పుడూ జరగలేదు బాబూ ఎవరన్నా పొరపాట్న తొడుక్కెళ్ళేరేమో'' అన్నాడు వీరాసామి. ఆ మాటల్లో తన పనిమీద తనకున్న విశ్వాసముంది. అతను నమ్ముకున్న దేవతమీద భక్తి వుంది.

చెప్పులు పోగొట్టుకున్నాయనేం మాట్లాడలేదు. ఎవరూ తియ్యకుండావుంటే ఎట్లా పోతాయి అన్నట్లుందాయన ముఖం. ఆ ముఖం చూశాక వీరాసామికక్కడ అదే ప్రశ్న మెదడులో ప్రవేశించింది. అతనికి అనుమానించడానికి యింకెవరూ దొరకలేదు, ప్రసాదాలకోసం పాకుల్లాడే గుంటలతప్ప.

'ఎవడోకడు మీలోవాడే తీసుండాలిరా. లేపోతే చూసన్నా వుండాలి. నిజం చెప్పకపోతే ఒక్కొక్కడికీ తగుల్తాయి గుప్‌కీలు' అంటూ కఱ్ఱెత్తేడు. వీరాసామి తల్చుకుంటే ఏమైనా చెయ్యగల్డు. పోయినేడాది అమ్మోరి పండక్కి ఎవడో గుంటడు దొమ్మీ చూసుకుని జేబులు కొట్టబోతుంటే పట్టుకుని రోజంతా లైటుస్తంభాని కేసి కట్టేసుంచేశాడు. వాడుతిన్న దెబ్బలూ, వాడు కాసిన తిట్లూ విని చూసినవాళ్ళందరికీ వీరాసామి ఎంత కర్కోటకుడో తెలుస్తుంది. వీరాసామిలోవున్న గుణమేమిటంటే...మంచోళ్ళతో, వెన్నలా మెత్తగానూ వుండగల్డు; పెంకివాళ్లతో పొయ్యిలో కఱ్ఱలానూ వుండ గల్డు. అంచేత...యిప్పుడు వీరాసామి ఎత్తిన అవతారం చూసిన గుంటలంతా జడుసుకుని బిక్కచచ్చిపోడంలో ఆశ్చర్యంలేదు.

''సిమ్మాచలం గోడిందాక తీస్తుంటే నాన్చూసినాను.'' అన్నాడు పుసుక్కున నూకరాజు. నూకరాజు అర్భకుడే కాదు భయస్తుడు కూడ !

ఆ మాటవిన్న సింహాచలం మనసు బోన్లోపడ్డ పులిలా గిజగిజ లాడింది.

'ఔను నానూ చూసినానంటే నానూ చూసినా' నన్నారు అప్పిగాడూ, వీర్రాజూ.

''ఏరా ! తీసినావా'' అన్నాడు వీరాసామి కళ్ళెర్రజేస్తూ. వీరాసామి కళ్ళు ఎఱ్ఱ గోళికాయల్లా కాకుండా; మండుతున్న నిప్పు కణికల్లా వున్నాయి.

వీరాసామి చేతిలో నలుగుతూన్న సింహాచలం చొక్కా సింహం నోట్లో చిక్కిన కుందేలు పిల్లలా కరకరలాడింది.

''అవున్నానిందాక తీశాను. కావనీ బాబుగారివవునో కాదో నాకు తెలీదు'' అన్నాడు సింహాచలం.

ఆ మాటకి చెప్పులు పోగొట్టుకున్నాయనా, వీరాసామీ కూడ తెల్లబోయారు. మహామహులే ఒప్పుకోని నిజాన్ని వీడెలా ఒప్పుకున్నాడా అనికాదు. అంత ధైర్యంగా ఎలా చెప్పగలిగేడా అనే.

''ఎక్కడ దాచినావో తెచ్చిచ్చీ'' అన్నాడు వీరాసామి గుప్పిట్లోని చొక్కా వదిలిపెట్టి.

''నాను దాచనేదు. నాకెందుకవి'' సింహాచలం మాటలకి మరింతాశ్చర్య పడ్డాడు చెప్పులు పోగొట్టుకున్నాయన.

''నాటకాల్జేస్తున్నావేట్రా'' గూబ గుయ్యిమనిపించాడు వీరాసామి. ఆ దెబ్బ చావుదెబ్బలా తగిలింది సింహాచలానికి. నీర్సానికి లోతుకుబోయిన కళ్ళు పచ్చబారి చెమ్మగిల్లాయి. తననే కేంద్రంగా చేసుకుని అమ్మవారి గుడితో సహా అంతా తనచుట్టు తిరిగినట్టయింది సింహాచెలానికి. ఆ స్థితిలో వాడిని చూస్తే చెప్పలేనంత జాలి కలిగింది చెప్పులుపోయిన అయ్యవారికి. కాలేజీ పిల్లలముందు పులిలా అరిచే ఆయన కూడ పిల్లిలామారి వీరాసామిని వారించి; ''నిజం చెప్పు నాయనా. నా జోళ్ళేం చేశావ్'' అన్నాడు సింహాచలంతో సౌమ్యంగా. వీరాసామి దెబ్బకూడా రానిఏడ్పు అయ్యవారు ఓదారిస్తే ఉప్పెనలా ముంచుకొచ్చింది సింహాచలానికి. ముత్యపుచిప్పల్లాంటి కళ్ళనుండి కన్నీళ్ళు టపటపా రాలిపడ్డాయి.

''నీ కర్దరూపాయిస్తాను. తొరగా తీసుకురా. పో'' లంచం కూడ ఎరచూపాడు అయ్యవారు.

డబ్బుమాట వచ్చేసరికల్లా సింహాచలానికి పావుగంట క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు నిలిచింది.

*   *   *

తననెవరో పిలుస్తున్నట్టై తలెత్తి చూశాడు సింహాచలం. ఆలయ ముఖద్వారాని కెదురుగా అరుగుమీద కూర్చున్న ఓ యిరవైయ్యేళ్ళతను తననే పిలుస్తున్నాడు.

గట్టుదిగి అటువైపు అడుగులు వేశాడు.

''చూడూ నీ పేరేంటీ.''

''సింహాచెలమండీ.''

''ఆ గుమ్మం దగ్గర అట్నించి రెండో జత జోళ్ళిలా పట్టుకొస్తావ్'' అన్నాడతడు.

అర్థంకాక అయోమయంగా చూశాడు సింహాచలం.

''నావేన్రా బాబూ. అక్కడకెళ్ళి వేసుకునే ఓపిక లేదు.'' అంటూ ఓ పదిహేను పైసలుతీసి వాడిచేతిలో పెట్టాడు. ముందు తేగూడదనుకున్నా పైసలు చేతిలో పడేసర్కి మరి మాట్లాడలేకపోయాడు సింహాచలం. పైగా అతని కాళ్ళకు చెప్పులులేవు ఖరీదైన బట్టలే వేసుకున్నాడు. చుట్టూ నలుగురు స్నేహితులు కూడ. అందుకే మరో ఆలోచన రాలేదు.

*   *   *

ఆ సంగతే వున్నదున్నట్టు చెప్పేడు.

''ఛప్ దొంగనాయాలా. ఎవుడికో అమ్మేసి, పైగా కట్టుకదలు చెప్తావ్రటా'' అని, అయ్యవారి వంకచూసి ''యీడు చెప్పే సినీమా కతలు విని మోసపోకండి బాబూ ఈడిచేత నిజవేలా చెప్పించాలో నాకు దెల్సు'' అంటూ ముందుకొచ్చాడు వీరాసామి.

''దార్నపోయేవాడెవుడో ఒచ్చి అడిగితే నువ్వెందు కివ్వాల్రా'' అని ప్రశ్నించేడు, ''నువ్వెవుడి కిచ్చిందీగాదు పోయింటు, నువ్వెందు కిచ్చావూ అన్నదే కొశ్చను'' అన్న ధోరణిలో.

సింహాచలానికి మరి నోట మాటరాలేదు. వాడినేం చేస్తే యింకా నిజం చెప్తాడో అన్నీ చేసేడు వీరాసామి. కానీ ఫలితంలేదు. కష్టదశలోవున్న సినీమా హీరోయిన్ని రక్షించలేని ప్రేక్షకుడిలానే చూస్తూ నిల్చున్నారందరూ.

''నేను చెప్పిందే నిజం అంతకుమించి నాకేం తెలీదు'' అన్నాడు చివరికి. అది తప్ప మరో మాట రావడంలేదు, సింహాచలం నోటి నుంచి. వాడి ఒళ్ళంతా పుండుమీద కారం అద్దినట్లుగా దెబ్బలకు మండుతోంది. ఆ మంట ముందు కడుపులో పేరుకున్న ఆకలిమంట తెలీటంలేదు వాడికి.

వాడి కళ్ళలో నీళ్ళు యింకిపోయాయి !

స్తంభానికి వెనక్కు కట్టేసినవాడి చేతులపై తాడు రాపిడికి ఒరుసుకుని చర్మం లేచింది ! !

చెప్పులు పోగొట్టుకున్న అయ్యవారు మాత్రం అయ్యవార్లా కాక నిప్పులు తొక్కిన కోతిలా గెంతి చేసేదిలేక వెళ్ళిపోయాడు.

వీరాసామి కూడ చేసింది చాలునని నరశింహావతారం మార్చి తన పనిలో లీనమయ్యాడు. కొద్దిసేపట్లోనే సింహం సగం తినేసి వదిలేసిన లేడి శరీరంలా వంటరిగ అసహ్యంగా వదిలివేయబడ్డాడు సింహాచలం.

ఆ క్షణంలో తనపై తనకే అసహ్యమేసింది సింహాచలానికి. ఎదురుగా కన్పించే దేవుడిగుడినిచూస్తే పూర్వంలా గొప్పగా అన్పించ లేదు. తన కళ్ళముందు జరిగే అన్యాయాలను చూస్తూ కూడ మౌనం వహించే యీ రాతిబొమ్మకంటె మామూలు మనిషి నయ మనిపించింది. ఎవరో దయతలచి యిచ్చే ప్రసాదాలను తింటూ అవి దేవుడే యిస్తున్నాడని యిన్నాళ్ళూ తనెంత గుడ్డిగా నమ్మేడో అప్పు డర్థమైంది. దేవుడంటూ వుంటే యీ తేడాలూ, యీ దరిద్రాలూ, అన్యాయాలూ, అక్రమాలూ వుండేవా అని తనలో తనే ప్రశ్నించుకుని సమాధానపడ్డాడు. అప్పటివరకూ తెలియని సత్య మేదో అవగతమైనట్లు వాడి కళ్ళు మెరిశాయి.

* * *

సరిగ్గా అదే సమయంలో యిందాకా సింహాచలంచేత చెప్పులు తెప్పించుకుని తొడుక్కెళ్ళిన సత్యానందం కళ్ళూ ఆనందంతో మెరిశాయి.

తనచుట్టూవున్న స్నేహితుల మధ్యలో కాకులమధ్య హంసలా, ఎక్స్ట్రాలమధ్య హీరోలా, మామూలు ప్రజలమధ్య ప్రజానాయకుడిలా వెలిగిపోతున్నాడు సత్యానందం.

''మాటంటే మాటే. లేకపోతే క్లాసులో అందరి ముందూ నా అంతం చూస్తానంటాడా ?'' అన్నాడు గర్వంగా.

''వాడి రోగం కుదిర్చావు సరే. మరిప్పుడివేం చేస్తావ్ ?'' ప్రశ్నించాడు సత్యానందా న్నీపనికి పురిగొల్పిన శ్రేయోభిలాషి అప్పారావు.

''యేముంది. యే చెప్పులు కుట్టేవాడికిచ్చినా యీ రోజు మన సిగిరెట్లకి లోటుండదు.'' ఘనకార్యమేదో చేయబోయేవాడిలా నవ్వేడు.

* * *

ఆరోజు సాయంత్రం వడదెబ్బతిన్న కాకిపిల్లలా గూడుచేరిన సింహాచలానికి ఆప్యాయంగా ఎదురొచ్చి సేద దీరుస్తుందనుకున్న అతని తల్లి రాలేదు.

వేపచెట్టు జల్లిన చీకటి కల్లాడిని చూస్తూ గుమ్మంలోనే కూర్చుండిపోయిన సింహాచలానికి మాటలురాని మరబొమ్మలాంటి చెల్లెలు చేసిన సంజ్ఞకు అదిరి లోపలికి అడుగుపెట్టాడు.

తాళ్ళు తెగిన నులక మంచంలో విరిగిన బొమ్మలా పడుకున్న వాడి తల్లి పాముకాటుబడ్డ కప్పలా మూలిగింది.

సింహాచలం మనసులో దుఃఖం వుప్పెనలా పొంగింది. కళ్ళలో నీటిచుక్కలేదు !


చెల్లెల్ని దగ్గరకు తీసుకుని తలనిమిరి జోకొట్టేడు.

కళ్ళు ఎప్పుడు మూతలు పడ్డాయో ! మెలుకువవచ్చి చూసే సరికి గుడిసెపైన కాకులు అరుస్తున్నాయి.

లేచి, తల్లి మంచం దగ్గరకువెళ్ళి ఆమె గుండెలమీద చెయ్యి వేశాడు.

బాధలేదు — మూల్గులేదు — ఆయాసం లేదు - ఆవేశమూ లేదు — నిశ్చలంగా మంచు కంటె చల్లగా వుంది.

అప్పటికింకా చీకటి విడిపోలేదు.



శ్రీ ఎ. బొబ్బిలి

చక్రవర్తి : ఆవిర్భావం, పరిణామం

- ఒక పరిశీలన

I

భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్య స్థాపకులు మౌర్యులు. వీరికి ముందు భారతదేశం ఎన్నో చిన్న చిన్న రాజ్యాల సమాహారంగా ఉండేది. చంద్రగుప్తమౌర్యుడు క్రీ. పూ. 4వ శతాబ్దము మొదటి పాదములో విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించే వరకు భారతదేశంలో అంతటి విశాలమైన రాజ్యంగాని, అంతటి దృఢమైన రాజకీయార్థిక సాంఘిక వ్యవస్థగానీ లేదు. మౌర్యులతర్వాత మరల అంతటి సామ్రాజ్యాన్ని అంతేదృఢతరమైన సాంఘిక, ఆర్థిక రాజకీయ వ్యవస్థను స్థాపించిన వారుగా పేర్కొనబడినవారు వరుసగా శాతవాహనులు, గుప్తులు, పుష్యభూతి వంశజుడైన హర్షుడు. పైన పేర్కొన్న వంశాలకు చెందిన రాజులందరిని చరిత్ర చక్రవర్తులుగా పేర్కొంటున్నది వీరికి సమకాలికులైన మరెందరో రాజులను చరిత్ర మామూలు రాజులుగానే తప్ప చక్రవర్తులుగా పేర్కొనలేదు. దీనినిబట్టి చక్రవర్తులుగా పేర్కొనబడిన మౌర్య, శాతవాహన, గుప్త మరియు పుష్యభూతి వంశానికి చెందిన హర్షుడు మొదలగు రాజులు ఏవైన ప్రత్యేకమైన అర్హతలను కలిగి వుండేవారా? అనే భావం కలుగుతుంది.

చక్రవర్తి భావన ఎలా, ఏ పరిస్థితుల్లో ఏర్పడింది ? ఈ ఆవిర్భావన రూపం, దాని పరిణామ క్రమమేమిటి ? చక్రవర్తి ఆవిర్భావన రూపం దాల్చక పూర్వం సమాజ స్థితిగతులు ఏలా ఉండేవి? చక్రవర్తి ఆవిర్భావన రూపు దాల్చుటలో ఏర్పడిన నూతన సమాజాలలో ఉన్న ఆర్థిక, సాంఘిక, పరిస్థితుల్లో వ్యత్యాసాలేమన్నా ఉన్నాయా ? ఇట్టి విషయాలను గురించి చర్చించకుండా చక్రవర్తి ఆవిర్భావాన్నిగాని, దాని స్వభావాన్నిగాని తెలుసుకోవడం సాధ్యంకాదు.

II

నిరంతరము ప్రకృతి శక్తులపై పోరాడుతూ నశించిపోయే మృగప్రాయుడైన ప్రాచీన ఆటవిక మానవుడు నిప్పును[1] కనుగొనడం, అడవి జంతువులను మచ్చిక చేసుకొనడముతో విపత్కరజీవన పరిస్థితుల నుండి బయటపడి, ప్రాచీన ఆటవిక జీవితమును రూపుమాపి, గణ సమాజానికి[2] పునాది వేశాడు. ఈ గణ సమాజంలో ఒకే రక్త సంబంధీకులు సభ్యులుగా ఉండేవారు. ఈ సభ్యులు [స్త్రీ,పురుషులు] విపత్కరమైన ప్రకృతిలో ఒకరినొకరు పరస్పరం అంటిపెట్టుకొని సమిష్టిగా పనిచేసి సమంగా అనుభవిస్తూ, ప్రకృతి పరిస్థితుల ఒత్తిడికి లోనవుతూ గణ సమాజ సభ్యులయొక్క అభిప్రాయాల ప్రకారము ఏర్పర్చిన మార్గములో ప్రతివారు తాము నిర్వర్తించవలసిన సామాజిక విధికి కట్టుబడి సమిష్టిగా వున్నట్లు అథర్వణ వేదం వలన తెలుస్తున్నది.[3] గణ సమాజ జీవనానికి భంగకరమైన పరిస్థితులను ఏ సభ్యుడైన కలగజేస్తే బహిరంగంగా మందలించడం ద్వారా అవి సరిదిద్దబడేవి. గణములోని సభ్యుడు తనతోటి సభ్యుణ్ణి చంపడం లాంటి పెద్దనేరం చేసినప్పుడు అతనిని గణంలో నుండి వెళ్ళగొట్టేవారు. నాటి ఆటవిక జీవితంలో గణావరణానికి ఆవలి భూభాగం ప్రమాదకరమైన అడవులతో, విష కీటకాలతో, క్రూరమైన జంతువులతో కూడి ఉండేది. అట్టి పరిస్థితులలో గణ సమాజం నుండి ఒక సభ్యుణ్ణి బహిష్కరించడం అంటే అతనిని సరాసరి మృత్యువు నోటికి అందించడమే అవుతుంది అది ఆది గణ సమాజాలనాటి కఠినాతి కఠినమైన శిక్షన్నమాట. ఈ గణ సమాజం సమిష్టి ఆస్తిపైన, సమిష్టి శ్రమపైన ఆధారపడియున్న సాముదాయిక ఆత్మ ప్రవర్తకమైన సాయుధ ప్రజావ్యవస్థ.

పై గణ సమాజంలో గణాభివృద్ధి కొరకు స్త్రీ, పురుషుల సంబంధాలు ప్రకృతి నైజమై సామాజిక సంబంధాలు గాను కూడ ఉండేవి. సంపదను ఉత్పత్తి చేయడంలో సామాజిక సంబంధాలు పరిణామము చెందుతున్నట్లుగానే సంతానాభివృద్ధి కొరకేర్పడిన 'కామ' సంబంధాలు కూడ సంకల్ప, సంస్పర్శ, మైథున, ద్వంద్వ అను నాలుగు విధాలుగా కృత, త్రేత, ద్వాపర మరియు కలియుగాలకు వరుసగా పరిణామం చెందాయని మహాభారతంలో కురువంశ పితామహుడైన భీష్ముడు పేర్కొన్నాడు.[4]

సంకల్ప సంబంధాలంటె ఒకే రక్తసంబంధీకులతో కూడిన గణ—సమాజంలో[5] స్త్రీ ఏ పురుషునితోనైన, పురుషుడు ఏ స్త్రీతోనైనా వారి వారి సంకల్పాన్ని [యిష్టాన్ని]బట్టి సంభోగించవచ్చును. సామాజికంగా గానీ, వ్యక్తినిబట్టి గాని, అడ్డంకు లేవి ఉండవు. ఉదా:— నిశాతల్లి గణం, నిశాగణం[6] సంకల్ప పద్ధతి నుంచి మాతృ స్వామికము వచ్చినదని, అదే ప్రతి సమాజ సమూహానికి మూలం అని మోర్గన్ భావించాడు.[7]

సంస్పర్శ వివాహ పద్ధతిలో సగోత్ర వివాహాలు [ఒకే రక్త సంబంధాలలో ఏర్పడే స్త్రీ, పురుష కామ సంబంధాలు] నిషేధింపబడి, అన్యగోత్రీకులతో ముఠా ఉమ్మడి పద్ధతిమీద [ఒక గోత్రానికి మరో గోత్రానికి మధ్య సాముదాయిక పద్ధతిలో]— అనగా ఒకే రక్త సంబంధీక గణం మరో రక్త సంబంధీక గణంతో —ముఠా ఉమ్మడి పద్ధతిలో వివాహాలు ఏర్పడటం జరిగింది.[8] ఈ విధానంలో అక్కచెల్లెండ్రు ఒకే పురుషునికి సంకల్పంగా భార్యలయ్యేవారు. ఐతే ఈ భర్త — భార్యలు ఒకే కడుపున పుట్టినవారు కారు. వీరికి కలిగిన సంతానం ఆ గణ—గోత్రానికి వారసులైనారు. అక్కచెల్లెండ్రతో బుట్టిన అన్నదమ్ములు ఆ గణ— గోత్రాలను విడిచి తనకు భార్యలు దొరికే గణ—గోత్రాలకు పోవలసి వచ్చేది. అంటే స్త్రీలతో గణ — గోత్రాలు స్థాపించబడినాయి.

మిథునం అనగా జంట కుటుంబం. తమ కిష్టమైనంత కాలం కలిసి యుండుట. హిడింబి—భీముడు, అర్జునుడు—చిత్రాంగద, మేనకా—విశ్వామిత్రుల వివాహాలు ఈ పద్ధతికి చెందినవే.[9] ప్రకృతి సహజమైన వివాహాలలో యిది చిట్టచివరి దశ. ఈ దశలో ముఠా ఉమ్మడి వివాహ పద్ధతి నశిస్తూ మాతృస్వామిక సమాజం రూపుమాపబడి పితృస్వామిక సమాజానికి పునాదులు ఏర్పడ్డాయి. పైన వివరించిన దశలో మత్స్యన్యాయం ఉండేది కాదు.

నాల్గవ దశ [ద్వందం] లో ఏకపత్నీత్వం ఏర్పడుతుంది అంటే భార్య లేదా భార్యలు ఒకే భర్తను కల్గియుండుట. దశరథ మహారాజు, పాండురాజు, శ్రీకృష్ణుడు మొదలగువారు యిట్టి భర్తలే. దీనితో మాతృస్వామిక సమాజం అదృశ్యమై పితృస్వామిక సమాజం ఏర్పడిందన్నమాట. పితృస్వామిక సమాజంలో స్త్రీ ఆర్థిక, సాంఘిక విషయాలలో సమానమైన హక్కులు కోల్పోయి భర్త అదుపు ఆజ్ఞలో ఉండేది. ఈ దశలో మూడు ఉపదశలు ఉన్నట్లుగా కనబడుతుంది. ఈ మూడు ఉపదశలకు వరుసగా మూడు ఉదాహరణలు పేర్కొనవచ్చును. ఈ ఉదాహరణలను పరిశీలించినచో పురుషాధిక్యత ఏవిధముగా ఏర్పడింది అనేది మనకు స్పష్టంగా అవగతమౌతుంది. (1) ఓఘావతి—సుదర్శనుడు, (2) గౌతమీ—గౌతముడు (3) రేణుకా—జమదగ్ని వృత్తాంతాలు.

మొదటి వృత్తాంతం : ఒకనాడు సుదర్శన మహాముని తన భార్య ఓఘావతిని ఆశ్రమంలో విడిచి కార్యార్థమై బయటకు వెళ్ళినాడు. అప్పుడు ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు అతనికి ఆతిథ్య నియమాల ప్రకారం భోజనాదికములతో తృప్తి పర్చడమే కాక, గణ—గోత్రాచారాన్ని అనుసరించి అతిథి కోరగా ఆమె అతనితో సంభోగించింది.[10] సుదర్శనుడు తిరిగివచ్చి జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొని తన భార్య గృహస్థ ధర్మాలను చక్కగా నిర్వర్తించినందుకు ఆనందభరితుడైనాడు.

రెండవ వృత్తాంతం : గౌతముడింట లేనప్పుడు ఇంద్రుడు అతిథిగా వచ్చి గౌతముని భార్యతో గృహస్థ ధర్మ ప్రకారం సంభోగించాడు. గౌతముడికి కోపమువచ్చి కొడుకు 'చిరకారిని'ని పిలిచి తల్లి తల నరకమని ఆజ్ఞాపించి వెళ్ళిపోతాడు. పూర్వాచార నీతి, ధర్మంచూస్తే తల్లిది తప్పుకాదు. 'చిరకారి'ఆమె కొడుకు. తల్లిని చంపడం కొడుకుకు మహాపాపం. కాని కాలంమారి కొత్త వర్గ సంబంధాలు, కుటుంబ నియమాలు, వర్గ శాసనాలు వచ్చినవి. కొత్త సంబంధాల ప్రకారం కొడుకు తల్లికి బదులు, తండ్రికి విధేయుడై నడచుకోవాలి.[11] గౌతముడు తిరిగి వచ్చేసరికి కోపము చల్లారిపోయింది. 'చిరకారి' తల్లిని చంపకుండ ఉండటానికి గౌతముడు ఒప్పుకుంటాడు. అంటే కొత్తగా ఏర్పడిన వర్గ సంబంధాలు ఇంక సర్వాధికారంతో పాదుకొనలేదు. కాబట్టి తల్లి — కొడుకులు నెగ్గుతారు.

మూడవ వృత్తాంతం : జమదగ్ని భార్య రేణుక, చిత్రరథుడనే గంధర్వుని వైపు ప్రేమ పూర్వకముగా చూచింది. దీనిని గ్రహించిన జమదగ్ని మొదటి ముగ్గురి కొడుకులను తల్లిని చంపమని ఆజ్ఞాపించుతాడు. కానివారు పూర్వాచారాన్ని దృష్టిలో పెట్టుకొని వూగిసలాటలో పడుతారు. విషయాన్ని గ్రహించిన జమదగ్ని ఈ ముగ్గురిని శపించి చంపుతాడు. చివరకి నాల్గవ కుమారుడైన పరుశురామునితో తల్లిని చంపమనగా అతను వెంటనే తల్లి తల నరికి వేస్తాడు ఈదశలో భార్య ప్రాణాలపైన పురుషుడికి సంపూర్ణమైన హక్కు స్థిరపడింది. ఈ కథను కుణ్ణంగా పరిశీలిస్తే యిప్పటి స్త్రీ స్థితి, గణ సమాజములోని స్త్రీ స్థానానికి పూర్తి విరుద్ధంగా కన్పిస్తుంది. ఈ విధానంలో పురుషుడు ప్రయివేటు [వ్యక్తిగత] ఆస్తికి సర్వాధికారియై ఉంటాడు. పితృస్వామిక సమాజంలో ఫలాన తండ్రికి పుట్టారు అని చెప్పదగిన సంతానాన్ని కనడమే ఈ దశలోని ప్రముఖ లక్షణము. అలా పుట్టిన సంతానం, తండ్రి వ్యక్తిగత ఆస్తికి వారసులౌతారు.

మొదట ఒకేరక్త సంబంధీకుల మధ్య, తర్వాత అన్య గణ—గోత్రాలమధ్య, చివరకు కేవలము వివాహాలద్వారా బంధుత్వమేర్పడ్డ వారిమధ్య వివాహ సంబంధాలు వరుసగా తెగిపోవడంవల్ల సాముదాయిక వివాహాలన్నీ రూపుమాపబడి, చివరకు ఒక భార్య—ఒకభర్తల కుటుంబము రూపుదాల్చింది.

ఈ పరిణామాని కంతటికి వెనుకనున్న కొత్త ఉత్పత్తి శక్తుల, కొత్తఆస్తిసంబంధాల, కొత్తసామాజిక శక్తులలో ఏర్పడిన మార్పులే కారణాలు. వ్యక్తిగత ఆస్తి, గణసమాజాన్ని విచ్ఛిన్నంచేసి, ఏకపత్ని కుటుంబము రూపం దాల్చటానికి దోహదంచేసింది. ఆస్తి, వారసత్వము మొదలగు లక్షణాలుగల ఏకపత్ని కుటుంబం, గణ సమాజానికి వ్యతిరేకమైనది. గణసమిష్టి జీవిత హక్కులకు వ్యతిరేకంగా వచ్చిన వ్యక్తిగతఆస్తి హక్కులను రక్షించడానికి గృహ్యసూత్రాలు సృష్టించబడినవి.[12]

పూర్వ గణ సమాజపు రోజులలో తమ పశువుల, ప్రజల రక్షణకొరకు పోరాడారు.[13] అప్పుడు వ్యవసాయము, భూమి, జీవన భృతికి రెండవ సాధనంగా ఉండేది. కాని జనాభా పెరుగుదలవలన సామాజిక ఉత్పత్తి పరిణామములవలన పశువులమీదనే బ్రతుకడం

కష్టమైపోయినందున, భూమి, వ్యవసాయానికి ప్రాముఖ్యత వచ్చింది. కాబట్టి భూమిని సాగులోనికి తీసుకరావడం అవసరమైంది. కంచు పనిముట్లతో అడవులను నరకడం సాధ్యం కానిపని. కాబట్టి యినుమును కరగడం కనిపెట్టి, శూద్ర బానిసల సహాయంతో, వైశ్య వ్యవసాయదారులు అడవులను నరికించి భూమిని సాగులోనికి తెచ్చారు కొత్త ఉత్పత్తి శక్తులలో భూమి ప్రధానమైన వృత్తి సాధనమైంది.

సామాజికావసరం అనేది ఉత్పత్తి శక్తుల అభివృద్ధికీ, ఈ అభివృద్ధి శ్రమవిభజనకూ దారితీసింది. వర్ణవ్యవస్థ పుట్టుకకు ఈ శ్రమ విభజనయే కారణమైనట్లు భారతం పేర్కొంటున్నది.[14] సమాజ పరిణామక్రమ విధానంలో గణసంఘము విస్తరించటమువలన సమాజ సమిష్ఠి విధానానికి వ్యతిరేకంగా వచ్చిన శ్రమ విభజన విధానంలో సమాజ ప్రజలు స్వేచ్ఛాయుత గణ సమాజ విధానాన్ని త్రోసివేయలేకా, ఉత్పత్తి శక్తులలో వచ్చిన మార్పుతో కలిసిపోలేని స్థితిలో ఆత్మ ప్రవర్తకమైన ప్రజావ్యవస్థ, వైరాజ్యం[15] నశిస్తున్న స్థితిలో ఒక విలక్షణమైన సమాజ నిర్మాణం జరిగిన విషయాన్ని గమనించవచ్చు.[16] దాన్ని పురుషసూక్తకారుడు యిలా చెప్పాడు—యింతవరకు మూడు వర్ణాలే వుండేవి. పోరాటానుక్రమములో భూభాగాలను ఆక్రమించి, పోరాటములో ఓడిపోయినవారిని బంధించి తెచ్చి నాల్గవ వర్ణముగా[17] గుర్తించి వారిపై త్రివర్ణ ధనికులు అధికారం చెలాయించే రాజ్యాంగ యంత్రాన్ని సృష్టించడానికి ప్రథమ ప్రయత్నాలు జరిగినవి. వీరే విరాట్టులైనారు. అంటే దీనితో వైరాజ్యం, గణప్రజాస్వామికమూ అంతరించి ప్రభువర్గ పరిపాలన మొదలైంది. దీనికి సమకాలికమైన పశ్చిమ భారత దేశంలో స్వరాజ్య గణముండేది. గణం పనిచేయడానికి వీలులేనంత పెద్దదిగా పెరిగిపోవడంవలన సభయొక్క సమిష్ఠి కార్యకలాపాలను నడిపించుటకు కౌన్సిల్‌ను ఎన్నుకునేవారు. యిందునుండి వ్యవహారములను నడిపించుటకై ఎన్నుకోబడిన వ్యక్తి స్వరాజ్య గణ సభ్యులతో సమాన హోదాలోనే ఉండేవాడు.[18] ఈ నాయకత్వాన్ని ఎన్నుకునే వారి [కౌన్సిల్ ఓటర్లు]తో నిమిత్తం లేకుండానే అతనికి స్వతంత్రించి పనిచేసే హక్కు ఉన్నది. ఈ వ్యవహారకర్త సమాజ ఉత్పత్తి పరిణామక్రమములో పెరిగి అందరికి రాజౌతాడు.[19]

గణ సమాజములోని ప్రజలు స్వయం ప్రవర్తకమై ధర్మార్థ కామాలతో పరస్పరము రక్షించుకుంటూ జీవనం గడిపేవారు. అప్పుడు రాజు ఉండేవాడుకాదు. అలాంటి అవసరము కూడ లేకపోయింది. నూతన సమాజ పరిణామక్రమములోని కొత్త ఆర్థిక, కుటుంబ సంబంధాలను దండం[20] ద్వారా నిలబెట్టవలసి వచ్చింది. అంటె ధర్మార్థకామాలనే నైజగుణాలు దండనీతి సహాయములేకుండ వాటంతట అవి పనిచేసే స్థితి నశించింది.[21] భారతదేశంలో ఈ మొదటి పరిపాలన చట్టాన్ని 'విశాలాక్ష' అని పిలిచేవారు.[22] బాహుదండకుడు, బృహస్పతి, కలి, చేతులలో 'విశాలాక్ష' రాజ్యాంగం అనేక మార్పులను పొందింది.

ఈ రాజ్యాంగ యంత్రము సృష్టికర్తయొక్క ఆశీర్వచనాన్ని పొందినదైనప్పటికీ యింకా సిలకడ కుదురలేదు. ఐదారుగురు రాజులు పాలించారో లేదో వెంటనే కొత్త సంఘర్షణలు ప్రారంభమయ్యాయి. విశ్వప్రజాతంత్ర పక్షపాతుడుగా మారిన ఒకరాజు బ్రాహ్మణ, క్షత్రియులకు వ్యతిరేకంగా పోరాటాన్ని నడిపాడు. ఇతడే వేనరాజు. ఈ పోరాటంలో 'వేను'డికి సలహా సంపత్తి నిచ్చినది అతని భార్య 'సునీత'. మాతృస్వామికము, స్త్రీ ప్రజాతంత్రము అణగద్రొక్కబడటంవల్ల 'సునీత' క్రోధపూరితయై యుంటుంది. కాని సునీతా—వేనులెంత గొప్పవాళ్ళయినప్పటికి నూతనయుగంలోకి వచ్చిన సామాజిక శక్తులను, ఆదిమ గణ సమాజ యుగంలోకి వెనుకంజ వేయించలేరు. ఎందుకంటే ఆ యుగం శాశ్వతంగా గతించింది. పోరాట ఫలితంగా వేనుడు ఓడిపోయినాడు. ఓడిపోవడం కాదు బ్రాహ్మణులతనిని హత్యచేశారు. వేనుడికి సహాయంగ బయటినుంచివచ్చిన గణాలు, తెగలు కూడ అణచివేయబడ్డాయి. అతని మరణానంతరము అతని కొడుకైన పృథువైనుడు బ్రాహ్మణులకు లొంగిపోవుట వలన అతనిని రాజుగా పట్టాభిషేకం చేశారు. ఫలితం, వారి [బ్రాహ్మణుల] ఆజ్ఞప్రకారం పాలక వర్గాలను, రాజ్యాంగ [దండనీతి] శాసనానికి అతీతులను చేశాడు.[23] వర్ణవిభేదాలకు అంతరాయము కలగనీయనని వాగ్దానంచేశాడు. ఆనాటినుండి దౌర్జన్య ప్రయోగం–దండం, ప్రపంచాన్ని శాసిస్తూ వచ్చిందని హిందురాజనీతి చెప్పుచున్నది.

వర్ణ విభేదాలు శ్రమవిభజనలేని పూర్వ గణ సమాజాలలో చట్టాలు [దండం] దానికి సంబంధించిన శాస్త్రాలకు గాని స్థానం లేదు[24] పరస్పరం పొత్తుకుదరని వైరుధ్యాలమధ్య ఘర్షణవలన రాజు, రాజ్యం, రాజ్యాంగ యంత్రము ఏర్పడినవి. ఈ రాజ్యాంగ యంత్రము ఆర్థిక ప్రాబల్యముగల వర్గానికి చెందినది. అంటె బ్రాహ్మణ, క్షత్రియులకు చెందినది.[25] నాటినుండి విశ్వప్రజాతంత్రాన్ని అణగద్రొక్కి, వైశ్యప్రజను, శూద్రులను పాలకవర్గాలు అణచిపెట్టి తమ ఆజ్ఞలకు భగవదాజ్ఞలనే పేరుపెట్టి ఓడిపోయిన ప్రజలపైన రుద్దారు. దీనితో రాజ్యాలకు నిశ్చితమైన ఎల్లలేర్పడినవి. ఈ ఎల్లల లోపల ఆర్యులతోపాటు ఓడిపోయిన అనార్యులు, నిషాదులు, సూతమాగధులు మొదలైనవారంతా నివసించేవారు.[26] ఇకనుండి జీవిత యాత్రకంతటికీ వెనుక దండముయొక్క భయమే కీలకంగా వుంటుంది.

ఈ కీలకమైన దండాన్ని [స్థాయిసైన్యం, చతురంగసేనలు, రాజపురుషులు, బ్రాహ్మణులు, జైళ్ళు మరియు కోర్టులు] ప్రయోగించువాడే రాజు. ఆ ప్రయోగించడమనునదే దండనీతి. వీటిని అట్టిపెట్టాలంటె రాజ్యంలోని ప్రజలనుండి పన్నులను వసూలు చేయాలని భారతం పేర్కొన్నది.[27]

మనుష్యుల జీవితమునకు మూలం అర్థము; లేదా మనుష్యులతో కూడిన భూమియే అర్థము.[28] సమస్తమునకు మూలమైన భూమి, దానిని సాగుచేసే ప్రజలు, దానిపై పన్నులు, దానిని ఆవరించియున్న తరు, జల, ఖనిజాది సమస్త సంపదలను కలిగియు

చిన్న చిన్న భూమండల రాజ్యాలు [రాజ్యాలు, వైరాజ్యాలు, గణ రాజ్యాలు] ఉన్న సమయమందు, కౌటిల్యుడు సృష్టించిన మండల యోని సిద్ధాంత[29] ప్రకారము దండాన్ని కీలకంగా నడిపించు రాజు [విజిగీషు[30]] షాడ్గుణ్యముల[31] సాధనతో ఆర్థిక ప్రయోజనాలకై సముద్ర పర్యంతమువరకు భూమండలాలను విస్తరింపచేయుట — సామ్రాజ్య స్థాపనకు[32] బీజమైంది. ఈ చారిత్రిక పరిణామదశలో చక్రవర్తి వ్యవస్థ ఆవిర్భవించింది. భారతదేశంలో క్రీ. పూ. 4, 1వ శతాబ్దాలలో ఏర్పడిన మౌర్య, శాతవాహన సామ్రాజ్యాలు మరియు క్రీ. శ. 4, 7వ శతాబ్దాలలో ఆవిర్భవించిన గుప్త, హర్ష సామ్రాజ్యాలు యిట్టివే.

NOTES

1 త్వామ్ అగ్నే అంగిరసో గుహాహితమ్ అన్వవిన్దన్ శ్రిశ్రియాణం వనే వనే సజాయసే మథమానః సహో మహత్త్వా మాహుః॥

ఋగ్వేదం 5–2–8, 10–36–6, 5–11–6.

వేదిక్ హిమ్స్ :Vol XLVI; సంపాదకుడు మాక్స్ ముల్లర్, మోతీలాల్ బనారసీదాస్, ఢిల్లీ 1964 పు. 391.

విత్ ది కామెంటరీ ఆఫ్ సాయన, 5 సంపుటాలు, వైదిక సంశోధన్ మండల్, పూనా, 1933–51.

2 త్రేతాయుగే విధిస్త్వేష యజ్ఞానామ్ న కృతయుగే–

మహాఋషి శ్రీకృష్ణద్వైపాయన ప్రణీతం; మహాభారత మూలమాత్రం; శాంతిపర్వం; గీతాప్రెస్ గోరఖ్‌పూర్ విక్రమశకం 2014; 237–101. పు. 483.

3 జ్యాయస్వన్తశ్చిత్తినో మావియౌష్ట సంరాధయన్తః సధురాశ్చరన్తః।

అన్యో అన్యస్మై వల్గు వదన్త ఏవ సధ్రీచీనాన్వః సంమనసస్కృణోమి।

సమానీ ప్రపా సహవోఽన్నభాగః సమానేయోక్త్రే సహవో యునజ్మి॥

అథర్వణవేదం 3–30–5–6;

హిమ్స్ ఆఫ్ ది అథర్వవేద; Vol XLII సం. మాక్స్ ముల్లర్; మో. బ. 1964; పు. 134, సీ ది కామెంటరీ ఆఫ్ 3–30–5–6 పు. 361–362.

4 కృతయుగే నచైషాం మైథునో ధర్మోబభూవ భరతర్షభ॥
సంకల్పాదేవ చైతేషాం గర్భః సముత్పద్యతే॥ 207–38
తత్రస్త్రేతాయుగే కాలే సంస్పర్శాజ్జాయతే ప్రజా
నహ్యభూన్మైథునో ధర్మస్తేషామపి జనాధిప॥207–39
ద్వాపరే మైథునో ధర్మః ప్రజానామభవన్నృప
తథా కలియుగే రాజన్ ద్వంద్వమాపేదిరేజనాః॥ 207–40
మహాఋషి శ్రీకృష్ణద్వైపాయన ప్రణీతం
OPCit; P. 542

5 జాత్యా చ సదృశాస్సర్వే కులేన సదృశాస్తథా॥
అంతే; 107–31

6 రాహుల్ సాంకృత్యాయన్; వోల్గానుంచి గంగాతీరము; అనువాదం స్వర్గీయ అల్లూరి సత్యనారాయణరాజు; అనుపమ ప్రచురణలు, హైదరాబాదు 1978; PP 11–13

ప్రజాపతిర్వై స్వాం దుహితరమభ్యాధ్యాయత్॥
ఐతరేయ బ్రాహ్మణం 5–33, 5–32 అనువాదం ఎ.బి. కెయిత్,HOS XXV; హార్వర్డ్ యూనివర్సిటీ 1920.

7 లూయిస్ మార్గన్; ఏన్షన్ట్ సొసయిటీ, న్యూయార్క్ 1907.

8 ప్రజారణిస్తు పత్నీతే కులశీల సమన్వితా।
సదృశీ మమ గోత్రేణా వహామ్యేనాం క్షమస్వమే।
మహాఋషి శ్రీకృష్ణద్వైపాయన ప్రణీతం;
ఇంతకి ముందుదే

9 ప్రజా విశుధ్యర్థమ్ స్త్రియమ్ రక్షేత్ ప్రయత్నతః।
మనుస్మృతి 13–9–9 ఉదాహరణ; ఎస్. ఎ. డాంగె; ఇండియా : ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజమ్ టు స్లేవరీ : పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ 1979, పు. 80.

10 వథి చారాత్ ఋతౌ శుద్ధిః
గర్భేత్యా గోవిధేయతే॥
యాజ్ఞవల్క్య 1–72; ఎస్. ఎ. డాంగె; ఇం. ముం, పు. 81

11 పితురాజ్ఞా పరోధర్మ స్వధర్మో మాతృరక్షణమ్।
అస్వతంత్రం చ పుత్రత్వం కిం తు మాం నా నుపద్యత్॥
స్త్రీయ హత్వా మాతరం న కోహి నాతు సుఖీ భవేత్।
పితరం చాప్య వజ్ఞాయకః ప్రతిష్ఠామవాప్నుయాత్॥
మహాఋషి శ్రీకృష్ణద్వైపాయన ప్రణీతం;
ఇం. ముం. పు. 12.

12 త్రేతాయాం సంహతా వేదా యజ్ఞా వర్ణాస్తథైవచ।
సంరోధాదాయుషస్త్వేతే వ్యస్యంతే ద్వాపరే యుగే॥
238–14
ద్వాపరే విప్లవం యాంతి యజ్ఞాః కలియుగే తథా॥
238–11
అంతే, పు. 583

13 రాహుల్ సాంకృత్యాయన్ ఇం. ముం., పు. 42–47

14 చాతుర్వర్ణ్యస్య వర్ణేన, యదివర్ణో విభజ్యతే।
సర్వేషాం ఖలు వర్ణానాం దృశ్యతే వర్ణసంకరః॥
కామః క్రోధో భయం లోభః శోకశ్చింతా క్షుధా శ్రమః॥
సర్వేషాం నః ప్రభవతీ కస్మాద్వర్ణో విభజ్యతే॥
తనుః క్షరతి సర్వేషాం కస్మాద్వర్ణో విభజ్యతే॥
భృగురువాచః... నవిశేషోస్తి వర్ణానాం సర్వం బ్రాహ్మమిదం జగత్।

బ్రాహ్మణాః పూర్వస్పష్టాహి కర్మభిర్వర్ణ
నాంగతాః॥
మహాఋషి శ్రీకృష్ణద్వైపాయన ప్రణీతం; ఇం. ము. 186-6, 186-7, 186 8, 186-10; పుట 522.
చాతుర్వర్ణ్యం మయాసృష్ణ్వ గుణకర్మ విభాగశః॥
మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారిచే విరచితము; శ్రీమద్భగవద్గీతం; శ్రీవ్యాసాశ్రమము, ఏర్పేడు, చిత్తూరుజిల్లా 1968; 4—13; పు 120

15 రాజ్యాంగయంత్రము, రాజరికము ఉండవు, కాని పిత్రుసామికము ఉంగను.

16 కేపిటల్ సంపుటం 1; సంపాదకుడు డోనాటార్; ఎల్లెన్; అన్విన్ ప్రచురణ పు 345.

17 శూద్రులు

18 రాహుల్ సాంకృత్యాయన్; వోల్గానుండి గంగాతీరం; ఇం. ము., పు. 68.

19 ఏతస్యాం ప్రతీచ్యాం దిశి యేకేచ నీచ్యానాం రాజనో
యేఽపాచ్యానాం స్వారాజ్యాయై వతేఽమిషిచ్యన్తే స్వరాడ్
ఇత్యేనాన్ అభిషిక్తాన్ ఆచక్షత॥
ఐతరేయ బ్రాహ్మణం 8—4; ఎస్ ఎ.డాంగె. ఇం.ముం. పు. 140.
య ఏవ విద్వాన్ వాజపేయేన యజతి! గచ్ఛతి స్వారాజ్యమ్।
అగ్రం సమా నానాంపర్యేతి! తిష్ఠన్తేఽస్మై జ్యేష్ఠ్యా
యాయ॥
తై. బ్రా 1—3—2—2; ఎస్. ఎ. డాంగె: ఇం. ముం. పు. 140.

20 దండం అనగా అధికార చిహ్నము. దాని ప్రయోగమే దండనీతి. దండం యిదివరకు లభించని దానిని లభింపచేయును. లభించిన దానిని పరిరక్షించును. పరిరక్షింపబడిన దానిని వృద్ధిచేయును. లోకయాత్ర అంతయు దానిపైన ఆధారపడియుండును. అర్థశాస్త్రం, అనువాదం మామిడిపూడి వెంకటరంగయ్య; మామిడిపూడి వెంకటరంగయ్య, నెహ్రూ నగర్, సికింద్రాబాదు, ఆం. ప్ర 1968. పు. 10.

21 వోల్గానుండి గంగాతీరము ఇం. ము., పు. 111.

22 తతోధ్యాయ సహస్రాణాం శతచక్రే స్వబుద్ధిజమ్
యత్ర ధర్మస్తథైవార్థః కామశ్చైవానువర్ణితః॥
59—29.
త్రివర్గ యితి విఖ్యాతో గణయేష్య స్వయంభువా
59—30
త్రివర్గశ్చైవదణ్ణజం 59—31.
మహాభారతం మూలమాత్రం; ఇం. ముం., పు 381.

23 అదండయా ద్విజాశ్చేతిభి ప్రతిజానీష్వ చాభిభో!
లోకం చ సంకరాత్ కృత్స్నంత్రాతాస్మేతి పరంతప॥
59—108
అంతే; పు. 383

24 యత్రతు ప్రేతి ఉపలబ్ధితః ప్రవృత్తిః న తత్ర శాస్త్రం అస్తి!
ఆపస్తంబ సూత్రాలు 4—12—11; విత్ ది కామెంటరీ ఆఫ్ రుద్రదత్త; సంపాదకుడు రిఛర్డ్ గార్బె, 3 సం. కలకత్తా, 1882—1902. అనువాదం డబుల్యు కాలాండ్ 3 సం, గోట్టింగెన్ — లెయిప్జిగ్ — ఆమ్స్టర్డామ్ 1921–28.

25 మహాభారతం మూలమాత్రం; ఇం. ముం. 88—29; పు. 416

26 తస్మాన్ని షాదాస్సంభూతాః క్రూరాశ్చైలవనాశ్రయాః!
యే చాన్యే విన్ధ్య నిలయాః మ్లేచ్ఛాః శతసహస్రశః॥
1061
ప్రీతోరాజాదదౌ ...
అనూపదేశం సూతాయ మగధం మాగధాయ చ॥ 58-122
అంతే; పు 383

27 యథా శల్యక వానాఖుః పదం ధూనయతే సదా!
అతీక్ష్ణే నాభ్యుపాయేన తథా రాష్ట్రం సమాపిబేత్॥
అంతే; 88—6; పు 415
వోల్గానుంచి గంగాతీరము; ఇం. ముం. పు. 111-113

28 అర్థశాస్త్రం; మామిడిపూడి వెంకటరంగయ్య; ఇం. ముం. పు. 600

29 అంతే; పు. 367. మండలయోని అనగా మూలం లేక ఆధారము. మండలయోని అనగా షాడ్గుణ్యమునకు మూలాధారముగు రాజమండలము.

30 ఆత్మ గుణ సంపన్నుడును ప్రకృతి గుణసంపన్నుడును అగు రాజునయము నధిష్టించి విజిగీషువని చెప్పదగియున్నాడు. అంతే; పు. 364.

31 షాడ్గుణ్యమనగా ఆరుగుణములని అర్థము (1) సంధి (2) విగ్రహము (విరోధం) (3) ఆసనము (ఉపేక్షణము) (4) యానము (శక్తులను వృద్ధిచేసుకొని శత్రువులపైకి వెళ్ళుట) (5) సంశ్రయం (పరార్పణము) (6) ద్వైధీభావము (ఒకనితో సంధి మరియొకనితో యుద్ధము) అంతే; పు. 36౮.

32 కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి; శ్రీ సూర్యయాంధ్ర నిఘంటువు; తృతీయ సంపుటము చ. తృ—కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారిచే ప్రకటింపబడినది; కాకినాడ ముద్రాక్షరశాల 1942. పు. 24.

నీకు విముక్తి ఎప్పుడు? ఓ హాలికుడా!

శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి

నేను వర్షాకాల ఆరంభ దినాలలో
మా పొలంలో నాగలి దున్నుతుండగా
ఒక కంకాళం వెలువడింది.
నన్ను ప్రేమతో అది కుశల ప్రశ్నలువేస్తూ
"మిత్రమా! ఎన్నోవేల సంవత్సరాలనుండి
నీకొఱకే వేచి చూస్తున్నాను.
కష్టాలలో నున్న నిన్ను పరామర్శిస్తున్నాను.
ఇదే భూమిని ఇంతకుముందు
మా ముత్తాత, మా తాత, మా నాయన, మేమన్నదమ్ములము సాగు చేశాము.
అందరము అన్ని రోజులు ఎండమావుల్లోనే బసచేసి కన్ను మూశాము.
నా కొడుకు, నా మనుమడు, నా మునిమనుమడు ఈ భూమినే దున్నారు.
నాకన్నా ఎనుబది యయిదు తరాల తర్వాతి వాడివి నీవు.
అదే భూమిని మాలాగానే బ్రతుకలేక దున్నుతున్నావు.
మాకు కౌపీనమయినా మిగులలేదు
ఎన్నడు మూడు పూటలు తినలేదు.
మాకాలంలోనే మహాపద్మనందుడు పతనమయ్యాడు
మౌర్య సామ్రాజ్యం స్థాపించబడింది.
మాలో ఎంతో ఉత్సాహం కన్పడింది.
కాని చాణుక్యుని రాజనీతి, అర్థశాస్త్రము
మా బ్రతుకులలో ఏమీ మార్పు తేలేకపోయింది.
ఆతర్వాత మా సంతతివాళ్ళు అదే గాడిలో బ్రతికారు.
తోడర్‌మల్ భూసంస్కరణలు, ఆంగ్లేయుల పాలన
మన పేద రైతులకు కష్టాలుతప్ప ఏమి ఈయలేదు.
మా నాయిన నాకొక దున్నపోతు, ఒక నాగలి
నీవిప్పుడు దున్నుతున్న భూమిని ఇచ్చాడు.
నేను నా కొడుకులకు ఉండడానికొక గుడిసె
ముక్కలుచేసిన ఈ భూమిని, కష్టాలు ఆస్తిగా ఇచ్చాను.
నేను, నా కొడుకులను భూమిని దున్ననీయవద్దనుకున్నాను.
మంచి దుస్తులు, మంచి విద్య, మంచి తిండి ఇవ్వాలనుకున్నాను.
కాని ఏది? నాకు ఎముకలు తప్ప ఏమి మిగులలేదు.
చూస్తూ నా కొడుకులకు కన్నీళ్ళు తప్ప ఏమీఈయలేదు
నా కొడుకులు, వాళ్ళ కొడుకులకు ఈ భూమితోపాటు
దారిద్ర్యాన్ని ఆస్తిగా ఇస్తూనే ఉన్నారు
ఈ దేశంలో భూమిని దున్నితే యేమున్నది ?
కౌపీనాలు, కడగండ్లు తప్ప."
నేను ఇంతలో నా బాధామయ జీవితాన్ని
విన్నవించుకోతలచి నా జన్మకు కారణమయిన ఆకంకాళంతో
"మా తండ్రి నీ సంతతివాడే !
ఆయనకూడ నీలాంటివాడే !
భూమిని నమ్మి భూమిలో కలిశాడు
జీవితమంతా పేదరికంలో మ్రగ్గాడు.
తన చరమదశలో అతి చిన్న ఈ భూమిముక్కను స్వంతంచేసి
నిట్టూర్పులతో క్లిష్టదశలోకూడ అమ్మకోవద్దన్నాడు
తర తరాల ఈ వృత్తిని విడువవద్దన్నాడు.
అప్పుడు ఆకాశంవంక చూశాను.
సూర్యోదయ సమయమది
రక్తరంజిత ఉదయ దిశ భానునకు స్వాగతం చెప్తున్నది.
దుఃఖభాజితపు మానాయన జీవితానికి చరమాంకమది.
మాతాత పోయేటప్పుడు మా నాయనలమధ్య భూమిని చీల్చాడు.
అందులో చిరుగగా, అరుగగా, తరగగా మిగిలిన భూమిలో
మా నాయన మా అన్నదమ్ములమధ్య చీల్చాడు.
ఈ చీలికలోనే నేనిప్పుడు దున్నుతున్నాను.
వేరేదైనా వృత్తి నేర్చుకోవాలనుకుంటున్నాను.
నా కొడుకులను ఈ ఊబిలోనికి దిగనీయవద్దనుకున్నాను.
హాయిగా బ్రతుకాలంటే ఈదేశంలో
భూమిని నమ్ముకొని మాత్రం బ్రతుకవద్దు
భవిష్యత్తుకు భయపడవలిసివస్తుంది.
ఆకాశానికి చేతులెత్తవలిసివస్తుంది.
కుచేలునికి వారసులం కావల్సి వస్తుంది
కళ్ళల్లో నీళ్లు ఎండిపోతాయి" అని అన్నాను.
కంకాళం కఠోర సత్యాన్ని ఉటంకిస్తూ

''ఎందరు రాజులు మారినా
రోలింగ్ ప్లానులు, పంచవర్ష ప్రణాళికలు
పార్టీల ప్రతిజ్ఞలు, మేధావుల అర్థనీతులు
భూమిని దున్నేవాని స్థితిని
చెక్కు చెదరకుండా
మన భారత సంస్కృతికి తార్కాణంగా
క్రొత్త రాతి యుగంలాలోనే
అగర్భ దరిద్ర్యంలో బంధించి వదిలపరిచాయి.
మిమ్మల్ని రక్షించేవాడు సూర్యుడొక్కడే !
శాశ్వతంగా మీ కష్టాలను దూరంచేయగల సమర్థుడతడే !
భూమిని దాని కక్షలోంచి తప్పించి అనంత విశ్వంలోకి
పంపిననాడే
మీకు విముక్తి ! జాలికళ్లే నీ స్థితికి నిష్కృతి.
నీకు చేతనయుంది ఏడవడమే !
అంతకన్నా ఇంకేమి చేయకల్గుతావు.'' అని అన్నా.
పొట్టకోసం మిట్టమధ్యాహ్నమయినా నాగలి విడువకుండా
నోరులేని పశువులను గదమాయిస్తూ
నా మనస్సు వద్దన్నా ! దున్నడానికుపక్రమించాను
తర తరాలనుండి ప్రవహిస్తున్న నాలోని రక్తం
నన్ను పురమాయించింది నా వృత్తి పనికి
నా కన్నీళ్లకే తెలుసు నా సంగతి !

శిలలు

శ్రీ చెన్నాప్రగడ నరసింహారావు

ఎవరన్నారు ఇవి శిలలని !
ఇవి శిలలుకావు నా కలల కన్నీటి అలలు
ఏ కిరాతకుని దౌష్ట్యానికో బలియైన అహల్యలు
అనుక్షణం ఆ శ్రీరాముని పాదస్పర్శకై పరితపిస్తున్న బేలలు

లేక

ఏ భయానక దృశ్యాన్నోచూచి ఘనీభవించిన ఒక మహాత్ముని
గుండెలా !
కావచ్చు అందుకే ఆ కళ్ళనుండి స్రవించే కన్నీటి మడుగులు
అక్కడక్కడా
లబ్ డబ్ లా నాకు వినిపించే ఆ కప్పల బెకబెకలు

లేక

ఏ దూర్వాసుని శాపానికో బలియైన గంధర్వకన్యలా ?
పచ్చని చీరకట్టుకొని ఆకాశంవైపు చూస్తూ తన కన్నీటి
సెలయేళ్ళతో నన్ను పరామర్శిస్తూ
నిశ్శబ్దంగా తన వక్షంపై నిలబడ్డ నన్ను పరికించి
ఇంకా పైకిరమ్మని నిశ్శబ్దంగా పిలుస్తున్నట్లుగా
ఈ గాలి హోరు

అందుకే చివరికి

ఎవరు ఎలా పిలుచుకొన్నా నాకు మటుకు ఇవి
మరపురాని మధుర స్వప్నాలు
ఎంత విషాదాన్ని చిందించినా
కఠినత్వాన్ని, మృదుత్వాన్ని
అనాకారి తనాన్ని అందాన్ని
తగుపాళ్ళలో మేళవించుకొని
నాకై భగవంతుడు చేసిన, చూపిన
ఒక మహత్తర నగ్నసత్యం.

[దర్శి కొండల్ని చూసిన తర్వాత]

డాక్టర్ ఎన్ గోపి

వేమన పద్యాల పరిష్కరణ బ్రౌన్ నేపథ్య కృషి

1. ప్రథమ ముద్రణం

వేమనను గూర్చి మొట్టమొదటిసారి 1824 లో విన్నాడు. విన్నదే తడవుగా వేమననుగూర్చి అక్కడక్కడ విచారించడం ప్రారంభించాడు. ''పట్టు పట్టరాదు పట్టి విడువరాదు'' అనే తత్త్వం గల బ్రౌన్ తలుచుకుంటే కాని కార్యమేముంది గనుక! అభినివేశానికి అధికారం తోడయ్యింది. 1824 లో బ్రౌన్ మచిలీపట్నంలో ఉన్నాడు. వేమన పద్య యాగానికి నాంది అక్కడే జరిగింది. వేమన పద్యాల తాళపత్ర ప్రతులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి చేతిలో వాలాయి. మచిలీపట్నం, విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు, కడప, మద్రాసుల నుండి ప్రతులు సంపాదించాడు బ్రౌన్.[1] 1824 నవంబరు నాటికే 15 ప్రతులదాకా సంపాదించ గలిగాడని "An index to the verses of Vemana ... ..., Musulipatnam Nov. 1824"[2] వలన తెలుస్తున్నదంటే బ్రౌన్ కార్యదీక్ష, ఎటువంటిదో అర్థమౌతుంది. ప్రతులనైతే సాధించాడు గాని వాటిలో బ్రౌన్ కొక దుర్గమారణ్యమే ఎదురైంది. లిపిదోషాలు,[3] ఛందోభంగాలు, అర్థాన్వయ కాఠిన్యం మొదలైన వాటితో అంతా చిక్కులమయంగా ఉంది. ఏ రెండు ప్రతులలోని పద్య క్రమాలూ ఒకే రకంగా లేవు. పైగా వాటినిపోల్చి చూస్తే 200 నుండి 800ల వరకు సంఖ్యలో విభేదిస్తున్నాయి.[4] అల్లుకుపోయి ఉన్న ఈ అవ్యవస్థా పరిస్థితిలో ఒక స్పష్టత కొరకు వీటితో బ్రౌన్ పెద్ద యుద్ధమే చేయవలసి వచ్చింది. వెల్లాచెదురై ఒక అరాచక స్థితిలో ఉన్న పద్యాలకు ఒక వ్యవస్థను కల్పించి 'న్యాయమూర్తి'గా వాటికొక ''తీర్పు'' చెప్పవలసి వచ్చింది. 1824 లోనే బ్రౌన్ 15 ప్రతులను సేకరించగలిగాడని చెప్పాను. వీటిలో 9 ప్రతులను మాత్రమే బ్రౌన్ పరిష్కరణకు ఆధారంగా ఎన్నుకున్నాడు.[5] ముందుగా పండితులను నియమించి తన పర్యవేక్షణలో పాఠ భేదాలన్నింటిని సంకలనం చేయించాడు.[6]

(Theming the place each verse occupies in each of nine collected manuscripts copies, compiled under the direction of Charles Philip Brown, Civil [illegible]ice) ఒక్కొక్కదానిలో పద్యం స్థానం వేరు వేరు ప్రతులలో [illegible]దో పద్య సంఖ్యలతో సూచిస్తూ ఒక పట్టిక తయారు చేశాడు.[7] వేమన పద్యాల సంస్కరణ కిది తొలిమెట్టు. దీని ఫలితంగానే 1829లో వేమన పద్యాల మొట్టమొదటి ముద్రణం వెలువడింది మళ్ళీ ఒక దశాబ్దం తరువాత 1839 లో రెండవ ముద్రణం వెలువడింది. అనేక విధాలుగా అత్యంత శ్రేష్ఠమయిన తొలి ముద్రణానికి ఉపయోగపడిన 9 నేపథ్య ప్రతులను గూర్చి ఆరా తీయడం అతికష్టమని అనుభవం చెపుతుంది. బ్రౌన్‌చేత సేకరించబడి ప్రస్తుతం మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో గాని, తిరుపతి రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో గాని భద్రపరచబడిన సామాగ్రిలో ఇవి ఉన్నాయా, లేనట్టయితే, వీటిమధ్య ఉన్న పరస్పర సంబంధ బాంధవ్యాలు ఎటువంటివి అని అన్వేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దారిపొడుగునా లభించే ఇటువంటి చెదురుముదురు వాస్తవాల దారిదత్తం ఉంటేగాని పద్యాల సంస్కరణలో బ్రౌన్ లక్ష్యం మనకు ప్రత్యక్షం కాదు. బ్రౌన్ ఈ 15 ప్రతులకు కొన్ని సంజ్ఞలు తగిలించాడు.[8] వీటిలో కొన్ని కాగితపు ప్రతులు కూడ ఉన్నాయి ఈ సంజ్ఞలు ఏ ప్రతుల పేర్లో, (కొన్నింటిపై[9] ప్రస్తుతం ఆ గుర్తులు లేకున్నా) మనకు లభిస్తున్న సామగ్రిలో నుండి, కనిపెట్టి వెలికితీయడంలో కొంతవరకు సఫలమవుతాము. ఇవి కూడ స్థలాంతరాలలో పేర్కొన్న దానినిబట్టి వాటి పేర్లు కనుక్కునే అవకాశం కలిగింది. వాటిలో కొన్నింటిని ఈ క్రింద చూడవచ్చు.

C = D 1728
D = D 1733
Y = D 1771
N = D 1765
F = D 2949
K = D 1741

ఈ సంజ్ఞలను ప్రతులకు పేర్లుగా పెట్టడం కేవలం సౌకర్యం కొరకు అనేకాక వాటికొక అర్థం కూడ ఉందేమో పరిశీలించాలి.

ఉదా :– K=D 1741 ''కోదండ రామయ తెచ్చినది'' కావునా గుర్తు కొరకు 'K' అని పిలిచి ఉండవచ్చు C=కరపప్రతి, Y=''యానాంలో అందిన పుస్తకం.'' అదే విధంగా G గుంటూ

రులో సంపాదించింది కావచ్చు. కాని ఈ మంత్రం అన్నింటికీ పని చెయ్యదు.[10] ఉదా — B='కనకాద్రి' ప్రతి .., D=రంగరాయని తాటి ఆకు ప్రతి, E="రంగరాయనిదే రెండో ప్రతి," F=సూర్యనారాయణ అంపిన ప్రతి" R=' 'ఫా కడప ప్రతి.[11] ఇక ఈ ప్రతులను గురించిన ఇతర వివరాలు కూడ సరిగ్గా తెలియవు. A="వెంకట శివుని ప్రతి"గా దీనిని అభివర్ణించాడు బ్రౌన్.[12] ప్రస్తుతం లభ్యమవుతూ ఉన్న ప్రతులలో ఇది న్నట్టు కానరాదు. దీనిలో 1155 పద్యాలు ఉండేవని తెలుస్తుంది [13] C = ఇది D 1728 నెంబరు గల ప్రతి. దీనికే కడప ప్రతి అని పేరు దీనిలో 878 పద్యాలు ఉన్నాయి. ఇక A, C ప్రతుల ఆధారంగా పరిష్కరించి తయారుచేస్తే ఏర్పడిందే B ప్రతి. అంటే ఒక దానిలో వచ్చిన పద్యాలు రెండవ దానిలో వస్తే వాటిని పరిహరిస్తూ ఏర్పరచిన ప్రతి B. దీనికి 'కనకాద్రి' ప్రతి అని పేరు. దీనిలో 1028 పద్యాలు ఉన్నాయి. వేమన పద్యాల పరిష్కరణకు బ్రౌన్ ఈ ప్రతినే ఆధారంగా ఎన్నుకున్నాడు.[14] ఇక 'Q' అనే ప్రతి D 1724 ప్రతికి మాతృక [15] D ప్రతితో 785 పద్యాలు ఉన్నాయి. ఇది D 1733 నెంబరు ప్రతిగా తేలుతున్నది. ఇంకా F = D 2949గా, Y = 1771గా, N = 1765గా గుర్తింప బడ్డాయి. వీటిలో వరుసగా 997, 152, 309 పద్యాలు ఉన్నాయి. అదే విధంగా Eలో 572, Gలో 875 పద్యాలు ఉన్నాయని తెలుస్తుంది. H అనే మరో ప్రతిని కూడ బ్రౌన్ ఉపయోగించుకున్నాడు గాని అది పోయిందని తెలుస్తుంది.[16] V, Q అనే గ్రంథాల కొరకు కూడ వెతకగా పరిశీలనలో అవి D 1767, D 175[illegible] ప్రతులుగా తేలాయి. బ్రౌన్ మరికొన్ని ఏవో గుర్తులు వ్రాసి పెట్టుకున్నాడు కాని అవి ఇప్పుడు మనకు అర్థం కావు.[17] కారణం అవి తన స్వోపయోగం కొరకు, గుర్తు కోసం వ్రాసుకొని ఉండటమే.

ప్రతులు చేతిలో పడగానే బ్రౌన్ కొక గహనారణ్యం ఎదురైందని మొదటే మనవి చేశాను. దేనినీ వేమన పద్యాల సమగ్ర ప్రతిగా గాని, కవిదేనని విశ్వాసపాత్రమైన ప్రతిగా గాని భావించడానికి వీలులేని సందిగ్ధ పరిస్థితి అది. ఏది ప్రాచీనమో, ఏది అర్వాచీనమో నిర్ణయించలేని నిస్సహాయ స్థితి. దీనికి కారణాలు రెండు. 1. వేమన సాహిత్యం ఒక కథా కావ్యం కాక ముక్తకప్రాయమైన పద్యాలు కావటం. 2. ఒక ప్రత్యేక కవిచేత రచింపబడినప్పటికీ వేమన పద్యాలు జానపద సాహిత్యంలాగ మౌఖిక ప్రచారంతో వ్యాప్తి చెందటం.

వీటిని గూర్చి కొంచెం వివరిస్తాను. వేమన పద్యాల సమగ్రతకు హద్దులు నిర్ణయించడం సులభసాధ్యమైన పని కాదు.[18] గాలి, నీరు, వెలుతురులాగ దేశమంతా నిండి ఉన్న ఈ పద్యాల ప్రారంభాన్ని, అంతాన్ని ముడివేయడానికి లభించే సాధనాలు సంతృప్తి నిచ్చేవి కావు. శిష్ట సాహిత్యపు నిర్బర కావ్య పరిపాకాలనుండి చాలా వరకు వైదొలగి సామాన్య జనాలను సమీపించిన అనేకానేక శతకాలతో కూడ ఈ యిబ్బందిలేదు. శతకాలకున్న నిర్ణీతమైన సంఖ్యా నియమం వేమన పద్యాలకు కనరాదు. శిష్ట సాహిత్యంలోని కావ్యాలను నిర్ణయించడానికి కావ్య పీఠిక, ఇతివృత్తం, రచనా ప్రణాళిక మొదలైనవి ఉపకరిస్తాయి. కాని వేమన పద్యాలు కుదురుగా ఒక చోట కూర్చొని "రాసినవి" కావు. ఊరూరా సంచరిస్తూ నోటికి వచ్చినప్పుడెల్లా చెప్పినవి.

బ్రౌన్ పై సమస్యలను కొంతవరకు గుర్తించకపోలేదు. కాబట్టి వేమన పద్యాల పరిష్కరణలో తన స్వంత అభిరుచుల పైన ఆధారపడకుండా, ఆంధ్ర సాహిత్యంలో అప్పటికి అపూర్వమైన పాశ్చాత్య పద్ధతిలో ఒక శాస్త్రీయ రీతికి శ్రీకారం చుట్టి ఎన్నటికీ ముగియబోని పరిష్కరణ మహాయజ్ఞాన్ని ప్రారంభించాడు.

శ్రమపడి సంపాదించి 16 ప్రతుల్లో తొమ్మిదింటిని మాత్రమే మేలైనవిగా బ్రౌన్ ఎన్నుకున్నాడని చెప్పాను. అవి A, B, C, E, G, H, J, T (?) అనే గుర్తులున్న ప్రతులు. వీటిలో కొన్నింటిలో 500 పద్యాల వరకు ఉన్నవి ఉన్నాయి. ఏ ప్రతిలో కూడ 700 పద్యాలను దాటిన సంఖ్యలేదు. వేరు వేరు ప్రతులలో పద్యాలు బయటిప్రతులలో ఉన్నవీ, లేనివీకూడ పద్యాలు ఉంటాయి. అందుకే ఈ తొమ్మిది ప్రతులను ప్రక్క ప్రక్కన పెట్టుకొని, పునరావృతమయ్యే పద్యాలను పరిహరిస్తూ లెక్కించి 2100పద్యాల దాకా సాధించాడు బ్రౌన్.[19]

బ్రౌన్ 9 గళ్లను నిలువుగాగీసి ఒక్కొక్క గడిలో ఒక్కొక్క ప్రతిలోని పద్యస్థానాన్ని గుర్తిస్తూపోయిన 'నమూనా'ను ఈ కింద చూడవచ్చు.

ఉదా॥ :	?	B	J	E	T	G	H	A	C	(?)[20]

ఈ విధంగా అనవసర పద్యాలను యేరి వేసి మార్గాన్ని సుగమం చేశాడు బ్రౌన్. తర్వాత ఈ 2100 పద్యాలను విషయాన్ని బట్టి తొమ్మిది ప్రకరణాలతో 5 భాగాలుగా విభజించాడు.

1 – 5	=	1100	నీతి
6	=	200	హాస్యము
7	=	200	భక్తి
8	=	300	గూఢార్థతత్త్వము
9	=	300	చిల్లర
వెరశి	=	2100[21]	

పై పద్యాల ఆధారంగా 1829లో బ్రౌన్ ప్రథమ ముద్రణాన్ని వెలువరించాడు.[22] కాని పై ఐదు సంపుటాలలో రెండింటిని (4, 5 ప్రకరణాలు) నిరుపయోగమనీ, 'విద్యార్థులకు' నచ్చక పోవచ్చునని భావించి పరిహరించాడు. అంతే కాకుండా అర్థం సంశయాస్పదంగా ఉన్నవీ, ఎంతకూ అన్వయం కుదరని మొండి పద్యాలను కూడ పరిహరించాడు. కాని కొన్ని మార్మిక (మిస్టిక్) పద్యాలకున్న ప్రాచుర్యాన్ని గుర్తించి తొలగించలేదు. మరింకెన్నింటినో తొలగించి వేయాలనుకున్నాడు కాని ప్రజల నాలుకల మీద వాటికున్న చెలామణి వలన అట్లాగే ఉంచవలసి వచ్చింది. ఈ విధంగా 693 పద్యాలతో బ్రౌన్ ప్రథమ ముద్రణం వెలువడింది.

693 పద్యాలను అనువాద సహితంగా అచ్చు వేయడానికి ఫోర్ట్ సెంట్ జార్జ్ కాలేజి వారికి అర్జీ పెట్టుకున్నాడు బ్రౌన్. 1827 జూలై 23న కాలేజీబోర్డు కార్యదర్శి హెచ్. హర్కనెస్ ఛీఫ్ సెక్రటరీకి సిఫారసు చేశాడు.[23] మొత్తం మీద 1829 లో కాలేజీ బోర్డు వారిచేత మొట్టమొదటిసారి వేమన పద్యాలను ప్రకటింప జేశాడు బ్రౌన్.[24] ఈ ముద్రణం అనేక విధాలుగా విశిష్టమైంది. గ్రంథాంతంలో బ్రౌన్ ఏర్పరచిన గ్లాసోరియల్ ఇండెక్సు (గ్లాస్సోరియల్ ఇండెక్స్) ప్రథమపాద వర్ణక్రమ సూచిక (ఇండెక్స్ ఆఫ్ ఫర్స్ట్ లయిన్స్) అధో భాగాలలో బ్రౌన్ లఘు వ్యాఖ్య, పాఠాంతరాల గుర్తింపు, వీటన్నింటితో వెలువడింది.

(1) ద్వితీయ ముద్రణం

ఇంతచేసినా బ్రౌన్ వేమన పద్యాల సేకరణను ఆపలేదు. 1830 లో మరికొన్ని తాళపత్ర ప్రతులను సేకరించగలిగాడు. పై తొమ్మిది ప్రతులలోలేని కొత్త పద్యాలు వీటిలో కనిపించాయి. కాని వాటిని సులభంగా కనుక్కోవడానికి వీలులేకుండా ఒక క్రమంలో లేకపోవడం వలన బ్రౌన్ ఆ ప్రతులమీద విసుక్కున్నాడు.[25] తరువాత 1834 లో పెనుగొండలో మరొక ప్రతిని సేకరించాడు[26] దాని స్వంతదారుడు దానిని అమ్మడానికి ఇష్టపడలేదు బ్రౌన్ దానిని కాపీ చేయించి తెప్పించాడు. ఈ ప్రతి పేరు 'బెండమూరి లంక ప్రతి.' బ్రౌన్ సేకరించిన తాళపత్ర ప్రతులన్నింటిలోకి ఈ ప్రతి చాలా ప్రాముఖ్యం వహిస్తుంది. డి 1735 నెంబరుగల లిఖిత ప్రతికిది మాతృక. దీనిలో 1116 పద్యాలు ఉన్నాయి. దీనికి అనేకమైన ప్రతులను వ్రాయించాడు బ్రౌన్. (అవి డి 1737, డి 176[illegible], డి 1723, డి 1722, డి 1721) బ్రౌన్ ప్రథమ ముద్రణ నాటికి బ్రౌన్‌కు బెండమూరి లంక ప్రతి తెలియనే తెలియదు. తర్వాత దశలోని వేమన పద్యాల పరిష్కరణలో అతిప్రాధాన్యం వహించిన ఈప్రతియొక్క ప్రమేయం లేకుండానే ఆయన తొలి ముద్రణం వెలువడిందని మనం గుర్తించవలసి ఉంది.

కాలేజి బోర్డువారు బ్రౌన్ తొలి ముద్రణాన్ని 500 కాపీలు ముద్రించారు. బ్రౌన్‌కు 50 కాపీలు ఇవ్వబడ్డాయి. కాని మిగిలిన 450 కాపీలు కాలేజీలోనే అదృశ్యమైపోయాయి. పదేళ్ల తరువాత కాలేజీ లైబ్రరీలో చిత్తు కాగితాలలో తద్గ్రంధ శిథిలాలు దృష్టికి వచ్చాయి. అప్పుడిక, వెంటనే బ్రౌన్ ద్వితీయ ముద్రణానికి సన్నాహాలు ప్రారంభించాడు[27]

1829 గ్రంథం రూపుదిద్దుకోవటానికి నేపథ్యంలో బ్రౌన్ ఒక మహా యజ్ఞమే నిర్వహించాడు. కాని ఇంతటి విర్దుష్టమైన గ్రంథం కూడా బ్రౌన్‌కు ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదు. 9 ప్రతుల ఆధారంగా, మరో 6 ప్రతుల సహాయంతో దాదాపు ఐదేండ్లు (1824–1829) పరిశ్రమించి వెలువరించిన ఈ ముద్రణాన్ని బ్రౌన్ కేవలం ఒక ''ఎంచిన పద్యాల''[28] సంపుటిగా భావించటం, ముందు ముందు వేమన పద్యాలను గూర్చి ఆయన చేయాలనుకొన్న కృషితో దానిని పోల్చుకోవటమే కారణం కావచ్చు.

తర్వాత బ్రౌన్ వేమన పద్యాల తాళపత్ర సేకరణ 16నుండి 30 దాకా పెరిగింది. కొత్త పద్యాలెన్నో వచ్చి చేరాయి. ఉన్న వాటికి పాఠాంతరాల సంఖ్య పెరిగింది. తాళపత్ర ప్రతులన్నింటిలోని 'పద్య సంఖ్య' 2500 దాకా తేలింది. మరికొన్ని ప్రతులు వచ్చి చేరగా పద్య సంఖ్య 3000 దాకా పెరిగింది. (బహుశా 40 ప్రతులు) కాని 1164 పద్యాలను యేరుకొని మాత్రమే బ్రౌన్ రెండవ ముద్రణాన్ని 1839లో వెలువరించాడు. కాని పదేళ్ల తరువాత రావలసిన విధంగా ఈ గ్రంథం లేదని బ్రౌన్ మళ్లీ అసంతృప్తిని ప్రకటించాడు.[29] తొలి ముద్రణంకన్న 471 పద్యాలను అదనంగా చేర్చటం అక్కడక్కడ శుద్ధ పాఠాలతో పోల్చి చూసి పద్యాలను సరిదిద్దటం, అనువాదం, లఘు వ్యాఖ్యానం పరిహరింపబడటం ఇందులో జరిగిన కొత్త కార్యాలు. అదనంగా చేర్చుకోబడ్డ 470 పద్యాలలో దాదాపు అన్నీ మత నీతి విభాగాలలోకి చేరిపోయాయి.[30]

బ్రౌన్‌కు ద్వితీయ ముద్రణం కూడ తృప్తినివ్వకపోవటానికి ఆయనే ఉటంకించిన ఓ ఉదంతాన్ని కూడా ఒక కారణంగా ఊహించవచ్చు. 1834 వరకు దాదాపు 3000 పద్యాల వరకు సేకరణ జరిగింది. వీటితో కొత్త ముద్రణ కొరకు ప్రతిని తయారుచేసే

పనిని ఓ పండితునికి అప్పగించడం జరిగింది. కాని ఆ పద్యాలను తన ఇష్టం వచ్చినట్లు దిద్దటం, కొన్ని పాదాలకు పాదాలే తీసివేసి స్వకపోల కల్పిత పద్యాలు చేర్చటం సాగించే తీరు బ్రౌన్ దృష్టికి వచ్చింది[31] అప్పటికి నాలుగో వంతు పని మాత్రమే జరిగింది. బ్రౌన్ వెంటనే ఆతనిని ఆ పనిలో నుండి తీసివేశాడు.

ద్వితీయ ముద్రణానికి కృషి చేసేటప్పుడే వేమన పద్యాలను గూర్చి కొన్ని ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టాడు. ముప్పయికి పైగా (అనగా దాదాపు నలభై) తాళ ప్రతులను పరిశీలించగా, ప్రస్ఫుటంగా తేలిన అంశాలివి :

1 అన్ని ప్రతులలోను సామాన్యంగా కనిపించే పద్యాలు 40 మాత్రమే.

2 అత్యధిక సంఖ్యాకమైన పద్యాలు (అనగా మొత్తంపద్యాలలో ఎక్కువ భాగం) దాదాపు పదిహేనుకన్న తక్కువ ప్రతుల్లో ఉన్నాయి.

3 కొన్ని పద్యాలు రెండు మూడు ప్రతులలో తప్ప రావు.

4 ఒక నూరుపద్యాలు మాత్రం ఒకప్రతిలోనే కనిపిస్తాయి.[32]

1839 నాటి ద్వితీయ ముద్రణం తరువాత కూడ బ్రౌన్ తన ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. కొన్ని కొన్ని కొత్త ప్రతులను సేకరించినట్లుగా కూడ తెలుస్తుంది. బెండమూరి లంక ప్రతి ఆధారంగా విభాగాలు చేసిన రెండు పుత్రికలను (1721, 1722) 184?లో రాయించాడు. కాని బ్రౌన్ కలలుగన్న సమగ్రమైన పరిష్కృత ముద్రణం ఆయన జీవిత కాలంలో వెలువడనేలేదు.

ఇప్పటి వరకు తెలుసుకున్న వేమన పద్యాల ప్రతులను, వాటితో బ్రౌన్ గావించిన విశేష పరిశ్రమను పరిశీలిస్తే కొన్ని ముఖ్యాంశాలు మన గ్రహింపునకు రాకమానవు.

బ్రౌన్ తాళ ప్రతులను శుద్ధమైన ప్రతులను (కాగితపు) వ్రాయించాడు విభాగాలుచేసి ప్రతులను పుట్టించడం వలన మాతృకలను కనిపెట్టడం కష్టసాధ్యమైన కార్యంగా మారింది. వేమన పద్యాలను గూర్చి బ్రౌన్ 18 ఏండ్లు శ్రమించాడు ఇంతటి సుదీర్ఘమైన కృషిలో కూడ బ్రౌన్ రెండు ముద్రణలు మాత్రమే వెలువరించగలిగాడు. కాని పాశ్చాత్య పద్ధతిలో నిర్దుష్టంగా వెలువడిన శ్రేష్ఠమైన ముద్రణలివి. దాదాపు నలభైకి పైగా తాళపత్రప్రతుల ఆధారంగా బ్రౌన్‌కు లభించిన పద్య సంఖ్య 3000 అను మాత్రమే మించి ఉన్నది. అన్ని ప్రతులలో ఉన్న సామాన్య పద్యాలు కనీసం 40 పద్యాలు కనిపించాయి. వేమనయొక్క అపూర్వ పద్య ప్రపంచంలోంచి ముద్రణ ప్రతులను రూపొందించడానికి బ్రౌన్ ''ఒకానొక'' విధానాన్ని అవలంబించాడు. వేమన పద్యాల పరిష్కర

ణలో రెండు ప్రధానమైన అంశాలపైన బ్రౌన్ అవసరమైనంత శ్రద్ధాదృక్కులు సాధించలేదు. 1. వేమన పద్యాలు జానపద సంప్రదాయంతో పుట్టి మౌఖిక ప్రచారంతో పరివ్యాప్తం కావడం 2. వేమన పద్యాలేవి? కానివేవి ?? అనే ప్రశ్నలోనికి అసలే వెళ్లక పోవడం.

మొదటి దానికి కారణం స్పష్టమే. బ్రౌన్ పరిష్కరించిన అనేకానేక తాళపత్ర ప్రతులలో వేమన పద్యాలు ఒక చిరుభాగం మాత్రమే. ఇతివృత్త సహితమై గంభీరమై రస ప్రధానంగా కావ్య భాషలో రచింపబడి వర్ధిల్లిన ఇతర కావ్యాలకన్న భిన్నమైన ప్రత్యేకమైన స్థానాన్ని, ముక్తక ప్రాయమై సునీతి బోధకమై, సామాజిక ప్రవాహంలో నిమగ్నమై, సులభ సుందరంగా వెలువడిన వేమన పద్యాలకు ఇవ్వలేదు కాకపోతే తెలుగురాని ఆంగ్లేయులకు సుబోధకంగా ఉన్నాయనే అంశాన్ని బ్రౌన్ ఎక్కువగా అభిమానించాడు. వేమన భావాలు, వాటిపైన వాడుకలోఉన్న వాద వివాదాల జోలికి బ్రౌన్ ఎక్కువగా పోలేదు. వేమనను వెలుగులోకి తేవడం స్థానికులైన పండిత మండలికి అరుచికరమైన కావ్యమని గమనించినా తన ఉద్యమాన్ని ఎప్పుడూ విడనాడలేదు. వేమనపట్ల ఆయన దృష్టి ఎక్కువగా భాషాపరమైనది అనే వాదం ఖండించడానికి వీలుకానిది. ఏమైనా పాండితీ మండితమైన తన పరుసవేది చేతులతో వేమన పద్యాలను తాకి తెలుగు లోగిళ్లలో బంగారాన్ని కుప్పవోశాడు బ్రౌన్.

ఇక రెండవది దీనిని స్పృశించడం అంటే యక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సిద్ధపడటమే కాని వేమన పద్యాలేవి? కానివేవి? అనే దృష్టి బ్రౌన్‌కు పూర్తిగా లేదనలేము వేమన పద్య సంచయంలో సుమతి, భాస్కరా, తిరుమలేశ పద్యాలు ఉన్నాయని మొదట గుర్తించినవాడు బ్రౌనే. ఇది వేమన పద్యం కానట్టు తోస్తున్నది అనే నోట్సు కూడా క్వాచిత్కంగా కనిపిస్తూ ఉంటుంది. కృతకమైన కందాది పద్యాలను మాత్రం బ్రౌన్ ఉదారంగా చూసి గ్రంథాలలోనికి చేదుకున్నాడు. 1842 లో వేమన పద్యాల వ్యాసాంగాన్ని బ్రౌన్‌వదిలివేసినట్టు కనిపిస్తున్నది. 1880 దాకా ఆంధ్ర సాహిత్య మథనం చేసిన బ్రౌన్ వేమన పద్యాలనుమధ్యలోనే వదిలి వేయడానికి కారణాలు అనూహ్యం. ఎందుకంటే 1839లో ద్వితీయ ముద్రణం తర్వాత కూడా మరో సుపరిష్కృత ముద్రణం కొరకు కలలు కన్నట్టుగా తానే రాసుకున్నాడు. ఏమైనా బ్రౌన్ సేకరించిన వేమన పద్యాల అపార నిధులే చాలు ఆయనకు మనం ఆచంద్రార్కం ఋణపడి ఉండడానికి.

అ ధో జ్ఞా పి క లు

1 Such an enquiry in the year 1824 regarding Telugu, made me acquainted with verses collected in the present volume. Several manuscripts of VEMA or VEMANA (for both names are used) were put into my hands, which I persued and translated in such hours of leisure as my public commitments allowed ... After collecting such copies to be found in Musulipatnam. Where I was then stationed, I gradually procured others from Vizagapatnam, Nellore, Guntoor, Cuddapa and Madras.

2 No.D3098 Govt. Oriental manuscripts library, Madras.

3 ... ... The proved to be full of errors of every kind in orthography, metre, and meaning.

4 ......no two copies followed the same arrangement and they varied in extent from two to eight hundred epigrams.

5 About six of the manuscripts of Vemana I now possess have not been read or examined.

C. P. Brown
D. 1773 Vol. 3.

6 Meantime I persisted in reading translating all the manuscripts of Vemana that I could collect and when I had gone through the whole I formed an edition of the work arranged in nine books. – June 1828

Sketch of the origin of my
Dictionary No. D 1391, Vol 9.

7 ఈ పట్టికా గ్రంథం రెండు సంపుటాలుగా (డి 3098, 3094) అతిశిథిలావస్థలో ఇప్పటికే అక్షరాలకన్న రంధ్రాలే అధికమై ముడితే పొడి పొడి అయ్యే స్థితిలో ఉంది.

8 కళ్లలో వొత్తులు పెట్టుకొని అన్వేషిస్తే ఈ సంజ్ఞలను తగిలించుకున్న అసలు ప్రతులు కొన్ని బయటపడ్డాయి. భావి పరిశోధకుల సౌకర్యార్థం (?) బ్రౌన్ అక్కడక్కడ కొన్ని వివరాలు వ్రాసి పెట్టుకున్నా కొన్నిచోట్ల పుర్వోత్తర విరుద్ధంగా ఉండి బయట పడిందనుకున్న సత్యం సంశయాస్పదంగా మారుతుంది. (ఉదా :– E, F లకు ఒకే రకమయిన వివరాలు వ్రాశాడు.) మొత్తంమీద ఆ సంజ్ఞలివి. A, B, C, D, E, G, H, F, K, Y, R, N, K, Q, V (N=ఇది న కారం అనే గ్రంథం. V=ఇది వీ కారం అనే గ్రంథం)

9 G, H.

10, 11 An index to the verses of Vemana, D 3090.

12 "A is Venkat siva's original copy" D 3098. వెంకట శివుడు – తిప్పాబొంట్ల వేంకట శివశాస్త్రి. బందరులో బ్రౌన్ సబ్ జడ్జిగా ఉన్న కాలంలో కోర్టులో పని

చేసేవాడు. దిట్టమైన పండితుడు. గ్రంథ పరిష్కరణ వ్యాపారాలలో బ్రౌన్‌కు చేదోడు వాదోడు.

13 D 3090.

14 This supplement contains such verses as were excluded from the Ms "B", which I adopted as the basis of my edition. It is compiled from manuscripts A and C. D 1773, Vol. 5.

15 Copied from Ms'Q' (I & TT Vol.38,7 part 2nd) D 1724.

16 అక్షరాల తాత్పర్యము డి 3090. లాస్ట్ డి. 3090.

17 కొన్ని తాళ పత్ర ప్రతులమీద "దీనిని టీకా గ్రంథంలో చేర్చడమయినది" అని వ్రాసి ఉంటుంది. దీనికి అర్థం చెప్పినవారు నాకింతవరకు తటస్థపడలేదు.

18 It is perhaps impossible to meet with a complete copy of this poet, a manuscript of antiquity, The principle copies from which this edition is compiled are nine...D 1773, Vol. 4.

19 ... ... few of these copies contains about five hundred verses; nones come up to seven hundred. The number however that, I have succeeded in collecting is 2100 ... D 1773. Vol. 4.

20 D 3090.

21 D 3090.

22 The two last of these form more than half the work, but are omitted in present volume because of interest and utility.

Verses of Vemana 1829.

23 బ్రౌన్ లేఖలు, బంగోరె 1976 బ్రౌన్ ప్రాజెక్టు, శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ.

24 My first edition of Vemana with the english translation was printed at Madras 1829, MD CCC XXIX, D 3101, Vol. I.

25 New verses of Vemana found in copies produced in 1830 and which cannot be traced not satisfactories adjusted D 1773, Vol. IV.

26 The original Ms. was found at Penugonda and the owner not willing to sell it. I had this copy made in February 1834 D 1735.

27 About 50 copies were given to me, and 450 disappear. After ten years, I discovered these rolled up as waste paper in the library. I then took steps to publish Vemana, the book became popular among those who were learning either Telugu or English It was juvenile effort and I have since remodelled several pages.

28 That was merely a selection D 3101, Vol I.

29 The second edition printed in 1839 though years later is only an extended selection with the tent occassionally amended D 3101 Vol. I.

30 బ్రౌన్ ద్వితీయ ముద్రణం ఎక్కడా లభ్యం కాలేదు. శ్రీ నార్ల దేశం అన్ని మూలలో వెతికి విఫలమయ్యారు. దానిని చూసినానని చెప్పినవాడు, దానిని సమీక్షించిన "మ్యాక్ డోనాల్డు" ఒక్కడే కనిపిస్తున్నాడు.

31 In the year 1839 I delivered the present volume to a learned brahmin who undertook to prepare a new edition, but he disappointed me; for he attempted to expirge every rustic phrase and inelegant rhyme even striking out whole lines and substitues other of his own compose. He went through only about a quarter of the work for an (?) finding what he had done I put a stop to his edition and dismissed him.

D 3101, Vol. I.

32 More than thirty manuscripts (Total were examined and exactly collected for this new edition) but there are only about forty verses which occur in all these - most of them were found in less than fifteen manuscripts. Some only in two or three; and a few, about a hundred rest on only a single authority.

కాంట్రడిక్షన్స్

సలంద్ర

కంటినిండా నిద్ర
  కడుపునిండా తిండి
నోటినిండా మాట
అయినా ఏదో వెలితి –

చేపలు చెట్టుకు కాసినట్టు
సముద్రం నిప్పయి
మరో సూర్యుడై మండుతున్నట్టు
ఆలోచనలీనడం –
ఒక పాట నిద్రపొమ్మంటే
ఒక పాట ఏడవమంటే
మరో పాటేమో
అక్కడే అప్పుడే ఏదో చేయమంటం ...

అన్నీ
కాంట్రడిక్షన్సే
కాంట్రడిక్షన్సే
ఏవి డామినేట్ చేస్తే
అవే నిజమవడం
దాన్నే ఆచరించడం
అదే అలా ఆసేపు
నిలిచిపోడం –

ఏమిటీ
ఎందుకీ అస్థిరతా ?
ఏమైపోతున్నట్టు నేను ?
ఎటుపోతున్నట్టు నేను
నదినుండి జలధికి
మరి జలధినుండో ?
ఏమో ఎటో !
ఏమో నాకేం తెలుసూ ?

ఏమిటీ ఏమిటీ
ఈ ప్రశ్నల పరంపరల రేయింబవళ్లూ ?
ఒకే క్షణం
ఒక్కసారి
నా ఆలోచనల సూర్యునికి
సంపూర్ణ సూర్యగ్రహణం పడితే ఎంతబావుండూ !
అమ్మో !
వద్దు ఆ స్తంభన
ఆ నిలకడ నే భరించలేను
యిప్పుడే ఒక్క రాత్రినే భరించలేని నేను
ఆలోచనల సంపూర్ణగ్రహణమా !
వద్దు వద్దు
అలా జరగొద్దు !

అయినా
యిదంతా ఓ పెద్ద ప్రాబ్లమయినట్టు
ఎందుకూ నాకీభయం ?

నేను
భూగోళాన్ని
శూన్యంలో వుండి
కోట్లాది గ్రహాంతరాల మధ్యన
వున్న వాడ్ని –
నేనేంటో
నీకు తెలుసుకోవాలనివుంటే
కోట్లాది ఏండ్లనుండి
యింకా ప్రయాణం చేస్తూ
నా చెంతకే రానున్న
ఆ కాంతినీ
కాంతి సంవత్సరాలనీ అడుగు !

కలగూరగంప

మన విశ్వరూపం

అఫ్గాన్ అవతారం

మన ప్రపంచపు తీరుతెన్నులను గూర్చి ఎన్నో వ్యాఖ్యానాలు రోజూ పత్రికా ముఖాన, ఆకాశవాణిద్వారా వెల్వడుతూవున్న సంగతి మనమందరం ఎరుగుదుము. కాని, దాని స్వరూప స్వభావాలన్నీ ఒక్కసారిగా అఫ్గాన్ సంఘటనలో విదితమైనట్లు మరే వ్యాఖ్యతోనూ స్పష్టంకాలేదు. ఎవరెవరి పరిధి ఎంతో, విశ్వవ్యాప్తమైన భావనకు ఎంత దూరంలోవున్నామో తెలిసిపోతున్నది. అట్లని, మనం సంకుచితమైపోరాదు. విశాల విశ్వదృష్టికి సమీపంగావెళ్ళే ప్రయత్నాన్ని విరమించరాదు.

కీ. శే. అమనుల్లాఖాన్ హయాంలో జరిగిన సంఘటన దగ్గరనుంచి నేటివరకూ అఫ్గానిస్తాన్ చరిత్రలో అనేక చరిత్రాత్మక దృశ్యాలు వెల్వడినవి అన్నింటిలోనూ అంతర్జాతీయ తాకిడి కొంత వున్నది. నిన్న మొన్నటి సంఘటనలో అది విశ్వరూపాన్ని ప్రదర్శించింది.

అమనుల్లా ఆక్కడా, సుభాష్ చంద్రబోస్ ఇక్కడా నెగ్గివుంటే, పాకిస్తాన్ జన్మించేదేకాదు· అమనుల్లాహయాంలో అఫ్గానిస్తాన్, కెమల్‌పాషా తీర్చిదిద్దిన తురుష్క ప్రజాస్వామికం (టర్కీ) వలె రూపొందేది. ఆ ప్రభావం హిందూస్తాన్‌మీద పడేది. దాని పర్యవసానంగా మన దేశ రాజకీయాలలో సుభాష్ శక్తి ఇనుమడించేది. నేతాజీ నడిపిన ఆజాద్ హింద్ ఫౌజ్ బర్మాలో కాక ఇక్కడే జన్మించేది. బ్రిటిష్ అప్పగింతద్వారా గాక, అధికారం రణరంగాన మన కైవశమయ్యేది. సరే, ఇక ఈ ఊహాగానం ఆపివేసి, వాస్తవ ప్రపంచానికి వస్తాం.

స్వతంత్ర అఫ్గాన్ సీమ అనే భావం ఇండియాను పరిపాలిస్తూ వుండిన బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి గిట్టలేదు. నీళ్ళు మోసి జీవించే బాచా శాకో అనే ధూర్తుని నిల్పి, మూర్ఖులైన ముల్లాలను—వారి నాయకులోనైన మూర్ఖపుజనాన్ని రెచ్చగొట్టి, గందరగోళాన్ని సృష్టించి, అమనుల్లా రాజ్యాన్ని తలక్రిందులు చేయించి, వారు నాదిర్‌షాకు పట్టం గట్టినారు. ఆ తర్వాత అమనుల్లా సంకల్పాన్ని అమలు జరిపించాలనే పట్టుదలగల శక్తులు విజృంభించలేదు. నాదిర్‌షా తర్వాత జహీషా వచ్చాడు. ఆ రాజరికాన్ని అంతంజేసి దావూద్ ఆ రాజ్యాన్ని రిపబ్లిక్ చేసినాడు. రష్యన్లకు ఆ రిపబ్లిక్ అనుకూలంగానే వుండెను. అంతకుముందు జహీర్‌షా రాజ్యం అట్లే వుండెను. దావూద్ తొందరపడి కార్మికుల ప్రదర్శనాలపై చేయి చేసుకుని, అప్పటికే దేశంలో బలం పుంజుకున్న కమ్యూనిస్టు బృందాలను ఏకం చేశాడు. అంతట, దావూద్‌వంశం సమూలంగా సంహరింపబడి, కమ్యూనిస్టు రాజ్యం వచ్చింది. ఐతే, ఆ పాలకవర్గం చీలికలైనది. ఆ పరిస్థితిని చక్కదిద్దుకోడానికి సోవియట్ నాయకులు, సేనానులు వచ్చి దేశాన్ని స్వాధీనం చేసుకుని, అంతకుముందే ధ్వజమెత్తిన ప్రజల ఉద్యమాలను అణచడం ఆరంభమైనది.

ఇందులో రెండు సమస్యలు ఎదురైనవి. పొరుగునవున్న పాలించే పార్టీ నీ రాజ్యాన్ని పాలించే పార్టీ వంటిదైతే, నీవు ఆ గడ్డ మీదకు వెళ్ళి ఆక్రమించుకోడానికి అధికారాన్ని కలిగివున్నావా? ఇదొక ప్రశ్న. రెండవ ప్రశ్న—ఆ సీమలో ధ్వజమెత్తిన వారిని అణచడానికి, ధ్వంసం చేయడానికి నీ సేనలను పెద్దయెత్తున వినియోగించే అధికారాన్ని కలిగివున్నవా? అంతర్జాతీయ వ్యవహార సరళి, సహజీవన విధానం ఈ రెంటినీ సహిస్తవా?

ఇవన్నీ అంతర్జాతీయ సమస్యలు. అన్ని దేశాలకు అన్ని దేశాలలోని అన్ని పార్టీలకు సంబంధించిన సమస్యలు.

అంతేగాని, అఫ్గాన్ సీమలోని ప్రజలు ముస్లిములు గనక రష్యా దండయాత్రను ఇస్లామీ సమస్యగాజేసి, పాకిస్తాన్ ముస్లిం రాజ్యాలను సమావేశపరచి ఆ దండయాత్ర విషయం చర్చించడంతో విశాలమైన అంశం సంకుచితమైపోయింది. మనము, పాకిస్తాన్, బాంగ్లాదేశ్, బర్మా, థాయ్‌లాండ్, ఇండోనీషియా, శ్రీలంక అందరం కలిసి, యుగొస్లావియా, రుమేనియాలను కల్పుకుని, పశ్చిమ యూరప్‌లోని కొన్ని కమ్యూనిస్టు పార్టీలను కల్పుకుని, చైనా, అమెరికా తదితర పాశ్చాత్య రాజ్యాలను, ఆఫ్రాసియా సోదర సీమలను తోడ్కొని బ్రహ్మాండమైన వేదికను సృష్టించి, ఐక్యరాజ్య సమితిని మొగ్గించుకుని, మాస్కోలోని మహానాయకులను – వారిని మంచి చెడ్డలన్నింటిలో అభిమానించే సాటిరాజ్యాల నాయకులను ఎదుర్కొనవలసి వుంటిమి.

అట్లాగక, పాక్ సీమ ఒక దారీ, అమెరికా—చైనాలు కలిసి మరొకదారీ—రెండూ పెడదారులే—అనుసరించి, మనకూ లోకానికి ఒక పెద్ద సమస్యను కొత్తగా తెచ్చిపెట్టినవి.

అఫ్గాన్ సమస్య ఇస్లామీ సమస్య కానేకాదు. మరే మతానికీ సంబంధించిన సమస్యాకాదు. అది కేవలం రాజకీయ సమస్య సహజీవన సమస్య. అంతర్జాతీయ సంబంధాల నడవడికి సంబంధించిన సమస్య.

ఇంతకూ, రష్యన్లను దురాక్రమించే విదేశీయులుగా, సైన్యాలు దొర్లకముందునుంచే అఫ్గాన్ ప్రజలు ఎందుకని భావించారు? కమ్యూనిజం దేశంలో వస్తే రానీగాక! రష్యన్లకు ఇక్కడేమి పని అని వారెందుకు భావించారు? ఇది సలక్షణమైన జాతీయ భావానికి ప్రతీక.

ఇదిగాక, అసలు ఎక్కువభాగం గిరిజనులైన అఫ్గన్ ప్రజానీకం ఎందుకోసం కేంద్రప్రభుత్వంమీద తిరుగుబాటు చేస్తున్న

కమ్యూనిస్టు రాజ్యపు అభిమానులన్నట్లుగా ఆ రాజ్యపు భూసంస్కరణ వగైరా శాసనాలను వమ్ముచేయడానికి రియాక్షనరీలు చేయించే అల్లరి అయితే, దేశంలో అంతఃకలహం సంస్కరణల అభిమానులకూ, విరోధులకూ మధ్య ఇదివరకే వచ్చి వుండవలెగదా! దాని ఛాయలు కనిపించవే? పాక్, సౌదీ అరేబియావంటి రాజ్యాలవాదం ప్రకారం ఇస్లామీ సంస్కృతిపై అఫ్గాన్ కేంద్రం చేస్తున్నదాడిని త్రిప్పికొట్టడానికై ఇస్లామీ ఉద్యమాభిమానులు ప్రజలకు అండదండలను చేకూర్చేటట్లయితే, ఇరాన్‌లో ఖొమిని బృందాలకు మార్క్సిస్టులు సాయపడుతున్నారే? అంతేగాక ఇస్లామీ సంస్కృతిపై దండెత్తవలసిన అవసరం రష్యాకేమి గలిగినది? ఈజిప్టులో నజర్ హయాంలో రష్యన్లు ప్రవేశించినపుడు, ఇటువంటి ఛాయలు కనిపించలేదే? సాదత్ వచ్చి, వేలమంది రష్యన్ సలహాదార్లను పంపించి వేసినప్పుడు కూడా, వారిమీద ఇటువంటి ఆరోపణలేదే? కాగా, అనేక అరబ్బీ—ముస్లింరాజ్యాలు ఇజ్రాయిల్‌పై పగ సాధించడానికి చేసే ప్రయత్నాలను రష్యా హర్షించినది గదా! మనకూ. పాక్‌సీమకు యుద్ధం జరిగినపుడు మనకు రష్యా, ఎదటివారికి అమెరికా సాయపడిన సంగతి జగద్విదితం కదా !

మన దేశంలో షేక్‌హుసామ్, జమాత్–ఎ–ఇస్లామీ నాయకులు రష్యా దాడిని ఇస్లామీ వెలుగు బాటకు విరుద్ధంగా చిత్రిస్తూ, దానిని ఖండిస్తున్నందువల్ల, ప్రభావం సన్నగిల్లుతున్నది విషయిం కూడా ప్రక్కదారికి పోతున్నది.

గాంధీజీ ఖిలాఫత్ రద్దును ఖండించే ఉద్యమాన్ని ముస్లిం ఉద్యమంగా వుంచలేదు. ధార్మిక సమస్యగా, మానవ సమస్యగా, భారత జాతీయ సమస్యలో భాగంగా చేసినాడు

అందువలన, మన ప్రపంచ రాజకీయాల నిజస్వరూపాన్ని అద్దంలోవలె మనం చూడగల అఫ్గాన్ పరిణామం నేటి అగ్ర రాజ్యాల తంత్రాంగాలలో ఒక భాగంగా, స్పష్టంగా కనిపిస్తుంది. అదే జాడ్యం. ఆ రోగనిదానం చేసి; విరుగుడు వేయవలెను.

రష్యాలోని కమ్యూనిస్టు రాజ్యం, అఫ్గానిస్తాన్‌లోని కమ్యూనిస్టు పార్టీ చీలకలు, ఆ సీమలోని జనాభా అవలంబించే మతం— ఇవన్నీ నిమిత్తములు. అసలు సమస్య అధికారం, దానికితోడైన ఉన్మాదం లేక అవివేకం. రాజ్యాలను పాలించేవారి తత్వాలు ఎట్టివైనా, ఇట్టి సంఘటనలు సంభవమవుతున్నవి. ఉదా : వియత్నాం కంపూచియామీదకు దండెత్తింది. కంపూచియా కలహ కారణాన్ని కల్పించి నందువల్ల అది జరిగిందట. చైనా, రష్యాలు రెండూ రెండు పక్షాలను వహించి, తమ తమ పక్షాల కనుకూలంగా వర్తిస్తున్నవి, ప్రచారం చేస్తున్నవి.

తత్వాలనుసైతం గంగలో కల్పే నగ్నమైన పవర్ పాలిటిక్స్ తాండవిస్తున్నది. ఇది ఎక్కడ, ఏ రూపంతో చెలరేగుతుందో చెప్పలేము.

ఇదిగాక, ప్రజలు ఒకానొక సంఘటన వలన ప్రేరణపొంది, [illegible]వ్య వాహినిగా మారినపుడు ఆ ప్రజల మతానికి సంబంధించిన వాఙ్మయంలోనుంచి ఆ వాహినికి పుష్టిని కలిగించేటట్లు పలకడం సహజం. కాని అది పిడివాదం, ఉన్మాదం వగైరా పోకడలకు అతి దూరంగా వుండవలెను. లేకుంటే తీరని నష్టం వస్తుంది మానవకోటి పురోగమనాన్ని అడ్డుకుని వెనక్కు నెట్టినట్లవుతుంది.

ఆంగ్లంలో పిడివాదాన్ని ఫండమెంటలిజమ్ అంటారు. దానిని ఎవరు అవలంబించినా, లెక్కలేనన్ని సమస్యలు వచ్చిపడతవి.

టెక్నాలజీ, సైన్సు, లౌకికవర్తన, వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధి, విద్యావ్యాప్తి ఇవన్నీ ఆ పిడివాదంవల్ల దెబ్బతింటవి.

అందువలన, విశ్వస్థాయిలో దానిని ఎదుర్కొడానికి విజ్ఞులందరు, అన్ని ధర్మాలకు, మతాలకు, పక్షాలకు జెందిన లిబరల్ భావుకులందరు సిద్ధం కావలెను.

మన గమ్యం వికసించే మానవక్షేత్రం. సర్వమానవ ధర్మక్షేత్రం. పృథివి మన కుటుంబం. అందులో గౌరవప్రదంగా కలిసి మనుగడసాగించేటందుకు అనుకూలమైన వాతవరణాన్ని మనం పెంపుజేయవలెను.

ఆ దారికి అడ్డంవచ్చే మార్గాలను ఎప్పటికప్పుడు శాయశక్తులా విరోధించక తప్పదు.

అ న్వే షి

సూర్యునిపై ధ్వజమెత్తిన కలాలు

ఒకప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కవిత్వాన్ని కొన్ని వర్గాల క్రింద కేటాయించారు. విప్లవ కవిత్వం, అభ్యుదయ కవిత్వం శృంగార కవిత్వం మొదలగునవి. మరొక విభజన ఛందోబద్ధ కవిత్వం, వచన కవిత్వం. ప్రస్తుతం వచన కవిత్వం మంచి ఆదరణ పొందుతుంది. కవిత్వమనేది అనేక విషయాలమీద వ్రాయవచ్చు అంటే కవితా వస్తువు ఏదయినా తీసుకోవచ్చు. ఆ తీసుకున్న వస్తువును అటు ఛందోబద్ధంగానూ, ఇటు వచన కవిత్వంలోనూ రెండు రకాలుగానూ వ్రాయవచ్చు.

ఇక ఈ కవితా వస్తువు విషయంలో కవులు ఏ వస్తువును కవితా వస్తువుగా ఎంచుకోవాలి అనేది ఆ యా కవుల మనస్తత్వాల మీద, వారి ఆసక్తిమీద, వారి ఆశయాలమీద ఆధారపడి యుంటుంది. కానీ కొన్ని సందర్భాలలో ఆయా సమాజ పరిస్థితులనుబట్టి, దేశకాల పరిస్థితులనుబట్టి కొన్ని వస్తువులను ఎంచుకుంటారు. అది వేరే విషయం.

నేడు వస్తున్న వచన కవిత్వం ఒక కొత్తబాట ఏర్పరచుకుంది అనక తప్పదు ఈ వచన కవిత్వంలో కవితా వస్తువుగా చాల మంది కవులు ''సూర్యుడ్ని'' తీసుకున్నారు. ప్రస్తుతం ఇంకా తీసుకుంటున్నారు కూడా. ''సూర్యుడ్ని'' కొందరు దుమ్మెత్తి పోస్తున్నారు. మరికొందరు నెత్తి ఎక్కించుకుంటున్నారు. కొందరు మంచాలమీద పడుకోబెడుతున్నారు. జేబులో దాచుకుంటున్నారు.

అరచేతిలో ఇముడ్చుకుంటున్నారు. ఇంత ఎందుకు మొత్తంమీద సాహిత్యంలో సూర్యుడ్ని కవితా వస్తువుగా తీసుకొని అనేకరకాలుగా కవిత్వాలు వ్రాస్తున్నారు. ఏది ఏమయినా సాహిత్యంలో 'సూర్యుడ్ని' సృష్టిస్తున్నారు. ఏ విధంగా 'సూర్యునిపై' కలాలతో దండయాత్ర సాగిస్తున్నారో వివరంగా పరిశీలిద్దాము.

డా॥ దాశరథి ''వివేక సూర్యోదయం'' — అనే కవితలో ''వివేక సూర్యోదయాన్ని ఆమధ్య పిలిపించాను. వెలుతురుని చీకటితో పోరాడించి గెలిపించాను. ఏమిచేసినా అజ్ఞాన తిమిరాలు శాశ్వతంగా భూమిని విడిచి పోవటం లేదు అని విలపించారు'' అని సూర్యునిపై కవిత్వం వ్రాశారు. దీనిలో వివేకాన్ని సూర్యునితోనూ పోల్చి నేటి సమాజంలో అజ్ఞానాన్ని తొలగించడానికి ఈ వివేక సూర్యుడు చాలటంలేదని వారు చిత్రించారు నేటి సూర్యుడు ఏ మాత్రం సమాజంలో అజ్ఞానాన్ని తొలగించలేడని కవి భావన. అలాగే శ్రీ వి.యస్.ఆర్. అవధానిగారు ''జెండాలమీద సూర్యుడు'' అన్న కవితలో ''దిగంత రేఖలో దివంగతుడయ్యే సూర్యుడ్ని, ఆకాశం శిరస్సుపై నిలబెడదాము, మన జెండాల ప్రతీకను ప్రతిష్ఠించుకుదాం'' అంటారు. అంటే ఈ కవితలో వారు ''సూర్యోదయం'' మహా పవిత్రమయినదని, మన జతకళ్ళు సూర్యోదయాన్ని చూస్తున్నాయంటే దానికంటె గొప్పదేది ప్రపంచంలో? అంటారు వీరు. శ్రీ గుడిమెట్ల గోపాలకృష్ణ ''తూర్పు పూలు'' అన్న కవితలో ''ఏ సూర్యుడు ఈ రోజు నా ముఖంలో రూపాలు దిద్దుకుంటున్నాడు'' అంటూ ''రోజుకో తూర్పు పూవు చాలు నాకు.'' అంటారు. వీరు ఇక్కడ సూర్యుడ్ని పువ్వులతో పోల్చి, నాకు వేయి సూర్యులు అక్కర్లేదు. ఒక్క సూర్యుడు చాలు అంటారు వీరు. శ్రీ ఆసు రాజేంద్ర ''జేబులో సూర్యుడు'' అన్న కవితలో ''ఈ జగతి జనుల్లో ఉషస్సు తేవాలన్నా — తమస్సు కరిగించాలన్నా నా సూర్యుడే దిక్కు అనుకున్నాను'' అంటారు ఈ కవితలో వేయి రూపాయి నోటుని సూర్యుడితో పోల్చాడు కవి అవి మారని రోజుల్లో నమ్ముకున్న సూర్యుడే నట్టేట ముంచినట్లు, సూర్యుడ్ని మాటామంచీ లేనివాడని కొన్ని విసుర్లు విసిరాడు కవి. శ్రీ శశికాంత్ శాతకర్ణి తన ''సూర్యుడ్ని గ్లాసులో పిండుకో'' అన్న కవితలో ఎర్రగా విచ్చిన గులాబీ కూడా వేసవి వేడికి చెమట వాసన కొడుతుంది. అంటూ సూర్యుడ్ని నారింజ పండులా గ్లాసులో పిండుకో అంటూ మానవుడి చేతిలో సూర్యుడ్ని సృష్టించాడు.

శ్రీ కోరా ''ఉదయ భాను'' అన్న కవితలో ''సుందర మందార, సింధూర కాంతియై ఉదయించె భాస్కరుడు తూర్పునందు రంగారు, బంగారు, పొంగారు మూర్తియై పయనించె పడమరకు ప్రజ్వలిస్తూ'' అంటూ సూర్యుడి నిత్య కృత్యాలు తమ కవితలో సొంపుగా చెప్పి వదిలిపెట్టేడు కవి. అంతకుమించి సూర్యుణ్ణి ఏమి చేయలేదు వారు. ''జ్యోతిర్మయి'' ''ఉదయరాగం''కవితలో— ''నేను తూర్పున ఉదయించే ఓర్పును, తూర్పున నే గీసిన గీతల్లోని అరుణ కాంతుల బాణపు గుర్తులు మార్పుకు ప్రతీకలు సుమా! అని మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను.'' అంటూ సూర్యుడు ఈ లోకానికి ఒక హెచ్చరిక ఇస్తున్నట్లు, ఆ హెచ్చరికలో కొంత సెల్ఫ్ కవి చిత్రించాడు. శ్రీ దస్తగీర్ ''సూర్యుడిపై వారంట్'' కవితలో ''ఎక్కడ ఉన్నా సూర్యుణ్ణి గాలించి అరెస్టు చేయండి'' అంటూ సూర్యుడి చిహ్నాలు కొన్ని ''కనిపించటంలేదు'' అనే హెడ్డింగ్ క్రింద రోజూ న్యూస్ పేపర్లో మనం చూసే మాదిరిగా కవి వర్ణించాడు. నిజంగా సూర్యునిపై వారంట్ వేయగల సామర్థ్యం కవి గుండె ధైర్యానికి చిహ్నం. ఈకవే ''అరచేతిలో సూర్యుడు'' అన్న కవితలో కార్మిక కర్షక జనాన్ని అండగా తీసుకుని ''వ్యవస్థ విత్తనం నుండి విప్లవం అంకురిస్తుంది, రేపు — మీ చెమటతో తూర్పు భళ్ళున బద్దలై మీ అరచేతిలో తిరిగి 'శ్రమ సూర్యుడు' ఎర్రగా ఉదయిస్తాడు. అంటూ కార్మిక జనం చేతుల్లో ఎర్రగా కాయలు కట్టిన దేహాన్ని సూర్యులుగా వర్ణించాడు కవి. ఇక్కడ సూర్యుణ్ణి శ్రమతో పోల్చాడు కవి. శ్రీ విరియాల లక్ష్మీపతిగారు ''సూర్యుడికి ఉరిశిక్ష'' అన్న తన కవితలో ''ప్రకృతి న్యాయనిర్ణేతగా నిలుచుని, నిర్దోషి సూర్యుడికి ఉరిశిక్ష విధించింది. సాయంత్రం సాక్ష్యం పలికింది. అందుకు పాపం ఆకాశం తన బాలార్కుని కోసం అదేపనిగా ఆక్రోశించింది.'' అంటూ సాయం సంధ్యలో సూర్యుడ్ని నేరమున్నవిగనూ, అస్తమించటం ప్రకృతి విధించిన ఉరిశిక్షగనూ ఈ కవి భావించుకొని, ''సూర్యుడికి ఉరిశిక్ష'' తీయ ప్రయత్నించారు. ఈ కవే ''ఆరుబయట అరుణోదయం'' అన్న కవితలో ''ఆరుబయట అరుణోదయం పిలుస్తుంది. నిన్నరాత్రి అంతా యుద్ధంచేసి, శత్రువు పై విజయించిన వీరుడు, రక్తసిక్తంగా ఉన్న మెరుపు కత్తుల్ని తన శక్తినంతా కూడదీసుకొని, ప్రాచీరేఖమీద నిలుచుని క్షితిజంమీదకు విసురుతున్నాడు.''అంటూ రాత్రి జరిగిన చీకటి సమరంలో విజయం సాధించి, ఉదయానికి తూర్పు కొండ ఎక్కి తన విజయాన్ని లోకానికి చాటుకుంటున్నట్లు కవి వర్ణించాడు. ఇక్కడ సూర్యుని వీర ప్రతాపాన్ని చిల్పుటకు కవి మంచి పదాలు వాడారు. డా॥ ఆచార్య హావన్ ''ఇంకో సూర్యుడు'' అన్న కవితలో ''ఈ లోకంలో ఇప్పుడున్న సూర్యుడు కాక, ఇంకో సూర్యుడు ఉదయిస్తే ఎంతో బాగుంటుంది'' అంటూ తన భావం కవి వ్యక్తపరిచారు. అంటే ఈ సూర్యుడు ప్రస్తుతంఉన్న సూర్యుడు మవ రాజకీయ నాయకుల్లా ఆరంభసూరత్వమే కానీ కార్యశాలికాడు అని వారిభావన. హృదయాలను వికసింపచేసే మానవతా భావానికి, బాసటగా నిలబడే మరో సూర్యుడు కావాలని వారి వాదం! బహుశా మరో సూర్యుడు ఉదయించవచ్చునేమో కూడా.

ఈ రకంగా ప్రస్తుత వచన కవిత్వంలో 'సూర్యుణ్ణి' కవితా వస్తువుగా తీసుకొని కవిత్వాలు వ్రాస్తున్నారు. మొత్తంమీద ఇది ఒక ఉద్యమం అనకతప్పదు! భావోద్రేకమయిన కవిత్వానికి ''సూర్యుడు'' కవితా వస్తువుగా సరిపోతాడు కూడా. ఈ ఉద్యమం ఎంతవరకూ సాగుతుందో ... ఏ ఏ పరిణామాలకు దారి తీస్తుందో మనం వేచి చూడక తప్పదు!

కొల్లూ

కుందుర్తి-అభ్యుదయ ప్రస్థానం

"సాధారణంగా నేనెన్నుకొనే కావ్యవస్తువులు చైతన్యవంతమైన ప్రజోద్యమాలకు సంబంధించినట్టివిగా వుంటాయి"[1] అంటాడు కుందుర్తి. ఆదమరచి నిద్రిస్తున్న, అణగారిన ప్రజలను వెన్నుతట్టి మేల్కొలిపి, చైతన్యోద్యమాలవైపు నడిపించే అభ్యుదయవాదిగా తన కవితా పరిశీలనలో మనకు గోచరిస్తాడు కుందుర్తి. ప్రబంధ కవితలోని రమ్యహర్మ్యాదులు తన కవితారీతి గాదని, సామాన్య మానవుల, వారి పూరిగుడిసెల ఘనాదుల వృత్తాలు తన కవితా యితివృత్తాలని అతని ఆత్మీయత గోచరించే ప్రతిచోట మనకు బోధపడుతుంది. వచన కవిత్వం తన ఒక్కడి సొత్తేగాని, ఎవరిసొమ్ము గాదని నొక్కి వక్కాణిస్తాడు. కుందుర్తియొక్క అభ్యుదయ పంథాను నాకు తెలిసినమేరకు సాహితీ లోకానికి పరిచయముచేయటం ప్రస్తుత వ్యాసోద్దేశ్యము.

తెలంగాణ దొరల పాలనలో సామాన్యుల యిక్కట్లు, వారి సహనం వివరిస్తూ, పేద ప్రజల మౌనం అశక్తతకు నిదర్శనం కాదని, వారు తిరగబడితే ఏ శక్తి అడ్డుకోలేదని, కట్టలుతెగి ప్రవహించే ప్రజావెల్లువముందు ఏ నిరంకుశ అడ్డుకట్టలు తెగలేవని వివరిస్తాడు.

"ఒక్కమనిషి నిద్రలేచి లక్షమందిని లేపుతాడు[2]
ఒక్క అణువు కడుపు పగిలి మహాశక్తి జనిస్తుంది"

ఆ అమాయిక ప్రజలలో ఒకరినుండి మరియొకరికి విద్యుత్ప్రసారంతా వారి శక్తి వ్యాపిస్తుందని, ఒక్క నిప్పురవ్వలా కనిపించే వారి శక్తి అనంతమైన ప్రళయానలమై కార్చిచ్చులా చెలరేగి నిరుపయోగమైన ధనమదాంధుల సంపదలనే అడవులను దహించి వేస్తుందని వివరిస్తాడు. మనం దేన్నైనా రాజేయవలసి వచ్చినపుడు ఒక నిప్పురవ్వను తీసికొని రాజేస్తాం. తద్వారా పెద్ద అగ్ని జ్వాలరేగుతుంది. అట్లే చైతన్యం ప్రారంభదశలో ఏదో ఒకచోట ప్రారంభమవుతుంది. కాని ప్రారంభమైన అగ్ని ఒకేచోట ఆగక ఆ చుట్టుపట్ల వ్యాపించునట్లే చైతన్యం కూడ దేశవ్యాప్తంగా అల్లుకుపోతుందని, దాన్నెవరు ఆపలేరని పై పంక్తులవలన మనకు తెలుస్తుంది.

తెలంగాణాలో స్త్రీలకు రక్షణలేని విషయాలను, దాహమైనప్పుడు మంచినీళ్ళలా అధికార్లు వారి మానాలను రాక్షసుల్లా భంగపరచారని, "పుట్టింటికి పోయిన పెళ్ళాన్ని మళ్ళీ కళ్ళారా చూసిందాక నమ్మకంలేదు"[3] అని ఆనాటి స్త్రీల దయనీయ పరిస్థితులను వివరిస్తాడు. అదేవిధంగా గృహదహనాలు, లూటీలు—అయితే పేద ప్రజ యిప్పుడిప్పుడే నిద్రలేస్తున్నారని, వారికి అరుణోదయం అతి త్వరలోనే కలుగుతుందనే తన ఆశను వ్యక్తపరుస్తాడు.

పరిపూర్ణమైన భావవ్యక్తీకరణకు ఛందస్సు ప్రతిబంధకమన్న సంగతి చాలమంది ఒప్పుకొన్నదే. అయితే ఛందస్సువలన చేకూరే ప్రయోజనాలున్నప్పటికి, సమగ్రమైన కవితా ప్రయోజనానికి ఛందస్సు ప్రతిబంధకమన్నది యథార్థమైన విషయం. "ఛందస్సు బంధాలకు పక్షవాతాన్ని"[4] అని ఛందస్సుపట్ల తన విముఖతను తెలియజేస్తాడు. సామాన్య మానవులవద్దకు చేరవలసిన కవితా ప్రయోజనాలు ఛందస్సు బంధాలవలన ఆగిపోతున్నవని వాపోతు "మేకప్" లేని తన సహజసిద్ధమైన ముఖాన్ని లోకానికి చూపించాలని తాపత్రయపడ్డాడు. ఈనాడు వచన కవిత్వానికి లభిస్తున్న ఆదరణ ఛందస్సుపైగల వైముఖ్యానికి ఒకవిధంగా నిదర్శనమని మనము పరిగణింపవచ్చు.

"ఎడారి పుష్పిస్తుందని చెప్పటం మా జాతి కవుల కలవాటు"[5] అనిన కుందుర్తి మాటలవలన ఆయనకు భవిష్యత్తుపై ప్రగాఢ విశ్వాసమున్నదన్న సంగతి యథార్థం.

"సామాన్య మానవుడికి స్వరాజ్యం వస్తుంది"[6] అని శోషలిస్టు వ్యవస్థలో కోరే సమసమాజాన్ని ఆకాంక్షిస్తూ వసుధైక కుటుంబ వ్యవస్థను కోరుకున్న 'సామ్యవాది' సహృదయుడైన కుందుర్తి. ఇలాంటి వ్యవస్థ ఒక దేశానికి, జాతికి కాక మొత్తం మానవజాతికే యీ వ్యవస్థ కావాలని కోరుకుంటాడు.

అధర్మంపై ధర్మం తిరుగుబాటే స్థూలంగా భారత కురుక్షేత్ర రణరంగం తిరుగుబాటుద్వారా ఒక వ్యవస్థ అంతమై, తద్వారా మరొక నూతన యుగావిర్భావం జరుగుతుంది. అంటే ధర్మాధర్మాల సంఘర్షణ అనివార్యం, అవిరామం. చివరకు జరిగేది ధర్మవిజయం. ఆధునిక యుగపు ఘర్షణ ఉన్నవారికి, లేనివారికి మధ్య జరుగుతుంది. అయితే ప్రపంచ చరిత్ర పరిశీలనచేస్తే "ఒక జాతిని వేరొక జాతి, పీడించే సాంఘికధర్మం, ఇంకానా? ఇకపై సాగదు"[7] అని అసంఖ్యాకమైన కోట్లాది ప్రజలు నిరూపణ చేసినట్లు మనకు అవగతమగుచున్నది. కుందుర్తి గూడ

"తిరుగుబాటు, కాలానికి కలిసిన చుట్టం[8]
ప్రతియుగానికి అంతిమఘట్టం" అని ఈ దోపిడీ వ్యవస్థ

పోవాలంటే తిరుగుబాటు తప్పని సరియని సూచిస్తాడు. ఏదో కొంతమంది బూర్జువాలపై హింసాకాండ జరిపినంతమాత్రాన అది తిరుగుబాటనిపించుకోదు. బూర్జువా వ్యవస్థనే సమూలంగా ఛేదించినపుడు మాత్రమే అది సంపూర్ణమైన తిరుగుబాటవుతుంది. ప్రగతిశీలురు కాంక్షించే సామ్యవాద వ్యవస్థ సిద్ధిస్తుంది.

"అనితర సాధ్యం నా మార్గం" అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లు ఈ కవి గూడ తనదైన మార్గాన్ని "ఎప్పుడు ఎవరూ తొక్కని దుర్గమపథాలు నా కవితాపథాలు"[9] అని తన మార్గాన్ని గురించి చెప్తాడు.

మారుతున్న కాలాని కనుగుణంగా కవితా స్వరూపము, ప్రయోజనాలు తప్పనిసరిగా మారటం సర్వసాధారణం. అలాకాక సనాతన సాంప్రదాయపు కవితా రీతులనుండి తొలగక మడిగట్టుకు కూర్చొనేవారు తప్పనిసరిగా ప్రజాహృదయాలకు దూరమవుతారు. తన సమకాలీన సమాజ పరిస్థితులను, సమస్యలను సామభూతితో

అవగాహన జేసికొని వాటికి తన రచనల్లో వీలైనంత యెక్కువ ప్రాధాన్యత నీయగలుగుట రచయితయొక్క విద్యుక్తధర్మం. ఇటు వంటి ఉత్తమ ఆశయానికి కుందుర్తి తన రచనల్లో యెక్కువ చోటిచ్చాడు.

''వృత్తాన్ని వదిలేసి మానవ వృత్తాన్ని స్వీకరించానట''[10] అందుకని నన్ను చరిత్ర ''చాళుక్యులనాటి కాలాన్ని సాక్ష్యం తెచ్చు'' కొని శిక్షిస్తానంటుందంటాడు. గతించిన కవితా సంప్రదాయపు విలువల త్రాసు నేటి కవితా విలువలను చూచుటకు పనికిరాదు. అప్పటి సాంప్రదాయ కవితవేరు. నేటి ఆధునిక కవితవేరు. కనుక రెండింటిని ఒకే త్రాసులో తూచుట సమంజసముగాదు.

కవితను కేవలం ఛందస్సు, రస, అలంకారాల రంధ్రాన్వేషణ దృష్ట్యా కాక ఆనందదాయికంగా పరిగణించాలని—

''రస చర్చల రంపపు పండ్లతో[11]
గురజాడను కోసి చూసి''

ఆత్మ కనిపించలేదనే వారి వాదాలకు తన నిరసన వ్యక్తంచేస్తూ—

''నాల్కలమీద నర్తించే భాషలో, నా కలం బలంగా వల కొచ్చు''[12] అని వ్యావహారిక భాషపై తనకున్న మోజుని తెలియ జేస్తాడు.

తన కవిత అచ్చంగా వచన కవితయేనని, ఒకవిధంగా తానే వచన కవితకు ఆద్యుడనని కుందుర్తి చెప్పుకున్నాడు. శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణబాబు, శిష్ట్ల, పఠాభి, తిలక్ మున్నగు వారిలో వచన కవితా ధోరణులున్నప్పటికి ''తొలిసారిగా వచన గేయములో సమగ్రమైన కావ్యము రచించిన కీర్తి కుందుర్తికే దక్కి నది''[13] అనిన ఆచార్య నారాయణరెడ్డిగారి తీర్పు యెల్లర కామోద యోగ్యమైనది. కుందుర్తి ఆత్మీయత నూటికి ఎనభైపాళ్ళు అన్ని గేయములలో కనిపిస్తది. తనకు జరిగే సన్మానాలు వచన కవితకు జరిగేవనే ఆయన భావించాడు. ప్రాచీన అలంకారాలు, శబ్ద, అర్థ పరమైన చర్చలలోకి పోక, ఆధునిక వచన కవితను ఆశ్రయించి నందుకు తనను సనాతన పండితవర్యులు ఆక్షేపించారని, అయి నప్పటికీ అనుమాత్రం ప్రగతినే కాంక్షిస్తానని ఆయన అంటాడు. తనకు వచ్చిన గౌరవం—

''నాకని మీరన్న ఖ్యాతి
వచన కవితకు వచ్చినట్లు
కవితలో సామాన్య ప్రజల
కథా రచనకు వచ్చినట్లు'' అని, ఆ విధంగా అట్టడుగున

ఉన్న సామాన్య ప్రజల జీవన చిత్రీకరణే తన కవితయొక్క ముఖ్యో ద్దేశ్యమని, రంగులులేని వాస్తవికదృష్టితో తాను దర్శించిన జీవన సత్యాలను వివరిస్తానని తెలియజేస్తాడు. కనుక కుందుర్తి కవితను తెలిసికొనటమంటే సమకాలీన సమాజ వాస్తవిక స్థితిగతులను దర్శించటమని మనము భావించవచ్చును.

'మనిషికి, మనిషికి మధ్య' ఉన్న నేటి స్వార్థ సంకుచిత, కుల, మత, వర్గ, ప్రాంతీయ, భాషాది తత్వాలను అవకాశ మున్న చోటల్లా కుందుర్తి ఖండిస్తాడు. ''నేను''[15] అనే గేయంలో మానవ స్వార్థ కుమ్ములాటలను వివరించి, మానవత్వం మరుగై నందుకు వ్యథచెంది ''చెప్పుకోను సిగ్గందుగ్గాన్ని, నేను మనిషినే'' అని మానవ కపట ప్రవృత్తిని నిరసిస్తాడు.

రంధి సోమరాజు తన కవిత్వాన్ని మూడు భాగాలుగా చేసి వానాకాలం, శీతకట్టు, వేసంగి పొద్దులు అని పేరుపెట్టి తత్కా లాని కనుగుణంగా కవిత్వాన్ని చెప్తాడు. వాతావరణంలో ఈ మూడు కాలాలతో స్పష్టమైన భేదం కనిపిస్తుంది. సమాజ వాతావర ణంలో గూడ ఆయా కాలాని కనుగుణమైన జీవన విధానం మనకు కనిపిస్తుంది. అదేవిధముగా ప్రతిభావంతుడైన కవి తన సమకాలీన సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని రచన చేస్తాడు. పూర్వపు కవితా సంప్రదాయాలు ఆనాటి సమాజానికి దర్పణంలా ఉన్నవా? లేవా? అనేది కాదు ప్రస్తుత చర్చ. సంపన్న, పేదవర్గాల మధ్య జరుగు తున్న ప్రస్తుత సమాజ ధర్మమైన ఈ వర్గపోరాటంలో కవి తన దృక్పథాన్ని ఏవైపు మళ్ళిస్తున్నాడు? పేదవర్గాల అభ్యున్నతికి రచ నలు యెంతవరకు దోహదపడుతున్నవన్నది ప్రస్తుతాంశాలు.

''ఊళ్ళో అందరికి జలుబులు దగ్గులు తెచ్చిన[16]
కొత్తనీటి చెరువును నేను'' అని అంటాడు కుందుర్తి.

తొలకరిలో క్రొత్త వర్షపు జల్లులు పడగానే అప్పటివరకు ఎండి బీళ్ళువారిన పొలాలలో పచ్చిక చిగురులు మొలకెత్తటం, ఎండి బొరి యలు వారిన కుంటలు కొంతవరకు నీటితో ఉండటం జరుగు తుంది. అంటే అంతకుపూర్వమున్న వాతావరణంకంటే వర్షపుజల్లు పడిన తరువాత కొంతవరకు కాలంలో క్రొత్తదనం కనిపిస్తది. అదే విధముగ అంతకుముందున్న కవితా సాంప్రదాయాలకు భిన్నమైన గొంతుకను తెలుగు లోకాని కందిస్తున్నానంటాడు కుందుర్తి. క్రొత్తనీరు త్రాగుటవలన తుమ్ములు, జలుబులు వస్తాయి. అయి నప్పటికి అంతవరకు నీళ్ళులేక బాధపడిన జనులకు తరువాత కాలంలో సమృద్ధిగా నీళ్ళుఉంటానికి ఆస్కారం ఏర్పడుతుంది. తన వచన కవితవలన, అభ్యుదయ రచనవలన ప్రస్తుతానికి కొంత యిబ్బందులున్నప్పటికీ, భావికాలానికి ఉపయోగపడే సమృద్ధిగ నీరు నిలువవున్న నిండు చెరువులాంటిది తన కవితని కుందుర్తి వివరణ. అందరికంటే భిన్నంగా, నూతనంగా తాను చెప్పదలుచుకున్నట్లు దీనిద్వారా మనకు తెలుస్తుంది.

''గొంతెత్తి సామాన్యుడి[17]
గోడంతపాడిన వాణ్ణి''

సామాన్యుడికోసము తాను కలం పట్టానని, గళంయెత్తి, ఆ సామాన్యుడి చరిత్రనే పాడుతున్నానని పై పంక్తులద్వారా స్పష్ట పరుస్తున్నాడు. తన కవితలో పదే పదే యిలాంటి భావనలు వ్యక్త పరుస్తాడు ప్రగతిశీలియైన కుందుర్తి.

నేడు సామాన్య మానవునికి కనీసం నిత్యావసర వస్తువులైన అందుబాటులోలేని దుస్థితిని "ఇదీ నాదేశం"[18] అనే గేయంలో తీవ్రంగా విమర్శిస్తాడు కుందుర్తి. ఉన్నవాడు, లేనివాడు కంరసోష కైనా భరించి సోషలిజం కావాలని చెప్పటం ఆధునిక ఫ్యాషనై పోయింది. అందుకే "కోటీశ్వరులు సోషలిజం కావాలని గోలపెడుతున్న దేశం నాది" అని బూటకపు నినాదాల్ని నిరసిస్తాడు. ఈవిధమైన నినాదాల్తో మభ్యపెడితే అశేష ప్రజానీకం సహించి ఊరుకోదని, వారు నిద్రిస్తున్న సింహాల్లాంటివారని హెచ్చరిస్తాడు.

స్వాతంత్ర్యానికి పూర్వము, స్వాతంత్ర్యానంతరము గూడ సామాన్య ప్రజల జీవన విధానంలో మార్పురాలేదు.

"నిజానికి స్వాతంత్ర్యం బోలెడంతవుంది మనకు[19]
నగంరోజులు తినకుండా నెల పొడుగునా
చాకిరీచేసే స్వాతంత్ర్యం వుంది"

అని నామమాత్రపు స్వాతంత్ర్యాన్ని నిరసిస్తాడు. నిజానికి తినడానికి తిండి, తలదాచుకోటానికి కొంప, తనువును కప్పుకోడానికి బట్టలేక కోట్లాది ప్రజానీకం క్రుగ్గిపోతున్నదేశంలో స్వాతంత్ర్యం ఎక్కడ? కాబట్టి కొంతవరకైనా పరిస్థితులు మారాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం సిద్ధించాలి.

వచన సాహిత్య ప్రాముఖ్యమును, ప్రాశస్త్యమును "పలుకు భగవంతుడా"[20] అనే గేయములో వివరిస్తాడు. ప్రస్తుత పరిస్థితులలో వ్యావహారిక వాద ఆవశ్యకతను తెలుపుతు "ఈ కాలంలో తెలుగులో సమస్త సాహిత్య శాఖల్లో వ్యవహారికవాదం విజయంపొందింది" అని అంటాడు. వచన సాహిత్యం యిప్పుడిప్పుడే అవతరిస్తున్నదని తెలుపుతు "వచనగేయం పసిబాల, ఒకసారి దృష్టి మళ్ళించు, వచ్చీరాని మాటల పసిపిల్ల పిలుపులకు" అని అంటాడు. పసిపిల్లల వచ్చీరాని మాటలు అందరికి ఆహ్లాదాన్ని కలిగిస్తవి. వచన కవిత యిప్పుడే ప్రారంభమవుతుందని చెప్పటానికిది సూచన. అలా ప్రారంభమయిన వచన కవితా బాల పరిపక్వస్థితికి చేరిందని చెప్తు "నాకవిత పదహారేండ్ల నవయౌవన" అని అంటాడు.

ఆధునికతను ప్రధానంగా పరిగణించి, తగినంతగ సనాతన సాంప్రదాయిక సాహిత్యాన్నిగూడ తాను స్వీకరిస్తున్నట్లు "నన్నయ్య నా పెద్దన్నయ్య, ఆయన నాటిన మొక్క శాఖోపశాఖలై సాగింది"[21] అనిన కుందుర్తి మాటలద్వారా తెలుస్తుంది. "అతి సర్వత్రావర్జయేత్" అన్నట్లు మరీ అతిగా పోకుండ ప్రాచీన సాంప్రదాయాన్ని కావలసినచోట స్వీకరిస్తూ ప్రస్తుత పరిస్థితుల కనుగుణమైన రచనలను వెలువరించుట యెల్లర కామోదయోగ్యమైనది.

తన రచనల్లో సర్వత్రా అభ్యుదయాన్నే కాంక్షిస్తున్నాడని తెలియజేయడానికే కుందుర్తి నాటికలను గూడ స్థూలంగా వివరిస్తున్నాను.

ఆచార్లగారమ్మాయి

ఎవరికివారు తాము నివసిస్తున్న నరకకూపంలోని కుళ్ళు మట్టి, యితరుల జీవన ప్రవంతులను మురికి కూపంగామార్చిన బంక బురద, బయటపడకుండా పైకి అందరికి పరోపకార ఎలా స్పందిస్తున్న జీవ, కాదు సజీవ జలఊటలా తన జీవంకూపం ఉండాలని కోరుకునే తత్వాన్ని ఆచార్లు, చైర్మన్ పాత్రలద్వారా వ్యక్తం చేయబడుతుంది. సాంప్రదాయం ఆచార్ల వారిళ్ళల్లోనే అనలేత్తి, కొనలుసాగి, రెమ్మలు, కొమ్మలు తొడిగి పూలు పూస్తుంది కాబట్టి ఆచార్లగారమ్మాయి తప్పు చేయదనే భావన ఆచార్లగారమ్మాయి ద్వారా తెలుపబడుతుంది. కీర్తి కాంక్షకొరకు రచయితపడే అడ్డదార్లు రచయిత పాత్రద్వారా తెలియజేస్తాడు. నేటి సమాజంలో అంతులేకుండ సాగుతున్న యిలాంటి చెరచబడ్డ జీవితాలెన్నో లెక్కకు మిక్కిలి. అలాంటివేలెత్తి చూపే శతకోటి జీవన గాథల్లో యిదొకటి. ఇదొక్కటే మాత్రంకాదు. చైర్మన్‌లాంటి కీచకులు, ఉపకీచకులు యింక ప్రబలమవుతూనే ఉన్నారు. అభినవ యువ భీములు వారి నంతిమొందించే దెప్పుడు?

శిక్ష ఏమిటి?

ఇందు గోపయ్య అనే ఒక అవినీతిపరుని వృత్తాంతము వివరించబడినది. ఇది ఒక్క గోపయ్యకే చెందినదికాదు. కాంట్రాక్టర్లుగా ఉంటూ ప్రజల రక్తమాంసాలను హరించివేసి తమ పాపపు సోపానాలను అంతస్థులంతస్థులుగా నిర్మించుకుంటున్న స్వార్థపరులందరికి చెందినది. ఈనాడు సర్వసాధారణంగా కనిపిస్తున్న హరిజన, గిరిజన యిళ్ళ నిర్మాణం పేరిట జరుగుతున్న అవినీతి, లంచగొండితనం, యిళ్ళు నిర్మించకుండ ఆ అమాయిక ప్రజలపేరిట జరుగుతున్న అధికార్ల, (ప్రజానాయకుల), కాంట్రాక్టరుల మనస్తత్వాలను యిందు చక్కగా చిత్రీకరించినాడు, ధర్మం వెలివేతను గూడ సూచించాడు. అయితే పెల్లుబికి వస్తున్న యువతరాన్ని న్యాయవీచికలను ఏ శక్తి అడ్డుకోలేదని, ఆపలేదని, యువశక్తికి దేశ నాయకత్వం అప్పగించాడు.

కుందుర్తి తనకు ఏ వర్గంతో సంబంధములేదని, ఏ వర్గానికి చెందినవారైనప్పటికి ప్రగతిని కాంక్షిస్తూ, ఆ వర్గరాజకీయ సిద్ధాంతాలకు తన 'సృజనాత్మక' శక్తిని తాకట్టుపెట్టుకొనవద్దని హెచ్చరిస్తాడు. ఈ కవి సాధ్యమైనంతవరకు ఆధునిక సమస్యలను యితివృత్తాలుగా స్వీకరించాడు. "క్రీస్తుపూర్వం ఎవరో రాజు వేశ్యతో ఊరేగిన సంగతి యింకైనా వదిలేయటం మంచిది"[22] అని అంటాడు. వాస్తవానికి చారిత్రకదృష్ట్యా తప్ప ఆ రాజు సంగతి నేడు అనవసరం. ఈనాటి జనజీవనం, వారి అస్తవ్యస్తస్థితిగతులు, ఆయా సమస్యలు, వాటి పరిష్కారాలు చేతనైనంతవరకు తమ రచనలద్వారా చూపగలిగితే రచయిత తన ధర్మాన్ని చాలవరకు నెరవేర్చ గలిగినవాడవుతాడని కుందుర్తి నమ్మకం. ఈనాటి సమాజ పరిస్థితు

లను దృష్టిలో ఉంచుకొని చూస్తే వేలాది కుందుర్తిలాంటి అభ్యుదయమూర్తులు వెలుగులోకి రావలసిన ఆవశ్యకత యెంతైనా ఉంది.

ఆధోజ్ఞాపికలు

1 కుందుర్తి కృతులు పీఠిక. పుట 3
2 " " తెలంగాణ ,, 46
3 " " " " 77
4 " " యుగేయుగే "– 210
5 " " " "– 239
6 " " " "– 220
7 మహాప్రస్థానం. శ్రీశ్రీ. పు–75
8 కుందుర్తి కృతులు. యుగే యుగే–పుట–267
9 " " " "–295
10 " " నగరంలో వాన పు–407
11 " " నాలోని నాదాలు పు 468
12 " " " పు– 467
13 ఆధునికాంధ్ర కవిత్వము. డా. సి. నా. రెడ్డి పు-619.
14 కుందుర్తి కృతులు–మాతృగీతం–పుట-533
15 " " " " –575
16 " " " " –536
17 " " " " –537
18 " " ఇదీ నా దేశం " –593
19 " " " " –633
20 " " భగవంతునికి బహిరంగ లేఖ " –689
21 " " దండియాత్ర "–808
22 " " " "–805

శ్రీ తాటి శ్రీకృష్ణ

మినీ కవిత్వం

ఒక దృశ్యం కానీ, ఒక సంఘటన కానీ కవి దర్శించినప్పుడు పొందిన అనుభూతి–వాక్యంగా కానీ, కావ్యంగా కానీ రూపం పొందవచ్చు.

కవిత్వ పరిణామాన్ని పరిశీలిస్తే రామాయణ, భారతాది పురాణాలూ, ప్రబంధాలూ, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వంగా మారుతూ నేడు విప్లవ కవిత్వంగా పరిణితి చెందింది. ఇది విషయాన్ని బట్టి చేసిన విభజన. అదే బౌతిక రూపాన్నిబట్టి అయితే ఆది పద్యం తోటే గద్యం నేడు వచనమో, వచన కవితగా రూపం పొందింది. తరువాత వచన కవిత నుండి అనవసర వ్యాఖ్యానాలను తీసివేస్తూ "ప్రస్తుత ప్రధానంగా మినీ కవిత వచ్చింది. ఆయా కాలాల్లో వస్తువునిబట్టి, ప్రజల సమయానుకూలతనిబట్టి కవిత్వం ఆయా రూపాలను పొందుతూ వచ్చింది.

ఈ రోజుల్లో పత్రికల్ని ఎక్కువ భాగం కథలూ, నవలలూ ఆక్రమిస్తున్నాయి. కవితలకి పత్రికల వాళ్ళు యిస్తున్న స్థలం తక్కువ అయినా ఆకాస్త స్థలాన్ని సామర్థ్యంతో, శక్తివంతంగా నేటి కవులు ఉపయోగించుకుంటున్నారు. ఈ కవితలు సైజులో చిన్నవై భావంలో చాలా గొప్పగా వుంటున్నాయి.

మినీ కవిత అంటే గొప్ప అర్థాన్నీ, విషయాన్నీ అతితక్కువ పరిధిలో చెప్పడం అనీ; ఆవేశాన్నీ, ఆనందాన్నీ హృదయానికి హత్తుకునేట్లుగా చెప్పడం అనీ అర్థం. అంతేకానీ దాని సైజుని బట్టి చేసిన నామకరణం కాదు.

మినీ కవితలు విరివిగానూ, విస్తృతంగానూ వ్రాయబడుతున్న ఈ రోజుల్లో మినీ కవిత్వంపైన సదభిప్రాయంలేని వ్యక్తులు కొందరున్నారు. కవిత రూపాంతరం చెందే ప్రతి దశలోనూ వ్యతిరేకత ఎదుర్కొనక తప్పలేదు. ఈ వాదనలు చేస్తున్నవాళ్ళు తమ పీఠాలు కదుల్తాయేమోనన్న భయంతో వున్నారేమో! ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి వుంది.

మినీ కవిత అని పేరు రాకపూర్వమే మహాప్రస్థానంలో అలాంటి కవితలు కొన్ని చోటు చేసుకున్నాయి. ఉ॥

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నే నెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు

నెత్తురు కక్కుకుంటూ
నేలకి నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే

ఇంకా సాహసి, అవతలి గట్టు, పరాజితులు కవితల్ని కూడా మినీ కవితలు గానే గుర్తించాల్సి వుంటుంది. శ్రీశ్రీ తరువాత ఇతర ప్రముఖులు చాలామంది మినీకవితలు వ్రాశారు. కే శే మాతల పాటి గంగాధరం విరివిగా వ్రాశారు. కానీ మినీ కవితలు విరివిగా వెలువడింది ఈ ఐదారు సంవత్సరాల్లోనే. ఈ మధ్యన వచ్చిన సంపుటాల్లో చాలా మినీ కవితలు చోటుచేసుకున్నాయి.

చాలా మినీ కవితల చివర్లో మలుపుంటుంది. దాంతో ఆ కవితకి అందం వస్తుంది. గమ్మత్తైన మార్పు జరుగుతుంది. అయితే ప్రతీ మినీ కవితలో మలుపుండాల్సిన అవసరంలేదు. అయితే

కొందరు మలుపే ముఖ్యం అన్న భ్రమలో వున్నారు; దేవరాజు మహారాజు కవిత 'దర్శన'

ఇన్ని వేల సమాధుల్లో
ఏ ఒక్కటి తెరచినా
ఒక రచయిత తన ఆలోచనలతో
సజీవంగా బయటకొస్తాడు

మూగగానే
గతంలోకి, తన నిర్ణీత కాలంలోకి
చటుక్కునపోయి నిల్చొంటాడు

నిశ్శబ్దంలో
సమాధుల మధ్య కూచున్నట్లుంది
ఈ లైబ్రరీలో
పుస్తకాల మధ్య కూచుంటే

మినీ కవిత క్లుప్తంగా వుంటుంది కనుక కొన్ని కవితల్లో శీర్షిక కూడా కవితలో భాగమైపోయి, అర్థవంతంగానూ, స్పష్టంగానూ అర్థం కావడానికి దోహదపడుతుంది. ఇలాంటి కవితల్లో కవిత చదవడం పూర్తిచేసాక మళ్ళీ కవితా శీర్షిక చదవాల్సిన అవసరం వుంటుంది. శీర్షిక చదివాకే కవితకి పరిపూర్ణత లభిస్తుంది. కే. శివారెడ్డి కవిత 'జలగ'

''ఆ ఉద్యోగమేనా ?
ఆ బోడి
ఇంజనీరు
ఉద్యోగ మెవడు చేస్తాడండీ
దాంతో మనవేం సంపాయిస్తాం
వైజాగులో కంట్రాక్టు
చేస్తున్నా''

అలాగే ఆసు రాజేంద్ర 'మృత్యువు'

నా ముంగిలి ముందు నుంచుని
ఓరగా చూస్తుంది
నే నెప్పుడు తలుపు తీస్తానా అని
నేను తలుపు తీసానో
అది లోపలికి
నేను బయటకి

కవిత్వానికి సెటైర్ ప్రాణం లాంటిది. సెటైర్ని ప్రధానం చేసుకుని చాలా మినీ కవితలు వచ్చాయి సెటైర్ గుండెలోకి ఎంత లోతుగా గుచ్చుకుంటుందో చూడండి 'ప్రగతి' కవితలో

బస్సులు పోకని
గొడ్రాలు
ఈ రోడ్డు
ఈ బల్బు బతుక్కి
కనెక్షన్లన్నీ వున్నాయి
కరెంటు లేదు

పై కవితలో దేవరాజు మహారాజుగారు దేశప్రగతిని గొడ్రాలుగా పోలుస్తారు. ఆపోల్చడంలోవున్న సెటైర్ మనకు గగుర్పాటు కలిగిస్తోంది.

చిన్న కవితలో కూడా స్పష్టమైన చిత్రీకరణలు, కొత్త వర్ణనలు వస్తున్నాయి. ఆ వర్ణనల ద్వారా కనిపించే పదాల కవతల పఠిత తనలో తానూ ఎన్నో విషయాల్ని వూహించుకుంటాడు. 'రేప్' అనే కవితలో ఒక'రేప్'దృశ్యాన్ని నేపధ్యంలో నడిపిస్తున్నట్లు రాత్రిపోయి తప్పక ఉదయం వస్తుందన్నట్లు, ఒకే కాలంలో పఠిత రెండు విషయాలను అర్థం చేసుకుంటాడు. జయధీర్ తిరుమలరావు కవిత 'రేప్'

ఆకాశం
చుక్కల రవికను చించి
వెన్నెల బ్రా హుక్కు
చంద్రుణ్ణి పీకి
నీలం లాగా
నలుపోతీ లాగి పారేస్తేగాని
రేపు కాదు.

పై కవితలో ఓ తరహా ప్రయోగం వుంది. మినీ కవితల్లో కూడా ప్రయోగాలు జరుగుతున్నాయి. మిరియాల రామకృష్ణ ఇన్స్టాంట్ కవితల పేరుతో కొన్ని మినీ కవితలు వెలువరించారు. దాంట్లో చెప్పుకోతగ్గ ప్రయోగం ఏవీ లేదు ఒక్క పేరు తప్ప.

$=$, $\times$, $\div$ ( ) వంటి చిహ్నాలు మినీ కవితలో చోటు చేసుకుని ఆధునికతకే కాక, ప్రయోజన సాధనలో కూడా ఈ చిహ్నాలు ఉపయోగపడుతున్నాయి. అంకిత కేశవులు తన కవితలో ఎలా వాడుకున్నాడో చూడండి.

నువ్వు + డబ్బు = హీరో
నువ్వు − డబ్బు = జీరో
పైసామే పై పరమాత్మా
దేర్ ఫోర్
దేవుడికి గోలీమారో

ఇలా అనేక శాస్త్రీయ పద జాలాన్ని, సాంకేతిక చిహ్నాలను ఉపయోగించుకుంటూ కవితలలో సామాజిక అర్థాన్ని ప్రతిపాదిస్తున్నారు కవులు

వ్యక్తిపై కవిత్వం వ్రాయాలంటే ఎన్నో పేజీలు వ్రాస్తే కానీ తెగేది కాదు. కాళోజీ నాలుగే నాలుగు ముక్కల్లో 'జె. పీ.'పై ఎలిజీ వ్రాసి మినీ కవితకి అందాన్ని చేకూర్చాడు.

పుటక నీది
చావు నీది

బతుకంతా
దేశానిది.

కొన్ని సంఘటనలూ, ప్రకృతి వైపరీత్యాలూ యుద్ధాలూ సంభవించినప్పుడు కవి స్పందించి ఆయా సందర్భాలపై కవిత్వం వ్రాస్తాడు. బెంగాల్ కరువు నుంచి ఆంధ్రలో ఉప్పెన వరకూ, ప్రపంచ యుద్ధాల నుంచి, భారత పాక్ యుద్ధం వరకూ ఎన్నో సంఘటనలమీద కవిత్వం వెలువడింది. 1977లో ఉప్పెనని ప్రతిబింబిస్తూ తెలుగున విరివిగా కవిత్వం వెలువడింది. వాటిలో స్మైల్ వ్రాసిన కవిత 'ఈ బాధకి టైటిల్ లేదు'

శవాల సముద్రపు తాడెత్తు అలల్ని
నా
కన్నీటి కరకట్టతో
అడ్డుకుంటున్నాను
రాముడేడీ ?
రాజకీయుడేడీ ? ?
శవాల్లోగానీ లేరు కదా
నన్ను ముంచెత్తడానికి

అలాగే 'సంజీవదేవ్' తుఫాను గురించి వ్రాసిన కవిత తుఫానులో కొంగ'

నిసీదపు నిబిడ తిమిరంతో
వర్షధారల వలయాన్ని చీల్చుక
ఎగిరిపోయింది
నల్లతుఫానులో తెల్లకొంగ
పొగడ చెట్టు గూటి నుండి;
ఎగిరిపోయింది తెల్లకొంగ
అంతానుదాటుతూ
అనంతాల వైపుకు;
ఎగిరిపోయిన తెల్లకొంగ
నల్లతుఫాను అంతరించినా
గూటికి రాలేదు తిరిగి
తెల్ల తెల్లగా తెల్లవారినా !

ఎంత సామాజిక స్పృహతో మినీ కవిత్వం బయలుదేరినా అందు కొంత వేదాంత ధోరణి కూడ ప్రవేశించింది. మూడు ముక్కల్లో వేదాంత సారాన్ని చెప్పాడు చంద్రసేన్ తన కవిత 'ముక్కంటి తెలివి'లో

కన్ను తెరిస్తే జననం
కన్నుమూస్తే మరణం
రెప్పపాటే కదా ఈ ప్రయాణం

మినీ కవిత్వంలో ఇంకా ముందుకు సాగితే — కవి సంఘంలోని ఆర్థిక, సాంఘిక సంఘటనలకి స్పందించినట్లుగా తను వ్యక్తిగా కొన్ని స్పర్శలకు కూడా స్పందిస్తాడు. ప్రస్తుత వ్యవస్థలో ఇలాంటి కవితలు రావడం సమంజసం కాదు అయినా వస్తున్నాయి.

వి. సూ. మూర్తి కవిత

గుండెలో
చూపుల
గుండు సూదులు
గుచ్చి
ఆకుపంక్చర్
అంటావేం.

అన్ని రకాల విషయాలపై కవిత్వం వెలువడినా, సామాజిక స్పృహతో, విప్లవోద్దేశ్య భావంతో కూడిన కవితలు విరివిగా వస్తున్నాయి. కవులు ఎక్కువగా మధ్యతరగతి, అట్టడుగు వర్గాలనుంచి వచ్చినవారు కనుక జీవితమూ, రాజకీయాలూ ముడివేసివున్నాయి కనుక సామాజిక అవసరం కనుక ఇలాంటి కవితలు విరివిగా వస్తున్నాయి. ఉద్యమాలూ, పోరాటాల ప్రభావం సాహిత్యంపై వుంటుంది. తెలంగాణా ప్రాంతం పోరాటాల గడ్డ. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకమైన పోరాటం. తరువాత రైతాంగ పోరాటాలు నేటి కవులకు ముడి సరుకు. కొందరి కవుల కవితల్ని పరిశీలిద్దాం.

అలిశెట్టి ప్రభాకర్ కవిత 'దొర'

సువ్వెరిమి చూసినప్పుడేమో
వూరంతా పాలేర్లే
వాళ్ళే వూర్నించి తరిమిగొడ్తే
నీ బతుకంతా పల్లేర్లే —

చెరబండరాజు కవిత 'హక్కు'

చెట్టులో ప్రాణం వుందని నరకొద్దనమ
ప్రకృతి కంటమని ఆకులు కొయ్యొద్దనమ
కొమ్మలు చెట్ల చేతులని విరగ్గొట్టద్దనమ
ఎందుకంటే నాకు గుడిసె కావాలి

ఎన్. ఎన్. నాయికర్ కవిత 'రక్తదానం'

మా నెత్తురు పీల్చి పీల్చి
మత్తెక్కిన మీరు ఒళ్ళు బలిసి
ఎప్పుడో, ఒకప్పుడు
కాస్తంత, రక్తం వదిలించుకుంటే
ఔరా, ఎంతటి పబ్లిసిటీ మీకు

ఆర్. దామెర కవిత 'అతడేం చేస్తాడు'

కళ్ళలో ఎర్రటి జీరలు
బిగి పిడికిళ్ళు
మండే కడుపు
స్పష్టంగా తెలుస్తూనే వుంది
ఆతడేం చేస్తాడో

ఇంకా ఈవిధంగా సామాజిక అవసరాల గురించి చాలా కవితలొచ్చాయి. వాటిని పేర్చుకుంటూపోవడం ఈ వ్యాసకర్త ధ్యేయం కాదు కాని అనేక కోణాల్నించి పరిశీలించడం కోసమే ఉదాహరణలతో చెప్పాల్సి వచ్చింది.

కొన్ని సైజుల్లో మినీ కవితల్ని పోలినా, వాటిని మినీకవిత్వం క్రింద లెక్కించలేం. సమాజనందస్వామి (దేవిప్రియ) చిత్రోక్తులు (శ్రీరమణ) టుమ్రీలు (విష్ణుల వెంకటరావు) లాంటివి. వీటి ధ్యేయం, ప్రయోజనం వేరు. ఇవి ప్రధానంగా వ్యంగ్య చిత్రీకరణ కలవి. వీటిని కార్టూన్ కవితలనొచ్చు.

మినీ కవితల్ని విరివిగా వ్రాస్తున్న నేటి యువకవుల్లో జగాష్ విలి, ఉపద్రష్టసాయి, గుడిహాళం రఘునాథం, బాన రబీందర్ నాద్, సలంద్ర, యస్సారెడ్డి వెంకటరెడ్డి, కొల్లూరి, నందిని సిధారెడ్డి, సిహెచ్ మధు, శైలకుమార్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఖమ్రొద్దీన్, వారాల ఆనంద్, రేడియమ్, గుడిమెట్ల గోపాలకృష్ణ, జింబో తదితరులు.

యువ కవులు మినీ కవితకి గౌరవాన్ని ఆపాదిస్తే, ప్రముఖ కవులు విఫలులై పాఠకుడికి మినీకవితలపై వున్న గౌరవాన్ని పోగొడుతున్నారు.

మినీ కవితకీ, దీర్ఘ కవితకీ కొన్ని భేదాలున్నాయి. దీర్ఘ కవితల్లో అంతర్లీనంగా వుండే లయ వీటిల్లో లేదు. వచన కవిత్వం వ్రాస్తున్న ప్రారంభ దశలో అది కవిత్వం కాదూ అన్న వాళ్ళూ వున్నారు. ఇప్పుడు మినీ కవితని కవిత్వం కాదూ అన్నవాళ్ళూ వున్నారు. దీనికి కాలమే సమాధానం చెప్తుంది. నేటి చారిత్రక అవసరం పాటల తరువాత మినీ కవిత్వమే!

దీర్ఘకవిత వ్రాయడానికి కవి మనస్సులో ఎంత సంఘర్షణ అయితే జరుగుతుందో, దానికి సమానమైన సంఘర్షణ జరగందే మినీకవిత రాదు. మినీ కవిత్వమే గొప్ప కవిత్వమని, ఇది ఈ విధంగానే నిల్చిపోతుందని వాదించడం సబబుకాదు. సంకీర్ణమైపోతున్న ఈ జీవిత విధానానికి స్పందిస్తూ కవులు ఎలాంటి ప్రయోజన పూరిత ప్రయోగాలు చేస్తారో వేచి చూడాల్సిన అవసరం వుంది.

మినీ కవితలపై సరైన, సమగ్రమైన విమర్శ రావడమే కాకుండా, ఒక్కొక్క కవి చేస్తున్న కృషిని తులనాత్మకంగా పరిశీలించాల్సిన బాధ్యత విమర్శకుల పైన వుంది.

ప్రస్తుత మీ తరంలో సమగ్రమైన మినీ కవితా సంకలనం రావాల్సిన అవసరం ఎంతో వుంది.

జింబో

వెలుగులోకిరాని వాస్తవాలు
శ్రీ ఆలూరి బైరాగి : చరమ జీవిత విశేషాలు

1978, సెప్టెంబరు నెలలో, మరణించిన బైరాగిగారి రచనా వ్యాసంగ విశేషములను గురించి, 1979, మేనెల, 'భారతి'

సంచిక యందు నిఖిల్‌గారు ''అపనమ్మకపు నీడల్లో కవి బైరాగి'' శీర్షికను, ఓ వ్యాసము ప్రకటించడము జరిగింది.

ఇలాగే, ''సంధ్యశ్రీ''గారు ''1×0'' శీర్షికగల, ఓ వచన గేయాన్ని కుండలీకరణము (బ్రాకెట్) నందు ''అపనమ్మకంలోని నమ్మకాన్ని నమ్మిన బైరాగి కోసం'' – 1979 నవంబరు నెల, 'భారతి' యందు ప్రచురించడము జరిగిన తర్వాత – శ్రీ బైరాగి జీవితవిశేషాలను గురించి ఆలోచనలు, నా మెదడునందు అప్పుడప్పుడు రేగుచుండెడివి.

నా స్వస్థలమైన నెల్లూరు జిల్లా కావలి పోయినపుడు ... తరచు శ్రీ కె. వి. రమణారెడ్డిగారిని కలుసుకోవడం జరుగుతుంటుంది. ఒకరోజు శ్రీబైరాగి విషయం ప్రస్తావించగా.. ఉత్తరాది హిందీ రచయితల ప్రభావానికి లోనైనాడని మాత్రమే ... ఆయన నాకు చెప్పగలిగాడు.

ఆ తర్వాత నేను, ప్రపంచ తెలుగు మహాసభా నిర్వాహకులు ప్రచురించిన ''తెలుగువాణి'' అను హిందీ సంచికను, దక్షిణ భారత హిందీ ప్రచార సంఘం వారి ఆధ్వర్యమున వెలువడుచుండెడి ''స్రవంతి'', శ్రీ గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారు వ్రాసిన ''అక్షరాభిషేకము'' ఎదువుచుండగా బైరాగిగారి చరమ జీవిత విశేషాలకు అవసరమైన కొన్ని ఆధారాలు లభించాయి.

ఆ లభించిన ఆధారాలకు, వివిధ రచనలను చదివే పాఠకుడిగా బైరాగిగారి రచనలను చదివిన నాటి జ్ఞాపకాలను సమన్వయం జేస్తూ ''అపనమ్మకపు క్రీనీడల్లో'' నిలిచిన బైరాగి చరమ జీవిత విశేషాల్ని ఈ చిన్న వ్యాసమునందు తెలియజేయడానికి మాత్రమేగాక, నిఖిల్‌గారివంటి కొందరు రచయితలు తమకు నచ్చిన సిద్ధాంతాన్ని వదలి – ఆయా రచయిత కానీండి, కవి గానీయండి – ఆధ్యాత్మిక రంగమున ప్రవేశించిన వారిని అపనమ్మకస్తులనీ... శూన్యవాదులనీ విమర్శించడము...తొందరపాటు కాగలదని – తెలియజేయడానికి – రాస్తున్నాను.

తెనాలి పట్టణము, రామకృష్ణయ్య కవిగారి హయాము నుంచీ, సాహితీ కేంద్రముగా ప్రసిద్ధి జెందినది. ఆ తెనాలి కేంద్రము, కవిరాజు త్రిపుర్నేని రామస్వామి చౌదరిగారు–సూతాశ్రమం స్థాపించి . సాహిత్య సృష్టి చేయడమేగాక నాటి సమాజంలో, గొప్ప సంచలనం కలిగించిన మేధావి!

తొలుత వారి సారస్వత ప్రభావమువలన ఉద్విగ్నులైన అనేక మంది యువకులతోటు వారి కొమారుడైన, గోపీచంద్‌గారి తోటి వహా–స్వరాజ్య సంపాదనకోసరం...సాంఘిక చైతన్యము కోసరము, యం. యన్. రాయిగారి, ర్యాడికల్ హ్యూమనిజమ్ వేపు మొగ్గుజూపి, చేవగలిగిన రచనలు చేశారు.

అలాంటివారియందు ఆలూరి బైరాగి చౌదరిగారొకరు. వీరు ఉత్తర హిందూస్థానమునకుబోయి హిందీ భాషయందు, ఉన్నత విద్య నేర్చి వచ్చారు.

వీరు మన ప్రాంతానికి వచ్చేటప్పటికి అన్నగారైన చక్రపాణి (ఆలూరి వెంకట సుబ్బారావు)గారు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు, తెనాలిలో ఉండే రోజులలో...నిర్వహించుచుండిన యువ, ముద్రణాశాలను కొని–ఆ ప్రెస్సును, ఆచాంప్పన్ వీధి–మదరాసుకు మార్చి...యువ ప్రచురణలను ఆరంభించి, స్వర్గీయ శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారిద్వారా, శరత్‌బాబుగారి నుంచి, ఆయన బెంగాలీ నవలలను తెలుగు అనువాదంజేసి ప్రచురించుకొనుటకు, అనుమతి సంపాయించి, శరత్ నవలా సాహిత్యాన్ని తెలుగు వారికి పరిచయము చేసిన తెలుగు రచయితలలో, మొదటివాడు మాత్రమేగాక – క్షమించాలి (బిందుగార్బ్బాయిలాంటి కొన్ని శరత్ నవలల్ని శివరామశాస్త్రిగారు అనువదించారు) ద్వితీయ ప్రపంచ యుద్ధము పూర్తి అయిన తర్వాత, 1944–45, ప్రాంతమున ''ఆంధ్రజ్యోతి'' అను మాస పత్రికను నెలకొల్పడమేగాక–స్వరాజ్య అవతరణానంతరం, 1948, ప్రాంతమునందు, 'యువ' అను మాసపత్రికను కాలేజీ విద్యార్థుల కోసరం పిల్లల కోసరమంటూ– ''చందమామ'' ఆరంభించారు

ఆ రోజుల్లో, శ్రీబైరాగి హిందీ 'చందమామ' సంపాదకత్వ బాధ్యత నిర్వహించడమేగాక–తెలుగు చందమామకు గూడా రచనలు చేసేవాడు.

* * *

గోపీచంద్‌గారు, గోర్కీ ''భయస్థుడు'' చదివి, ఉద్విగ్నుడైనతర్వాతనే, అసమర్థుడైన, శీతారామారావుపాత్రను సృష్టించి ''అసమర్థుని జీవిత యాత్ర'' నవల రాయగలిగాడు. ఎందుకంటారా? గోర్కీ ''భయస్థుడికి–గోపీచంద్ అసమర్థుడు, శీతారామారావు పాత్రలకు ఎన్నో పోలికలున్నాయి.''

ఈ ''అసమర్థుని జీవితయాత్ర'' నవల, తొలుత 1945 ప్రాంతమున ''ఆంధ్రప్రభ'' ఆదివారము అనుబంధమునందు, ధారావాహికంగా వెలువడి–ఆ తర్వాత పుస్తకరూపంగా వెలువడింది.

గోపీచంద్‌గారు, బైరాగిగారు చాలా సన్నిహితులు గావడం వలననే, 'అసమర్థుని జీవిత యాత్ర'యందు బైరాగిగారి ఒక గేయ శకలం వాడడం జరిగింది.

1950, అని జ్ఞాపకం! స్వర్గీయ శ్రీ ఖాసా సుబ్బారావుగారి సంపాదకత్వమున మదరాసునుంచి వెలువడుచుండిన ''తెలుగు స్వతంత్ర'' వారపత్రికలో శ్రీయుతులు నారాయణరెడ్డి, దాశరథిగార్ల కవితలతోపాటు, బైరాగిగారి ''నూతిలో గొంతుకలు'' లాంటి తెలుగు కవితలు వెలువడ్డాయి.

2

ఆంధ్రరాష్ట్రము అవతరించి కర్నూలు రాజధాని అయిన తర్వాత 1955 ఫిబ్రవరిలో మన ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ సాధారణ (మధ్యంతర) ఎన్నికలు జరిగాయి.

మధ్యంతర ఎన్నికలు ప్రకటింపబడిన రోజులలోనే...మాస్కో యాత్ర ముగించుకుని వచ్చిన, శ్రీశ్రీగారు ''ప్రాసక్రీడలు'', తెలుగు స్వతంత్ర యందు వెలువరించడము ఆరంభించి...రష్యావేపు మొగ్గు జూపే కొన్ని కొన్ని వ్యాఖ్యలు చేయడం వలన, ఆయన సారధ్యము క్రింద అంతవరదాకా ఉంటుండిన, ఆనాటి అభ్యుదయ రచయితల సంఘంలో చీలిక ఏర్పడింది.

అప్పుడే! ''ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ'' పత్రికలలో, ప్రజాస్వామ్యవాదులైన, తెలుగు రచయితల వర్గీకరణోద్యమము ఆరంభమై ప్రజాస్వామ్యమునందు విశ్వాసము కల్గిన తెలుగు రచయితల అభిప్రాయాలు వెలువడ్డాయి.

కావలి వంటి వివిధ ప్రాంతములందు శ్రీయుతులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, పాలగుమ్మి పద్మరాజుగారిలాంటివారు సభలుపెట్టి ప్రజాస్వామ్యము అధికారమునందుండే దేశాలలో రచయితలకు ఉండే స్వేచ్ఛావాతావరణాన్ని గురించి ప్రసంగాలు చేయబడ్డాయి. ఆరుద్రగూడా ''ఉద్యమ నాయకాభకో'' అనే గేయం ''శ్రీ శ్రీ'' గారిని విమర్శిస్తూ – స్వతంత్రలో ప్రకటించారు.

''ఆంధ్రప్రభ'' నిర్వహించిన ''నేనెలా ప్రజాస్వామికవాదిని అయినాను?'' శీర్షిక యందు, శ్రీ బైరాగిగారి వ్యాసము గూడా వెలువడింది. అంతే? ఆ తర్వాత, బైరాగిగారి రచనలు ఏవీగూడా, ఏ పత్రికలోనూ చదివినట్లు జ్ఞాపకంలేదు.

మానవుడియందు మార్పు రావటమనేది సహజం!

1955 ఫిబ్రవరికి పూర్వమే హిందీకవి, గజానన్ మాధవ్, ముక్తిబోధ్ కవితా ప్రభావము, బైరాగిగారిమీద శక్తివంతంగా పని చేసింది. అట్లా కాని ఎడల, అంతవరదాకా, ర్యాడికల్ హ్యూమనిజమ్‌మీదా; మార్క్సిజమ్ మీదా ఆయనకుగల ప్రగాఢ విశ్వాసం సడలనిదే – 1955 లో, శ్రీశ్రీగారి అభ్యుదయ రచయితల ఉద్యమానికి, వ్యతిరేకమైన, ప్రజాస్వామిక వాదులైన రచయితల వర్గీకరణ ఉద్యమాన్ని సమర్థిస్తూ – ''ఆంధ్రప్రభ''యందు వ్యాసము ప్రకటించలేడు కదా?

అందుకనే! నిఖిల్ గారు చెప్పినట్లుగాక – బైరాగిగారియందు అంతవరదాకా–అతనిమీద అధికారాన్నిచలాయించిన, మార్క్సిజమ్, ర్యాడికల్ హ్యూమనిజమ్ ప్రభావాల్ని – గజానన్‌గారి ముక్తిబోధ్ ప్రభావము ఒక్కసారిగా తుడిచివేసి – అతనిమీద అధికారం వహించింది. ఆ రోజులలోనే బైరాగిగారు, ఆంధ్రప్రభలో (1955) ఆ వ్యాసము వ్రాయడం జరిగి ఉంటుందనుకుంటున్నాను.

మన రచయితలలో కొందరు ఉన్నట్లుండి తాత్వికులుగా మారిపోతూ ... తాత్విక చింతనలో, ప్రశాంత జీవనము ఏర్పరచుకుని, పూర్వాశ్రమమువందు తాము నిర్వహించిన కార్యకలాపాల్ని వదిలివేస్తుంటారు. అలాంటి కోవకు జెందినవాడు బైరాగి చౌదరి గారని నా అభిప్రాయం.

ఇవాళ బైరాగివివిధ రచనలకోసరం గాలింపు జరుగుతోంది. దొరికిన ఆయన రచనలు వివిధ పత్రికలు ప్రచురిస్తున్నాయి.

ఐతే! 1955 తర్వాత బైరాగిగారి సాహితీ కృషిని గురించి కూడా వెలుగులోనికి రావాల్సిన విషయాలు ఉండవచ్చునని అనుకుంటున్నాను.

అంతేగాని, ఏవో కొన్ని ఇజాలకు, భావాలకు దూరమైనంత మాత్రాన, ఓ కవి...ఓ రచయిత...నైరాశ్యంలో బడిపోయాడను కోవడం ... కవితలు రాయడం . తొందరపాటు మాత్రమేగాక ... విడ్డూరమే కాగలదు!!

పాశ్చాత్య రచయితలు ఎంతోమంది కేవలం, భౌతిక వాదనల తోటి – భావనలతోటి సతమతమవుతూ అలసిపోయి... విఫలులై ... ఎంతమంది పాశ్చాత్య రచయితలు ఆత్మహత్యలు జేసుకోవడం లేదు?

అదృష్టవశాత్తు మన భారతదేశం ఎలాంటి నిరాశాపరుడికైనా, ఆత్మబలాన్ని ప్రసాదించే అమూల్యాలైన తత్వశాస్త్రాలు, భగవద్గీతలాంటి గ్రంథాలెన్నో ఉన్నాయి. మరి ఇలాంటి టానిక్కుల వలననే, మన మేధావులు, ఆత్మహత్యలకు గురికావడం లేదనుకుంటాము.

చలంగారు ఏంజేశారు? విజయవాడలో ఒకరోజు తన రచనలన్నిటిని పాయిలోబెట్టి నిప్పంటించబోయారు – నైరాశ్యంలోబడి! దాని రిలీఫ్ కోసరమే రమణాశ్రమంలో చేరి ... తాత్వికుడిగా ... జీవితశేషం గడిపాడు??

ఇలాగే, స్వర్గీయ శ్రీగోపీచంద్‌గారు కూడా ''ప్రియురాలు'' చిత్రం ఫెయిల్ గావడంతోటి, చిత్ర నిర్మాతలకు, అతనికి వచ్చిన మనస్పర్థల వలన చలనచిత్ర రంగం నుంచి యువతలికి వచ్చినాగూడా ...చాలా రోజులు, రచనలు చేయలేకపోయాడు.

అరవిందాశ్రమానికి పోయి...రిలీఫ్ చెందిన తర్వాతనే, గోపీచంద్‌గారు ఆ షాక్ నుంచి తేరుకొని, ''పోస్టుచెయ్యని ఉత్తరాలు,'' ''మెరుపు మరకలు'' లాంటి రచనలు అవిశ్రాంతంగా, జీవితాంతం వరకు చేశాడు.

అలాగే, 1955నాటి మన ఆంధ్ర రాజకీయమైన సంఘటనలు, బైరాగి చౌదరిగారిని ఆ తర్వాత రచనా వ్యాసంగం నుంచి, దూరంజేసిఉంటాయని ఎందుకనుకోగూడదో ఆలోచించమంటాను.

[ఈ వ్యాస రచనయందు నాకు ఉపకరించిన పత్రికల సంపాదకులకు, రచయితలకు ఎంతేనియు కృతజ్ఞుడను.]

శ్రీ సోమరాజుపల్లి చెంచయ్య

లే ఖ లు

తెలుగు - ఇంగ్లీషు సమాన అర్థ, సమాన ధ్వనికల శ బ్ద ము లు

జూన్ 1980 భారతిలో శ్రీ గంటి రామలింగంగారు ఇచ్చిన పట్టికకి, తెలుగు – ఇంగ్లీషు భాషలలో దాదాపు సమానార్థక సమాన ధ్వనిపూరిత శబ్దములను—పందికొక్కునుండి **Bandicoot** వచ్చినట్లు కాక—, ఆయా భాషలలో స్వతస్సిద్ధముగా వాడుకలో నున్నవానిని—ఇచ్చుచున్నాను.

తెలుగు	ఇంగ్లీషు
లేక	Lack
గాలి	Gale
చిల్లు	Chill
మూతి	Mouth
త్రాడు	Thread
గంటు	Knot
కప్పెర / కొప్పెర	Cup

ఇవి **Cognate** పదములూకావు. **Loan** పదములూకావు. వీని సామ్యము యాదృచ్ఛికమని నా విశ్వాసము.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

అనంతపురం

నా మ న వి

భారతి జూలై 1980 సంచికలో ''జాతి నిర్మాత'' గ్రంథ విమర్శ చేసిన కళాప్రపూర్ణ డా. మరుపూరు కోదండరామరెడ్డిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారు వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలకు నా సమాధానం ఇవ్వదలిచాను.

''హిందీ విషయంలో (త్రిభాషా విధానం) సర్వజనామోదకరమైన వాదం ఈయన చేయడంలేదు. ఆంధ్రులు హిందీకి వ్యతిరేకులనుటసత్యదూరం.'' అన్నారు. హిందీ సర్వజనామోదకరం కాదనేది అందరూ ఎరిగిన సత్యం. ''1919లోనే గాంధీజీ త్రిభాషా సూత్రాన్ని సూచించిఉన్నా'' అది ఇప్పటికీ ఆమోదయోగ్యం కాకపోవటం మనం గమనిస్తూనే వున్నాము. మహా మహా మేధావులే అనుసంధాన భాష విషయంలో వివాదాస్పదమైన అనేక ప్రాయాలు వెల్లడిస్తున్నారు ప్రజాభిప్రాయం కూడా అట్లాగే ఉన్నది. ఒక్క మన ఆంధ్రులేకాదు, దేశంలోని ప్రాంతీయ భాషలు మాట్లాడే మరో 13 రాష్ట్రాల ప్రజలు కూడా హిందీని బలవంతంగా తమపై రుద్దటాన్ని వ్యతిరేకిస్తున్నారనేది పత్రికా సాక్ష్యం. ''అసలు అరవలే మూకఉమ్మడిగ వ్యతిరేకులుకారు. ఏటేటా 40 వేలకుపైగా హిందీ పరీక్షలకు కూర్చుంటున్నారు'' అని వ్రాశారు. కావచ్చు. పరీక్షలకు కూర్చోవటం హిందీని అధికార భాషగా అంగీకరిస్తున్నట్టు ఎట్లా అవుతుంది? పరీక్షలు వ్రాయటం ఉద్యోగాలు సంపాదించటానికే కాని, హిందీని ఆమోదిస్తున్నట్టు ఎట్లా చెప్పగలము? ''డి. యం. కె. వారి గోల రాజకీయవ్యూహం'' అనుట పూర్తిగా సముచితమవుతుందా? అది కేంద్రంలో అధికారంలో వుంటున్న పార్టీ సమర్థించుకుంటున్న తీరు. స్వాతంత్ర్యం వచ్చి ముప్ఫయి మూడేళ్ళు కావచ్చినా భాషా సమస్యను పరిష్కరించలేని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ జవాబు చెప్పలేకపోతున్నది.

''బ్రిటిషువారు గుమాస్తాల ఉత్పత్తికి విద్యావిధానం సాగించారనటం మేలు చేసిన అయ్యలను మరచిపోవటమే'' అన్నారు నేను నా రచనా పరిధిలో తీసుకున్న విషయంవేరు. ఎన్ని విద్యావిధానాలు వచ్చినా స్వయం పోషకమైనవిగా లేకపోవటంవలన వ్యక్తి జీవనోపాధికి ప్రయోజనకరంగాలేవని కావ్యంలో చెప్పాను. మీరన్నట్లు—బ్రిటిషు విద్యా విధానం హైందవ విజ్ఞానానికి పునర్జన్మ కలిగించినమాట నిజమే. కాని, ఎంత చదివినా విద్యావంతుడయిన వ్యక్తి తన కాళ్ళపై తాను నిలబడగలశక్తిని పొందలేకపోతున్నాడు కేవలం, ఉద్యోగాల కోసమే చదివి, ఉద్యోగం లేకుండా బ్రతుకలేని స్థితిలో వున్నాడు, భారతీయ విద్యావంతుడు. ఇందుకు దోహదం చేస్తున్నది పాశ్చాత్య విద్యావిధానమేకదా! అదే నా రచనలో సందర్భోచితంగా చెప్పాను.

శ్రీ గోవర్ధనగిరి శ్రీరాములు

ఎల్లాపూర్

ఇద్దరిదీ అనుసరణలే !

జూన్ భారతి కలగూరగంపలో 'పెన్నా శిరాక్స' గారి లేఖ జూచితిని. అందు బి. చంద్రగారి (మే. భారతి) 'పునర్జన్మ' యను కవిత శేషేంద్రగారి కవితా పంక్తులకు యనుకరణయన్నట్లారోపించియున్నారు. కాని శేషేంద్రగారి ''ఒక రాలిన గింజను మట్టిలో పూడ్చి పెడ్తే దానికి అంత్యక్రియలు చేసినట్టుకాదు, దాని ప్రాణం భూమిని చీల్చుకొని ...... కొమ్మలు ధరించి పూస్తుంది'' (సముద్రం నాపేరు—పేజి 18) అన్న పంక్తులు శివారెడ్డిగారి 'రిజరెక్షన్'లోని ''నేను మట్టికింద పాతిపెట్టబడి మొలుస్తున్న చేతుల కాళ్లవాడ్ని'' (రక్తం సూర్యుడు—పేజి 16) అనే భావానికి యనుకరణలని నందిని సిధారెడ్డిగారు (ఆగస్టు 79, భారతి పేజి, 68) తేల్చియున్నారు.

అసలు విషయమేమిటనగా—బి. చంద్రగారి కవితాపంక్తులు, శేషేంద్రగారి కవితా పంక్తులు ఇద్దరివీ శివారెడ్డిగారి కవితకు అనుసరణలే !

పెన్నా శివరామకృష్ణ గారు సగము దెలిసి మాట్లాడుట సముచితము గాదు.

శ్రీ గుడిహాళం అంజయ్య
హైదరాబాదు

తప్పు

1980 ఫిబ్రవరి సంచికలో శ్రీ శశికాంత్ శాతకర్ణిగారు తమ 'అరిటాకు బావుటా' కవితలో

"రాత్రంతా మంచులో తడిసిన సంపెంగ ఉదయాన్నే సురభిళం వెదజల్లుతుంద"ని వ్రాసారు.

ఎందువల్లనంటే, మంచులో తడిసిన, విరిసిన సంపెంగ పరిమళించే శక్తిని కోల్పోతుంది. హేమంతపు చలికి నిలద్రొక్కుకో గలిగే పువ్వు 'చామంతి పువ్వొక్కటే'. అసలు నిజానికి, సంపెంగ ఉదయాన్న పరిమళం వెదజల్లదు. సాయంత్రం వేళల్లో మాత్రమే వెదజల్లుతుంది.

భగ్వాన్
పంజావేమవరం

కవితలు

ఆచార్య తల్లోజుగారు 'భారతి'లో ఇటీవల వచ్చే కవితల్ని చూసి నవ్వాలో ఏడ్వాలో అన్న భావం వ్యక్తం చేశారు. దీనిని శ్రీ లింగంపల్లి రామచంద్రరావుగారు విమర్శించారు. నేను కూడా పూజ్యులు శ్రీ తల్లోజు వారితో ఏకీభవిస్తున్నాను.

ఇటీవలి కాలంలో మన ఆంధ్రజాతి చాల హీనస్థితికి దిగజారింది! జాతికి పట్టిన జాడ్యం తెలుగుదేశపు కవిత్వానికి కూడా అంటుకుంది! కవిత్వమంటే .. ... ఏవో నాలుగు మాటల్ని పేర్చి ముక్కలు ముక్కలుగా కత్తిరించి వ్రాయుటమే అన్నభావం వేళ్ళు తన్నుకపోయింది మనలో. పైగా నేటి కవిత్వంలో అనవసరమైన ఆంగ్లపదజాలం వాడడం పరిపాటి అయిపోయింది. ఆంగ్లపదాలుంటేనే అది ఆధునిక కవిత్వం అని వాదించే వాదవివాద బ్రహ్మలు కూడ లేకపోలేదు. బోడ్డాడని 'మహా'కవులు, జంబుకశ్రీలు—రకరకాల తలా తోకాలేని కవిత్వాలతో పత్రికల కెక్కుతున్నారు. వారు వ్రాసిందే కవిత్వమని భ్రమిస్తున్నారు పాఠకులు! పత్రికా సంపాదకులు!! కవిత్వపు పుట్టు పూర్వోత్తరాలేవో ఆలంకారిక శాస్త్రాలద్వారా అధ్యయనం చేయాల్సిన అవసరం కవి కాబోయే ప్రతి 'అర్భకుడి'కీ వుంది!

"వాక్యం రసాత్మకం కావ్యమ్"
"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం"
"గుణవదలంకృతం చ వాక్యమేవ కావ్యం"

—ఇలాంటి ఆలంకారికుల సార్వజనీన సార్వకాలిక మౌలిక కవితా నిర్వచనాలు అసలైన కవిత్వ లక్షణాల్ని నిర్దేశిస్తున్నయ్! వ్రాసేది గద్యమైన, పద్యమైన, గేయమైన—రసవత్తరంగా చమత్కార భరితంగా వుండాలి! ఇటీవలి అయోమయపు వచన కవితల్ని చూస్తే ఒకవైపు హాస్యం పుట్టుకొస్తుంది! మరోవైపు తెలుగు కవిత్వం ఇంతగా అధఃపతనం చెందిందా అని బాధ కల్గుతుంది. ఈ భావంతోనే శ్రీ తల్లోజువారు 'నవ్వాలో ఏడ్వాలో' తెలీదన్నారు ఇప్పటి కవితల్ని చూసి! కొంతమంది లబ్ధప్రతిష్ఠులు, సుగృహీత నామధేయులుమాత్రం కమనీయ కవిత్వం సృజిస్తూనే వున్నారు. అయినా అకవికుకవుల ఆర్భాటం కీర్తికండూతీ ఎక్కువైనాయి ఈ కాలంలో! ఈ పతనావస్థనుండి తెలుగుకవిత్వాన్ని పునరుద్ధరించడం సాహితీవేత్తల, విమర్శక శిఖామణుల ప్రథమకర్తవ్యం! 'భారతి' ఇకముందు అసలైన కవిత్వాన్నే ఆదరిస్తుందని ఆశిద్దాం!

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి ఏషాం యశఃకాయే జరామరణజం భయమ్"

శ్రీ కె. సుధాకరరావు
ఆదోని

క్షీణిస్తున్న తెలుగు కవిత్వం

మూత్రించటం, విసర్జించటంలాంటి విషయాలు అనాదిగా మానవుడి అవసరాలుగా ఉంటూ వచ్చాయని మనకు తెలుసు. అయితే ఈమధ్య తెలుగు కవులుమాత్రం కొత్తరకంగా కూడా ఈ అవసరాలను తీర్చుకుంటున్నారు. వాళ్ళు కవిత్వాన్ని మూత్రిస్తారు. కవిత్వాన్ని విసర్జిస్తారు. కవిత్వాన్ని కక్కగలరు కూడా! కవిత్వాన్ని 'ఎబార్ట్' చేసేవాళ్ళు కూడా కనబడతారు. ఈమధ్య, ఈమధ్యేవిటి, చాలాకాలంనుంచీ తెలుగు కవిత్వాన్నిగురించి చెప్పాలంటే ఇంతకంటే ఎక్కువ చెప్పలేం. 'భారతి' కవితలక్కూడా ఈ దుస్థితి తప్పటంలేదు.

ఏం? ఈ జాతి గొప్పకవుల్ని తయారు చెయ్యలేదా? ప్రపంచ కవితని అనుసరించే, అనుకరించే స్థితిలోకాక మనం ప్రపంచ కవిత్వంలో సమభాగస్వాములుగానో అగ్రగాములుగానో ఉండే అవకాశమేలేదా? ఉత్తరాల శీర్షికల్లో చెత్త వాగ్వివాదాల్లోనూ, చెత్త టెక్నిక్కుల్లోనూ, భజన సంఘాల్లోనూ, అకాడెమీ ప్రదక్షిణాల్లోనూ కవులుగా ముద్రవేసుకొని సంఘంలో కాలరెత్తుకొని తిరిగే కవులేతప్ప నిజంగా కవిత్వంకోసం తపించే వాళ్ళేరీ ? ఈ దేశంలో బాద్‌లేర్‌లూ, రింబోలూ, ఆంద్రే బ్రెతంలూ ఎలెన్‌గిన్స్‌బర్గ్‌లూ తయారవకపోవటానిగ్గల కారణమేవిటి ? ఈ విషయం అందరూ చాలా 'సీరియస్'గా ఆలోచించాల్సి ఉంది. 'భారతి' పాఠకులూ, ప్రచురణ కర్తలూ, కవులూ, రచయితలూకూడా ఆలోచించాలి. తెలుగు కవిత్వాన్ని 'ఎన్‌రిచ్' చెయ్యాలి.

శ్రీ ఎల్లా శివరామయ్య
వరంగల్

కవి - మహాకవి

1980 జూన్ సంచికలో 'మహాకవి' గూర్చి శ్రీ వెంపలి వెంకట శివప్రసాద్ లేఖ వ్రాయగా చదివాను. వారి లేఖనుబట్టి కవి గొప్ప ? మహాకవి గొప్ప ? అనే సమస్య ఉద్భవిస్తోంది.

అలనాడు కాళిదాసుని 'కవి కాళిదాసు' 'కాళిదాసకవి' అని మాత్రమే పేర్కొనేవారని మనకు తెల్సు. ఈనాడు కాళిదాసు మహాకవి కాళిదాసుగా పేర్కొనబడినాడు. ఎంతలో ఎంతమార్పు! అనాటి కవి ఈనాడు మహాకవి.

కవికీ మహాకవికీ తేడా గూర్చి నా మిత్రునితో చర్చిస్తుంటే జ్ఞానానికీ విజ్ఞానానికీ ఉండే తేడావంటిదే కవికీ, మహాకవికీ ఉండే తేడా అని అన్నాడు. అయినా నాకు సందేహ నివృత్తి కలుగలేదు. 'కవికీ మహాకవికీ ఉండే తేడా ఏమిటి?

శ్రీ మల్లాది కామేశ్వరరావు
దంటువారి వీధి, కాకినాడ–1

'మహాకవి' విషయము

కమ్యూనిస్టు సోదరులకు 'మహాకవి' బిరుదు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఇచ్చేరంటూ పరోక్షంగా శ్రీశ్రీగారిమీద 21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుడు రాయి వేసేరని శ్రీ వెంపలి వెంకట శివప్రసాద్‌గారు భావించడం ఏమాత్రం సమంజసంగాలేదు. పైగా శ్రీశ్రీని 'మహాకవి శ్రీశ్రీ'గా పిలుచుకోవడానికే ప్రజలు ఇష్టపడుతున్నారని ఆయన 'అభిప్రాయాన్నే' జనరలైజ్ చేసేందుకు ప్రయత్నించారు. ప్రజలివ్వని ఆ 'మహాకవి' బిరుదును ప్రజలెందుకు ఇష్టపడతారు? ఒకవేళ యిచ్చిఉంటే బహుశా వారు కమ్యూనిస్టులై ఉండి ఉంటారు. నవ్యప్రపంచంలో వారి శాంతమెంతో తేల్చుకొంటే శ్రీశ్రీని 'మహాకవి'గా పిలిచేవారిని చూసి ఏం పడాలో పాఠకులకే వదిలేస్తున్నాను.

శ్రీశ్రీ గొప్పకవే!' కాదనరు. కాని మహాకవా? ఎందుకని? విప్లవాన్ని సృష్టించారా? ఆ మాటకొస్తే గురజాడ దొక విప్లవం. రాయప్రోలు దొక విప్లవం. విశ్వనాథదొక విప్లవం. కృష్ణశాస్త్రి దొక విప్లవం. ఇంతెందుకు. పురాణయుగంనుంచి ప్రబంధ పర్వానికి రావడమొక విప్లవం కాదా? ప్రబంధాలనుంచి ఆధునిక కవితాయుగం వరిగెత్తుకొంటూ రావడం విప్లవంకాదా? ఈ విప్లవంలో కృషి సల్పిన ప్రతిఒకరూ విప్లవ మూర్తులేకదా? అంటే వారందరూ మహాకవులేనా ! కాక మామూలు కవులేనా !

కవులు నానా రకాలు. వారి భావోద్వేగాలు, విప్లవ ప్రభావాలు అంతే. డా. తంగిరాల 'వికటకవి' (భారతి, జూన్ '80) చదవండి. అర్థమౌతుంది. ఇంతకూ 21స్ట్ సెంచరీ రైటర్స్ అధ్యక్షుని మనవేంటో అర్థం చేసుకోగలిగితే కమ్యూనిస్టుల భుజం తుడుపు ఎంత అనవసరమో తెలిసొస్తుంది. సాహితీరంగంలోని ప్రముఖులంతా సహకరిస్తే 'మహాకవి' అంశపు పుట్టుపూర్వోత్తరాలపై పరిశోధించాలని మాత్రమే 21స్ట్ సెంచరీ రైటర్స్‌వారి ఆశయం. అదంతవరకే పరిమితము. అంతేకాని కమ్యూనిజానికి కాని, సోషలిజానికి కాని అందులో తావులేదు. ఈ నిజం తెలుసుకోక కేవలం 'పబ్లిసిటీ'కోసం భారతి లేఖల్ని ఉపయోగించుకోవడం అనారోగ్యకరం.

ఆచార్య తల్లోజు వారి విషయమూ అంతే. భారతిలో యిటీవల ప్రచురితమౌతున్న కవితల్ని చూచి "నవ్వాలో, ఏడవాలో" అన్నారు. అన్ని కవితలూ! అని అర్థమా? కాదు. కేవలం కొన్ని. ఏ పత్రికకైనా అటువంటివి కొన్ని తప్పవు. ఈ విషయంలో భారతి మరింత శ్రద్ధతీసుకొంటుంది. ఇక యీ విషయంపై అనవసరమైన చర్చలెందుకు చెప్పండి. హేతుబద్ధమైన తితిక్ష లేదని, అర్భకత్వమే ప్రతిచోటా ప్రత్యక్షమౌతోందని శ్రీ ఎస్. టి. వి. రామానుజాచార్యులుగారి ఆవేదనని అర్థంచేసుకొని ఆయన కోరినట్లే సంయమనాన్ని ప్రదర్శించండి. 'ఆచార్య' పదవులకు, 'డాక్టరేట్'లకు, 'కళాప్రపూర్ణ' లకు ఉన్న విలువలను గుర్తించి వ్యక్తిత్వపరధులకు పరిమితమైన విమర్శను మానుకోండి. ఇకపై భారతి లేఖల శీర్షికను సద్వినియోగం చేసుకొందాం.

నాకు జవాబివ్వదలచుకొన్న వారెవరైనాసరే యీ క్రింది అడ్రస్‌ను నిర్మొహమాటంగా ఉపయోగించుకోవచ్చు.

గుమ్మనూరు రమేష్‌బాబు
పరిశోధక విద్యార్థి, జంతుశాస్త్ర శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి–517502.

సాహిత్య లేఖ

"భారతి పత్రికలో ప్రచురితమౌతున్న వచన కవితల్ని చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో" అని ఆచార్య తల్లోజుగారు అనడంలో భారతి అర్థం పర్థంలేని వచన కవితల్ని ప్రచురిస్తున్నదన్న అర్థం తొంగి చూస్తున్నదో లేదో గాని వారు మొదట అలా అనడంవల్లా ఆ తర్వాత "జవాబు" యివ్వడంవల్లా కూడా మనం గ్రహించవల్సింది యేమాత్రం కన్పించడంలేదు.

భారతిలో పడ్తున్న యేయే వచన కవితలు యెక్కడెక్కడ అర్థరహితంగా వున్నాయో వుదాహరణ సహితంగా ఆచార్య తల్లోజు గారు పేర్కొనివుంటే సాహితీ లోకానికి మేలుచేసిన వారయ్యేవారు. కానీ ఆయన అలా చెయ్యక కేవలం "ఒక డాక్టరేటు పొందిన వ్యక్తి, శ్రీ రావి రంగారావు, పూజ్యులు శ్రీ కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి (పూజ్యులు కళాప్రపూర్ణ శ్రీ సో అండ్ సో అని వుండాలేమో!)గారు, మహామహులైన హైమవతీ, డా॥ బోయి భీమన్నగారు, డా॥ కె. వి. సుందరాచార్యులుగారు, మైనంపాటి వేంకటసుబ్రమణ్యం మొదలగువార్ని" వొత్తాసుకోసం తీసుకొస్తున్నారు.

పయివారితో సమానులూ, అంతకంటే ప్రఖ్యాతులూ అయిన శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె, కాళోజీ, కె. వి. ఆర్., సోమసుందర్ మొదలయినవాళ్ళు భారతిలో వచన కవితలు అర్థంలేనివని అనలేదు గనక అవన్నీ గొప్ప కవితలని యెవరయినా అనడంవల్ల యెంత ప్రయోజనముంటాదో ఆచార్య తల్లోజుగారు వారి ''మహామహుల్ని'' పేర్కొనడంవల్ల కూడా అంతే ప్రయోజనముంటాది. యెందుకంటే యిటువంటివన్నీ సమస్య పక్కదోవ పట్టడానికి మాత్రమే పనికొస్తాయి.

కాబట్టి వచన కవితల్ని చూడ్డమేగాదు సానుభూతితో పరిశీలించి అనుభవించి పలవరించమనీ, అవి అర్థం కానివయితేనో, అర్థం లేనివయితేనో నిర్మొహమాటంగా, సోదాహరణంగా విమర్శించి భారతికీ, ఆయా వచన కవులకీ నాబోటి కవితా ప్రియులయిన పాఠకులకీ కనువిప్పు కలిగించి ఆధునికాంధ్ర కవిత్వానికి మేలు చెయ్యండని ఆచార్య తల్లోజుగార్కి నా మనవి.

మోహనమిత్ర
కాకినాడ

ఎలాగ చెప్పాలి ?

జూన్ సంచికలో రామానుజాచార్యులుగారు (నా) ఆచార్య తల్లోజుగారి సమాధాన లేఖకు ఉత్తరం రాశారు.

'ఆయన' గారికి కవిత్వ మర్థంకానట్టే— నా వుత్తరం రా. చా. గారికి అర్థం కానట్టుంది!

1 'ఇప్పటి ఆధునిక కవితా ప్రక్రియల అవగాహనకి పరిజ్ఞానం సంపాదించుకోమని సూచిస్తూ అవహేళన ప్రదర్శించారు'— చెప్పడం సూచించడం — ఆచార్యుల దృష్టిలో అవహేళనే అవుతుందా !

2 సహృదయత, బాధలు, అనుభూతి కవిత్వానికి కావాలంటున్న వీరు నవ్వడం ఏడవడం మానేసి కవిత్వాన్ని అర్థంచేసుకోమని తల్లోజువారికి బోధించడం అవహేళనెలా అవుతుంది?

3 ఎంగిలిపడ్డ సంస్కృత పదాల్ని సమాసాల్ని కవిత్వంలో యిరికించే కవుల్ని, కవితల్ని ఆక్షేపించాను తప్ప సంస్కృతమంటే నాకు కోపంగాని అక్కసుగాని లేవు.

4 'వీరి లేఖలో సంస్కృత పదాలు వాడి ఎందుకు ఎంగిలి పడ్డారు?' అన్నారు. భావప్రకటనకు ''ఏ భాషనైనా వాడుకోవచ్చు'' అంటే అర్థంకాని భాష కూడా వాడొచ్చా?

5 ''రచయిత సామాన్య పాఠకుడ్ని పఠనాసక్తుడ్నిచేసే ధోరణిలో వుండాలి'' వున్నాయి భేషుగ్గా వున్నాయి. అయినా 'సామాన్య పాఠకు'డంటే మీ దృష్టిలో ఎవరు ?

6 'వచన కవితా ప్రక్రియల్లో సిద్ధహస్తుల రచన లలావుంచి' —ఎందుకుంచాలి? వాళ్ళను కెల్లగిస్తే పెల్లలు రాల్తాయన్న భయం—వాళ్ళననే దమ్ము మీకెక్కడిది. 'మిగిలిన రచనలన్ని ఉదాత్తాలని—అధమాలని నిర్ణయించలేం'—మరేం చేద్దాం ? అటుగాకుండా—ఇటుగాకుండా ఎటుపరి ?

7 'మనకంటే పూర్వకవులే నిజాయతీగా వున్నవాళ్ళనిపిస్తుంది' నేటి కవులుకూడా 'నిజాయతి' పరులే ననడానికి మనలో 'నిజాయతీ' ఉండాలి!

8 ఆచీ — తూచీ ఆక్షేపణలేని వ్రాతలుండాలని బురదలో ఎందుకు పడ్డారు ? 'అత్తర'ని ఎందుకు భ్రమపడుతున్నారు? నేను మీలా ఎవరి తరపునో వాదించడానికి రాలేదు. వచన కవిత్వంవైపు నేనున్నాను. ఆ కవిత్వం విషయంలో ఏ దాడికైనా సిద్ధమే.

9 'తిడితేనేగాని పేరు రాదన్న ధోరణికి అలవాటు పడ్డట్టు'— పేరుకోసం తిట్టాలనుకునే అలవాటు మా (నా)లోలేదు. పేరుకోసం తిట్టడానికి నేను రాజకీయ నాయకుడ్నికాదు. న్యాయంగా తిట్టేవాళ్ళ నోరు మూసెయ్యడానికి పదవుల్నిచ్చే మంత్రిని కాదు! పేరు రావాలని తిడతారనుకోవడం పొరపాటు. 'భారతి' 'కలగూరగంప' స్థలం చాలా విలువైంది.

10 చెప్పిన విషయాల్లో మృదుత్వం, సంయమనత్వం అర్థం చేసుకునే 'కెపాసిటీ'నిబట్టే—మనుషుల్నిబట్టి వుంటుంది.

సాహితీ మిత్రులారా! ఈ మహానుభావుడు పేరుకోసం రాస్తున్నానని (లేఖల్ని) పొడిచాడు. ఇది వ్యక్తిత్వానికి దెబ్బ. దయచేసి పై విషయంమీద, అంతకుముందు లేఖలమీద మీకెలాంటి ఆక్షేపణలున్నా–అభిప్రాయాలున్నా–అనుమానాలున్నా నాఅడ్రసుకు వుత్తరం రాయగలరు.

బెడిద రాజేశ్వర్
4-5-34, కాసెట్ గల్లీ, నిజామాబాదు.

మినీ కవిత

ఏప్రిల్ నెల 'భారతి'లో పై శీర్షిక క్రింద ప్రచురితమైన శ్రీ రావి రంగారావుగారి రచనను చదివిన తరువాత, పై అంశంపై నా అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాను. శ్రీ రంగ రావుగారు కోట్ చేసిన పద్యాలేకాక, ఆరుద్రగారి కూనలమ్మ పదాలలోనూ, మరికొన్ని దినపత్రికలలో ప్రచురించిన ఛలోక్తుల పైపులలోనూ, ఈ మినీకవిత అంశం కనబడుతుంది.

రైళ్ళ నడకలలోని విపరీతమైన ఆలస్యాన్ని అందరికీ తెలిసిన తాబేలు—కుందేలు కథలో చమత్కరించిన

''తాబేలు—కుందేలు వేసుకొన్నాయి పందం
తాబేలు నడిచింది వందమైళ్ళు
కుందేలు మారింది రెండు రైళ్ళు''

అన్న ఆరుద్ర రచన, విశాఖపట్టణంలోని ఉక్కు కర్మాగారం కోసం (ఇంతకూ ఇప్పుడిది ఏ స్టేజిలో వుందో!) జరిగిన అలజడిని గురించి, ఒక యువకవి ఏదో వారపత్రికలో ప్రచురించిన

"మాకు కావాలె ఉక్కు
దిక్కులేక చిరాకు
ఇది మా మంత్రుల పరాకు"

వంటివి ఎన్నో పేర్కొనవచ్చు.

ఇటువంటి మినీ కవితలలో ముఖ్యమైనదీ అనుప్రాస, ఒక చమత్కారం, ఒక వ్యంగ్యోక్తి. భాషపై తగినంత అధికారం వుండటమే కాక, వివిధ భాషలలోని చమత్కార పదాలను క్రోడీకరించి, "మణి ప్రవాళ భాష"వలె కవిత్వం చెప్పడం ముఖ్యం. ఉన్నపళంగా కొన్ని పంక్తులు పేర్చి, చణుకు విసిరేటటువంటిదీ కవిత్వం. ఇది మన భాషలోకన్నా హిందీ ఉర్దూలలో బాగా ప్రఖ్యాతి నొందింది. కవి సమ్మేళనలో ఈ "సాయిరీ" చెప్పినవాడే కవి. మనం కూడా, మన అష్టావధానాలల్లో ఛందోబద్ధ కవిత్వంతోపాటు, ఛలోక్తిగా కొన్ని మినీ కవితలు చెప్పే సాంప్రదాయం నెలకొల్పాలి.

ఇకపోతే కొన్ని ప్రత్యేక అంశాలపైన రచింపబడ్డ వివిధ మినీ కవితలను సంకలనం చేయవొచ్చు. అయితే వీటిని తెలుగు సాహిత్య విద్యార్థులకు అవశ్య పఠనీయ అంశాలుగా చేర్చాలనడం, కొద్దిగా అత్యాశ కావొచ్చు. సాహిత్యంలో జరిగే వివిధ వినూత్న ప్రక్రియలను విద్యార్థులు గ్రహించవలసిందే. అయితే ముందుగా వారికి భాషమీద సంపూర్ణ అధికారం ఏర్పడాలి. దీనికి ప్రాచీన ప్రబంధ కవిత్వం తోడ్పడినంతగా ఆధునిక కవిత్వం తోడ్పడదు. "ఛందస్సు సంకెళ్ళనుండి కవితా కన్యను నవ కవికుమారులు" రక్షించుకోవచ్చు. కాని ముందు ఆ సంకెళ్ళ పుట్టుపూర్వోత్తరాలు తెలిసివుండటం మేలు. అది పునాది. మనము ప్రబంధ కవిత్వపు సామాజిక వ్యవస్థను నిరసించవచ్చు. కాని మన తెలుగు భాషపై సంపూర్ణ అధికారం ఏర్పడాలంటే, ఫ్యూడల్ సమాజాన్ని ప్రతిబింబించే, "వసు చరిత్ర" వంటివి పఠించితీరాలి. ఇది కేవలం జ్ఞానం కోసమే జరిగేప్రక్రియ. అది లేనినాడు, తెలుగు సాహిత్యం మరీ చౌకగా తయారైతుంది. ఇప్పటికే సంస్కృత గంధంలేక ఆంధ్ర భాషా భూషణం వంటి గ్రంథాలున్నాయని తెలియక, గైడ్ల ఆధారంతో మొప్పై అయిదు పర్సెంట్ తెలుగు పండిట్లు విపరీతంగా తయారైనారు. (ఒకానొకప్పుడు నిరుద్యోగులైన ఇంజనీర్ గ్రాడ్యుయేట్లను, టెంపరరీ తెలుగు పండిట్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. (మన దొరతనం వారికి మన భాషమీదవున్న గౌరవం ఈ పాటిది.) అటువంటప్పుడు మరీ ఈజీగా తయారైన మినీ కవితలు, — ఛందస్సు కష్టం కాబట్టి వచన కవిత్వాన్ని ఆదరించే ప్రాచీన గ్రాంథిక భాష జీర్ణం కాదు కాబట్టి, వ్యవహారిక, దిగంబర భాషను ప్రేమించే, సుకుమార నవీన ఆంధ్ర యువకులను — మరింత సోమరిపోతులుగా తయారుచేస్తుందేమో అన్నది ఒక భయం.

వ్యక్తిగతంగా నాకు అన్ని కవితలూ ఇష్టమే. తెలుగు భాషలోని సౌందర్య రహస్యం అది. ఈ భాషలో ఏది వ్రాసినా మధురంగానే వుంటుంది. అయితే వేటి వేటి ప్రాముఖ్యం వాటి వాటికి. ఈ ఆధునిక మినీ కవితలను, వేడి వేడిగా ఆరగించే పకోడీలుగా అభివర్ణించవచ్చు. ప్రాచీన ప్రబంధ కవిత్వం పప్పన్నం వంటిది. ఒకటి రుచికి, మరొది పౌష్టికాహారానికి. ముందుగా సాహిత్య పుష్టి కలుగనివ్వండి. తరువాత హాయిగా ఈ వినూత్న ప్రక్రియలను ఆనందిద్దాం.

డా. మురళీధర్

బొంబాయి.

స(వి)వరణ

భారతి జూలై లేఖలలో ఒక పరిశోధకుడి మనవి-అని నా [చిటిప్రోలు సుబ్బారావు] లేఖను ప్రచురించినందులకు ధన్యవాదాలు. అందులో పై కళాశాలలో ఉన్నారు కాని కళాశాల పేరు పేర్కొనలేదు. దయచేసి ఈ క్రింద తెలియచేసిన కళాశాల చిరునామాతో నా పేరు నక్కడ ఉదహరించి సహకరించగలరు.

శ్రీ చిటిప్రోలు సుబ్బారావు

తెలుగు శాఖ, శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల

నరసరావుపేట--522601

పునర్జన్మ

జూన్ భారతిలో పెన్నా శివరామకృష్ణ గారు నా కవిత 'పునర్జన్మ' మీద రాసిన వుత్తరానికి నా జవాబు.

భూమిలో పడ్డ విత్తనం తిరిగి మొలకెత్తడం సహజం, ప్రకృతిధర్మం. ఈ విషయం కొత్తగా గుంటూరి శేషేంద్ర కనిపెట్టినవారూ కాదు. ప్రప్రథమంగా కవితలో వుపయోగించినవారూ కారు. పెన్నా శి.రా.కృ గారు ఈమధ్యనే సాహిత్యం చదవడం మొదలు పెట్టినవారులాగుంది.

అయినా ఒక ఫాక్ట్ (నిజం)ని ఎవరికి తోచినవిధంగా వారి వారి కోణాల్లో దర్శించి రాసుకోవచ్చు. పెన్నాగారు చెప్పిందాన్నిబట్టి చూస్తే సూర్యుడు తూర్పున వుదయించాడు; అని రాయడం కూడ మరొకరి భావానికి దగ్గర అని వాఖ్యానిస్తారేమో.

మట్టిలోపడ్డ విత్తనం కూడా శేషేంద్రగారి సాహిత్యం కొరకే అయితే, లేదా విత్తనం మొలకెత్తడం మొట్టమొదట చూసిన మానవుడు గుంటూరి శేషేంద్రగారేనని పెన్నాగారి నిశ్చయమయితే......యిహ పొడిగించదలచుకోలేదు.

పెన్నాగారి వుత్తరం ప్రచురించి పత్రికాముఖంగా జవాబు చెప్పుకునే అవకాశం కల్పించిన 'భారతి'కి నా కృతజ్ఞతలు.

శ్రీ బి. చంద్ర

గ్రంథ విమర్శలు

జీవనానందదాస్

[ఆంగ్లమూలం : శ్రీ చిదానందదాస్ గుప్త, తెలుగుసేత : శ్రీ కు. దుర్తి. డెమ్మీ సైజు 88 పేజీలు. వెల : రు. 2-50 సాహిత్య అకాడమీ ప్రచురణ, ప్రతులకు : రవీంద్రభవన్, న్యూఢిల్లీ 1. లేక మద్రాసు-18.]

భారతీయ సాహిత్య నిర్మాతలలో శ్రీజీవనానందదాస్ ఒకరు. వంగదేశంలో శ్రీ రవీంద్ర కవీంద్రుని తర్వాత కవితలో అంత పేరూ తెచ్చుకున్న సమర్థులు

కొత్త రీతి కవితవచ్చినపుడు, అంతకు ముందుండిన కవిత్వం పయి అనాదరణ ఏర్పడడం సహజం. ఇది జన సామాన్యానికిఉన్నా, లేకపోయినా, నూతన కవుల విషయంలో తరచుగా కానవస్తూ ఉంటుంది. తమ కవితకు ఠాగూరు కవిత్వం మార్గదర్శకమయినా దానిపై నిరసన భావం చూపిన వంగీయులే వున్నారు నవ్యకవితకు నూతన చైతన్యాన్ని కూర్చిన శ్రీ జీవనానందదాస్ మాత్రం రవీంద్రునిపై ఎట్టి అనాదరణనూ, నిరసనభావాన్నీ వ్యక్తం చెయ్యలేదు. ఇది యీ కవిలోని విశిష్టత.

ఈ పుస్తకంలో బెంగాలీ కవి జీవనానందదాసు జీవితాన్ని గురించి ఎక్కువగా లేదు. అతని కవితకే ఎక్కువ ప్రాధాన్యం ఇయ్యబడింది.

ఇందలి ఆయిదు శీర్షికలలో కవి కాలాదులు అనే తొలి శీర్షిక తర్వాత, రెండవ దానిలో ఈ కవి వ్యక్తిత్వాన్ని గురించి ఉన్నది మూడవ శీర్షికలో కవిగా శ్రీ జీవనానందదాస్‌కు గల స్థానం సమీక్షించబడింది. ఆ తర్వాత అతని కొన్ని కవితలకు అనువాదాలు ఈయబడినవి. పుస్తకంలో ఈ భాగమే ఎక్కువ. చివర ఈ కవి రచనలలో ముఖ్యమైన వాటి పట్టిక ప్రకటన వివరణలతో సహా మూడు పుటలలో ఇయ్యబడింది.

ఏ భాషలోని కవితలనైనా యితర భాషలోనికి అనువదించడం — మూల భావం దెబ్బతినకుండా వ్రాయడం చాలా కష్టం. అందులోనూ నవ్యకవితను గురించి వేరే చెప్పనక్కర్లేదు. దాన్ని తర్జుమా చెయ్యడానికి నవ్యకవితా తత్వం తెలిసి, నవ్య కవితలో సమర్థులైనవారే అర్హులయి ఉంటారు. తెలుగు నవ్య కవితలో ఆరితేరిన శ్రీ కుందుర్తిని దీని అనువాదానికి ఎన్నుకొన్న సాహిత్య అకాడమీ వారి ఉచితజ్ఞత మెచ్చుకోదగినది. శ్రీ కుందుర్తి ఇప్పటి నవ్యకవుల్లో అగ్రశ్రేణికి చెందినవారు. అట్టివారే శ్రీ దాసుగారి కవితలను తెలిగించడానికి ఎంతో శ్రమపడవలసి వచ్చినది. వారెంత శ్రమపడినదీ ''అనువాదకుల అవస్థలు'' అనే దానిలో (పుటలు 35–36) వివరించబడింది. అందులో కుందుర్తివారు ''ఏ భాషలోనైనా ఆ భాషా సంప్రదాయమూ, నుడికారమూ తెలిసిన ఆ ప్రజలకు అర్థమైనట్లుగా కవి భావం అనువాదాల ద్వారా ఇతర భాషలు మాట్లాడే ప్రజల అవగాహన పరిధిలోకి పోలేదు. అందులోనూ కవిత్వాన్ని అనువదించడం కత్తిమీద నడకే'' అనే మాట అక్షరాలా నిజం. జీవనానందదాస్‌గారి కవితలను శ్రీ చిదానందదాస్‌గుప్త ఆంగ్లభాషలోనికి అనువదిస్తే, దాన్ని తీసుకుని కుందుర్తివారు తెలిగించారు. బెంగాలీ, తెలుగు భాషలు, ఆ భాషల్లోని కవితా చమత్కృతులు ఎరిగినవారే యీ అనువాదంలోని బాగోగులను చెప్పగలరు. అయినా నవ్యకవితా రీతుల్లో లబ్ధప్రతిష్ఠులైన కుందుర్తివారి అనువాదం, అనువాదంగా కాక, స్వతంత్ర రచనవలెనే రసికుల హృదయాలను ఆకట్టుకోగలదని మాత్రం చెప్పవలసి ఉన్నది.

శ్రీ జీవనానందదాస కవితకొక ఉదాహృతి —

''ఎగరాలి ఎగరాలి యీ హంసలు యింకా
    యింకా ఎత్తుల్లోకి
వెన్నెల పరచిన వెండి తీగల మార్గాల వెంట
    ఎగరాలి ఎగరాలి యీ హంసలన్నీ.
భూలోకపు రణగుణధ్వనులు సాంతం
    సమసిపోయి
నా గుండెలో పరచిన వెన్నెల నిశ్శబ్దపు
    వెన్నెముక్కల వీథుల్లోకి
ఎగరాలి ఎగరాలి యీ హంసలన్నీ!

(పుట 58)

'జాతీయ భాషలలోని సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించి సమన్వయపరిచేందుకూ, ఒక భారతీయ భాషలోని ఉత్తమ సారస్వతమును అనువాదరూపంలో అన్య భారతీయ భాషలవారికి అందించేందుకూ' ఇట్టి గ్రంథాలను ప్రకటిస్తూ ఉన్న సాహిత్య అకాడమి కృషి మెచ్చుకోదగినది.

శ్రీ బులుసు వేంకటరమణయ్య

ఉషోదయం ఆపలేరు

[కవితా సంపుటి. వెన్నెలగంటి రాజేశ్వరప్రసాద్. క్రౌన్ 60 పేజీలు ధర : 3 రు/- ప్రతులకు: వి. శివప్రసాద్, 6/134, పార్కుమిట్ట, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు–2.]

అవును! ఉషోదయాన్ని ఎవరూ ఆపలేరు, అట్లనే అస్తమయాన్ని ఆపే వాళ్లెవరున్నారు? అంటే–కాలచక్ర పరిభ్రమణాలలో అభిరుచులు, లక్ష్యాలు ఎచ్చయి తగ్గయి మారుతుంటవి. ఇది కాల స్వభావం. సమాజ స్పృహ అని ఇంకొక మాట ఇప్పుడు విన

బడుతున్నది. ఏ కాలంలో ఉన్న వ్యక్తికి–కవికి ఆ కాలస్పృహ లేకుండా పొయ్యేదానికి వీలేలేదు. ఆనాడు ఎద్దుబండిని, ఈనాడు విమానాన్ని గుర్తించని వారున్నారా? ఇంకొక స్లోగన్–మిని కవిత. ఈ ముక్తకాలు–మన చాటువులు మన శతకాల పద్యాలవంటివి కావా? ఇంగ్లీషు పేరుతో ఏదో కొత్త ఊడిపడటం ఏమీలేదు. దని యాల లకుంగారు క్రైస్తవుడై, డ్యానియల్ లాజరెస్ కాగానే ఆయన ఒరగబెట్టేది ఏమీలేదు.

ఈ యువకుని భావసుమం బాగా వికసించి గుబాళించబొయ్యే సూచనలు కనబడుతున్నవి. కాని, అపసవ్యంగా ఈ జగత్తులో అంతా చెడ్డ అనుకోవడం ఈయన అభివృద్ధికి మంచిదిగాదు. ''ఎద ఎదలో విషపుముల్లు'' అని పుట్టిన జీవులనంతా పాపుల క్రింద లెక్కగట్టడం మానవతకే మర్యాదకాదు. మంచివారిని పొగుడుదాం–చెడ్డవారిని తెగుడుదాం. ''చెప్పుక్రింద వృశ్చికాలు''– ఇది అశక్తి దుర్జనుల లక్షణం. ఈ కవి నుడికారానికి జాత్యం అబ్బుచేసుకొంటే రచనకు అందం చేకూరుతుంది. ''చెప్పుక్రింద తేలు'' అనడం జాతీయంగదా! ఈయనకు ఉత్సాహానికి తగిన భాష ఉన్నది. నక్సలైట్లను–వారి ధైర్యానికి త్యాగగుణానికి పొగడవలసినదేగాని, నిరుపరాధుల డబ్బున్నంతమాత్రాన చంపడం ఏనాటి తీరు? ఈ భాగితులంట్ల గూడ ఈ కవి (మంచి ఉద్యోగి) ఒక్క కన్నీటి బొట్టునైనా రాల్చవలదా? మానవత ఏకపక్షానలంటి కాదుగదా!

పెద్దల ఆశీర్వాదాలకు పాత్రమైన ఈయన వృద్ధికి రావలని కోరుకొంటున్నాం. ఇందలి పెద్దల వ్రాతలలో స్ప్రెలింగ్ తప్పులు పొడగలిగితే (క్రిష్ణ–ధనస్సు) పిన్నలు లొంగిపడితారు.

పూలజల్లు

[సంకలనం–మధురాంతకం రాజారాం, ఎస్. మునిసుందరం. క్రౌన్–80 పేజీలు, ధర: 4 రు., ప్రతులకు: ఆర్ట్ లవర్స్ యూనియన్, 12-5 4, పిళ్ళారి గుడివీధి, చిత్తూరు]

చిత్తూరు మండలంలోనేగాక, యావదాంధ్రలో వినబడే పెద్ద పేర్లున్నవారు–రాజగోపాలనాయుడు, సిధా, రాజారాం, మునిసుందరం మొదలైనవారి రచనలు ఇందు చేర్చబడడంవల్ల ఈ పుస్తకానికి ఒక గౌరవం ఏర్పడుతున్నది. ఆంధ్రుల జాతీయగీతం వ్రాసిన శంకరంబాడి సుందరాచారి ''మా దేశం'' బాలలకు పాడి ఆంధ్రత్వానికి మురిసిపోవలసి ఉన్నది. ఈ గతంలో గానం వేయబడిన దేశప్రశస్తి, రాయప్రోలు సుబ్బారావు ''తుమ్మెదా తుమ్మెదా'' అన్న పాటలోని ఉత్తేజశక్తి కలిగియున్నది.

ఇది పిల్లకాయలు తామే నేరుగా ఉపయోగించుకోగలిగిన పాటలు కలిగిఉన్నది. పాటలేగాక ఏకాంకికలు బాగున్నవి. ''భస్మాసుర'' (రాజారాం) తపశ్శక్తిని చెడ్డకు ఉపయోగిస్తే నెత్తిపైన బడే ముప్పు చెపుతున్నది. కర్ణుని రణరంగ మరణగాథ (మహాదాత–మునిసుందరం) కొత్త బాణీలో, కర్ణుని దాన గుణాన్ని స్వామిభక్తిని మహిమ పరుస్తున్నది. ఈ నాటికలో సన్నివేశాలు భావాలు భాష పులకలెత్తిస్తున్నవి. రాజగోపాలనాయుడు చేసిన మంచిబాలుని నిర్వచనం నీతిదాయకంగా ఉన్నది. మొత్తంమీద పుస్తకమంతా నీతి జ్ఞానాభివృద్ధులకు తోడ్పడగలిగి ఉన్నది.

అన్ని మాండలికాలు కలిస్తేగదా సమగ్రభాషా వికాసం అయ్యేది. వీరు, స్వచ్ఛమైన ప్రాణవంతమైన రాయలసీమ భాషను ఇంకా ఎక్కువగా వాడుతుంటే సమైక్యతకు దారితీస్తుంది.

ప్రచురణకర్తలు – ఆర్ట్ లవర్స్! స్వదేశాన్ని స్వభాషను ఆకాశానికి ఎత్తిపెట్టుతున్న ఈ సంఘంవారు, రజనీకాంతరావు సూచించినట్లు కళాప్రియులనుకొంటే ఇంకా బాగుండదా ?

బాలగేయాలు

[వేముగంటి నరసింహాచార్యులు. క్రౌన్ 32 పేజీలు, ధర: 1.50, ప్రతులకు: శ్రీనివాస బుక్ డిపో, మెయిన్‌రోడ్, సిద్దిపేట–502103.]

పండితకవి, బహుగ్రంథకర్త–వేముగంటి నరసింహాచార్యులు బాలగేయాలు వ్రాస్తే కవితా పాటవం ఉండక తప్పుతుందా? ఇందలి పాటలన్నీ బాలబాలికలు ఆడుతూ పాడుకోతగినవి. దేశప్రగతిమీద చరిత్రమీద పిల్లకాయల నుద్దేశించి చెప్పిన గేయాలు జాతి గౌరవాన్ని దేశభక్తిని రేకెత్తిస్తున్నవి ''భావి భరత భవనంలో వెలిగే దివ్వెలు మీరు'' అన్నది హృద్యంగా ఉన్నది; భాషలో ఎంతో ఇమిడి ఉన్నది. బాలకృష్ణుని గూర్చి రాసిన పది కెక్కేటట్లు అల్లబడి ఉన్నది. తెనుగు భాష గొప్పదనం శిశు హృదయానికి ఎక్కేటట్లు చెప్పబడినది.

''వెన్నెల'' కవితా శిల్ప శోభగలిగి ఉన్నది. ''నిండు పున్నమి రేయి వెండి జిగి జాబిల్లి నీలాల నిగ్గుల నింగిపళ్ళెమునుండి కలికి వెన్నెలపాలు ఒలికిపోశాడు; ఒలికిపోయిన పాలు ఒడిసిల జొల్లాడె'' ఆ వెన్నెలపైలనే పలుకుల ప్రసున్నదిస్తున్నది.

''వినా పాపి దండిరి సరి సేటి దొమ్మ'' అని ఆటపాట్నను ప్రోగంటోస్తున్నాడు.

సరే! నాలుగు కోట్ల కౌమారులట! ఆంధ్రమాత కౌమారులైన వీరి సంఖ్యా సంఖ్య (మూడు కోట్లనుండి పెరిగి ఉన్నది) 1981 సెన్‌సెస్‌గదా తెల్పవలసినది.

చేతన

[గేయ కవితా సంకలనం (భిలాయ్) డెమ్మి–48 పొరటలు; ప్రతులకు: చేతన, 2–ఎ–స్ట్రీట్ 32, సెక్టర్ 6, భిలాయ్ 490006 – మధ్యప్రదేశ్.]

ఎక్కడనో వింధ్యపర్వతారణ్యాలలో భిలాయ్ కర్మాగారాలలో పనిచేస్తూ, ఆత్మానందానికి కవితలల్లే ఈ సరస్వతీ ఆరాధకులను

ప్రశంసింపక తప్పదు. ఈ మాతృభాషా తగులాటం తప్పించుకోలేకపోవడం ఒక సుగుణమే. ఇందు 37 మంది భావుకుల రచనలున్నవి స్త్రీలు గూడ ఎక్కువగా ఉండటం గుర్తించదగిన సంగతి.

చాలామందికి రచన ఇంకా బాగా అలవాటు కావలసినట్లున్నది; కాబట్టే అస్పష్టత ప్రాకి ఉన్నది. ఏదో పదాడంబరం ఉన్నదిగాని, కవిహృదయం బయటపడటంలేదు. వీరి కవిత, నేలమీద ఇంకా బాగా కాలు నిలదొక్కుకోవలసి ఉన్నది. ''అశ్రుకణం పగలాలి'' అంతా ఇంగ్లీషుమయం...ఈ కవి ''మిరాక్ట'' అనవలసిన దానిని (ఎండమావి) ''మిరాజ్'' అంటాడు. ''జీవిత సత్యం'' భావ విలసనం కలిగి ఉన్నది ఈ రచయిత్రి–ఎందుకిస్తాం నన కాళ్లుకడిగే వాడికి? సమస్త జీవకోటి కల్మషాన్ని తనలో కలుపుకుని పైకి నవ్వే సామాన్యుడు సముద్రుడు — అన్నది మనోజ్ఞంగా ఉన్నది. ''మినీ గేయాలు''లో నేస్తు–నిన్ను ప్రేమించని ఆడదానిపై నువ్వు జరిపిన ఆలోచనలు కటిక చీకటిలో నీవు పెట్టుకున్న సులోచనాలు –అన్న భావం మంచి భాషలో పడినది.

''గోళకుడు'' ''(మగడు చచ్చిన తర్వాత ముండకు బుట్టిన కొడుకు) తన్ను గూర్చి అనుదినం వినబడుతున్న గుసగుసలకు పడిన ఆవేదన కరుణారసాన్ని ఒలికిస్తున్నది. ''మధ్యతరగతి గోడు''లో కవి సామాన్యులందరికి ప్రతినిధిగా వాపోతున్నాడు. ఒక పేద శ్రీమంతుడుగా నటించడంలోనే గదా ఉండే అసహాజత అంతా. ఇదే ఆవేదనకు పాది.

కవితా మంజరి

[విద్వాన్ చావలి లక్ష్మీనారాయణ. డెమ్మి 64 పారటలు, వెల : 2రు/– ప్రాప్తిస్థానం : గ్రంధకర్త, బ్రాహ్మణవీధి, పొన్నూరు–522124·]

ఇంకా, ఇంగ్లీషులో ఎన్నో మహాకావ్యాలు తెలుగు వెలుగు చూడకుండా నిలిచిపోయి ఉన్నవి. ఈ కవి అట్టి మూడు కావ్యాలను ఆంధ్రభారతికి కానుక బెట్టుతున్నాడు. ఇది సాంప్రదాయిక (ఛందోబద్ధ) కవిత్వం. భాష సరళ గంభీరంగా సమంచితమైన ధారతో నడుస్తున్నది; చదువరిని చివరవరకు చదివింపజేస్తున్నది. దీనికి తోడు చాలా పదాలకు క్రింద అర్థాలిచ్చినాడు. ఈ విదేశ కవితకు భారత జాతీయత కల్పించడం ఒకవిధంగా అందమే అనిపిస్తున్నది.

''విజయ భాస్కరం'' లో వీరపత్ని భావోద్రేకాన్ని ఎంత మంచిగా చెపుతున్నాడో చూడండి :

> జయవార్తన్ వినినప్పుడెల్ల నొక విశ్వాసంబు నేబుత్తు, నా
> ప్రియుడీ గండము దాటెగాయనుచు; కీర్తి ప్రాప్తికింజాడ ని
> ర్భయ చిత్తస్థితి నాకు నాహవ పునఃప్రారంభ పర్యంతమే
> యయి యుండన్, బ్రతుకెల్ల యియ్యెడుకుకట్టా! యెట్లు
> సైరింతునో

ఇది పారసీకవీరులు–అబ్బకొడుకు — సొరాబ్ రుస్తుంకథ.

రుద్రభూమి–''గ్రే'' అనే కవి ''ఎలిజీ''— శోకగీతానువాదం. వల్లకాడులో కలిగే శ్మశాన వైరాగ్యం మంచి కవితాపాకంలో చెప్పబడి ఉన్నది :— ''జీవతతి తప్పనట్టి యా సీమజేర బాటు చున్నది కర్మంపు బండ్లనెక్కి'' అన్నది భావానికి భాషకు మంచి మచ్చుతునక.

పాండిత్యము పరిశ్రమ చక్కటి కవిత్వాన్ని ఇచ్చినవి. నవ్య కవితారీతులు వీచే వడగాడ్పులలో ఇది ఒక చలువ పందిలిగా ఉన్నది—సాహిత్య పాంథునికి కాస్త దగ తీరుస్తున్నది.

అచ్చు తప్పులు మరీ ఎక్కువ!

కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి

నా గొడవ

[కాళోజీ. మూల్యం : లేదు. ప్రతులకు : శ్రీ రాధాకృష్ణ, సర్. సి. ఆర్. రెడ్డి కాలేజి, ఏలూరు, ప. గో. జి.]

1975 నుండి 77వరకు కాళోజీగారు వెలయించిన కవితల సంకలనం ఇది. కాళోజీ ఒక రాజకీయ ఇజానికి కట్టుబడిన కవి కాడు ఆయన ప్రధానంగా మానవతావాదకవి. సామాజిక చైతన్యం, మానవ సమానత్వ విలువలు భూమికగా కాళోజీ కవిత్వం దర్శనమిస్తుంది. అయితే ఆయన చెబుతున్న భావాలు మార్క్సిజానికి, గాంధీయిజానికి ఇంకా అనేక యిజాలకు దగ్గరగా కనపడవచ్చు గాని ఆయన ఈ యిజాల్లో ఏఒక్క యిజానికి నిబద్ధుడు మాత్రంకాదు.

> 'గోళం మట్టం మీద
> పొగడొచ్చు తెగడొచ్చు ఎంతైనా
> కలం గారడీ కైతల
> వల లల్లొచ్చు ఎన్నయినా
> గాంధీకయినా మావోకయినా
> చెక్కభజన చెక్కభజనే
> చెక్కభజనకు చుక్కలు
> సంగీతానికి చింతకాయలు రాలవు.'

అనే పాదాల్లో కాళోజీ తత్వం పూర్తిగా అర్థం అవుతుంది. క్రియాశూన్యమైన నినాదాలవల్ల ఆశయాలు నెరవేరవని ఆశించేసమాజం ఆవిర్భావంకాదని కాళోజీ మతంగా స్పష్టం అవుతుంది. ఉత్తరాతల వల్ల ప్రయోజనంలేదని కాళోజీ అభిప్రాయం. ఆచరణశూన్యమైన కవిత్వం సమాజాన్ని ఏమాత్రం మార్చలేదని ఆయన అభిప్రాయం. అభివృద్ధికరమైన, ఆరోగ్యకరమైన మార్పు సమాజంలో రావాలంటే ముందు కవికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉండాలి. అదిలేని కవిత్వం ఏ ఒక్కణ్ణి కదిలించలేదని కాళోజీ కంఠ దఘ్నంగా చెబుతున్నాడు.

> **'A simple drop of ink**
> **That makes the millions think** –Byron
> ఒకే ఒక్క సిరాచుక్క
> లక్ష మెదళ్ళకు కదలిక

అన్నాడు బైరన్
నిజమేనా అది ?
మరి నేను ఒలకబోసిన
సిరా సీసాల కొద్దీ కాదు
పీపాలకొద్దీ
ఏ ఒక్క మెదడు కదల్చినట్టు లేదు
మొదట నా మెదడులో ఉంటేగా కదలిక
మరోడ్ని కదలించ'

ఈనాటి కవితల తత్వాన్ని కాళోజీ బాగా చెప్పాడు. కవిత్వం కీర్తికి, చప్పట్లు కొట్టించుకోడానికేగాని సమాజశ్రేయస్సుకుకాదు. ఎంచేతంటే కవి అంతర్యం స్వార్థపూరితమైనది కనుక. జనుల జీవనాడిని పట్టుకుని దానిని తమ కవిత్వంతో దోపిడీ చేస్తున్న అనేకమంది బురఖా పురోగామి కవులపై ఈ క్రింది పాదాలు పెద్ద సెట్టారు.

'కైతల కథనము విశ్వశ్రేయము
చేతల పని రాకాసి మాదిరిదే
దుష్ట చతుష్టలమే లోలోపల
స్పష్టము విదురుల మాదిరిదే
ముఖాముఖిగ సభ్యత సౌమ్యత
ముడ్డి వెనుక పగ నాగు మాదిరిదే
మాత్సర్యం గాంధారి కొడుకుది
మాటచ్చం గంధీ మాదిరిదే'

వ్యవస్థలో ఈనాడు కనబడుతున్న హింసకు ప్రతిహింసే మార్గమని కాళోజీ విశ్వాసం. ఆ విశ్వాసం వెనుక రాజకీయ సిద్ధాంత భావనలేదు. శుద్ధమానవతా వాదం తప్ప.

'ప్రజలు సిద్ధంబుగా లేరు లేరు అనుచు
పాట వల్లించు పిరికి మేధావులెల్ల
పట్టపగ్గాలు లేక వర్తించు దుష్ట
కూటముల యింటిలో కూలిలేని బంట్లు
శాంతి వచనాలు సత్యాహింస ధర్మ
ధోరణి నిప్పుల మగుట జూచి విసిగి వేసారి నరుడే—
దిరి పుత్ర పొట్ట చీల్చి
నరశింహరూపు దాల్చి
హింస వారియింప ప్రతిహింస బూనినాడు.'

అంటున్నారు కాళోజీగారు. కాళోజీ కవిత్వంలో క్లిష్టత, అస్పష్టతతో కూడిన భావ చిత్రాలు కాని, భాషా భేషజం కాని కన బడవు. స్పష్టత, సంక్షిప్తత, సరళత ఆయన కవితా లక్షణాలు. ఆ లక్షణాల సమాహారమే ఈ కవితా సంకలనం.

మథనం

[డా॥ సి. నారాయణరెడ్డి. మూల్యం : రు. 6–00 లు, ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతి రోడ్డు, సికిందరాబాదు.]

డా॥ నారాయణరెడ్డిగారి మరో కావ్యమిది. ఇది నాలుగు భాగాలుగా విభజింపబడింది. మననం, జ్వలనం, ఉద్గమనం, ఉన్మీలనం. కావ్యం పేరు మథనం ప్రతీకాత్మకంగా ఉంది. ఇప్పుడున్న సమాజం లోపభూయిష్టమైనదనేది అందరూ అంగీకరించిన యథార్థం. మరో సమాజం ఎట్లా ఉండాలనే దానిమీద ఆధునిక మతానుకూలురైన వారిలోను, ప్రాచీన వ్యవస్థాభిమానుల్లోనూ కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. సంఘర్షణ లేనిదే కొత్త వ్యవస్థ పుట్టదు. ఆ సంఘర్షణకు ప్రతీకాత్మిక నామధేయం మథనం. సంఘర్షణ నాలుగు దశలుగా సాగుతుంది. మొదటి దశ సంఘర్షణను గురించిన స్పృహ, రెండవ దశ ఆ స్పృహలోంచి చైతన్యా విర్భావం, మూడవ దశ జననం, నాల్గవ దశ వికసించడం. ఈ నాలుగుదశల నిరూపకాలు మననం, జ్వలనం, ఉద్గమనం,ఉన్మీలనం.

'ఇప్పుడున్నది ఇవాళగట్టు
ఎక్కడుంది అవలిగట్టు
ఏవేవో తుఫానుల్లో
జీవించాలని ఉంది.'

అనడంలో వర్తమాన వ్యవస్థలో జీవిస్తూ రాగల వ్యవస్థ కోసం పడవలసిన శ్రమ ధ్వనిస్తోంది.

'రాళ్ళూ రప్పలు ఏంచేసాయని రంకెలు వేస్తావెందుకని
రాయీ రాయీ ఒరుసుకుంటె ఉగ్రజ్వాలాకృతి పుడుతుంది
చల్లగసాగే మూగకాళ్ళకు సంకెళ్ళు వేస్తావెందుకని
ఒళ్ళు మండితే పల్లెపల్లెకూ ఒక నక్సల్‌బరీ పుడుతుంది.'

ఈ పాదాల్లో దోపిడీ చేసేవారి మనస్తత్వం దోపిడీ చేయ బడుతున్న వారికుండవలసిన ఐక్యత చెప్పడం కవి ప్రధానోద్దేశం.

'ఎందరెందరో సూర్యులు
ఎదట కదలిపోతున్నా
ఏది ప్రభాతమ్మని ప్ర
శ్నిస్తూనే వున్నాను.'

ఈ పాదాల్లో కొత్త వ్యవస్థ కోసం ఆరాటపోతున్న తరం, దానికి నిర్లిప్తంగా, నిస్తేజంగా ఉన్న సాధారణ మనిషి మనస్తత్వం వ్యంజకమవుతున్నది.

రచయితలకి మనవి

రచనలలో ఇంగ్లీషు లిపి అధికంగాఉంటే అచ్చు కూర్పుకి ఇబ్బందిగా ఉంటుంది కనుక 'భారతి'కి తమ రచనలు పంపేవారందరూ వీలయినంత వరకు తెలుగు లిపినే వాడాలని మనవి చేసు కుంటున్నాము.

సంపాదకుడు.

నేటి సమాజంయొక్క చైతన్య రాహిత్యాన్ని, ఈ జడత్వం లోంచి చైతన్యం పుడుతుందనే ఆశావాదాన్ని ఈ క్రింది పాదాల్లో వ్యక్తం చేస్తున్నారు నారాయణరెడ్డిగారు.

'ఏ పిలుపులేదు
నేటి ఉక్కు తీగకు
రెక్కలు తొడిగి ఎగరేసే
ఆ పిలుపు లేదు
నేటి ఒక్క వాగుకు
తెలుసు నాకు
పొద్దులా నువ్వు
పొడుచుకొస్తావని —
నిశ్శబ్దాన్ని నంజుకుంటూ
నిశీథాన్ని మింగుకుంటూ.'

పీడనకు మూలమైన వ్యవస్థకు ప్రతినిధులైనవారిని కవి హెచ్చరిస్తున్నారు తిరుగుబాటు ఒకనాటితో పోయేదికాదని పీడన సాగనంతకాలం విప్లవాలు జరుగుతూనే ఉంటాయని ఏనాటికైనా ఈ దుష్ట వ్యవస్థ అంతంకాక తప్పదని.

'వెయ్యిమంది వంచుకునే
వెలుతుర్ని దోచుకుని
ఒక్క కడ్డీలో దాచుకుని
ఒకే గదిలో పరుచుకుని
అనుభవించాలనుకునే అయ్యలూ
ఈనాటితో ఆగదు
ఈ రెక్కల దాడి
సాగుతూనే ఉంటుంది
స్వేచ్ఛ నొక్కినప్పుడల్లా.'

పిరికితనం సహనం కాదని, చచ్చుగుణం శాంతం కాదని, చదలు చిమ్మను కోరికలేదని, చీకటి తూర్పును ఆర్పలేదని కవిగారి ఆశావాదం. అందుకే —

'చచ్చిపోవాలంటాను
చైతన్యాన్ని కప్పే మంచు
పుట్టి రావాలంటాను
రక్తాన్ని రగిల్చే మించు.'

అంటూ కావ్యాన్ని ముగిస్తారు నారాయణరెడ్డిగారు.

శ్రీ టి. ఎల్. కాంతారావు

మార్క్సుకు పాఠాలు

[రచన : వజ్రజనఖ. పుటలు : 24, వెల : రూ. 1-00, ప్రచురణ : నవభారతి, 3-4-852, బరకత్‌పురా, హైదరాబాద్—500027]

జాగృతి వారపత్రికలో వరుసగా ప్రచురింపబడుతూన్న "మార్క్సుకు పాఠాలు"లో కొన్ని ముక్కలు తీసి, ఓ మాలగా గుచ్చి—ఈ చిన్న పొత్తాన్ని ప్రచురించారు.

మార్క్సిజంయొక్క మంచి—చెడులను చారిత్రక దృక్పథంతో విమర్శిస్తూ తెలుగులోనూ, యితరేతర భాషలలోనూ అనేకానేక పుస్తకాలు సాహిత్య ప్రపంచంలోని కొచ్చినా, తార్కికంగా, శాస్త్రీయంగా మార్క్సిజాన్ని విమర్శించి, వివరించే ప్రయత్న లోపాన్ని తెలుగు సాహితీ లోకంలో పూరించడానికే ఈ పుస్తకాన్ని వెలువరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ విషయాన్ని అందరికీ (ముఖ్యంగా మార్క్సులకు) అర్థం గావడానికై ఆటవెలది పద్యాలలో, వాటికి వ్యాఖ్యతో అందంగా అందించాలనుకున్నారు, రచయిత మార్క్సులకు పద్యరూపంలో నయితేనే బాగా పడుతుందని కొన్నట్లున్నది, రచయిత.

భారత, భాగవతాదులనుండి అరవిందుని రచనలవరకూ పెక్కు అంశాలను తెచ్చి మార్క్సు చెప్పిన దానికి పోల్చారు, రచయిత. ఈ పుస్తకంలో గడియారం చూస్తూంటే—ఓ మాట గుర్తుకొస్తూన్నది— విశ్వనాధవారు వెనక్కు నడవగా — నడవగా వేదకాలం మరీ వెనక్కుపోయిందని—


మార్క్సు చెప్పిన దానికి విరుద్ధంగా, వారి సిద్ధాంతం తప్పని పాఠకులను ఒప్పించడానికి వేరుమార్గాలున్నాయి. కమ్యూనిజం చెప్పేదాన్ని కాదనడానికీ వాదనలున్నాయి. దానికి రాజకీయ, సాంఘిక, ఆర్థిక విధానాలు, సిద్ధాంతాలు అవసరం. వాటిద్వారా జనాన్ని ఒప్పించడానికి ప్రయత్నించినట్లయితే, పరిమితమైన ప్రయోజనమైనా వనగూడుతుంది. అంతేగాని ధర్మార్థ కామ మోక్షాలు, వర్ణాశ్రమధర్మాలు, ఇతిహాసాలు, జీవాత్మ పరమాత్మ వంటి మాటలతో పద్యరూపంలో చెప్పడం నేలవిడిచి సాము చేయడమే కాగలదు.

ఏది ఏమైనా ఇటువంటి రచనలకు కాలం చెల్లిపోయింది. యిటువంటి మెట్టవేదాంతం శతాబ్దాలుగా చెబుతూనే వున్నారు. వారే యథా—తథవాదులు. జనం ఆలోచనలు, ఆశయాలు శరవేగంతో పరుగులెత్తుతున్నాయి. వాటిని ఈడేర్చడానికి మార్గాలేమిటో మేధావులు ఆలోచన చెయ్యాలి. అంతేగాని అసమానతలు సృష్టిలో సహజమని, పెద్ద చేపలు చిన్న చేపలను మ్రింగడం మామూలేనని, జోలపాడ యత్నిస్తే, ఈ కాలంలో కూడా ప్రయోజనం వుంటుందనుకోవడం అవివేకమే కాగలదు.

ఏది ఏమైనా మార్పుకోరని, యధాతథవాదుల ఆలోచనా ధోరణి ఎంత నేలబారుగా వుంటుందో అంచనా వేయడానికిది చదవడం అవసరం, అవకాశమున్నవారికి.

డాక్టర్ శివాజీ

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.


"సాంప్రదాయ సిద్ధమయిన
భారతీయ ఔషధాలకి
ప్రత్యేకమయిన శక్తివుంది.
ఉదాహరణకి,
అమృతాంజన్."
AMRUTANJAN
Pain Balm
ప్రకృతిలో లభించే అత్యంత
శక్తివంతమయిన పది మూల
ఔషధాలతో అమృతాంజన్ తయారు
చేయబడుతోంది. అంటే అమృతాంజన్
చాలా శక్తివంతమయినది.
అందుచేత అమృతాంజన్
తలనొప్పులకు, జలుబులకు,
వంటినొప్పులకు, బెణుకులకు
శీఘ్రంగానూ, నిశ్చయంగానూ
ఉపశమనం కలిగిస్తుంది
అంతేకాదు అమృతాంజన్
సురక్షితమయిన బాధా నివారిణి
అమృతాంజన్ :
80 సంవత్సరాలకు పైబడిన
నమ్మకమైన దివ్య
ఔషధము
AM-2148
అమృతాంజన్
తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు